సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 8

సోమవారం 31-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'



'ఆదిమ' గెలాక్సీ చిక్కింది

విశ్వంలో అత్యంత ఆదిమ గెలాక్సీల్లో ఒకటిగా భావిస్తున్న ఓ నక్షత్ర మండలాన్ని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా గుర్తించింది.

వివరాలు 6లో ▸



కుళ్లుతున్న మృతదేహాలు

మయన్మార్ భూకంపంలో తీవ్రంగా దెబ్బతిన్న మాండలేలో శిథిలాల కింద కుళ్లిపోతున్న మృత దేహాలతో వీధులన్నీ కంపు కొడుతున్నాయి.

వివరాలు 6లో ▸



గ్రీన్‌లాండ్ కోసం సైనిక చర్య!

గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవడానికి సైనిక శక్తిని ఉపయోగించే అవకాశం లేదని తానెన్నడూ చెప్పలేదని ట్రంప్ అన్నారు.

వివరాలు 6లో ▸



మన దగ్గరే 'బంగారు' కొండ

ప్రపంచంలోని ప్రధాన కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న పసిడి నిల్వల కంటే భారతీయుల వద్దే ఎక్కువ పసిడి ఉందని ఓ నివేదిక తెలిపింది.

వివరాలు 16లో ▸

న్యూస్‌రీల్

నేడు రంజాన్ పండుగ



హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా ఆదివారం నెలవంక కనిపించడంతో సోమవారం రాష్ట్రంలో రంజాన్ పండుగ జరుపుకోవాలని నెలవంక నిర్ధారణ కమిటీ ముస్లింలకు సూచించారు.

- వివరాలు 5లో▶

ప్రేమను పంచే శుభదినం

13 లో

ఆన్‌లైన్‌లో భర్తీ లేనట్లేనా?



ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్ల భర్తీపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఈసారి 'బీ'కేటగిరీ సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీ చేస్తామని కొన్ని నెలలుగా అధికారులు చెబుతూ వస్తున్నారు. దీనిపై ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు కూడా చేసింది.

- వివరాలు 5లో▶

డైట్ చార్జీల బకాయి 650 కోట్లు



సంక్షేమ శాఖల పరిధిలోని వసతిగృహాలకు ప్రభుత్వం నెలల తరబడి డైట్ చార్జీలు విడుదల చేయకపోవడంతో నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. 4 సంక్షేమ శాఖలకు రూ. 650 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయినట్లు ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి.

- వివరాలు 3లో▶

ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకం ప్రారంభోత్సవంలో లబ్ధిదారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే పద్మావతి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు



సన్నబియ్యం చరిత్రాత్మకం

ఈ పథకం దేశ చరిత్రలో నిలిచిపోతుంది • భవిష్యత్తులో ఏ సీఎం వచ్చినా దీన్ని రద్దు చేయలేరు

సన్న బియ్యం పథకం ప్రారంభ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

- 3.10 కోట్ల మందికి ప్రతిరోజూ పండుగ
- దొడ్డు బియ్యం పేదల కడుపు నింపడం లేదనే సన్న బియ్యం పంపిణీ
- కేసీఆర్ ఏనాడైనా ఈ ఆలోచన చేశారా?
- ఫాంహౌస్‌లో పండించిన ధాన్యాన్ని క్వింటాల్ రూ.4,500కు అమ్ముకున్నరు
- అంత ధర పెట్టి కొన్నారంటే అవి వడ్లా? బంగారమా?

సాక్షి ప్రతినిధి, నల్లగొండ

సన్న బియ్యం పథకం దేశ చరిత్రలోనే నిలిచిపోతుందని, ఆ చరిత్రకు హుజూర్‌నగర్ వేదికగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో ఏ సీఎం వచ్చినా ఈ పథకాన్ని రద్దు చేయలేరని చెప్పారు. ఆనాడు ఇందిరాగాంధీ రోటీ, కపడా, మకాన్ అనే నినాదంతో పేద వారికి కడుపు నిండా అన్నం, గుడ్డ, ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో 25 లక్షల ఎకరాలను పేదలకు పంచారని గుర్తుచేశారు. దాంతో పేదల్లో చైతన్యం వచ్చి పెద్ద ఎత్తున పంటలు పండించారని, నేడు అదే స్ఫూర్తితో తెలంగాణలో పెద్ద ఎత్తున పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు. ఆనాడు పేదలు.. పండుగ నాడే కాకుండా ప్రతిరోజూ తెల్ల బువ్వ తినాలనే ఉద్దేశంతో కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి రూ.1.90కు కిలో బియ్యం పథకం తెచ్చారని, అయితే ఎన్నికల కారణంగా అది అమలు కాలేదని చెప్పారు. తర్వాత అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ రూ.2కు కిలో బియ్యం పథకాన్ని 1983లో ప్రారంభించారని..ఆనాడు మొదలు పెట్టిన దొడ్డు బియ్యం పంపిణీ పథకమే ఇప్పటి వరకు కొనసాగిందని అన్నారు. అయితే దొడ్డు బియ్యం పేదల కడుపు నింపడం లేదని ఆలోచించి, పేదలంతా తినేలా తాము సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టామని వివరించారు. ఇక నుంచి 3.10 కోట్ల మందికి సన్న బియ్యం ఇచ్చి ప్రతిరోజూ పండుగలా పేదవాడి కడుపు నింపాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తెచ్చామని చెప్పారు. ఉగాది సందర్భంగా ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో

మిగతా 5వ పేజీలో ▶

గ్రూప్–1 మెయిన్స్

టాపర్లు మహిళలే..



జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల చేసిన టీజీపీఎస్సీ

- మల్టీజోన్–2లో టాప్ స్కోర్ 550 మార్కులు
- మల్టీజోన్–1లో టాప్ స్కోర్ 532.5 మార్కులు
- అతి త్వరలో 1:2 నిష్పత్తిలో ప్రాథమిక ఎంపిక జాబితా విడుదల
- ఆ తర్వాత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసు కొలువులుగా భావించే గ్రూప్–1 ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అర్హత పరీక్షల ఫలితాల్లో మహిళలు టాపర్లుగా నిలిచారు. మల్టీజోన్–1, మల్టీజోన్–2 రెండుచోట్లా టాప్ ర్యాంకులను మహిళా అభ్యర్థులే సాధించారు. మల్టీజోన్–2లో టాప్ స్కోర్ 550 మార్కులు కాగా.. మల్టీజోన్–1లో 532.5 మార్కులు టాప్ స్కోర్‌గా ఉన్నాయి. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్‌ఎల్)ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం విడుదల చేసింది. ఉగాది పండుగ సందర్భంగా అభ్యర్థులకు తీపికబురు అందించే ఉద్దేశంతో తెలుగు నూతన సంవత్సరం తొలి రోజున జీఆర్‌ఎల్‌ను విడుదల చేసినట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి.

జనరల్ ఇంగ్లిష్‌లో అర్హత సాధించిన వారే జాబితాలో..

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి గతేడాది ఫిబ్రవరి 19న టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 4,03,465 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది జూన్ 9న

మిగతా 3వ పేజీలో ▶

సాంస్కృతిక వటవృక్షం



బిలాస్‌పూర్‌లో లబ్ధిదారుతో మోదీ

ఆరెస్సెస్‌పై మోదీ ప్రశంసలు

నాగపూర్ ప్రధాన కార్యాలయ సందర్శన

ప్రధాని హోదాలో 11 ఏళ్లలో ఇదే తొలిసారి

"జాతి ప్రయోజనాలే లక్ష్యంగా మన సంస్కృతిని, ఆధునికతను ఆరెస్సెస్ నిత్యం పరిరక్షిస్తోంది. ఇందుకోసం అసంఖ్యాకులైన కార్యకర్తలు దేశవ్యాప్తంగా నిస్వార్థంగా కృషి చేస్తున్నారు. 2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్యంగా పురోగమిస్తున్న వేళ ఆరెస్సెస్ వందేళ్ల తపస్సు ఇప్పుడు ఫలాలందిస్తోంది."

- నరేంద్ర మోదీ

కాంగ్రెస్ వల్లే నక్సలిజం ప్రబలింది

6 లో

- ఛత్తీస్‌గఢ్ పర్యటనలో మోదీ ధ్వజం
- రూ.33,700 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ఇప్పపువ్వు లడ్డూ.. గిఫ్ట్ ఆఫ్ నేచర్

మన్ కీ బాత్‌లో ఆదిలాబాద్ ఆదివాసీ మహిళలను అభినందించిన ప్రధాని

16 లో



తెలుగు ప్రజలకు మోదీ ఉగాది శుభాకాంక్షలు

- వివరాలు 16లో

విద్యార్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



హెచ్‌సీయూ రణరంగం

- ఆదివారం ఉదయమే క్యాంపస్‌ను దిగ్బంధించిన పోలీసులు
- జేసీబీలతో ప్రహరీ లోపలి ప్రాంతాలను చదునుచేసే యత్నం
- నిరసనకు దిగిన విద్యార్థులు.. అడ్డుకున్న పోలీసులు
- 52 మంది విద్యార్థులు అరెస్ట్.. వివిధ పీఎస్‌లకు తరలింపు
- మహిళలనూ ఈడ్చుకెళ్లి వాహనాల్లో పడేసిన వైనం
- వర్సిటీ భూములు ప్రైవేటుకు విక్రయంపై కొనసాగుతున్న నిరసన

సాక్షి, హైదరాబాద్/ రాయదుర్గం:హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన నిరసన ఆదివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆదివారం ఉగాది రోజున జేసీబీలతో వందల సంఖ్యలో పోలీసులు క్యాంపస్‌లోకి ప్రవేశించి భూములను చదును చేయటం ప్రారంభించారు. విషయం తెలిసి వందలమంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగటంతో అందరినీ ఈడ్చుకెళ్లి లారీల్లో పడేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

అరుపులు.. కేకలు.. అరెస్టులు

ఆదివారం సెలవు దినం, ఉగాది పర్వదినం కూడా కావటంతో క్యాంపస్‌లో ఉదయం

మిగతా 2వ పేజీలో ▶

'సన్'కు స్టార్క్ స్ట్రోక్

సన్‌రైజర్స్ హైదరాబాద్ **163/10** (18.4 ఓవర్లు)

ఢిల్లీ క్యాపిటల్స్ **166/3** (16 ఓవర్లు)

గత ఏడాది రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ 18వ సీజన్‌లో మరోసారి నిరాశపర్చింది. సొంతగడ్డపై ఓటమి తర్వాత వైజాగ్ చేరిన సన్‌రైజర్స్ బ్యాటింగ్ వైఫల్యంతో ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో సాధారణ స్కోరుకే పరిమితమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ జట్టు 18.4 ఓవర్లలో 163 పరుగులకే ఆలౌటైంది. ఢిల్లీ పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్ 5 వికెట్లతో సన్‌రైజర్స్‌ను దెబ్బ కొట్టాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 3 వికెట్లతో రాణించాడు. అనంతరం 164 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 3 వికెట్లు కోల్పోయి 16 ఓవర్లలోనే ఛేదించింది. డుప్లెసిస్ (27 బంతుల్లో 50; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), జేక్ ఫ్రేజర్ (32 బంతుల్లో 38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ పొరెల్ (18 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడి ఢిల్లీకి రెండో విజయాన్ని అందించారు.



14 లో

రాజస్తాన్ ఖాతా తెరిచింది

ఐపీఎల్‌లో తొలి గెలుపు

- 6 పరుగులతో ఓడిన చెన్నై
- నితీశ్ రాణా మెరుపు బ్యాటింగ్
- హసరంగకు 4 వికెట్లు

14 లో



హసరంగ

ఇదండీ జోక్



మనకు కూడా మంచి అధ్యక్షుడు దొరికితే ఇంకా బావుండు సార్!

గెలుపు ఎర వేస్తారు.. తర్వాత ఓడిస్తారు

బెట్టింగ్ యాప్స్ అలాగే డిజైన్ చేసి ఉంటాయి

'సాక్షి'తో సీనియర్ ఐపీఎస్ వీసీ సజ్జనార్

- ఈ బెట్టింగ్ యాప్‌ల టార్గెట్ ప్రధానంగా యువతే
- గ్రామీణ ప్రాంతాల వారు ఎక్కువగా వీటికి బానిసలవుతున్నారు
- బెట్టింగ్‌ల కోసం అనేకమంది అప్పులు చేసి ఆత్మహత్యల వరకు వెళ్తున్నారు
- యాప్‌లను ప్రమోట్ చేసిన ఇన్‌ఫ్లూయెన్సర్లు తదనంతర పరిణామాలు ఊహించలేదు



సాక్షి, హైదరాబాద్: 'బెట్టింగ్ యాప్స్ ప్రభావం ఎక్కువగా యువత పైనే ఉంటోంది. కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా అనేక మంది వీటికి బలవుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఈ వ్యసనానికి బానిసలుగా మారుతున్నారు. మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీమ్‌లకు భిన్నంగా ఈ బెట్టింగ్ యాప్స్ యువతనే టార్గెట్‌గా చేసుకుని దోచుకుంటున్నాయి. ఈ బెట్టింగ్ యాప్స్ ఎలాగైనా ఎదుటివాళ్లు ఓడిపోయే విధంగానే డిజైన్ చేసి ఉంటాయి. ఒకటీ రెండుసార్లు డబ్బు వచ్చినా అది కేవలం దోచుకోవడానికి ఎర అనే విషయం తెలుసుకోవాలి..' అని సీనియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్ హెచ్చరించారు. బెట్టింగ్ యాప్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో 'హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్' పేరుతో సజ్జనార్ ప్రారంభించిన అవగాహన కార్యక్రమం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కేంద్రాన్నీ కదిలించింది. తెలంగాణ సర్కారు వీటిపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తోంది. గతంలో మల్టీ లెవల్ మార్కెటింగ్ దందాల పైనా ఇలానే పోరు కొనసాగించిన సజ్జనార్.. వాటికి సంబంధించి ప్రత్యేక చట్టం రావడానికి కారణమయ్యారు. తాజాగా బెట్టింగ్ యాప్స్‌పై యుద్ధం ప్రకటించిన ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

అవగాహన పెంచేందుకే 'సే నో టు బెట్టింగ్ యాప్స్'

యువత ప్రాణాలు తీసుకోవడం కదిలించింది. బెట్టింగ్ యాప్‌ల బారినపడకుండా వారిని కాపాడటం కోసం, వారిలో అవగాహన కల్పించడానికి 'హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్' ప్రారంభమైంది. దీన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్ల మంది సెర్చ్ చేశారు. క్యాంపెయినింగ్

మిగతా 2వ పేజీలో ▶

బెట్టింగ్ యాప్‌లపై సిట్ చీఫ్‌గా ఐజీ రమేష్



ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ జితేందర్

- బృందంలో మొత్తం ఐదుగురు ఉన్నతాధికారులు
- ఎస్పీలు సింధు శర్మ, వెంకటలక్ష్మి తదితరులకు స్థానం
- 90 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ వ్యవహారాలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అధిపతిగా ఐజీ ఎం.రమేష్ పేరు ఖరారైంది. ఈ మేరకు డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదివారం ఉత్తర్వులు (ఆర్సీ నం.191/ఎల్ అండ్ ఓ–ఐ/2025) జారీ చేశారు. తొలుత ఈ బాధ్యతల్ని డీఐజీగా ఉన్న అభిషేక్ మహంతికి అప్పగించాలని భావించారు. అయితే ఆయన తెలంగాణకు కేటాయింపుపై స్పష్టత లేకపోవడం, హైకోర్టు ఆదేశాల మేరకే ఇక్కడ కొనసాగుతుండటంతో డీజీపీ కార్యాలయంలో పీ అండ్ ఎల్ విభాగం ఐజీగా ఉన్న రమేష్‌ను

మిగతా 2వ పేజీలో ▶

హెచ్‌సీయూ రణరంగం

▶ మొదటి పేజీ తరువాయి

వాతావరణం ప్రశాంతంగానే మొదలైంది. కొద్ది సేపటికే పోలీసులు తండోప తండాలుగా వచ్చి క్యాంపస్‌లోని అన్ని అంతర్గత రోడ్లను ఆధీనంలోకి తీసుకొని బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈస్ట్ క్యాంపస్ వైపు ఎవరూ వెళ్లకుండా కట్టడి చేశారు. వర్సిటీ ప్రహరీ లోపలి భూములను జేసీబీలతో చదును చేయటం ప్రారంభించారు. విషయం తెలిసిన విద్యార్థులు రోడ్లపైకి దూసుకొచ్చారు. దీంతో పోలీసులకు, విద్యార్థులకు తోపులాట జరిగింది. విద్యార్థుల నినాదాలతో క్యాంపస్ దద్దరిల్లింది. పోలీసులు ఏమాత్రం ఉపేక్షించకుండా కనిపించిన విద్యార్థిని కనిపించినట్లే వాహనాల్లోకి ఎక్కించి మాదాపూర్, గచ్చిబౌలి, కొల్లూరు పోలీస్ స్టేషన్లకు తరలించారు. విద్యార్థినులను కూడా ఈడ్చుకెళ్లి పోలీస్ వ్యాన్లలో పడేశారు. మొత్తం 52 మంది విద్యార్థులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పక్కా ప్రణాళికతో..: హెచ్‌సీయూ పరిధిలో ఉన్న 400 ఎకరాల భూమిని విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొంతకాలంగా క్యాంపస్‌లో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. ఈ నిరసనను అణచివేసేందుకు ప్రభుత్వం కూడా పక్కా ప్రణాళికతోనే వెళ్తున్నట్లు ఆదివారం నాటి ఘటనను బట్టి తెలుస్తోంది. శనివారం రాత్రి నుంచే పోలీసులు క్యాంపస్‌లో కొద్దిమొత్తంలో మకాం వేశారు. ఆదివారం ఉగాది సందర్భంగా చాలామంది విద్యార్థులు స్వగృహాలకు వెళ్లే అవకాశం ఉందని గుర్తించి క్యాంపస్‌ను పూర్తిగా అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. క్యాంపస్‌లోకి బయటి వారు రాకుండా ముందు జాగ్రత్తగా మెయిన్ గేటుకు తాళం వేశారు. లోపలివారిని బయటకు కూడా వెళ్లనీయలేదు. శనివారం రాత్రే విద్యార్థులకు, పోలీసుల మధ్య జరిగిన తోపులాటలో చాలామంది గాయపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హెచ్‌సీయూ క్యాంపస్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకోవడం పట్ల విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




హెచ్‌సీయూ భూముల విక్రయంపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం ఆందోళన చేస్తున్న విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్న పోలీసులు

మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్టైన విద్యార్థులు →



క్లుప్తంగా...

గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

- ఉగాది శుభాకాంక్షలు తెలియజేసిన ముఖ్యమంత్రి
- మంత్రివర్గ విస్తరణ అంశం కూడా చర్చకు?



రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయ్యారు. రవీంద్రభారతిలో పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, ఆ తర్వాత నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి ఉన్నారు. కాగా ముఖ్యమంత్రి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరిగిన తీరును గవర్నర్‌కు వివరించారని సమాచారం. అలాగే త్వరలో జరుగుతుందని భావిస్తున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ గురించి కూడా ప్రస్తావించారని, ఇందుకు సంబంధించిన కసరత్తు కొలిక్కి వచ్చిన తర్వాత అధికారిక సమాచారాన్ని అందజేస్తామని చెప్పినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రాక్షస పాలన ఎక్కడ కనబడిందో చెప్పండి

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మల్లురవి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాక్షస, రాబందుల పాలన నడుస్తోందంటూ బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నానని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. తెలంగాణలో రాక్షస, రాబందుల పాలన ఆయనకు ఎక్కడ కనబడిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'కేసీఆర్ రాక్షసుడని గతంలో ప్రవీణ్‌కుమార్ అన్నారు. అపాయింట్‌మెంట్ అడిగితే మూడు నెలలకు కూడా ఇవ్వలేదని, కేసీఆర్ ఫామ్‌హౌస్ పాలన చేస్తున్నారని విమర్శించారు. అదే ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్‌ను సమర్థిస్తున్నారు. ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా' అని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోని పరిస్థితులకు, కాంగ్రెస్ ప్రజాపాలనలోని పరిస్థితులకు ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉందని గుర్తించాలని కోరారు. ప్రవీణ్‌కుమార్ లాంటి నేతలు కేటీఆర్, హరీశ్, కవిత తరహాలో మాట్లాడవద్దని మల్లురవి హితవు పలికారు.

అదనపు కలెక్టర్‌పై కేసు

మరో ఇద్దరిపై కూడా...

వర్ని: ఓ రైస్‌మిల్ యజమాని సంతకం ఫోర్జరీ చేసిన కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుతం సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌తోపాటు మరో ఇద్దరిపై వర్ని పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సీఎంఆర్ కోసం 19,640 క్వింటాళ్ల ధాన్యాన్ని వర్ని మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన శ్రీనివాస రైస్‌మిల్‌కు కేటాయించారు. అయితే అకాలవర్షంతో ఆ ధాన్యం తడిసిందని రైస్‌మిల్ ప్రతినిధి కిశోర్ అధికారులకు చెప్పాడు. ఆ సమయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి 20 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని అమీర్ ఆగ్రోఫామ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి పంపినట్టు, ఆ తరువాత 51 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని పంపినట్టు సమాచారం అందించారని, కానీ ఆ ధాన్యం తమకు చేరలేదని కిశోర్ పేర్కొన్నారు. అధికారులు ధాన్యం కేటాయించకుండానే కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని అందించాలని ఒత్తిడి పెంచారన్నారు. 2023 జూలై 7వ తేదీన తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్యాడీని ఎఫ్‌టీఎఫ్ ట్రేడర్స్‌కు (బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్‌కు చెందిన రైస్‌మిల్లుకు) సరఫరా చేసినట్టు తప్పుడు రికార్డులు సృష్టించారని కిశోర్ ఆరోపిస్తూ..కోర్టును ఆశ్రయించాడు. ఈనెల 25న హైకోర్టు ఆదేశాలతో అప్పట్లో అదనపు కలెక్టర్‌గాచేసిన చంద్రశేఖర్, డీఎస్‌ఓ చంద్రప్రకాశ్, డిప్యూటీ తహసీల్దార్ నిఖిల్‌రాజ్‌లపై కేసులు నమోదు చేశామని వర్ని ఎస్సై తెలిపారు.

నా సంకల్పమేదీ విఫలం కాలేదు

తెలంగాణ రైజింగ్ లక్ష్యాన్ని కూడా సాధిస్తా..

- రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పం విజయవంతమవుతుందని ఆశిస్తున్నా
- మా ప్రయత్నాలు అడ్డుకుంటే ఆగిపోతాయని అనుకునేవారిపై కఠినంగా వ్యవహరిస్తాం
- ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రవీంద్రభారతిలో యాదగిరిగుట్ట దేవస్థానం నూతన పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆలయ ముఖ్య అర్చకులు నర్సింహమూర్తి

సాక్షి, హైదరాబాద్: తమ ప్రభుత్వ ఆలోచనల్లో స్పష్టత ఉందని. సంకల్ప బలం ఉంటే దేవుడు కూడా సహకరిస్తాడన్న సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. తన జీవితంలో సంకల్పించిన లక్ష్యం ఏదీ ఇప్పటివరకు విఫలం కాలేదన్నారు. తెలంగాణ రైజింగ్ 2050 లక్ష్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పం కూడా విజయవంతమవుతుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్యాటక సాంస్కృతిక శాఖలు సంయుక్తంగా రవీంద్రభారతిలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం మాట్లాడారు.

పెట్టుబడుల నగరంగా ఫ్యూచర్ సిటీ

'తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలబెట్టేందుకు మా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుంది. తెలంగాణ రైజింగ్ నినాదాన్ని నిజం చేస్తూ దేశంలో తెలంగాణ ఓ వెలుగు వెలిగేలా చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగు రోడ్డు, ఫ్యూచర్ సిటీ.. లాంటి కీలక నిర్ణయాలతో హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడేలా మారుస్తాం. మన ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ ఆ ఆలోచనకు నమూనాగా నిలవబోతుంది. ఇది జనావాస యోగ్యానికే పరిమితమయ్యే నగరం కాదు. ఉద్యోగ, ఉపాధి కల్పన సంక్షేమ పథకాల అమలుకు నిధులు కావాలంటే ఆ నగరానికి పెట్టుబడులు భారీగా రావాల్సి ఉంది. ఆ పెట్టుబడులతో రాష్ట్ర ఆదాయం పెరగాల్సి ఉంది. అందుకే ఆ నగరం జనావాసాలకే పరిమితం కాకుండా ఓ పెట్టుబడుల నగరంగా రూపు దిద్దుకుంటుంది..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తాం..

'అభివృద్ధి పథకాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు ప్రజల నుంచి నూరు శాతం మద్దతు వస్తుందని మా ప్రభుత్వం అనుకోవటం లేదు. దేవుళ్ల ఆరాధన విషయంలోనే భిన్నాభిప్రాయాలుండే సమాజం నుంచి.. ప్రభుత్వ నిర్ణయాలకు పూర్తి ఆమోదం ఆశించలేం. కానీ మెజారిటీ ప్రజల సంక్షేమం కోసం మేం తీసుకునే చర్యలు అడ్డుకుంటే ఆగిపోతాయని అనుకునేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రజల నుంచి మాకు సూచనలొస్తున్నాయి. కాబట్టి వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం..' అని రేవంత్ అన్నారు.

ఉగాది పచ్చడి లాగానే భట్టి బడ్జెట్

'ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కూడా షడ్రుచుల ఉగాది పచ్చడి లాగానే ఉంది. తీపి ఉంది, పులుపు ఉంది, కారం ఉంది. కాస్తోకూస్తో ఉప్పు కూడా ఉంది. కొన్ని అంశాల్లో స్వేచ్ఛగా నిధులిచ్చారు. కొన్నింటి విషయంలో తప్పనిసరి నియంత్రణ పాటించారు. ఉద్యోగ ఉపాధి, పరిశ్రమలు, వ్యవసాయం, విద్య వైద్యం తదితరాలకు మెరుగ్గా నిధులిచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు కావాలంటే, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలి. అది జరగాలంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు స్థిరంగా ఉండాలి. అసాంఘిక శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పేదలు సన్న బియ్యం కోరుకుంటున్నారు..

నేను, భట్టి జోడెద్దుల్లా రాష్ట్రాన్ని పురోగమన పథంలోకి తీసుకెళ్లేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాం. గతంలో పండుగ పూట మాత్రమే తెల్లన్నం చూసే భాగ్యం పేదలది. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి రూ.1.90కే, తర్వాత ఎన్టీఆర్ రూ.2కే కిలోబియ్యం ఇచ్చి కొంత మార్పు తెచ్చారు. సోనియాగాంధీ ఆధ్వర్యంలో ఆహారభద్రత చట్టం వచ్చాక ఇప్పుడు పేదలు శ్రీమంతుల తరహాలో సన్న బియ్యం తినాలని కోరుకుంటున్నారు. వారికోసం హుజూర్‌నగర్‌లో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వంతో పాటు గవర్నర్, ఎన్నికల వ్యవస్థ, న్యాయవ్యవస్థ, పార్టీలు, ప్రజా సంఘాలతో సత్సంబంధాలు కొనసాగిస్తాం. ఎక్కడైనా లోపాలుంటే సరిదిద్దుకుంటూ ముందుకు సాగుతాం. రాష్ట్ర ప్రజలందరికీ విశ్వావసు ఉగాది శుభాకాంక్షలు..' అని సీఎం అన్నారు.



కార్యక్రమంలో రేవంత్, భట్టి ముచ్చట్లు

ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాభివృద్ధి: భట్టి

అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాదు, ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, శంకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. ఇలావుండగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతనంగా రూపొందించిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. యాదగిరి క్షేత్ర ముఖ్య అర్చకులు మంగళగిరి నర్సింహమూర్తిని ఉగాది పురస్కారం, అవార్డుతో సన్మానించారు.

ప్రభుత్వ అణచివేత పెరిగింది

హెచ్‌సీయూలో అరెస్టులపై మండిపడ్డ కేటీఆర్

రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ అణచివేత విపరీతంగా పెరిగిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. వందలాది ఎకరాల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ ఆదివారం యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులతో పాటు జర్నలిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పోలీస్ అరాచకత్వం, దమనకాండ విచ్చల విడిగా పెరిగిపోయిందని, పాత్రికేయులను సైతం అరెస్టు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలను నిరసించే ప్రతి గొంతునూ నొక్కుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను, భావ ప్రకటన హక్కుని అణచి వేస్తున్న తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో ఈ విధంగా జరుగుతున్న అరాచకత్వానికి రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ దేశంలోని ప్రతి పట్టణానికి వెళ్లి ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ గురించి ఉపన్యాసాలు ఇస్తారని, కానీ తెలంగాణలో తమ సొంత పార్టీ పాలనలో జరుగుతున్న అరాచకత్వంపై ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఈ ద్వంద్వ ప్రమాణాలను ఇప్పటికైనా పక్కన పెట్టి, ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజాస్వామిక పాలన చేసేలా తమ పార్టీ నాయకులకు ఆదేశాలు ఇవ్వాలని కేటీఆర్, రాహుల్ గాంధీకి సూచించారు. అదుపులోకి తీసుకున్న విద్యార్థులతో పాటు జర్నలిస్టులను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూలో పోలీసుల ప్రవర్తన గర్హనీయం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసులు ప్రదర్శించిన హింసాత్మక ప్రవర్తన గర్హనీయమని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో ఆయన ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళనకు దిగారని, ప్రభుత్వం చేపట్టిన భూవేలాన్ని వ్యతిరేకించారని తెలిపారు. శాంతియుత నిరసనపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, విద్యార్థుల ఫోన్లు ధ్వంసం చేయడం, గొంతు వినిపించకుండా అణచివేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థులు ప్రజాస్వామ్యంలో తమ హక్కులు వినిపించే ప్రయత్నం చేస్తున్నారని, నిరసన తెలిపినంత మాత్రాన వారిపై లాఠీచార్జ్ చేయడం తగదని హరీశ్‌రావు అన్నారు.

బెట్టింగ్ యాప్‌లపై సిట్ చీఫ్‌గా ఐజీ రమేష్

▶ మొదటి పేజీ తరువాయి



సింధు శర్మ

ఎంపిక చేశారు. విదేశీ లింకులతో పాటు ఇతర కీలకాంశాలతో ముడిపడిన బెట్టింగ్ యాప్స్ కేసు దర్యాప్తు సుదీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉంది. ఈ లోపు అభిషేక్ మహంతికి వ్యతిరేకంగా క్యాట్ ఉత్తర్వులు వస్తే ఆ ప్రభావం కేసుల దర్యాప్తుపై పడుతుందని డీజీపీ కార్యాలయం భావించింది. ఈ నేపథ్యంలోనే మరో సమర్థుడైన అధికారిగా పేరున్న రమేష్‌ను ఖరారు చేసింది. సిట్‌లో ఇంటెలిజెన్స్ ఎస్పీ సీహెచ్ సింధు శర్మ, సీఐడీ ఎస్పీ కె.వెంకటలక్ష్మీ, సైబరాబాద్‌లో పని చేస్తున్న అదనపు ఎస్పీ ఎస్.చంద్రకాంత్, సీఐడీ డీఎస్పీ ఎం.శంకర్ సభ్యులుగా ఉన్నారు. ఈ కేసుల దర్యాప్తునకు అవసరమైన ఇతర అధికారులను సిట్ ఎంపిక చేసుకోనుంది. దీంతో పాటు ఆర్థిక నిపుణులు, న్యాయాధికారులు, ఆడిటర్లు, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ నిపుణులు తదితరులను సీఐడీ అదనపు డీజీ అనుమతితో నియమించుకునే అవకాశం ఉంది.

దర్యాప్తే కాదు..సిఫారసులూ చేయాలి: ఈ సిట్ కేవలం కేసుల్ని దర్యాప్తు చేయడం మాత్రమే కాకుండా బెట్టింగ్ యాప్స్ తీరుతెన్నులు, వ్యవహారాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వీటిని నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఈ యాప్స్‌ను కట్టడి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు, ఆదాయపు పన్ను శాఖ, జీఎస్టీ, సమాచార ప్రసార, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ, హోం మంత్రిత్వ శాఖలతో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ తదితరాల బాధ్యతలను గుర్తించాల్సి ఉంది. ఈ యాప్స్ ఆర్థిక లావాదేవీలు, వాటి మార్గాలను గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దృష్టికి తీసుకువెళ్లాలని డీజీపీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలాంటి అనేక అంశాలు, సమగ్ర వివరాలతో కూడిన నివేదికను సిట్ 90 రోజుల్లో డీజీపీకి సమర్పించాల్సి ఉంటుంది. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందం డీజీపీ కార్యాలయం కేంద్రంగానే పని చేయనుంది.

భద్రగిరిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు



ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వసంత పక్ష ప్రయుక్త తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, వేద పండితులు ఈ వేడుకలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. అర్చకుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పవిత్ర గోదావరి నదీ జలాలు తీసుకొచ్చి, మత్స్యంగ్రహణం (పుట్టమట్టితో పూజ) జరిపి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలుత ఉదయం బేడా మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది ఉత్సవాలు నిర్వహించి పంచాంగ శ్రవణం జరిపారు. రామయ్య ఆదాయం 08, వ్యయం 02, రాజపూజ్యం 07, అవమానం 03 అని, సీతమ్మవారి ఆదాయం 14, వ్యయం 02, రాజపూజ్యం 06 , అవమానం 06 అని పండితులు తెలిపారు.

సీఎం, గవర్నర్‌కు రాజపత్రాల అందజేత

శ్రీ సీతారాముల కల్యాణం, మహాపట్టాభిషేక ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మలకు ఆలయ అర్చకులు, అధికారులు ఆదివారం హైదరాబాద్‌లో రాజపత్రాలు అందజేశారు. ప్రతీ ఏడాది శ్రీరామనవమికి సీఎం, పట్టాభిషేకానికి గవర్నర్ హాజరు కావడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఉగాది పర్వదినాన వీరికి రాజపత్రాలు అందించి అర్చకులు వేదాశీర్వచనం చేశారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయ రామాయణ పారాయణులు ఎస్టీసీ అంతర్వేది కృష్ణమాచార్యులు రూపొందించిన కల్యాణ స్వాగత గీతాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓ రమాదేవి, పండితులు ఎస్టీజీ కృష్ణమాచార్యులు, సీసీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల తలంబ్రాల బుకింగ్ షురూ..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి ముత్యాల తలంబ్రాలు కావాలనుకునే వారికి ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ సౌకర్యం అందుబాటులో ఉంచినట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. ఒక్కో ప్యాకెట్‌కు కొరియర్ చార్జీలతో కలిపి రూ.60 చెల్లించాలని, దేవస్థానం వెబ్‌సైట్, మీసేవా, టీ సేవా కేంద్రాల్లో బుక్ చేసుకుంటే ఏప్రిల్ 8 నుంచి పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?

పండుగ రోజు ప్రజలతో మమేకమైన భట్టి



కాచారంలో ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తున్న భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: 'మీ అందరికీ విద్యుత్ జీరో బిల్లు వస్తోందా.. పెద్దయ్యా.. నీకు రైతు భరోసా డబ్బులు పడ్డాయా.. అమ్మా.. మీకు వంట గ్యాస్ సబ్సిడీ డబ్బులు వస్తున్నాయా?' అంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం కాచారం, కొత్త గోపవరం గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన పర్యటించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇళ్లు లేని అర్హులైన పేదలకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని భట్టి భరోసా ఇచ్చారు. పొదుపు సంఘంలో ఉన్న మహిళలకు ఇందిరమ్మ డెయిరీ పథకంలో సబ్సిడీపై గేదెలను ఇస్తామని హామీ ఇచ్చారు. కాచవరం గ్రామంలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా సానుకూలంగా స్పందించారు.

నరసమ్మగారూ.. బాగున్నారా..

ఎర్రుపాలెం మండలం కాచారంలో భట్టి పర్యటన సందర్భంగా స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకురాలిని చూడగానే 'నరసమ్మ గారూ బాగున్నారా.. ఆరోగ్యం ఎట్లా ఉంది' అంటూ భట్టి ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో ఆమె 'నెల రోజుల నుంచి నిన్ను చూడాలని ప్రాణం కొట్టుకుంటున్నది. సార్ వస్తే నా ఇంటికి తీసుకురమ్మని మన నాయకులకు చెప్పాను. పండుగ రోజున నన్ను చూడడానికి నా ఇంటికి వచ్చి పలకరించినవ్. నాకు చాలా ఆనందంగా ఉంది' అంటూ భట్టిని ఆలింగనం చేసుకొని భావోద్వేగానికి గురైంది.

గెలుపు ఎర వేస్తారు.. తర్వాత ఓడిస్తారు

▶ మొదటి పేజీ తరువాయి

మొదలైన తర్వాత 'ఎక్స్'ను 1.2 కోట్లు మంది, ఇన్‌స్టాగామ్‌ను 85 లక్షల మంది వీక్షించారు. ప్రస్తుతం అనేక మంది సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లతో పాటు ప్రముఖులు బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీళ్లు ఆయా ప్రకటనలు చేసేప్పుడు తదనంతర పరిణామాలను ఊహించలేదు. ఇలాంటి వాటిని ప్రోత్సహించడం సైబర్ టెర్రరిజం కిందికే వస్తుంది.

మన పోలీసులు ఆది నుంచీ ముందున్నారు

సమాజంలో జరుగుతున్న వివిధ రకాలైన ఆర్థిక దోపిడీలను అడ్డుకోవడంలో మన పోలీసులు ఎప్పుడూ ముందుంటున్నారు. ఒకప్పుడు ఎంఎల్ఎం స్కామ్స్, ఆపై మైక్రో ఫైనాన్స్ దుర్వినియోగాలను పకడ్బందీగా కట్టడి చేశారు. ఇప్పుడు బెట్టింగ్ యాప్స్ వంతు వచ్చింది. అదే స్ఫూర్తితో ముందుకు వెళ్లి కేవలం పాత్రధారులనే కాదు సూత్రధారులకూ చెక్ చెప్పే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. చట్టాన్ని కూడా కఠినంగా అమలు చేయాలి. అన్నివర్గాల్లో అవగాహన కల్పించాలి. బెట్టింగ్ యాప్‌లను బ్యాన్ చేయడం, ప్రమోటర్లతో పాటు నిర్వాహకుల పైనా చర్యలు తీసుకోవడం అవసరం. ఈ బెట్టింగ్ ప్రకటనలను అనుమతించిన మీడియా ప్లాట్‌ఫామ్‌లూ బాధ్యత వహించేలా చేయాలి. లావాదేవీలను సులభతరం చేసే చెల్లింపు గేట్‌వేల లైసెన్స్‌లు రద్దు చేయాలి.

అడ్డుకట్ట వేయకపోతే ఓ తరాన్ని పణంగా పెట్టాల్సిందే..

బెట్టింగ్ నెట్‌వర్క్‌లు విదేశాల నుండి పనిచేస్తుంటాయి. అందువల్ల వీరిని కనిపెట్టి, కట్టడి చేయడం కష్టసాధ్యమైన అంశం. అందువల్ల అంతా ముందుకు వచ్చి అందరిలోనూ అవగాహన కల్పించడం ద్వారా ఈ ఉచ్చు నుంచి యువతను తప్పించాలి. పోలీసులు సైతం ఎప్పటికప్పుడు బెట్టింగ్ దందాలపై అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లు అనేక కుటుంబాలు కుప్పకూలడానికి కారణం అవుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ఆర్థిక ఉగ్రవాదంతో సమానం. ఇప్పటికైనా దీనికి అడ్డుకట్ట వేయకపోతే దానికి ఓ తరాన్ని ఫణంగా పెట్టాల్సి వస్తుంది. ఈ తరుణంలో అందరం కలిసి ముందుకు వెళితేనే మన సమాజాన్ని కబళిస్తున్న బెట్టింగ్ భూతానికి పూర్తి స్థాయిలో చెక్ పెట్టగలం. యువతరాన్ని రక్షించుకోగలం.

తల్లిదండ్రుల అప్రమత్తతా కీలకం

బెట్టింగ్ యాప్‌ల విషయంలో తల్లిదండ్రులూ అప్రమత్తంగా ఉండాలి. ఈ భూతాన్ని పూర్తిగా పారద్రోలాలంటే తల్లిదండ్రుల సహకారం అనివార్యం. ప్రతి ఒక్కరూ తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. సోషల్‌మీడియా వినియోగదారుల్లో 16–30 ఏళ్ల మధ్య వయస్కులే ఈ యాప్‌ల టార్గెట్‌గా ఉంటున్నారు. ఇక తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్న ఎందరో విద్యార్థులు తమ చదువుకు ఉద్దేశించిన డబ్బును బెట్టింగ్‌లో పోగొట్టుకుని విద్యకు దూరమైన ఉదంతాలు ఉన్నాయి. యువత అనేకమంది అప్పుల ఊబిలో చిక్కుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు తరచుగా వెలుగులోకి వస్తున్నాయి. నిజానికి ఇవి ఆత్మహత్యలు కాదు.. బెట్టింగ్ యాప్స్, వాటిని ప్రమోట్ చేసే వాళ్లు చేసిన హత్యలు.

క్లుప్తంగా...

పాత బార్లకు కొత్త ప్రకటన విడుదల

ఏప్రిల్ 26 వరకు దరఖాస్తు గడువు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 25 పాత బార్లకు కొత్తగా ప్రకటన విడుదలైంది. ఈ మేరకు గతంలో మంజూరై పనిచేయని, లైసెన్స్ ఫీజు రెన్యువల్ చేసుకోని ఆ బార్లకు ప్రయర్ క్లియరెన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఎక్సైజ్ శాఖ ప్రకటన జారీ చేసింది. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ పేరిట ఆదివారం జారీ చేసిన ఈ ప్రకటన ప్రకారం ఈ బార్ల కోసం వచ్చే నెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుము రూ.లక్షగా నిర్ణయించారు. ఈ బార్లకు లైసెన్సు ఫీజు రూ.44 లక్షలు, రూ.42 లక్షలు, రూ.30 లక్షల స్లాబులుగా నిర్ధారించారు. ఇందులో ఆదిలాబాద్ (5), కరీంనగర్ (1), వరంగల్ (4), ఖమ్మం (2), నల్లగొండ (1), మహబూబ్‌నగర్ (5), మెదక్ (1), నిజామాబాద్ (4), రంగారెడ్డి (2) డివిజన్ల పరిధిలోని బార్లు ఉన్నాయి.

హెచ్‌పీఎస్‌లో

గిరిజన విద్యార్థులకు ప్రత్యేక హాస్టళ్లు



సాక్షి, హైదరాబాద్: బేగంపేట, రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ప్రత్యేకంగా హాస్టళ్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండు స్కూళ్లలో వేర్వేరుగా బాలబాలికలకు చెరో హాస్టల్ చొప్పున నిర్మించేందుకు రూ.1.53 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 2025–26 విద్యా సంవత్సరం నుంచి వసతి గృహాలను అందుబాటులోకి తెస్తారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

టాపర్లు మహిళలే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. జూలై 7వ తేదీన ఫలితాలను విడుదల చేసింది. 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి 31383 మందిని మెయిన్స్ పరీక్షలకు ఎంపిక చేసింది. మెయిన్స్ పరీక్షలు గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించింది. మొత్తం 31,403 మంది పరీక్షలకు హాజరు కాగా.. 21,093 మంది మాత్రమే మొత్తం 7 పేపర్లూ రాశారు. ఈ నెల 10న అభ్యర్థుల ప్రొవిజినల్ మార్కుల జాబితాను కమిషన్ విడుదల చేయగా..మార్కుల రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 వరకు కమిషన్ అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియ పూర్తి కావడంతో అభ్యర్థులు ఏడు పేపర్లలో సాధించిన మొత్తం మార్కుల వివరాలతో కూడిన జీఆర్‌ఎల్‌ను కమిషన్ తాజాగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. జనరల్ ఇంగ్లిష్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ఉన్నారు.

అభ్యర్థి లాగిన్‌లో మార్కుల మెమోలు

పేపర్ల వారీగా అభ్యర్థుల మార్కులను కమిషన్ విడుదల చేసింది. అభ్యర్థుల లాగిన్‌లో మెమోలు అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు వారి టీజీపీఎస్సీ ఐడీ, హాల్‌టికెట్, పుట్టిన తేదీ, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీల ద్వారా లాగిన్ అయ్యాక పేజీని తెరిచి మెమోను డౌన్‌లోడ్ చేసుకోవాలని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఈ మెమోలు ఏప్రిల్ 5వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని కమిషన్ కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే జీఆర్‌ఎల్ ఏప్రిల్ 28వ తేదీ వరకు నెలరోజుల పాటు అందుబాటులో ఉంటుందని వివరించారు. ప్రస్తుతం విడుదల చేసిన జీఆర్‌ఎల్ ఆధారంగా త్వరలో 1:2 నిష్పత్తిలో ప్రాథమిక ఎంపిక జాబితాను విడుదల చేయనున్నట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి. అలాఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టిన తర్వాత తుది ఎంపిక జాబితాను ప్రకటిస్తారు. అభ్యర్థులు అన్నిరకాల ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు అనెక్షర్-6 ప్రకారం నిర్దేశించిన డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకోవాలని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఇలావుండగా హైకోర్టు ఆదేశాలతో మెయిన్స్ పరీక్షలు రాసిన అభ్యర్థుల (స్పోర్ట్స్ కోటా విషయంలో 20 మంది కోర్టును ఆశ్రయించారు) వివరాలను విడుదల చేయలేదు. లాగిన్ విషయంలో అభ్యర్థులకు ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే కమిషన్ టెక్నికల్ డెస్క్‌ను 040–23542185, 040–23542187 ఫోన్ నంబర్లలో లేదా 'హెల్ప్‌డెస్క్(ఎట్)టీఎస్‌పీఎస్సీ.జీఓవీ.ఇన్'లో సంప్రదించవచ్చని టీజీపీఎస్సీ తెలిపింది.

గ్రూప్-1 మెయిన్స్‌లో టాప్ 25 అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లు, వారు సాధించిన మార్కులు ఇలా...

ర్యాంకు	హాల్‌టికెట్ నంబర్	మార్కులు	జెండర్	కేటగిరీ	మల్టీజోన్
1	240946218	550.000	మహిళ	ఓసీ	2
2	240920349	535.500	పురుషుడు	బీసీ-ఏ	2
3	240907150	535.500	పురుషుడు	ఓసీ	9
4	240911068	532.500	మహిళ	ఓసీ	1
5	240918455	532.000	మహిళ	బీసీ-బి	2
6	240911138	525.500	పురుషుడు	ఓసీ	2
7	240915311	524.000	మహిళ	ఓసీ	2
8	240913631	521.000	మహిళ	ఓసీ	1
9	240911097	521.000	మహిళ	బీసీ-బి	1
10	240906021	519.000	పురుషుడు	ఓసీ	1
11	240920332	517.000	పురుషుడు	ఓసీ	2
12	240912041	516.500	మహిళ	ఎస్టీ	2
13	240906269	515.000	పురుషుడు	బీసీ-బి	1
14	240919616	514.500	మహిళ	బీసీ-డి	1
15	240901328	513.500	మహిళ	బీసీ-బి	1
16	240912822	513.500	పురుషుడు	ఓసీ	2
17	240912884	513.000	పురుషుడు	బీసీ-డి	1
18	240938010	512.500	మహిళ	ఓసీ	1
19	240916017	512.500	పురుషుడు	బీసీ-బి	1
20	240907205	512.500	పురుషుడు	ఓసీ	9
21	240909412	512.000	మహిళ	బీసీ-బి	1
22	240901417	511.000	మహిళ	బీసీ-డి	1
23	240916252	510.500	పురుషుడు	బీసీ-బి	1
24	240915594	510.000	పురుషుడు	ఓసీ	2
25	240922188	510.000	పురుషుడు	బీసీ-ఏ	2

(నోట్: పట్టికలో మల్టీజోన్ కింద ఉన్న 9 అంకె నాన్ లోకల్ అభ్యర్థికి సూచిక)

డైట్ చార్జీల బకాయి

రూ.650 కోట్లు

గత ఏడాది జూన్ నుంచి పైసా ఇవ్వని ప్రభుత్వం

అప్పులు చేసి హాస్టళ్లను నడుపుతున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ శాఖల పరిధిలో కొనసాగుతున్న వసతిగృహాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. ప్రభుత్వం నెలల తరబడి డైట్ చార్జీలు విడుదల చేయకపోవడంతో నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. నాలుగు సంక్షేమ శాఖలకు సంబంధించి రూ.650 కోట్లకు పైబడి బకాయిలు పేరుకుపోయినట్లు ప్రాథమిక గణాంకాలు చెబుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే డైట్ చార్జీలు విడుదలయ్యాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిల్లో కొంతమేర విడుదల కాగా.. ప్రస్తుత ఏడాది బకాయిలు మాత్రం విడుదల చేయలేదు. సంక్షేమ శాఖల అధికారులు బిల్లులను క్లియర్ చేసి ఖజానా విభాగంలో టోకెన్లు జనరేట్ అయ్యేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత ఆర్థిక శాఖ నుంచి అనుమతి లేకపోవడంతో ఆ బిల్లులన్నీ ఖజానా విభాగంలోనే పేరుకుపోయాయి. ఉగాది, రంజాన్ సందర్భంగా వరుసగా సెలవు దినాలు వచ్చాయి. దీంతో ఆర్థిక సంవత్సరం ముగిసిపోయినట్లే. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే వీటికి మోక్షం కలుగుతుందని భావిస్తున్నారు.

సంక్షేమ శాఖల వారీగా హాస్టళ్లు ఇలా..

శాఖ	ప్రీమెట్రిక్	పోస్టుమెట్రిక్	మొత్తం విద్యార్థులు
ఎస్సీ	647	213	76,436
ఎస్టీ	138	163	44,091
బీసీ	390	313	72,800
మైనార్టీ	0	6	230

నిర్వహణ భారం..

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు సంక్షేమ శాఖల పరిధిలో 1,870 సంక్షేమ వసతి గృహాలున్నాయి. ఇందులో 1,175 ప్రీమెట్రిక్ హాస్టళ్లు, 695 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లున్నాయి. వీటి పరిధిలో 1,93,557 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సగటున ఒక్కో హాస్టల్‌లో 105 మంది విద్యార్థులున్నారు. చాలా హాస్టళ్లలో పూర్తిస్థాయి వసతులు లేకపోవడంతో దాదాపు 10 వేలకు పైబడి అడ్మిషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. హాస్టళ్లకు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో నిర్వహణ భారంగా మారుతోందని వసతిగృహ సంక్షేమాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతిగృహాల నిర్వహణకు సంబంధించిన చెల్లింపులను గ్రీన్‌చానల్ పద్ధతిలో ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలుకు నోచుకోలేదు. గతంలో ఈ చెల్లింపులు ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగేవి. కానీ, గత పది నెలలుగా డైట్ బిల్లులు విడుదల కాకపోవటంతో నెలవారీ నిర్వహణ కోసం వసతిగృహ సంక్షేమాధికారులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల కిరాణా వ్యాపారుల వద్ద ఉద్దెర పద్ధతిలో సరుకులు తెచ్చి కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడం.. మరో పక్షం రోజుల్లో వార్షిక పరీక్షలు ముగిసి హాస్టళ్లు మూతపడనుండడంతో ఆయా వ్యాపారులు డబ్బులివ్వాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు.

ఐఏఎస్ నా కల..



తల్లిదండ్రులతో వెంకటరమణ

నల్లగొండ: గ్రూప్ -1 ఫలితాల్లో నల్లగొండకు చెందిన దాది వెంకటరమణ 2వ ర్యాంకు సాధించాడు. టీజీపీఎస్సీ ఆదివారం ప్రకటించిన ర్యాంకింగ్‌లలో దాది వెంకటరమణ (హాల్ టికెట్ నంబర్ 240920349) 535.5 మార్కులు సాధించాడు. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన వెంకటరమణ తల్లి దాది రమాదేవి ప్రధానోపాధ్యాయురాలిగా, తండ్రి శ్రీనివాసరావు ఆర్‌డబ్ల్యూఎస్‌లో కాంట్రాక్టు ఏఈగా పని చేస్తున్నారు. వీరి స్వస్థలం సూర్యాపేట. ఉద్యోగరీత్యా నల్లగొండలోని బృందావన్ కాలనీలో స్థిరపడ్డారు. ఐదు సంవత్సరాలుగా వెంకటరమణ సివిల్స్‌కు ప్రిపేర వుతూ గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. వెంకటరమణ ఇటీవల విడుదలైన జూనియర్ లెక్చరర్, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ ఉద్యోగాలు కూడా సాధించడంతో పాటు గ్రూప్-2లో 378వ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఐఏఎస్ కావాలన్నది తన ఆశయమని, అయితే గ్రూప్-1 ద్వారా డిప్యూటీ కలెక్టర్ పోస్టు సాధించానని చెప్పాడు. భవిష్యత్‌లో ఐఏఎస్ కల నెరవేర్చుకుంటానని తెలిపాడు. అమ్మానాన్నల సహకారంతో విజయం సాధించానని పేర్కొన్నాడు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తా..



శాయంపేట/హనుమకొండ: హనుమకొండ జిల్లా శాయంపేట మండలం తహరాపూర్ (మాందారిపేట) గ్రామానికి చెందిన జిన్నా తేజస్వినిరెడ్డి గ్రూప్-1 ఫలితాల్లో స్టేట్ 4వ ర్యాంకు సాధించింది. తేజస్విని తల్లిదండ్రులు జిన్నా హేమలత, విజయపాల్‌రెడ్డి ప్రస్తుతం హనుమకొండ విద్యానగర్‌లో ఉంటున్నారు. తేజస్వినిరెడ్డి మల్టీజోన్-1లో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఆమె 2019 మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-2లో మండల పంచాయతీ అధికారిగా ఉద్యోగం సాధించింది. మొదటి పోస్టింగ్ నేలకొండపల్లి, రెండవ పోస్టింగ్ టేకుమట్ల, ప్రస్తుతం రేగొండలో ఉద్యోగం చేస్తున్నది. ఓవైపు ఉద్యోగం చేస్తూనే గ్రూప్-1కు సన్నద్ధమైంది. 'నేను సివిల్ సర్వీసెస్‌లో చేరాలన్నది తాత కోరిక. అది నెరవేర్చడానికి కష్టపడి చదివాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గ్రూప్-1లో స్టేట్ 4వ ర్యాంకు సాధించాను. చాలా సంతోషంగా ఉంది. నాకు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వస్తుంది. ఆ హోదాలో ప్రభుత్వ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందేలా చూడవచ్చు. అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తాను'అని తేజస్వినిరెడ్డి తెలిపారు.

అమ్మమ్మ, తాతయ్యకు అంకితం..



మిర్యాలగూడ: గ్రూప్-1 ఫలితాల్లో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన పూనాటి హర్షవర్దన్ (హాల్‌టికెట్ నంబర్ 240911138) 525.5 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు సాధించాడు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన రాజ్యలక్ష్మి, తిరుపతిరావుల కుమారుడైన హర్షవర్ధన్ పదో తరగతిలో 568 మార్కులు, ఇంటర్‌లో 972 మార్కులు సాధించాడు. అనంతరం బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసి రూ.27 లక్షల వార్షిక వేతనంతో అమెజాన్‌లో ఏడాది పాటు ఉద్యోగం చేశాడు. అనంతరం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోసం ఢిల్లీ వెళ్లి నాలుగేళ్ల శిక్షణ తీసుకున్నాడు. గత సంవత్సరం తిరిగి హైదరాబాద్‌కు వచ్చి గ్రూప్-1 కోసం సన్నద్ధమై పరీక్షలో సత్తాచాటి రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించాడు. హర్షవర్ధన్ తల్లి గృహిణి, తండ్రి బియ్యం వ్యాపారి. హర్షవర్ధన్ తమ్ముడు అమెరికాలో చదువుతున్నాడు. కష్టపడి చదివి గ్రూప్-1లో ర్యాంకు సాధించానని.. ఈ విజయాన్ని తన అమ్మమ్మ జంపాల నర్సమాంబ, తాతయ్య కొండయ్యకు అంకితం ఇస్తున్నట్లు హర్షవర్ధన్ తెలిపాడు.

ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు..



మీర్‌పేట: ఆదివారం వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా మీర్‌పేట మున్సిపల్ పరిధిలోని జిల్లెలగూడకు చెందిన సిద్ధాల లావణ్య, బీరప్పల కుమార్తె కృతిక రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా 'సాక్షి'తో తన ప్రిపరేషన్ గురించి వివరించింది. 'మొదట సివిల్స్‌కు సిద్ధం అయ్యాను. నాలుగుసార్లు ప్రయత్నించినప్పటికీ మంచి ర్యాంకు రాలేదు. దీంతో 2022లో గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతో అప్పటి నుంచి చదవడం ప్రారంభించాను. రోజులో ఇన్ని గంటలు చదవాలన్న నిబంధన పెట్టుకోకుండా ఒక చాప్టర్ పూర్తిగా చదవాలని అనుకుని ఎన్ని గంటలైనా చదివి పూర్తి చేశాను. పరీక్షలు దగ్గరపడుతున్నప్పుడు మాత్రం రోజులో 10 నుంచి 12 గంటలు చదివాను'అని తెలిపారు. తాను ఎక్కడా శిక్షణ తీసుకోలేదని, ఆన్‌లైన్ కోర్సులు కొనుగోలు చేసి చదివినట్లు వెల్లడించింది. సివిల్స్ ప్రిపరేషన్ గ్రూప్-1లో మంచి ర్యాంకు సాధించేందుకు ఉపయోగపడిందని తెలిపింది. ఆమె గ్రూప్-4లో 511వ ర్యాంకు సాధించింది. కమర్షియల్ ట్యాక్స్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా కూడా ఉద్యోగం సాధించి జనవరి నుంచి విధులు నిర్వహిస్తోంది. తనకు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వస్తుందని తెలిపింది. కృతిక తల్లి లావణ్య గతంలో సరూర్‌నగర్ మండల ఎంపీపీగా, మీర్‌పేట కార్పొరేటర్‌గా పనిచేశారు.

నానమ్మ కష్టం వృథా కానివ్వలేదు..



ఏటూరునాగారం: ఆరేళ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆ బిడ్డను.. దివ్యాంగురాలైన నానమ్మ అన్నీ తానే అయ్యి సాకింది. ఆమె కష్టాన్ని ఆ బిడ్డ వృథా కానివ్వలేదు. కటిక పేదరికం ఎన్ని అవరోధాలు సృష్టించినా మొక్కవోని దీక్షతో చదివి గ్రూప్-1 ఫలితాల్లో స్టేట్ 105వ ర్యాంకు సాధించాడు. ములుగు జిల్లా ఏటూరునాగారంలోని మానసపల్లికి చెందిన దైనంపల్లి ప్రవీణ్ కుమార్ తన నానమ్మ రుణం ఇలా తీర్చుకున్నాడు.

కష్టాలనే విజయంగా మార్చుకొని..

ప్రవీణ్‌కుమార్‌కు ఆరేళ్ల వయసు ఉన్నప్పుడే తల్లిదండ్రులు సమ్మయ్య, రజిత అనారోగ్యంతో మరణించారు. దీంతో నానమ్మ ఎల్లమ్మ అతడిని పెంచి పెద్ద చేసింది. స్వగ్రామంలో సఫాయి కార్మికురాలిగా పనిచేస్తూ మనవడిని చదివించింది. ప్రవీణ్ ఏటూరునాగారం జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. ములుగు మండలం జాకారం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఇంటర్, ఉస్మానియా యూనివర్సిటీలో 2019లో బీటెక్ పూర్తి చేశాడు. 'గ్రూప్-1 ఆఫీసర్ కావాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లోని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ప్రిపేర్ అయ్యాను. ఫలితాల్లో 105వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. డీఎస్పీ హోదా కలిగిన ఉద్యోగం వస్తుంది'అని ప్రవీణ్‌కుమార్ సంతోషం వ్యక్తంచేశాడు. 'నా కొడుకు, కోడలు లేనందుకు మనవడికి గొప్ప ఉద్యోగం రావడం గర్వంగా ఉంది. నాకు రెండు కాళ్లు లేకున్నా గ్రామ పంచాయతీలో సఫాయిగా పనిచేసి పెద్దచేసిన. ఇప్పుడు గొప్ప స్థాయికి పోయిండు. ఎంతో ఆనందంగా ఉంది'అంటూ ఎల్లమ్మ భావోద్వేగంతో చెప్పింది.

ఫార్ములా- ఈ కార్ రేస్ దర్యాప్తు ముమ్మరం

- మరోసారి నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న ఏసీబీ అధికారులు
- ఈ వారంలో కీలక పరిణామాలు!

సాక్షి, హైదరాబాద్: నిబంధనలను అతిక్రమిస్తూ విదేశీ కంపెనీకి ప్రభుత్వ నిధుల మళ్లింపు ఆరోపణలపై నమోదైన ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేశారు. కారు రేసు నిర్వహణకు నిర్ణయాలు తీసుకున్న అప్పటి ప్రభుత్వ పెద్దల నుంచి రేసు నిర్వహణ సంస్థ వరకు అందరినీ ఇప్పటికే ఒకసారి విచారించిన ఏసీబీ, అందులో వచ్చిన అంశాల ఆధారంగా మరోసారి విచారణకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ వారంలో ఈ కేసు దర్యాప్తు మరింత ముమ్మరం అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ కేసులో కీలకమైన వారిని విచారించేందుకు ఏసీబీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణలో కీలకమైన ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈఓ)



ప్రతినిధులతోపాటు, ఎఫ్ఈఓ సీఈఓను సైతం ఏసీబీ అధికారులు ఇటీవలే జూమ్ మీటింగ్ ద్వారా విచారించిన విషయం తెలిసిందే. ఇప్పటికే సేకరించిన ఆధారాలు..విచారణ సందర్భంగా పలువురి నుంచి సేకరించిన అంశాల ఆధారంగా ఈ కేసులో ఏ-1గా ఉన్న మాజీమంత్రి కేటీఆర్, ఏ-2 స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, ఏ-3 హెచ్ఎండీఏ మాజీ ఈసీ బీఎల్ఎన్‌రెడ్డిలకు మరోసారి నోటీసులు ఇచ్చి ప్రశ్నించే అవకాశం ఉంది. ఇటీవలే ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ సైతం పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'ఈ కార్ రేస్ కేసులో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతుండగానే నాకు మళ్లీ నోటీసులు ఇస్తారు. ఆ లొట్ట పీసు కేసు గురించి నేను భయపడను' అంటూ వ్యాఖ్యానించారు. అయితే కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు మెటీరియల్ ఎవిడెన్స్ సేకరణపై ఫోకస్ పెట్టిన ఏసీబీ అధికారులు, మరింత లోతుగా విచారించేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. హెచ్ఎండీఏ నిధుల దుర్వినియోగంపై ఈ ఏడాది జనవరి 8న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, 9న కేటీఆర్, 10న హెచ్ఎండీఏ బోర్డు మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డిని, అదే నెల18న గ్రీన్‌కో ఏస్ నెక్స్ట్‌జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణ ఒప్పందాలు, ఆర్థిక లావాదేవీలు, నిబంధనల అతిక్రమణపై ఇప్పటికే ఏసీబీ అధికారులు కీలక వివరాలు సేకరించారు. ప్రాథమిక విచారణలో భాగంగా నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, లభించిన ఆధారాలతో మరింత ముందుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ వారంలో కేసులో మరికొన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.



పెద్దవాళ్లతో చర్చల్లో కన్నా పిల్లల నుంచి ఎదురయ్యే అనూహ్య ప్రశ్నల నుంచే మరింత ఎక్కువగా నేర్చుకోగలం.

– జాన్ లాకి

సాక్షి

సోమవారం, 31 మార్చి 2025

నిజంగా హర్షణీయం!

కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని సమూలంగా మార్చేసింది. దాని పర్యవసానాల్లో ఒకటి, బయటికి వెళ్లే పనిలేకుండా చేయగలిగే పనుల గురించి ఆలోచించడం. అలాంటి ఒక కారణంతో మొదలైన 'హర్షణీయం' తెలుగు పాడ్‌కాస్ట్, సమస్త సాహిత్య ప్రపంచాన్ని తెలుగు గడపలోకి తెచ్చిపెట్టింది. అంతేనా? అనువాద ప్రపంచంలోకి అడుగుపెట్టాలనుకునే ఏ భాషవారికైనా ఒక ఆన్‌లైన్ నిధిగా రూపొందింది. 2020 మార్చ్‌లో ముందు తెలుగులో ప్రారంభమై, తర్వాత తెలుగు– ఆంగ్లంగా మారి, అటుపై ఆంగ్లంలోకి కూడా వ్యాపించిన ఈ పాడ్‌కాస్ట్ 'నూరు మంది అనువాదకుల' సిరీస్‌ను ఇటీవలే ముగించుకుంది. ఇందులో మలయాళం, తమిళం, కన్నడం, గుజరాతీ లాంటి భారతీయ భాషల్లోంచి ఆంగ్లంలోకి అనువదిస్తున్నవారితో పాటు– థాయి, ఉజ్బెక్, వియత్నమీస్, హంగేరియన్, తుర్కిష్, నార్వేజియన్, మంగోలియన్, కిస్వాహిలీ లాంటి భాషల ఆంగ్లానువాదకుల ఇంటర్వ్యూలు ఉన్నాయి. దోస్తొవ్‌స్కీ ఉపరితల అంశాల మీద సమయం వృథా చేయరని చెబుతారు, గతేడాదే 'బ్రదర్స్ కరమ జోవ్'కు మరో ఆంగ్లానువాదం వెలువరించిన మైకేల్ ఆర్. కట్జ్. మనిషిని మలిచే కీలక క్షణాలు, విశ్వాసం, నైతికత, హింస, తీవ్రోద్వేగాల మీద దోస్తొవ్‌స్కీ దృష్టి ఉంటుందని అంటారు. పంతొమ్మిదో శతాబ్దపు రష్యన్ సాహిత్యాన్ని బోధించే మైకేల్ సుమారు 20 రష్యా నవలల్ని అనువదించారు. దోస్తొవ్‌స్కీ 'నోట్స్ ఫ్రమ్ అండర్‌గ్రౌండ్'లోని తొలి 30 పేజీలు అనువాదానికి అసలు లొంగనివని ఆయన అభిప్రాయం. ఒక పుస్తకం పుట్టించే తక్షణ స్పందనే దాన్ని అనువాదానికి పూనుకునేలా చేస్తుందని చెబుతారు అరుణవ సిన్హా. పదహారేళ్ల కాలంలో సుమారు 80 పుస్తకాల్ని బంగ్లా నుంచి ఆయన ఆంగ్లంలోకి అనువదించారు. సగటున ఏడాదికి ఐదు పుస్తకాలు! ఒక దానిలో దిగితే అందులో మునిగిపోవడమే ఇంత వేగంగా అనువదించడానికి కారణమంటారు. ఫుట్‌నోట్ ఇవ్వాల్సి రావడాన్ని ఒక వైఫల్యంగా చూస్తారు హిందీ, ఉర్దూ నుంచి అనువాదాలు చేసే అమెరికన్ డైసీ రాక్‌వెల్. భాషల మీద ప్రేమతో ఆమె దాదాపు పదిహేను భాషలు నేర్చుకున్నారు. ఇంకా, కరీమ్ అబ్దుల్ రహమాన్(కుర్దిష్), జెస్సికా కోహెన్(హీబ్రూ), లోలా రోజర్స్ (ఫిన్నిష్) లాంటివాళ్లు ఈ పాడ్‌కాస్ట్‌లో తమ ఆలోచనలను పంచుకున్నారు. అనువాద క్రాఫ్ట్‌తో పాటు మొత్తంగా అనువాద ఎకో సిస్టమ్ గురించి ఇంత విస్తారంగా ఒకేచోట మాట్లాడిన పాడ్‌కాస్ట్ ప్రపంచంలో ఇంకోటి లేదని ఐస్‌లాండిక్ అనువాదకురాలు విక్టోరియా క్రిబ్ కితాబునివ్వడం హర్షణీయం అందుకున్న ప్రశంసల్లో ఒకానొకటి.

మూడు దశాబ్దాలుగా స్నేహితులైన ఇంజినీరింగ్ క్లాస్‌మేట్లు హర్ష, అనిల్, గిరి ఉద్యోగాలు చేస్తూనే, పాఠకులుగా తమ అభిరుచితో 'హర్షణీయం' మొదలుపెట్టారు. ఇందులో హర్ష కథకుడు, అనిల్ అనువాదకుడు, గిరి సాంకేతిక నిపుణుడు. వక్తలను ఎంచుకోవడం, ప్రశ్నలు కూర్చుకోవడం ముగ్గురూ కలిసి చేస్తారు. ఎడిటింగ్ బాధ్యత కుదిరినవాళ్లు తీసుకుంటారు. ఇంటర్వ్యూలు మాత్రం అనిల్ చేస్తారు. సాహితీవేత్తలను ఇంటర్వ్యూలు చేయడంలో ప్రొఫెసర్ మృణాళిని 'అక్షర యాత్ర' తమకు స్ఫూర్తి అంటారు. ముందు తెలుగు రచయితల సంభాషణలతో మొదలుపెట్టి, తర్వాత ఇరవై నాలుగు రాష్ట్రాల్లోని పర్యావరణవేత్తల అభిప్రాయాలకు వేదికై, బిభూతిభూషణ్ బంధోపాధ్యాయ 'వనవాసి' నవలను యాభై వారాలు ఆడియోగా ఇచ్చి, తర్వాత అనువాదకుల వైపు మళ్లారు. లోప్రొఫైల్‌లో ఉండే అనువాదకుల మెయిల్స్, కాంటాక్ట్ నంబర్స్ సంపాదించడం, వాళ్లకు తమ వివరాలు చెబుతూ సందేశాలు పంపడం, ఒక్కోసారి ఎనిమిది నెలల తర్వాత కుదురుతుందని చెబితే వేచివుండి(ఉదా: మైకేల్ కట్జ్) మళ్లీ సంప్రదించడం, ప్రశ్నలు ముందే పంపడం, విదేశీయుల సమయాన్ని బట్టి రాత్రుళ్లు మాట్లాడటం, వివాదాల జోలికి పోకుండా పుస్తకాల మీదే ఫోకస్ పెట్టడం వీళ్ల పనితీరు. ఎక్కువ అనువాదాలు జరిగే ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇటాలియన్ అనువాదకులు కూడా సహజంగానే ఈ పాడ్‌కాస్ట్‌లో చోటుచేసుకున్నారు. 'ది హర్షణీయం పాడ్‌కాస్ట్ అండ్ ఇట్స్ ఇటాలియన్ లిటరేచర్ ఇన్ ట్రాన్స్‌లేషన్' పేరుతో 'ద గ్లోబల్ లిటరేచర్ ఇన్ లైబ్రరీస్ ఇనీషియేటివ్' 2024 నవంబర్‌లో వీళ్ల పాడ్‌కాస్ట్‌ను ప్రస్తావించడం విశేషం. కొన్నింటికి కాలం కూడా కలిసిరావాలి. ఇంకో కాలంలో అయితే ఇలాంటిది జరిగే అవకాశం లేదు. కొన్ని మెయిల్స్‌తో, ఒక్క ఫోన్‌కాల్‌తో ప్రపంచంలో ఎక్కడో ఉన్నవారితో సంభాషించడం ఎలా సాధ్యం? కాని కలిసొచ్చే కాలంలో కూడా ఎంతమంది ఇలాంటి పనికి పూనుకున్నారు? అందుకే వీళ్ల పని హర్షణీయం.

తెలుగు భాషలోని 56 అక్షరాలన్ని దేశాల వారితోనైనా మాట్లాడాలని సరదాగా వీళ్లు పెట్టుకున్న లక్ష్యం నెరవేరింది. అనువాదకుల సిరీస్‌లో భాగంగా, గతేడాది ప్రతిష్ఠాత్మక బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్ లాంగ్‌లిస్ట్‌లోని పదముగ్గురు అనువాదకులతోనూ సంభాషించారు. ఈ ఏడాది లాంగ్‌లిస్ట్‌లోని రిఫరెన్సుల్ని సాక్షాత్తూ 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్' అడ్మినిస్ట్రేటర్ ఫియమెత్తా రోకో ఇచ్చి ఇంటర్వ్యూలకు సహకరించడం వీళ్ల విశ్వసనీయతకు చిహ్నం. ఈ సంభాషణలు ఈ ఏప్రిల్‌లోనే ప్రసారం అవుతాయి. అక్కడివాళ్లను ఇక్కడికి తెస్తున్నారు సరే, తెలుగువాళ్లు అటుపోయే మార్గమేమిటి? 'తెలుగులో గొప్ప రచయితలు చాలామంది ఉన్నారు. కానీ ముందు ఆంగ్లంలోకి అనువాదం కావడం; ముఖ్యంగా యూకే, యూఎస్‌లో ప్రచురితం కావడం అతిపెద్ద సవాలు. దానికి నాణ్యమైన అనువాదకులతో పాటు నిబద్ధత ఉన్న ప్రచురణకర్తలు అవసరం' అని చెబుతారు అనిల్. తెలుగు సాహిత్యంలో ఆ వాతావరణం క్రమంగా చోటుచేసుకుంటోందనీ, రెండేళ్లలో సానుకూల మార్పు చూడబోతున్నామనీ అంటారు. ఇది ఇంకోరకంగా హర్షణీయం.

జాతి పునర్నిర్మాణంలో...

ఆర్ఎస్ఎస్ @100

విశ్లేషణ




దత్తాత్రేయ హోసబాళె

దేశమాత సేవలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నూరు వసంతాలను పూర్తిచేసుకుంటున్న తరుణంలో, ఈ మైలురాయిని సంఘ్ ఏ విధంగా పరిగణిస్తుందో అనే విషయంలో ఒక స్పష్టమైన జిజ్ఞాస ఉంటుంది. ఇలాంటి సందర్భాలు... ఉత్సవాల కోసం కావని, ఆత్మపరిశీలన చేసుకుని, లక్ష్యసాధనకు పునరంకితం కావడానికి వీటిని అవకాశంగా తీసుకోవాలన్నది సంఘ్ స్థాపించినప్పటి నుండి సుస్పష్టమైన విషయం. అదే సమయంలో, ఈ మహోద్యమానికి మార్గదర్శకులైన మహనీయ సద్గురువులు, నిస్వార్థంగా ఈ మార్గంలోకి ప్రవేశించిన స్వయంసేవకులు, వారి కుటుంబాల స్వచ్ఛంద సహకారాన్ని స్మరించుకునేందుకు ఇదొక అవకాశం. ప్రత్యేకించి, సంఘ్ స్థాపకులైన డాక్టర్ కేశవ బలిరామ్ హెడ్గేవార్ జయంతి సుదినమే హిందూ కాలదర్శినిలో మొదటి రోజైన వర్ష ప్రతిపద కూడా అయిన తరుణంలో... ఈ నూరు సంవత్సరాల ప్రయాణాన్ని పునర్దర్శనం చేసుకునేందుకు, సమరసతతో కూడిన సమైక్య భారతావని దిశగా సంకల్పం చేసుకునేందుకు ఇంతకు మించిన అనువైన సందర్భం మరేముంటుంది?

దేశం కోసం జీవించేలా...

డాక్టర్ హెడ్గేవార్‌లో భారతదేశం పట్ల అహంకార రహితమైన ప్రేమ, అఖండమైన అంకితభావం చిన్నతనం నుంచే కనపడింది. కోల్‌కతాలో తన వైద్య విద్యను పూర్తిచేసేనాటికే, సాయుధ విప్లవం నుంచి సత్యాగ్రహం వరకూ భారతదేశానికి బ్రిటిష్ పాలన నుండి విముక్తిని కలిగించేందుకు చేపట్టిన అన్ని రకాల ప్రయత్నాలతోనూ ఆయనకు అనుభవం ఉంది. అదే సమయంలో దైనందిన జీవితంలో దేశభక్తి లేకపోవడం, సంకుచిత ప్రాంతీయ విభేదాలకు దారితీసేలా ఉమ్మడి జాతీయ వ్యక్తిత్వం పతనం కావడం, సామాజిక జీవితంలో క్రమశిక్షణరాహిత్యం వల్ల భారతదేశంలో బయటివారి దురాక్రమణ సంభవించి వీరి స్థానం సులభతరమైందని ఆయన గ్రహించారు. ఎడతెగని దురాక్రమణలతో మన ఘనచరిత్రకు సంబంధించిన సామాజిక జ్ఞాపకాలను ప్రజలు మరచిపోయారని ఆయనకు అనుభవానికి వచ్చింది. ఫలితంగా మన సంస్కృతి, జ్ఞాన సంబంధమైన సంప్రదాయం పట్ల నైరాశ్యభావం, ఆత్మన్యూనతాభావం చోటు చేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎవరో కొద్దిమంది నాయకుల నేతృత్వంలో జరిగే రాజకీయ కార్యకలాపాలు మన ప్రాచీన దేశపు సమస్యలను పరిష్కరించలేవన్న నిశ్చయానికి వచ్చారు. అందుకే, దేశం కోసం జీవించేలా ప్రజలకు శిక్షణ ఇచ్చేందుకు నిరంతర ప్రయత్నాలతో కూడిన ఒక పద్ధతిని రూపొందించాలని నిర్ణయించారు. రాజకీయ పోరాటానికి అతీతంగా దార్శనిక దృష్టికోణంతో ఆయన చేసిన ఆలోచన ఫలితమే శాఖా పద్ధతి ఆధారంగా వినూత్నమైన పద్ధతిలో నడిచే సంఘం ఆవిర్భావం.


ఈ ఉద్యమం, సిద్ధాంతాల క్రమబద్ధమైన పురోగతి ఒక అద్భుతానికి ఎంతమాత్రం తక్కువ కాదు. హెడ్గేవార్ ఈ భావజాలాన్ని సిద్ధాంతంగా రూపొందించలేదు, కానీ ఆయన ఒక కార్యాచరణ ప్రణాళికను విత్తన రూపంగా ఇచ్చారు, అది ఈ ప్రయాణంలో చోదక శక్తిగా నిలిచింది. ఆయన జీవితకాలంలో, భారతదేశంలోని అన్ని ప్రాంతాలకూ సంఘ కార్యం విస్తరించింది.



◆ సంఘ్ ఒక జాతీయ పునర్నిర్మాణ ఉద్యమం. ఎవ్వరినైనా వ్యతిరేకించడం పట్ల సంఘ్‌కి నమ్మకం లేదు. సంఘ్ పనిని వ్యతిరేకిస్తున్నవారు కూడా సంఘ్‌లో భాగమవుతారనే విశ్వాసాన్ని కలిగి ఉంది.



డాక్టర్ హెడ్గేవార్



గురూజీ గోల్వాల్కర్

శాఖోపశాఖలుగా 'శాఖ'

మనం స్వాతంత్ర్యాన్ని పొందినప్పుడు, అదే సమయంలో భారతమాతను మతం ఆధారంగా విచ్ఛిన్నం చేసినప్పుడు, పాకిస్తాన్ నుండి వచ్చిన హిందూ జనాభాను రక్షించి వారికి గౌరవ, మర్యాదలతో కూడిన పునరావాసాన్ని కల్పించడంలో సంఘ్ స్వయంసేవకులు తమ అంకితభావాన్ని కనబరిచారు. సమాజం కోసం బాధ్యత, కర్తవ్యభావాలతో ముడిపడిన స్వయంసేవక్ అనే భావన విద్య, కార్మిక రంగం, రాజకీయరంగాల వంటి చోట తన శక్తిని ప్రదర్శించడం మొదలుపెట్టింది. రెండవ సర్‌సంఘ్‌చాలక్ అయిన శ్రీ గురూజీ (మాధవ సదాశివ గోల్వాల్కర్) మార్గదర్శక శక్తిగా ఉన్న ఈ దశలో ప్రతి విషయం జాతీయ సంస్కృతిని దృష్టిలో ఉంచుకుని పునర్వ్యవస్థీకరించబడాలి! దేశంలో అత్యవసర పరిస్థితిని విధించినప్పుడు రాజ్యాంగంపై క్రూర దాడి జరిగిన కాలంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు జరిగిన శాంతియుతపోరులో సంఘ్ స్వయంసేవకులు కీలక పాత్ర పోషించారు. రామజన్మభూమి విముక్తి వంటి ఉద్యమాలు సాంస్కృతిక విమోచనం కోసం భారతదేశంలోని అన్ని ప్రాంతాలు, వర్గాలను అనుసంధానించాయి. జాతీయ భద్రత నుంచి సరిహద్దుల నిర్వహణ వరకు, పాలనా భాగస్వామ్య వ్యవస్థ నుంచి గ్రామీణాభివృద్ధి వరకు, సంఘ్ స్వయంసేవకులు స్పృశించని అంశం లేదు.

ప్రతి విషయాన్నీ రాజకీయ దృష్టికోణంతో చూసే ధోరణి ఉన్నప్పటికీ, సంఘ్ ఇప్పటికీ సమాజపు సాంస్కృతిక జాగరణపైన, సరైన ఆలోచనలు గల వ్యక్తులు – సంస్థలతో బలమైన అనుసంధాన వ్యవస్థను సృష్టించడంపైన దృష్టి పెట్టింది. సామాజిక పరివర్తనలో మహిళల భాగస్వామ్యం, కుటుంబ వ్యవస్థ పవిత్రతను పునరుద్ధరించడంపై గత కొన్ని సంవత్సరాలుగా సంఘ్ దృష్టి సారించింది. లోకమాత అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది వేడుకల సందర్భంగా సంఘ్ పిలుపుతో దేశమంతటా 27 లక్షల మందికి పైగా వ్యక్తులతో సుమారు 10 వేల కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. మన దేశ నాయకుల విషయంలో మనమంతా కలిసి ఎలా వేడుక చేసుకుంటున్నామో ఇది సూచిస్తుంది. సంఘ్ తన నూరవ సంవత్సరంలోకి ప్రవేశించినప్పుడు బ్లాక్, గ్రామ స్థాయి వరకూ జాతి నిర్మాణం కోసం వ్యక్తి నిర్మాణ కార్యాన్ని కీలకంగా చేపట్టాలని సంఘ్ నిర్ణయించింది. గత ఏడాది కాలంలో పటిష్ఠమైన ప్రణాళికతో మరో పది వేల శాఖలను జోడించేలా కార్యాచరణ చేయడమన్నది అంకితభావానికి, అంగీకారానికి చిహ్నం. అయితే, ప్రతి గ్రామానికి, బస్తీకి చేరుకోవడమనే లక్ష్యం ఇంకా ఒక అసంపూర్ణంగా ఉంది. దీనిపై ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాబోయే సంవత్సరాలలో పరివర్తనకు ఉద్దేశించిన పంచ్ పరివర్తన్ అనే ఐదంశాల కార్యక్రమం ప్రధానంగా కొనసాగుతుంది. శాఖ నెట్‌వర్క్‌ను విస్తరించే క్రమంలో పౌరవిధులు, పర్యావరణహితమైన జీవనశైలి, సామాజిక సమరసతా వర్తన, కుటుంబ విలువలు, స్వీయతత్వ స్పృహపై ఆధారపడిన దైహికమార్పుపై దృష్టిని ఉంచింది. తద్వారా ప్రతి ఒక్కరూ 'పరం వైభవం నేతు మేతత్ స్వరాష్ట్రం' – మన దేశాన్ని మహావైభవ స్థితికి తీసుకువెళ్లే బృహత్ ప్రయోజనం కోసం తమ వంతు కృషి చేస్తారు.

గత వంద సంవత్సరాలలో, సంఘ్ ఒక జాతీయ పునర్నిర్మాణ ఉద్యమంగా ప్రయాణించింది. ఎవ్వరినైనా వ్యతిరేకించడం పట్ల సంఘ్‌కి నమ్మకం లేదు. అలాగే, ఈ రోజున సంఘ్ పనిని వ్యతిరేకిస్తున్నవారు కూడా సంఘ్‌లో భాగమవుతారనే విశ్వాసాన్ని కలిగి ఉంది. ప్రపంచం పర్యావరణ మార్పుల నుంచి హింసాత్మక ఘర్షణల వరకు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో సత్వర పరిష్కారాలను అందించే సామర్థ్యాన్ని భారతదేశపు ప్రాచీన, అనుభవ ఆధారిత జ్ఞానం కలిగివుంది. ఈ అతి పెద్దయిన, అనివార్యమైన కార్యం ఎప్పుడు సాధ్యమవుతుందంటే, భారతమాత పుత్రులందరూ తమ పాత్రను అర్థం చేసుకుని, ఇతరులు సైతం అనుసరించేలా ప్రేరేపించే దేశీయ నమూనాను నిర్మించడంలో తమ వంతు కృషి చేసినప్పుడే! ఇందుకోసం సజ్జన శక్తి నాయకత్వంలో సమరసతతో కూడిన సంఘటిత భారతీయ సమాజంలో ఆదర్శవంతులమై నిలిచే సంకల్పంతో ఏకమవుదాం!

వ్యాసకర్త ఆర్ఎస్ఎస్ సర్ కార్యవాహ్ (జాతీయ ప్రధాన కార్యదర్శి)

సోషల్ మీడియా

జంట ఫలితం



ట్రంప్ ప్రభుత్వ చర్యల వల్ల యూఎస్ డాలర్ స్వీయ వినాశనానికి గురవడం పట్ల సంబరపడుతున్న యూరప్ వాసులు ఒకటి గుర్తుంచుకోవాలి: యూరో–డాలర్ వ్యవస్థ స్వీయభక్షణ దశలోకి పోయినప్పుడు ముందు బలయ్యేది దాని బలహీన భాగం– అంటే యూరో. మరోసారి ఆలోచించండి.

– వెలీనా త్చకరోవా, జియో పాలిటిక్స్ నిపుణురాలు

ఉండకూడని తీరు



నేను ఉదారవాదిని. నా వరకూ ఉదారవాద సారాంశం ఏమిటంటే, భావస్వేచ్ఛ, ఎంపిక స్వేచ్ఛ. మనందరికీ భిన్నాభిప్రాయాలు ఉంటాయి. కానీ భిన్నాభిప్రాయం అయినందువల్ల దాన్ని అణచి వేయడం, కొట్టివేయడం అనేది ఆరోగ్యకరమైన ప్రజాస్వామిక సమాజానికి పూర్తిగా విరుద్ధమైనది.

– జేమ్స్ మెల్‌విల్, కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్

సహానుభూతి



జీవితం సులభంగా ఉందని భావించేవాళ్లు బహుశా బంధువులను, ప్రియమైనవాళ్లను కోల్పోవడం లాంటి తీవ్రమైన బాధను అనుభవించి ఉండరు. దీన్ని అర్థం చేసుకోవడమంటే– వేదన తాలూకు మనిషి ఫీలింగ్స్‌ను గౌరవించడం, ఆ బరువును తగ్గించడానికి తార్కిక మార్గాలను అన్వేషించడం!

– జాఫర్ మీర్జా, రచయిత

గ్రోక్ కాలం



జనం ఇప్పుడు గూగుల్ చెయ్యి అనట్లేదు. గ్రోక్ చెయ్యి అంటున్నారు.

– హసన్ సజ్వానీ, యూఏఈ కామెంటేటర్

మీ నుంచే మొదలవ్వాలి



మీకు మీరు నచ్చకపోవడానికి మీ సైజు, ఆకృతి, బరువు కారణాలు కావు. మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం, అంగీకరించుకోవడం, గౌరవించుకోవడం అనేవి మీ నుంచే మొదలవ్వాలి.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

చక్రవర్తులందరూ పన్నులను వడ్డించినవారే!

అభిప్రాయం



బి.ఆర్. బాపూజీ

మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ క్రూరుడూ, హిందూ వ్యతిరేకీ కాబట్టి, మహారాష్ట్రలో ఉన్న అతని సమాధిని తవ్వి తీసిపారెయ్యాలని డిమాండ్ చేస్తూ, నాగపూర్‌లో, వారం కిందట, కొన్ని హిందూ సంస్థలు సభలూ, నిరసన ప్రదర్శనలూ జరిపాయి. ఔరంగజేబు సమాధిని తీసెయ్యనక్కరలేదనీ, అతను అంతిమంగా మరాఠా ప్రజల చేతుల్లో ఓడిపోయాడు గనక, అతని సమాధి, మరాఠా ప్రజల వీరత్వానికి గుర్తుగా ఉంటుందని చీలిన శివసేనలోని ఒక పక్షం వాదన. తీసేస్తే తీసెయ్యండి, కానీ మహారాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం మీద దృష్టి పెట్టండి– అని కూడా ఒక విమర్శ. ఇటీవల వచ్చిన, హిందీ సినిమా 'ఛావా'లో చూపించినట్టు... ఔరంగజేబు క్రూరుడు కాదనీ, ఎన్నో మంచిపనులు కూడా చేశాడనీ, సమాజ్ వాదీ పార్టీకి చెందిన ఒక ముస్లిం సభ్యుడు అన్నాడు. వివాదం పెరిగి పెద్దదై, నాగపూర్‌లో చిన్న స్థాయి మతకలహాల వంటివి జరిగి షాపులూ, ఇళ్ళూ, వాహనాలూ ధ్వంసం అయ్యాయి. 50 మందికి గాయాలయ్యాయట!

ఇంగ్లీషూ, హిందీ టీవీ చానళ్ళలో ఈ వివాదంపై చర్చలు చూపించారు. ఇదే సమయంలో ఛత్రపతి శివాజీ ఎంత గొప్ప ప్రజానుకూల చక్రవర్తో వాదించిన వారున్నారు. ఔరంగజేబ్ సైన్యంలో కీలకమైన పదవుల్లో హిందూ సైనికాధికారులున్నారని వాళ్ళ జాబితా ఇచ్చిన వారున్నారు. అలాగే, శివాజీ సైన్యంలో కూడా, అతనికి ఎంతో నమ్మకస్తులైన ముస్లిం ఉన్నత సైనికాధికారులున్నారని వాళ్ళ పేర్లు చెప్పారు. ఈ చర్చల్లో ముస్లిం చక్రవర్తుల్ని ప్రజా వ్యతిరేకులుగానూ, హిందూ చక్రవర్తుల్ని ప్రజలకు అనుకూలురుగానూ వాదించుకోవడమే ఎక్కువగా కనిపించింది. పత్రికల్లోగానీ, టీవీ డిబేట్లలో గానీ, అసలు ప్రపంచ చరిత్రలో చక్రవర్తులనేవారు, వాళ్ళు ఏ మతస్థులైనా, పాలకవర్గ ప్రతినిధులనీ, పాలకవర్గం ఎప్పుడూ ప్రజలకు అనుకూలంగా ఉండజాలదనీ వివరించే వర్గ సిద్ధాంత దృష్టితో ఒక్క మాటంటే ఒక్క మాట చెప్పిన వారు లేరు. ఆ దృష్టికోణాన్ని పట్టించుకోకపోతే, సత్యానికి కళ్ళు మూసినట్టవుతుంది.

చక్రవర్తులంటే, అనేక చిన్నా పెద్దా భూభాగాల మీద పరిపాలన చేసే వాళ్ళు గదా? ఉదాహరణకి, ఔరంగజేబ్ (1618–1707) అయినా, శివాజీ (1630–1680) అయినా, చక్రవర్తులుగా విశాలమైన భూభాగాలను వారి కాలంలో పాలించారు. వారు ఎవరితో కలిసి ఎవరిని ఓడించారో, ఎన్నెన్ని ప్రాంతాలను ఆక్రమించారో, 'ఆ ముట్టడికైన ఖర్చులూ, మతలబులూ, కైఫియతులూ' ఇక్కడ చెప్పుకోలేము. అదంతా రకరకాల చరిత్ర పుస్తకాలలో దొరుకుతుంది. వారి ప్రభుత్వాలలో కూడా ఆర్థిక శాఖ, న్యాయ శాఖ, సైనిక శాఖ, ఇతర అనేక రకాల శాఖలూ ఉన్నాయి. ఏ కాలంలో అయినా, ఏ ప్రభుత్వమైనా పరిపాలన చెయ్యాలంటే, తప్పనిసరిగా కావలిసినవి పన్నులే. చరిత్రనించీ, మార్క్స్ గ్రహించి చెప్పినది ఇదే: 'అధికార గణానికీ, సైన్యానికీ, మత గురువులకూ, కోర్టులకూ, క్లుప్తంగా చెప్పాలంటే, మొత్తం కార్యనిర్వాహక అధికార యంత్రాంగపు మనుగడకీ ఆధారం... రాజ్యానికి అందే పన్నులే! పన్నులు అంటే, ప్రభుత్వపు యంత్రాంగపు ఆర్థిక పునాది తప్ప, మరేమీ కాదు'. అయితే, పన్నులు ఏ పేర్లతో వచ్చినా, ఏ రూపంలో చెల్లించినా, వాటి మూలం ఎక్కడుంది? ఏ కాలం గురించి మనం మాట్లాడుతున్నామో, ఆ కాలానికి చెందిన శ్రామిక జనాల శ్రమలోనే ఉంది! అదెలాగో చూద్దాం.



ఔరంగజేబు



ఛత్రపతి శివాజీ

ఔరంగజేబు ప్రభుత్వమైనా, శివాజీ ప్రభుత్వమైనా ఆ కాలంలో రకరకాల పద్ధతుల్లో పన్నులు వసూలు చేసేవి. వసూళ్ళకు ఒక యంత్రాంగం ఉండడం తప్పనిసరి. మనం మాట్లాడుకుంటున్న ఇద్దరు చక్రవర్తులూ పన్నులు ఎవరి దగ్గర్నించి ప్రధానంగా వసూలు చేశారు? వ్యవసాయ రంగం నించీ. అలాగే, ఆనాటి పరిమితుల్లో ఉండిన పరిశ్రమలనించీ, సరుకులతో వ్యాపారం జరిపే వర్తకుల నించీ! అసలు, ఒక రాజ్యంలో ఉండే భూములు ఎవరి అధీనంలో ఉంటాయి? వ్యవసాయ రంగంలో పనిచేసేది ఎవరు? పంటలు పండించేది ఎవరు? (1) జమీందారులనీ, మిరాసీదారులనీ, రకరకాల పేర్లతో ఉండే పెద్ద భూస్వాములు. వీళ్ళసలు ఒళ్ళు వంచరు. అంతా కౌలు రైతులు ఇచ్చే కౌలు మీదే ఆధారపడతారు. ఏ శ్రమా చెయ్యకుండా, కౌలు రైతులనించి గుంజిన కౌలులో నించే, చక్రవర్తికి శిస్తుగానీ, కప్పం గానీ, రకరకాల పన్నులు గానీ కడతారు. (2) సొంత శ్రమల మీదే, ప్రధానంగా ఇంటిల్లిపాదీ, కష్టపడి జీవించే 'స్వతంత్ర రైతులు'. వీళ్ళు కట్టే శిస్తులు గానీ, పన్నులు గానీ అన్నీ వీళ్ళ సొంత శ్రమ వల్లనే కడతారు. (3) సొంత శ్రమ మీదే కాక, కొంత ఇతరుల శ్రమల మీద కూడా ఆధారపడి జీవించే రైతులు వీళ్ళు. వీళ్ళు కట్టే పన్నులు కూడా, వీరి సొంత శ్రమలో నించీ కొంతా, ఇతరుల నించీ వచ్చిన అదనపు శ్రమ నించీ కొంతా. (4) వ్యవసాయ శ్రామికులు. వీళ్ళు లేకుండా వ్యవసాయంలో ఏ దశలోనూ, ఏ పనీ జరగదు. వీళ్ళని పనిలో పెట్టుకునే వారు, వారు పేద రైతులైనా, కొంత మెరుగైన స్థితిలో ఉన్న వారైనా, కౌలు రైతులైనా, ఈ కూలీల శ్రమ మీద ఆధారపడే వారే! వీళ్ళకి 'కూలి' అనేది డబ్బు రూపంలో ఇచ్చినా, ధాన్యం రూపంలో ఇచ్చినా, వాళ్ళకి అందేది వాళ్ళ శ్రమ శక్తి విలువే. మొత్తం శ్రమ విలువ కాదు. శ్రమ శక్తి విలువ అంటే, మర్నాడు వచ్చి పని చెయ్యడానికి శ్రామికులకి కావలిసిన జీవితావసరాలకు తగ్గ జీతం అన్నమాట. శ్రమ విలువ అంటే, తాము జీతం రూపంలో తీసుకునే విలువా, యజమాని లాభంగా మిగుల్చుకునే అదనపు విలువా కూడా కలిసినదే. వ్యవసాయ రంగం నించీ వచ్చే పన్నులు ఎక్కువ భాగం ఈ అదనపు విలువలో నించీ తీసి ఇచ్చేవే!

ఆ కాలపు రెవెన్యూ చరిత్ర ప్రకారం, ఈ ఇద్దరు చక్రవర్తులకీ ప్రధానమైన ఆదాయం వ్యవసాయ రంగం నించే వచ్చేది. వాటికి రకరకాల పేర్లు ఉన్నాయి. 'శిస్తు' అనీ, 'చౌత్' అనీ, 'జప్తీ' అనీ, 'సర్దేశ్ ముఖీ' అనీ, ఇంకేవో పేర్లు. అవన్నీ మనకి అనవసరం. భూమి వైశాల్యాన్ని బట్టో, సారాన్ని బట్టో, వచ్చిన పంట మొత్తాన్ని బట్టో కొంత భాగం పన్ను కట్టాలి. వీటిని చెల్లించే వారిని రైతులనీ, జమీందారులనీ, మిరాశీదారులనీ, కొల్దారులనీ... ఏ పేరుతో మనకి చెప్పినా, అసలు సంగతి కాయకష్టం చేసే రైతుల శ్రమని దోచడమే! ఈ ఆర్థిక సత్యాన్ని పట్టించుకోకుండా, ఈ చక్రవర్తి గొప్పా, ఆ చక్రవర్తి గొప్పా అనే తగువు అర్థం లేనిది. వ్యక్తిగత స్వభావాల్లో కొన్ని తేడాల వల్ల, కొందరు చక్రవర్తులు కొంత గంభీరంగానూ, కొందరు కొంత సాత్వికంగానూ, కొందరు కటువుగానూ, మరికొందరు కర్కశంగానూ, క్రూరంగానూ ఉంటారు. 'ఏ రాయి అయితేనేమీ పళ్ళూడగొట్టుకోవడానికి?' అనే నానుడిలో ఉన్న గొప్ప సత్యాన్ని అర్థం చేసుకుంటే... చక్రవర్తులందరూ శ్రమ దోపిడీదారులే!

మనం మాట్లాడుకునే చక్రవర్తుల కాలంలో చిన్న స్థాయిలో అయినా రకరకాల పరిశ్రమలు ఉండేవి. వ్యవసాయ ఉత్పత్తుల మీద ఆధారపడిగానీ, ఇతరత్రా గానీ సరుకులు తయారయ్యేవి. ఉప్పూ, దూదీ, దారం, నేతా, నూనెలూ, చర్మంతో తయారు చేసే వస్తువులూ, నివాసాల సామగ్రీ... ఇలా ఎన్నో రకాల పరిశ్రమలూ, వర్తకాలూ ఉండేవి. పరిశ్రమల యజమానులైనా, వర్తకులైనా, కట్టే పన్నులు, వాళ్ళ దగ్గిర పనిచేసే శ్రామికులు ఇచ్చే అదనపు విలువలోనించే తీసి కడతారు. అంటే, మళ్ళీ శ్రమ దోపిడీ ద్వారానే!

ఈ విషయాలు ప్రజలు గమనంలో ఉంచుకుంటే మత ఘర్షణలు తలెత్తవు. ప్రజల అనైక్యత నుంచి ఎన్నికల ప్రయోజనం పొందాలని రాజకీయ పార్టీలు ప్రయత్నించడం గమనార్హం.

వ్యాసకర్త హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు

దేవుని మన్నింపు రోజు

ఈద్ అంటే పండుగ, ఫిత్ర్ అంటే దానం... వెరసి దానధర్మాల పండుగ అని అర్థం. అందుకే రమజాన్ నెలలో ముస్లిం సోదరులు దానధర్మాలు అధికంగా చెయ్యడానికి ప్రయత్నిస్తారు. సదఖా, ఖైరాత్, జకాత్, ఫిత్రా... వంటి పేర్లతో పేదసాదలకు ఎంతో కొంత సహాయం చెయ్యాలని తద్వారా దైవ ప్రసన్నత పొందాలని ప్రయత్నిస్తుంటారు.

ఇస్లాం ధర్మంలో దాతృత్వానికి అత్యంత ప్రాముఖ్యం ఉంది. ముఖ్యంగా రమజాన్‌లో దానధర్మాలు చేసే వారికి, స్వీకరించే వారికి కూడా మంచి ప్రతిఫలం లభిస్తుందని నమ్మకం.



రుజుమార్గం

నిజానికి రమజాన్ అన్నది సంవత్సరంలోని పన్నెండు నెలల్లో తొమ్మిదవ నెల పేరు. సర్వ మానవాళికి మార్గదర్శక గ్రంథమైన పవిత్ర ఖురాన్ రమజాన్ లోనే అవతరించింది. అందుకే ఇంతటి గౌరవం, ఘనత, పవిత్రత ఈ మాసానికి ప్రాప్తమయ్యాయి. మానవుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి అద్భుతంగా ఉపకరించే 'రోజా' (ఉపవాస వ్రతం) అనే గొప్ప ఆరాధనను కూడా దైవం ఈ నెలలోనే విధిగా చేశాడు. ఇది జనహృదయాల్లో భయభక్తులు జనింప జేసి, మానవీయ విలువలను పెంపొందిస్తుంది. స్థితిపరులు ఉపవాసం పాటిస్తే, పేదసాదల ఆకలి బాధను అనుభవ పూర్వకంగా తెలుసుకోగలుగుతారు.

ఇలా మరెన్నో మానవీయ, నైతిక సుగుణాలను మానవుల్లో పెంపొందింపజేసే ఏర్పాటు చేసిన విశ్వప్రభువుకు కృతజ్ఞతగా నెల రోజుల ఉపవాసాలను ముగించి షవ్వాల్ నెల మొదటి తేదీన ముగింపు ఉత్సవంగా 'ఈద్' జరుపుకొంటారు. ఈరోజు దైవం తన భక్తులకు నెలరోజుల సత్కార్యాలకు అనంతమైన ప్రతిఫలం ప్రసాదిస్తాడు. ఈద్ దేవుని మన్నింపు లభించే మహత్తర శుభదినం. ఈద్ తప్పులు, పొరపాట్లకు క్షమాపణ కోరుకునే రోజు. జరిగిన తప్పుల పట్ల సిగ్గుపడుతూ, ఇక ముందు తప్పులు చేయమని, సత్యంపై స్థిరంగా ఉంటామని సంకల్పం చెప్పుకొనే రోజు. కనుక దేహంలో ప్రాణం ఉండగానే దైవం ఇచ్చిన సదవకాశాన్ని వినియోగించుకొని సన్మార్గం వైపునకు మరలాలి.

– మదీహా అర్జుమంద్

(ఈదుల్ ఫిత్ర్ పర్వదినం సందర్భంగా...)

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.విదియ ప.12.20 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** అశ్విని సా.5.04 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ప.10.21 నుండి 11.51 వరకు, తదుపరి రా.2.00 నుండి 3.29 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.28 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.20 నుండి 11.52 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.00, **సూర్యాస్తమయం:** 6.09.

క్లుప్తంగా...

ముస్లిం సోదరులకు గవర్నర్ రంజాన్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ముస్లిం సమాజానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం స్వీయ క్రమశిక్షణ, ఆధ్యాత్మిక పునరాలోచనకు సూచికగా నిలుస్తుందన్నారు. 'ఈద్–ఉల్–ఫితర్ అనేది దైవ ఆశీర్వాదాలను జరుపుకునే సందర్భం. ప్రేమను పంచుకునే అవకాశం. భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకునే సమయం' అని గవర్నర్ పేర్కొన్నారు. పవిత్ర ఖురాన్ బోధనలు ప్రపంచంపై గొప్ప ప్రభావాన్ని కలిగించాయన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరి శ్రేయస్సు, అభివృద్ధి, శాంతి కోసం ప్రార్థనలు చేస్తున్నట్లు గవర్నర్ తెలిపారు.

ఏప్రిల్ 3న ఏఐఓబీసీఎస్ఏ ఛలో ఢిల్లీ

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించాలనే లక్ష్యంతో ఏప్రిల్ 3న ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీనిర్వహించనుంది. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో 'బీసీ రిజర్వేషన్లు – సామాజిక న్యాయం' సదస్సును నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఓబీసీ జాతీయ సమాఖ్య ప్రధాన సలహాదారు, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సదస్సులో అఖిలపక్ష నాయకులు, ఎంపీలు తదితరులు పాల్గొననున్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఆంక్షలను ఎత్తివేయాలి

- మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో ప్రభుత్వం విధించిన నిర్బంధ ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికారిక ప్రతినిధి జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల ఆంక్షలను ఎత్తివేసే వరకు విద్యార్థులు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. 'యూనివర్సిటీలో అభ్యుదయ, విప్లవ చైతన్యం కలిగిన విద్యార్థుల పోరాటాలను అణిచివేయడానికే ప్రభుత్వం ఈ ఆంక్షలు విధించిందని ఆరోపించారు. ఇలాంటి నిరంకుశ చర్యలు దేశ భవిష్యత్తును నాశనం చేస్తాయని పేర్కొన్నారు. వర్సిటీ భూములను కార్పొరేట్లకు అప్పగించటానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని విమర్శించారు. 32వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టబద్ధత కల్పించిన సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని 'కారణ జన్ముడి' పాటను ఆదివారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆవిష్కరించారు. ఈ పాటను చిత్రీకరించిన ఫస్ట్ రీల్ సంస్థను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ఫస్ట్ రీల్ సంస్థ ఎండీ జూలూరు శివసాగర్, పాట రచయిత ఎం.రజినీకాంత్, టి.సాయి ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, హైదరాబాద్

కేంద్ర మంత్రి కమీషన్ల గురించి మాట్లాడతారా?

- టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్ విమర్శ

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి హోదాలో ఉండి కమీషన్ల గురించి మాట్లాడటం బండి సంజయ్‌కు తగదని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్ హితవు పలికారు. ఈ ఏడాది ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడే అవకాశం ఉందని పంచాంగ పండితులు చెప్పిన అంశంపై ఆయన నీటి బుడగల్లాంటి మాటలు మాట్లాడారని ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. తెలంగాణలో పింక్ పార్టీ అధికారంలోకి రాకుండా పారదోలామని చెబుతున్న బండి సంజయ్ పార్లమెంటు ఎన్నికల్లో అదే పింక్ పార్టీతో ఎందుకు స్నేహం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతి గురించి మాట్లాడేటప్పుడు ఆధారాలతో సహా మాట్లాడాలని, లేదంటే ప్రజలు ఆ వ్యాఖ్యలను పట్టించుకోరన్న విషయాన్ని సంజయ్ గుర్తించాలన్నారు. బండి సంజయ్‌కు రాష్ట్రాభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని గౌరి సతీశ్ కోరారు.

ఆన్‌లైన్‌లో భర్తీ లేనట్లేనా?

ఇంజనీరింగ్ 'బి' కేటగిరీపై రాని స్పష్టత

- ఆన్‌లైన్‌లో భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వని సర్కార్
- కోల్డ్ స్టోరేజీలో మండలి సిఫారసులు
- అనధికారికంగా సీట్ల అమ్మకాలు మొదలు
- జోరుగా మంత్రులు, ఎమ్మెల్యేల రికమండేషన్లు
- మౌన ముద్రలో అధికార యంత్రాంగం



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్ల భర్తీపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఈసారి 'బీ'కేటగిరీ సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీ చేస్తామని కొన్ని నెలలుగా అధికారులు చెబుతూ వస్తున్నారు. దీనిపై ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు కూడా చేసింది. మండలి నివేదిక ఇచ్చి కూడా మూడు నెలలు దాటింది. దీనిపై ప్రభుత్వం ఇంతవరకూ స్పందించలేదు. దీంతో ప్రైవేటు కాలేజీలు ఇప్పట్నుంచే యాజమాన్య కోటా సీట్ల అమ్మకాలు మొదలు పెట్టాయి. ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష కూడా ఇంకా జరగలేదు. మరోవైపు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు తమ అనుయాయులకు సీట్లు ఇవ్వాలని సిఫార్సు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో భర్తీ ఇప్పట్లో ఉండదని కాలేజీలకు నేతలు చెబుతున్నట్లు తెలిసింది. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే ఈ ఏడాది కూడా యాజమాన్య కోటా సీట్లు ఆన్‌లైన్‌లో భర్తీ లేనట్టేనని ఉన్నత విద్య వర్గాలు అంటున్నాయి.

ఆ బ్రాంచీల కోసమే

రాష్ట్రంలో 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లున్నాయి. వీటిల్లో కన్వీనర్ కోటా కింద 70 శాతం సీట్లు భర్తీ అవుతాయి. వీటిని ప్రభుత్వమే కేటాయిస్తుంది. యాజమాన్య కోటా సీట్లు 33 వేల వరకూ ఉంటాయి. ఇందులో 26 వేలు కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లోనే ఉన్నాయి. వీటిని రెండు కేటగిరీలుగా విభజించారు. 'బీ'కేటగిరీ కింద ఇందులో సగం ఉంటాయి. వీటిని జేఈఈ, ఈఏపీసెట్, ఇంటర్ మార్కుల ఆధారంగా భర్తీ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే తీసుకోవాలి. వీరికి ఎలాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. కానీ, కాలేజీలు సీఎస్ఈ, దాని అనుబంధ కోర్సులకు రూ.6 నుంచి రూ.18 లక్షల వరకు (నాలుగేళ్లకు కలిపి) వసూలు చేస్తున్నాయి. ఇది కాకుండా ప్రభుత్వం నిర్ణయించిన వార్షిక ఫీజు అదనం. మెరిట్‌ను పట్టించుకోకుండా ఎవరు డబ్బులు ఎక్కువ ఇస్తే వారికే సీట్లిస్తున్నాయి. ఆన్‌లైన్ విధానం లేకపోవడంతో ఎవరు దరఖాస్తు చేశారనేది గుర్తించడం కష్టంగా మారింది. ఇదే ప్రైవేటు కాలేజీలకు కలిసి వస్తోంది. యాజమాన్య కోటాలో 'సీ'కేటగిరీ సీట్లు ప్రవాస భారతీయుల పిల్లలకు ఇవ్వాలి. దీనికి ఏటా 5 వేల డాలర్లు వసూలు చేస్తారు. అయితే ఈ సీట్లకు పెద్దగా పోటీ లేకపోవడంతో వీటినీ ప్రైవేటు కాలేజీలు ఎన్ఆర్ఐ సిఫార్సుల లేఖలతో భర్తీ చేస్తున్నారు.

మండలి సిఫార్సులేమైనట్టు?

యాజమాన్య కోటా సీట్ల భర్తీపై ఉన్నత విద్యా మండలి ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేసింది. బీ కేటగిరీ సీట్లకు కన్వీనర్ కోటా కన్నా మూడు రెట్లు అధికంగా, సీ కేటగిరీకి ఐదు రెట్లు ఫీజు తీసుకొని, ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేయాలని పేర్కొంది. ఉదాహరణకు కాలేజీ ఫీజు కన్వీనర్ కోటా కింద ఏటా రూ.లక్ష ఉంటే, బీ కేటగిరీ ఫీజు ఏడాదికి రూ.3 లక్షలు, సీ కేటగిరీ ఫీజు రూ.5 లక్షలు వసూలు చేసుకోవచ్చు. ఈ విధంగా చేసే ఇప్పుడు కాలేజీలు తీసుకునే ఫీజులకన్నా బీ కేటగిరీ సీట్లకు కొంత మొత్తం తగ్గుతుంది. పైగా మెరిట్ ఉన్న వారికే బీ కేటగిరీ సీట్లు వచ్చే వీలుంది. దీంతో పాటు మంచి ర్యాంకు వచ్చిన వారికి డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లు వచ్చే వీలుంది. ఈ సిఫార్సులు పంపి మూడు నెలలైనా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని మండలి అధికారులు అంటున్నారు. 'మేం మాత్రం ఏం చేయగలం?'అని ఓ ఉన్నతాధికారి నిస్సహాయత వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలే సిఫార్సులు చేస్తున్న నేపథ్యంలో ఆన్‌లైన్ విధానం లేదనే ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. దీంతో సీట్లకు డిమాండ్ మరింత పెంచుకుంటున్నాయి.





ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సన్నబియ్యం చరిత్రాత్మకం

▶ మొదటి పేజీ తరువాయి

సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు.

నల్లగొండ గడ్డకు ఎంతో చరిత్ర

'ఈ పథకాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన, పద్మావతిరెడ్డి ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రారంభించడం హర్షించదగిన విషయం. ఈ ప్రాంతం పోరాటాలకు మారు పేరు. ఎందరో మహనీయులు భూమి కోసం భుక్తి కోసం, విముక్తి కోసం ఇక్కడి నుంచే పోరాటాలు చేశారు. రావి నారాయణరెడ్డిని నెహ్రూ కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించిన చరిత్ర కూడా నల్లగొండ గడ్డకే ఉంది. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో నల్లగొండ ఎంపీని గెలిపించింది కూడా నల్లగొండ బిడ్డలే. ఇలాంటి చోట ప్రారంభించిన ఈ సన్న బియ్యం పథకం దేశ చరిత్రలో నిలిచిపోతుంది. ఈ పథకం ద్వారా 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు.

మిల్లర్లు, దళారుల చేతుల్లోకి దొడ్డు బియ్యం

'ప్రభుత్వం 3 కోట్ల మందికి దొడ్డు బియ్యం ఇస్తుంటే, ఆ పథకం మిల్లర్ల మాఫియా, దళారుల చేతిలోకి వెళ్లిపోయి, రూ.10 వేల కోట్ల దోపిడీ జరుగుతోంది. పేదలు దొడ్డు బియ్యం తినలేక, రూ.10కు కిలో అమ్ముకుంటుంటే మిల్లర్లు కొనుగోలు చేసి, రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికే కిలో రూ.30కి అమ్ముతున్నారు. పేదలకు దొడ్డు బియ్యం ఉపయోగ పడటం లేదనే సన్న బియ్యం ఇస్తున్నాం..' అని రేవంత్ తెలిపారు.

రైతులను వద్దని కేసీఆర్ వరి పండించారు

'రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన, 80 వేల పుస్తకాలు చదివానని చెప్పుకునే కేసీఆర్.. ఏనాడైనా పేదలకు సన్న బియ్యం ఇవ్వాలన్న ఆలోచన చేశారా? మీరు వరి వేస్తే ఉరేసుకున్నట్లేనని, మేం వడ్లు కొనమని చెప్పిన ఆయన.. ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో వడ్లనే పండించారు. ఆ వడ్లను క్వింటాల్‌కు రూ.4,500 చొప్పున చెల్లించి కావేరీ సీడ్స్ అనే కంపెనీ కొనుగోలు చేసింది. రైతులు పండించిన ధాన్యాన్ని రూ.2 వేలకు కొనేవారు దిక్కులేక వాళ్లు ఉరేసుకుంటుంటే, ఆయన పండించిన ధాన్యాన్ని క్వింటాల్‌కు అంత ధర పెట్టి కొన్నారంటే అవి వడ్లా లేదా బంగారమా? చెప్పాలి..' అని సీఎం అన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పక్కనబెట్టారు

'నల్లగొండ జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు నాగార్జునసాగర్ సహా అనేక ప్రాజెక్టులు కాంగ్రెస్ తెచ్చింది. జిల్లా కాంగ్రెస్ నేతలు పోరాటం చేసి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వంటి పథకాలు సాధించుకున్నారు. కానీ కేసీఆర్ వాటిని పక్కన పెట్టారు. 44 కిలోమీటర్ల సొరంగం అప్పట్లోనే 34 కిలోమీటర్లు పూర్తయింది. ఏటా ఒక్క కిలోమీటర్ తవ్వినా బీఆర్ఎస్ కాలంలోనే సొరంగం పూర్తయ్యేది. 3.5 లక్షల ఎకరాలకు నీరు పారేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి టన్నెల్ పనులు ప్రారంభించాం. రూ.లక్ష కోట్లతో కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలిపోయింది. ఈ విషయంలో కేసీఆర్‌కు ఉరేసినా తప్పులేదు..' అంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్‌కు నాకు పోలికేంటి..?

'2006లో జెడ్పీటీసీగా రాజకీయం మొదలుపెట్టిన నేను ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్సీ అయ్యా. 2018లో కేసీఆర్ నాపై కక్షగట్టి ఎమ్మెల్యేగా ఓడించినా ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపించారు. ఢిల్లీకి వెళితే సోనియాగాంధీ పీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చారు. అదే నన్ను సీఎంను చేసింది. కేసీఆర్‌కు నాకు పోలికేంటి? మా ఇద్దరికి నందికి, పందికి ఉన్నంత తేడా ఉంది. నేను రుణమాఫీ చేశా. రైతుబంధును పెంచా. కేసీఆర్ ఎగ్గొట్టిన రైతుబంధు రూ.7,625 కోట్లు..మా ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే రైతుల ఖాతాల్లో వేశాం. 15 నెలల కాలంలో రుణమాఫీ కింద రూ.21 వేల కోట్లు, రైతు భరోసా కింద రూ.12 వేల కోట్లు వేశాం. సన్న వడ్లకు రూ.1,200 కోట్లు బోనస్ ఇచ్చాం. రైతులకు పంగనామం పెట్టిన కేసీఆర్ నన్ను పోల్చుకోవడమేంటి? మేం రైతుల గుండెల్లో శాశ్వతంగా నిలిచేలా కార్యక్రమాలు చేశాం. పథకాల అమలు విషయంలో కొందరు కాళ్లలో కర్ర పెట్టి పడేయాలని చూస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు వారి కళ్లల్లో కారం కొట్టాలి. ఒకరోజు వెనుకా ముందూ అయినా ఇచ్చిన హామీలను అమలు చేస్తాం..' అని సీఎం స్పష్టం చేశారు. సభలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

10 మందికి సన్నబియ్యం పంపిణీ

సన్న బియ్యం పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన సీఎం రేవంత్.. పది మంది లబ్ధిదారులకు బియ్యం సంచులు అందజేశారు. అనంతరం 12,712 స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు రాయితీ వడ్డీ రుణాల కింద రూ 26.10 కోట్ల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.

నేడు రంజాన్ పండుగ

- ప్రకటించిన నెలవంక నిర్ధారణ కమిటీ
- దేశవ్యాప్తంగా కనిపించిన నెలవంక


సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆదివారం నెలవంక కనిపించినట్లు సమాచారం రావడంతో సోమవారం (31వ తేదీ) రాష్ట్రంలో రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్) జరుపుకోవాలని రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) అధ్యక్షుడు మౌలానా హసన్ ఇబ్రాహీం హుస్సేనీజ్జాద్ పాషా ముస్లింలకు సూచించారు. మొజంజాహీ మార్కెట్‌లోని కమిటీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రీయ నెలవంక నిర్ధారణ కమిటీ ఢిల్లీతోపాటు ఇతర రాష్ట్ర కమిటీల ద్వారా నెలవంక కనిపించినట్లు తెలిపిందని, దీంతో రంజాన్ పండుగను సోమవారం దేశవ్యాప్తంగా జరుపుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సోమవారం నుంచి ఇస్లామియా కేలండర్ నెల షెవ్వాల్ ప్రారంభమవుతుందని చెప్పారు. నెల రోజులపాటు దైవ ప్రసన్నం కోసం ఆచరించిన కఠోర ఉపవాసాలను అల్లా స్వీకరించాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలంతా శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఈద్గాలు, మసీదుల్లో ఈదుల్ ఫితర్ నమాజ్ ఉంటుందని చెప్పారు. పలు ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం మైదానాల్లో కూడా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈదుల్ ఫితర్ నమాజ్ ఉదయం 6:30 గంటల నుంచి 10:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

జోగుళాంబదేవికి బంగారు కిరీటం

- రూ.1.60 కోట్ల విలువైన కిరీటం బహూకరించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బహూకరించిన బంగారు కిరీటం



బంగారు కిరీటంతో జోగుళాంబదేవి దర్శనం

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో కొలువుదీరిన జోగుళాంబదేవికి కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కలసి బంగారు కిరీటాన్ని బహూకరించారు. బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల బృందం ఆదివారం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలకు ఈ కిరీటాన్ని అందించింది. ముందుగా వారు జోగుళాంబదేవి, బాలబ్రహ్మేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం రూ.1,60,10,500 విలువ గల 1.587 కిలోల బంగారు కిరీటాన్ని అందించారని ఈఓ పేర్కొన్నారు. బంగారు కిరీటం అందించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ ఈఓ, చైర్మన్ వారిని శేషవస్త్రాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

దేశం తెలంగాణ వైపు చూసేలా చేస్తాం

- తెల్ల, ఎర్ర రేషన్‌కార్డుల స్థానంలో మూడు రంగులు, పచ్చ కార్డులు
- హుజూర్‌నగర్ సభలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ రూరల్: భారతదేశం తెలంగాణ వైపు చూసేలా ఉచితంగా సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఆదివారం హుజూర్‌నగర్ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకం అమలు చేయడం లేదని ఉత్తమ్ చెప్పారు. లబ్ధిదారులు ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున సన్న బియ్యం ఇస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానిదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వనుందని పునరుద్ఘాటించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి తెల్లకార్డుల స్థానంలో మూడు రంగుల కార్డులు, దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారికి గులాబీ కార్డుకు బదులుగా ఆకుపచ్చ కార్డు ఇవ్వడం ద్వారా ఒక విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సన్న బియ్యం పథకం హుజూర్‌నగర్‌లో ప్రారంభించడం ఒక చరిత్రాత్మక ఘట్టమని, ఇదొక విప్లవాత్మక మార్పు అని పేర్కొన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. రేషన్ కార్డుల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, పరిశీలన పూర్తయిన తర్వాత 10 లక్షల కొత్త కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు.

తిరుమలలో వైభవంగా ఉగాది ఆస్థానం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, పండితులు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఆస్థానం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతం అనంతరం శుద్ధి నిర్వహించారు. ఆ తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించారు. శ్రీవారి మూల విరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు ధరింపజేశారు. అనంతరం.. పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. శ్రీవారి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని టీటీడీ ఉద్యాన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫల, పుష్పాలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందు కోసం ఎనిమిది టన్నుల వివిధ రకాల పువ్వులు ఉపయోగించారు. శ్రీవారి ఆలయం లోపల విభిన్న రకాల పండ్ల గుత్తులు, అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలతో శ్రీవారి ఆలయాన్నీ ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

నాద నీరాజనం వేదికపై ఉగాది కవి సమ్మేళనం..

మరోవైపు.. పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మ.12 గంటలకు తిరుమలలోని శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న నాద నీరాజనం వేదికపై నిర్వహించిన కవి సమ్మేళనం వైభవంగా జరిగింది. తెలుగు భాష వైభవం, మన సంస్కృతి, సంప్రదాయాలు, టీటీడీ భక్తులకు చేస్తున్న సేవలను పద్యాల రూపంలో వారు వివరించారు.

మందుపాతర పేలి ఆదివాసీ మహిళ మృతి

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఘటన


చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ మహిళ మృతి చెందింది. ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధి సోడుపారాకు చెందిన సుశీల సోడె ఆదివారం గ్రామానికి సమీపంలో ఉన్న బోటామర్క అటవీ ప్రాంతానికి ఇప్పపూల సేకరణకు వెళ్లింది. అక్కడ మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబును ఆమె తొక్కడంతో అది పేలింది. దీంతో సుశీల తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి చేరింది. ఇప్పపూలకోసం వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు వెతుక్కుంటూ వెళ్లగా ఆమె అపస్మారక స్థితిలో పడి ఉంది. దీంతో చికిత్స నిమిత్తం ఊసూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని తెలిపారు. కాగా శనివారం కూడా ఇదే జిల్లాలోని బౌరంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధి బోడ్గా గ్రామానికి చెందిన ఓ మహిళ ఇప్పపూల సేకరణకు వెళ్లి ప్రెజర్‌బాంబు పేలి గాయపడింది. ప్రస్తుతం జగ్దల్‌పూర్‌లో చికిత్స పొందుతోంది. ఈ ఘటనలతో ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు.

ఎన్‌కౌంటర్ మృతుడి గుర్తింపు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా టేకుమెట్ల అటవీ ప్రాంతంలో శనివారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టును గుర్తించారు. మృతుడు జనతన సర్కార్ గ్రామ అధ్యక్షుడు కన్నా జాదీగా గుర్తించగా.. అతడి స్వగ్రామం అదే ప్రాంతంలోని నర్సాపూర్‌గా తెలిసింది. అతడిపై రూ.లక్ష రివార్డు ఉంది. మృతదేహాన్ని ఆదివారం కుటుంబసభ్యులకు అప్పగించారు.

కరీంనగర్‌ను కమ్మేసిన పొగ

- డంప్ యార్డులో మంటలు



గీతాభవన్ వద్ద కమ్ముకున్న పొగ

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్‌ను ఒక్కసారిగా పొగ కమ్మేసింది. నగరంలోని 9వ డివిజన్ పరిధిలోకి వచ్చే మానేరు ఒడ్డున ఉన్న డంప్‌యార్డ్‌లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త నుంచి తరచూ మంటలు చెలరేగడం, పొగ వ్యాపించడం సాధారణంగా జరిగే తంతు. కానీ ఆదివారం సాయంత్రం వేళ ఒక్కసారిగా డంప్ యార్డ్‌లో మంటలు చెలరేగడంతో ఆ పొగ నగరంలోని కోతి రాంపూర్, లక్ష్మీనగర్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, కాపువాడ, నాకా చౌరస్తా, క్రిస్టియన్ కాలనీ, టవర్ సర్కిల్, ముకరంపుర, జ్యోతినగర్, భగత్‌నగర్, గణేశ్‌నగర్, అల్కాపురికాలనీ, కట్టరాంపూర్, బోయవాడ తదితర ప్రాంతాల్లో వ్యాపించింది. ఈసారి మంటలు ఎక్కువగా చెలరేగడంతో పొగ డంప్‌యార్డ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు విస్తరించింది. అర్ధరాత్రి వరకు పొగ కొనసాగుతూనే ఉంది.

చెరువులో మునిగి నలుగురి మృతి

- గుంతలో మునిగిన ముగ్గురు చిన్నారులు... కాపాడబోయి సవతి తల్లి



ముగ్గురు చిన్నారులు (ఫైల్)

ఎల్లారెడ్డి: ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చెరువులో మునిగి చనిపోయారు. మృతుల్లో సవతి తల్లి, ముగ్గురు చిన్నా రులు ఉన్నారు. ఎస్సై మహేశ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్ అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మర్తి ఏసు అలియాస్ లింగయ్య మొదటి భార్య నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. లింగయ్య మౌనిక (25)ను రెండో వివాహం చేసుకున్నాడు. శనివారం సాయంత్రం మౌనిక తన సవతి పిల్లలైన మైథిలి(10), అక్షర (9), వినయ్ (7)లను తీసుకొని దుస్తులు ఉతకడానికి గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లింది. అక్కడ ముగ్గురు పిల్లలు ఆడుకుంటుండగా, ఆమె దుస్తులు ఉతకడంలో నిమగ్నమైంది. లింగయ్య ఎల్లారెడ్డి పట్టణంలో హమాలి పనులు చేస్తుంటాడు. శనివారం రాత్రి ఇంటికి వచ్చేసరికి భార్య, ముగ్గురు పిల్లలు లేకపోవడంతో ఆందోళన చెంది చుట్టుపక్కల వెతికాడు. చెరువు వద్దకు వెళ్లి చూడగా దుస్తులు, చెప్పులు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటన స్థలా నికి చేరుకుని గజ ఈత గాళ్లను రప్పించి చెరువులో గాలించారు. అర్ధరాత్రి దాటాక మౌనిక, అక్షర, వినయ్ మృతదేహాలు, ఆదివారం ఉదయం మైథిలి మృతదేహం లభించాయి. ముగ్గురు పిల్లలు చెరువు సమీపంలో ఆడుకుంటూ గుంతలో పడిపోయి ఉంటారని, వారిని కాపాడే ప్రయత్నంలో మౌనిక కూడా నీట మునిగి చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణలో 779 కి.మీ. రోడ్ల నిర్మాణం

- పీఎం గతిశక్తి కింద జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు


సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి గతిశక్తి పథకం కింద తెలంగాణలో జాతీయ ఎక్స్‌ప్రెస్ వే, యాక్సెస్–కంట్రోల్డ్ హైస్పీడ్ కారిడార్‌లను అభివృద్ధి చేసినట్లు కేంద్ర రవాణా, రహదారుల శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 2,474 కి.మీ. పొడవున జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం జరిగిందని ఆ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 779 కి.మీ. పొడవున నాలుగు జాతీయ హైవేలు/ఎక్స్‌ప్రెస్‌వేలు (హైదరాబాద్–విశాఖపట్నం, సోలాపూర్– కర్నూలు–చెన్నై, ఇండోర్–హైదరాబాద్, నాగ్‌పూర్–విజయవాడ) కారిడార్లు అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు దాదాపు 415 కి.మీ. నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. మిగతా నిర్మాణం కూడా త్వరితగతిన పూర్తవుతుందని కేంద్ర మంత్రి చెప్పారు.

ఆదిమ గెలాక్సీ చిక్కింది

విశ్వపు వెలుగుల గుట్టు విప్పింది

గుర్తించిన జేమ్స్ వెబ్ టెలిస్కోప్

అనంత విశ్వంలో మనకు అత్యంత సుదూరంలో ఉన్న ఒక నక్షత్ర మండలాన్ని జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా గుర్తించింది. దీన్ని అత్యంత ఆదిమ గెలాక్సీల్లో ఒకటిగా భావిస్తున్నారు. ఎందుకంటే విశ్వావిర్భావానికి మూల కారణమని భావిస్తున్న బిగ్‌బ్యాంగ్ జరిగిన కేవలం 33 కోట్ల ఏళ్లకే అది పురుడు పోసుకుంది! విశ్వం వయసు 1,380 కోట్ల ఏళ్లని అంచనా. ఈ లెక్కన ఈ గెలాక్సీ ఎంత పురాతనమైనదో అర్థం చేసుకోవచ్చు. దీనికి జేడ్స్-జీఎస్-జెడ్13-1గా సైంటిస్టులు నామకరణం చేశారు. భూమి వయసు 450 కోట్ల సంవత్సరాలన్నది తెలిసిందే. అయితే, ''జేడ్ గెలాక్సీ కేవలం 230 కాంతి సంవత్సరాల విస్తీర్ణంలోనే వ్యాపించింది. ఆ లెక్కన మన పాలపుంత కంటే ఇది వందలాది రెట్లు చిన్నదే'' అని సైంటిస్టులు వివరించారు. కానీ దీని గుర్తింపుకు ఉన్న విశిష్టత అంతా ఇంతా కాదు.



చీకట్లను చీల్చుకుని...

మనకు ఇప్పటిదాకా తెలిసిన అత్యంత పురాతన గెలాక్సీల్లో జేడ్స్ నాలుగోది. కానీ వాటన్నింట్లోకీ ఇది అత్యంత ప్రకాశవంతమైనది మాత్రం ఇదే. తద్వారా అయానీకరణ దశకు జేడ్స్ తొలి రుజువుగా నిలిచిందని ఈ అధ్యయనంలో పాల్గొన్న సైంటిస్టుల బృందం సంబరపడుతోంది. బిగ్‌బ్యాంగ్‌తో పురుడు పోసుకున్న విశ్వం క్షణాల వ్యవధిలోనే శరవేగంగా, అనంతంగా విస్తరించడం మొదలు పెట్టిందన్నది సైంటిస్టుల భావన. నవజాత దశను దాటి కాస్త చల్లబడ్డాక చాలాకాలం పాటు వైశ్విక అంధకార యుగం కొనసాగిందని చెబుతారు. ఆ దశలో విశ్వం మొత్తాన్నీ హైడ్రోజన్ వాయువు దట్టంగా కప్పేయడమే ఇందుకు కారణం. ''దాంతో విశ్వమంతా కేవలం హైడ్రోజన్, హీలియం, కృష్ణరాశితో కూడిన ముద్దగా మిగిలిపోయింది. ఆ తర్వాత విశ్వపు తొలి తారలు, కృష్ణబిలాలు, గెలాక్సీలు పురుడుపోసుకున్నాయి. వాటినుంచి నుంచి అతి శక్తిమంతమైన పరారుణ కాంతి ఉద్గారాలు వెలువడ్డాయి. విశ్వాన్ని చిరకాలంగా కప్పి ఉంచిన తటస్థ హైడ్రోజన్ వాయు మండలాన్ని ఛేదించాయి. తొట్టతొలి వెలుగు కిరణాలుగా నిలిచిపోయాయి'' అని పెన్‌హెగన్ యూనివర్సిటీ కాస్మిక్ డాన్ సెంటర్‌కు చెందిన ఆస్ట్రో ఫిజిసిస్టు జోరిస్ విట్‌స్టాక్ వెల్లడించారు. తాజా అధ్యయనానికి ఆయనే సారథ్యం వహించారు. ''అలా విశ్వం అయానీకరణ దశలో తొలిసారిగా వెలుగులు విరజిమ్మడం మొదలైంది. అందుకే దీన్ని విశ్వానికి పొద్దుపొడుపుగా చెబుతుంటారు. జేడ్స్ గెలాక్సీ సరిగ్గా ఆ పరివర్తన దశకు చెందినదని తేలింది'' అని విట్‌స్టాక్ వివరించారు. ''ఇప్పటిదాకా మనకు చిక్కిన ఇతర సుదూర గెలాక్సీలకు భిన్నంగా జేడ్స్ అత్యంత స్పష్టంగా కన్పిస్తుండటం వెనక కారణం కూడా ఇదే. అందులో అత్యంత శక్తిమంతమైన పరారుణ రేడియేషన్ వంటిది ఉందనేందుకు ఇది నిదర్శనం. అయానీకరణం చెందిన హైడ్రోజన్ దాని చుట్టూ భారీగా పరుచుకుని ఉంది'' అని చెప్పుకొచ్చారు. ఈ అధ్యయన వివరాలను జర్నల్ నేచర్‌లో ప్రచురించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కుళ్లుతున్న మృతదేహాలు

మయన్మార్‌లో పెనువిషాదం • శిథిలాల కింద మృత్యుఘోష • బయటపడే అవకాశాలు లేనట్టే

- నత్తనడకన సహాయక చర్యలు
- వనరుల లేమి, రవాణా కష్టాలు
- 1,700 దాటిన మృతుల సంఖ్య
- 5.1 తీవ్రతతో మరో భూకంపం

మాండలే: భూకంపం తాలూకు విధ్వంసం నుంచి మయన్మార్ ఇంకా తేరుకోలేదు. మౌలిక వనరుల లేమికి భూ ప్రకంపనలు తోడై సహాయక చర్యలు నత్తనడకన సాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుబడ్డవారి సంఖ్య అపారంగా ఉన్నట్టు సైనిక ప్రభుత్వ వర్గాలు అంగీకరిస్తున్నానాయి. ఇప్పటికే రెండు రోజులు దాటిపోవడంతో వారు ప్రాణాలతో బయటపడే అవకాశాలు క్రమంగా సన్నగిల్లుతున్నాయి. దాంతో రాజధాని నేపిడా మొదలుకుని ఏ నగరంలో చూసినా మృత్యుఘోషే విన్పిస్తోంది. ముఖ్యంగా భూకంప కేంద్రానికి సమీపంలో ఉన్న కారణంగా తీవ్రంగా దెబ్బ తిన్న మాండలేలో శిథిలాల కింద కుళ్లిపోతున్న మృతదేహాలతో వీధులన్నీ కంపు కొడుతున్న పరిస్థితి! అంతర్జాతీయంగా అందుతున్న సాయం ఏ మూలకూ చాలడం లేదు. శుక్రవారం మధ్యాహ్నం 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపం దేశాన్ని అతలాకుతలం చేయడం తెలిసిందే. చాలా నగరాల్లో భవనాలు పేకమేడల్లా కుప్పకూలిపోయాయి. భూ ప్రకంపనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. రాజధాని నేపిడా సమీపంలో శనివారం రెండుసార్లు 4.7, 4.3 తీవ్రతతో భూమి కంపించడం తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం కూడా 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దాంతో జనం భయాందోళనలతో ఇళ్లను వీడి వీధుల్లోకి పరుగులు తీశారు. స్వల్ప స్థాయి ప్రకంపనలు రోజంతా కొనసాగాయి. రోడ్డు, రైలు మార్గాలు, బ్రిడ్జిల వంటివన్నీ తీవ్రంగా దెబ్బతినడంతో రవాణా వ్యవస్థలన్నీ పడకేశాయి. దాంతో సహాయక బృందాలను బాధిత ప్రాంతాలకు తరలించడమే సవాలుగా మారింది. సమాచార వ్యవస్థలు కూడా కుప్పకూలాయి. వీటికి తోడు 41 డిగ్రీల పై చిలుకు ఎండ తారెత్తిస్తోంది. చాలాచోట్ల శిథిలాలను పారలు, చేతులతోనే తొలగించేందుకు స్థానికులు ప్రయత్నిస్తున్నారు! ఇన్ని ప్రతికూలతల మధ్యే ఇప్పటిదాకా 1,700కు పైగా మృతదేహాలను వెలికి తీశారు. అయితే సహాయక బృందాలు ఇంకా దేశంలో చాలా ప్రాంతాలకు చేరుకోనే లేదు. తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్న ప్రాంతాల్లో సహాయక చర్యల ఊసే లేదు. దాంతో అక్కడి మృతులు, క్షతగాత్రుల సంఖ్యపై ఇప్పటిదాకా ఎలాంటి సమాచారమూ లేదు. ఈ నేపథ్యంలో మరణాలు 10 వేలు దాటినా ఆశ్చర్యం లేదంటున్నారు.

మాండలేలో ఆకలి కేకలు

15 లక్షల జనాభా ఉన్న మాండలేలో విధ్వంసం మాటలకందని రీతిలో ఉంది. ఒక మోస్తరు నుంచి భారీ నిర్మాణాలన్నీ కుప్పకూలడమో, భారీగా పగుళ్లివ్వడమో జరిగింది. దాంతో నగరవాసులు వీధుల్లోనే గడుపుతున్నారు. శిథిలాల కింద చిక్కిన తమవారిని ఎలాగోలా కాపాడుకోవాలని తపిస్తున్నారు. పారలు, పలుగులతో వాటిని తవ్వి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే తిండికి, తాగునీటికి కూడా వాళ్లు అల్లాడిపోతున్న పరిస్థితి! శిథిలాల తొలగింపుకే నెలలు పట్టినా ఆశ్చర్యం లేదని కేథలిక్ రిలీఫ్ సర్వీసెస్ మేనేజర్ కారా బ్రాగ్ అభిప్రాయపడ్డారు. ''క్షతగాత్రులకు వైద్య సేవలు అందించేందుకు చాలినన్ని సదుపాయాల్లేవు. ఔషధాలు తదితరాలకు తీవ్ర కొరత ఉంది. తిండికి, తాగునీటికి కొరత తీవ్రతరమవుతోంది'' అంటూ ఆవేదన వెలిబుచ్చారు. నేపిడా, మాండలే విమానాశ్రయాలు పూర్తిగా దెబ్బతినడంతో ఆ నగరాలకు వాయుమార్గాన సహాయక సామగ్రి, సిబ్బంది తరలింపు అసాధ్యంగా మారింది. నేపిడాలో ప్రభుత్వ కార్యాలయాల పునరుద్ధరణకే సైనిక సర్కారు ప్రాధాన్యమిస్తోంది. దాంతో సాధారణ ప్రజల దైన్యాన్ని పట్టించుకునే వాళ్లే లేకుండా పోయారు.



ఆదివారం మాండలేలో ఓ భవన శిథిలాల కింద సహాయక సిబ్బంది వెదుకులాట

భారత్ ఆపద్బాంధవ పాత్ర

కల్లోల మయన్మార్‌ను ఆదుకోవడంతో భారత్ ఆపద్బాంధవ పాత్ర పోషిస్తోంది. ఆపరేషన్ బ్రహ్మ పేరిట ఇప్పటికే ఐదు సైనిక విమానాల్లో 60 టన్నుల మేరకు సహాయక సామగ్రిని చేరవేసింది. మరో 40 టన్నుల సహాయక సామగ్రి సముద్ర మార్గాన చేరుకుంటోంది. 80 మంది ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి ప్రత్యేక సైనిక పారా బ్రిగేడ్ బృందం కూడా తోడైంది. 120 మంది వైద్యులు, వైద్య సిబ్బందితో వాయు మార్గాన తరలించిన తాత్కాలిక ఆస్పత్రి రెండుగా విడిపోయి మాండలే, నేపిడాల్లో రోగులను పెద్ద ఎత్తున ఆదుకుంటోంది.

థాయ్‌లాండ్‌లో 18కి మృతులు

శుక్రవారం నాటి భూకంపంతో తీవ్రంగా దెబ్బ తిన్న థాయ్‌లాండ్‌లో మృతుల సంఖ్య 18కి పెరిగింది. బ్యాంకాక్‌లో కుప్పకూలిన 33 అంతస్తులు నిర్మాణంలోని భవనం శిథిలాల్లో నుంచి ఇప్పటిదాకా 11 మృతదేహాలను వెలికితీశారు.

ఒడిశాలో పట్టాలు తప్పిన 'కామాఖ్య'

ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

కటక్: బెంగళూరు నుంచి అస్సాంలోని గౌహతికి వెళ్లే కామాఖ్య ఏసీ ఎక్స్‌ప్రెస్ ఒడిశాలో పట్టాలు తప్పింది. ఘటనలో ఒకరు చనిపోగా ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. కటక్ జిల్లా మంగులి సమీపంలోని నిర్గుండి వద్ద ఆదివారం ఉదయం 11.54 గంటల సమయంలో 11 బోగీలు పట్టాలు తప్పాయని అధికారులు తెలిపారు. ఘటనతో భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు కేకలు వేశారు. భయపడి కిందికి దూకిన బెంగాల్‌కు చెందిన 22 ఏళ్ల సువంకర్ రాయ్ గాయాలతో చనిపోయాడన్నారు. ఇతడి మృతికి కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు ప్రకటించారు. ఆ ప్రాంతంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఘటన అనంతరం ఏసీ బోగీల నుంచి అకస్మాత్తుగా బయటకు వచ్చిన కొందరు ప్రయాణికులు అస్వస్థతకు గురయ్యారని కటక్ కలెక్టర్ దత్తాత్రేయ షిండే చెప్పారు. ఘటనాస్థలి వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో మొత్తం 15 మంది ప్రాథమిక చికిత్స చేయించామన్నారు. సాధారణ గాయాలైన ఇద్దరిని, తీవ్రంగా గాయపడిన ఒక మహిళను కటక్‌లోని మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు వివరించారు. బెంగళూరులో వైద్య చికిత్సల అనంతరం వెనక్కి వస్తున్న మరో నలుగురు కూడా వీరితోపాటు ఉన్నారన్నారు. అందరి పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఘటన కారణంగా హౌరా-చెన్నై మార్గంలోని రైళ్ల రాకపోకలను అంతరాయం ఏర్పడిందని అధికారులు వివరించారు. కామాఖ్యలోని వారిని గమ్యస్థానాలకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని తెలిపారు. ఘటన నేపథ్యంలో ధౌలి ఎక్స్‌ప్రెస్, నీలాంచల్ ఎక్స్‌ప్రెస్, పురూలియా ఎక్స్‌ప్రెస్ తదితర 21 రైళ్లను దారి మళ్లించారు. మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ.50 వేలు పరిహారంగా ప్రకటించారు.

ఛత్తీస్‌లో 50 మంది నక్సల్స్ లొంగుబాటు

- వారిలో 10 మంది మహిళలు
- 14 మందిపై రూ.68 లక్షల రివార్డు

బిజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్న వేళ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆదివారం బిజాపూర్‌లో దాదాపు 50 మంది మావోయిస్టులు పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు. వీరిలో 10 మంది మహిళలు కాగా, 14 మందిపై మొత్తం రూ.68 లక్షల రివార్డు ఉండటం గమనార్హం. పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ)సహా పలు విభాగాల్లో అగ్రస్థానాల్లో రవీంద్ర కరం(19), రోని పర్సిక్(22), రాకేశ్ కడ్తి(30), కోపె లెకమ్(24), శాంతి టాటి(22), సోను హెమ్లా(22) ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరిపై తలా రూ.8 లక్షల రివార్డు ఉందని వివరించారు. మరో ముగ్గురిపై రూ.5 లక్షల రివార్డు, ఐదుగురిపై రూ.లక్ష చొప్పున రివార్డులున్నాయన్నారు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా హర్షం ప్రకటించారు.

ఏఎఫ్ఎస్‌పీఏ పొడిగింపు

న్యూఢిల్లీ: శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని మణిపూర్‌లో సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని(ఏఎఫ్ఎస్‌పీఏ) ఆరు నెలలపాటు పొడిగిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. 13 పోలీస్‌స్టేషన్ల పరిధి మినహా మణిపూర్ వ్యాప్తంగా, నాగాలాండ్‌లోని 8 జిల్లాలు, మరో ఐదు జిల్లాల్లోని 21 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ చట్టం అమలవుతుందని వివరించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని టిరాప్, చంగ్లాంగ్, లాంగ్‌డింగ్ జిల్లాలు, నమ్‌సాయి జిల్లాలోని మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏఎఫ్ఎస్‌పీఏ ఆరు నెల్లపాటు కొనసాగుతుందని హోం శాఖ ఆదివారం వివరించింది. ఈ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే బలగాలకు ఈ చట్టం కింద విపరీత అధికారాలు దఖలు పడతాయి.

సాంస్కృతిక వటవృక్షం

ఆరెస్సెస్‌పై మోదీ ప్రశంసలు

- నాగపూర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయం సందర్శన
- ప్రధాని హోదాలో వెళ్లడం 11 ఏళ్లలో ఇదే తొలిసారి

నాగ్‌పూర్/బిలాస్‌పూర్: మహారాష్ట్ర నూతన సంవత్సర వేడుక గుడీ పడ్వా సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నాగపూర్‌లో పర్యటించారు. అక్కడి ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. రేషీంబాగ్‌లోని డాక్టర్ హెడ్గేవార్ స్మృతిమందిర్‌కు వెళ్లారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు కేశవ్ బలిరాం హెడ్గేవార్‌కు, సంస్థ రెండో సర్‌సంఘ్ చాలక్ మాధవ్‌రావ్ సదాశివరావ్ గోల్వాల్కర్‌కు నివాళులర్పించారు. ఆరెస్సెస్ గొప్పదనాన్ని, సంస్థ నేతల కృషిని ప్రస్తుతిస్తూ సందర్శకుల పుస్తకంలో హిందీలో భావోద్వేగపూరితంగా నోట్ రాశారు. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో కలిసి సంస్థ పంచాంగ కార్యక్రమం (ప్రతిపద)లో పాల్గొన్నారు. ప్రధానిగా పగ్గాలు చేపట్టిన ఈ 11 ఏళ్లలో మోదీ ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడం ఇదే తొలిసారి కావడం విశేషం. సంస్థ సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ''ఆరెస్సెస్ భారతదేశానికి సాంస్కృతిక వటవృక్షం వంటిది. జాతి ప్రయోజనాలే లక్ష్యంగా మన సంస్కృతిని, ఆధునికతను నిత్యం పరిరక్షిస్తోంది. ఇందుకోసం అసంఖ్యాకులైన ఆరెస్సెస్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా నిస్వార్థంగా కృషి చేస్తున్నారు. 2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్యంగా పురోగమిస్తున్న వేళ ఆరెస్సెస్ వందేళ్ల తపస్సు ఇప్పుడు ఫలాలందిస్తోంది. బానిస మనస్తత్వాన్ని, బానిస పాలన చిహ్నాలను, కాలం చెల్లిన చట్టాలను తొలగిస్తూ నూతన న్యాయసంహితతో భారత్ పురోగమిస్తోంది'' అని మోదీ అన్నారు.

మాధవ్ నేత్రాలయకు శంకుస్థాపన

నాగపూర్‌లో మాధవ్ నేత్రాలయ ఇన్‌స్టిట్యూట్, రీసెర్చ్ సెంటర్‌కు అనుబంధంగా నిర్మించబోయే మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్‌కు మోదీ శంకుస్థాపన చేశారు. ఆరెస్సెస్ మాజీ చీఫ్ గోల్వాల్కర్‌కు గుర్తుగా ఈ నేత్రాలయను నిర్మించారు. ''గోల్వాల్కర్ స్ఫూర్తితో ఈ నేత్రాలయం లక్షలాది మందికి కంటి బాధలను దూరంచేసింది. కొత్త ఆస్పత్రి కూడా కంటి సమస్యల బాధితులకు వెలుగులను పంచనుంది'' అన్నారు.

దీక్షాభూమిలో అంబేడ్కర్‌కు నివాళి

నాగపూర్‌లో అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన చోట నిర్మించిన 'దీక్షాభూమి'ని కూడా మోదీ సందర్శించారు. రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పించారు. అక్కడి సందర్శకుల డైరీలో మోదీ రాశారు. భారత్‌ను సమ్మిళిత, అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు తీసుకెళ్లడమే అంబేడ్కర్‌కు అసలైన నివాళి అన్నారు. తర్వాత నాగపూర్‌లోని సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ ఆయుధాగారాన్ని ప్రధాని సందర్శించారు. అక్కడ మానవ రహిత విహంగాల రన్‌వేను ప్రారంభించారు.



హెడ్గేవార్ విగ్రహం వద్ద మోదీ నివాళులు

కాంగ్రెస్ వల్లే నక్సలిజం ప్రబలింది

ఛత్తీస్ పర్యటనలో మోదీ ధ్వజం

కాంగ్రెస్ ప్రభుత్వాల విఫల విధానాల వల్లే ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల్లో నక్సలిజం ఊపందుకుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ''బీజేపీ అధికారంలోకి వచ్చాకే ఆయా రాష్ట్రాల్లో పెనుమార్పు మొదలైంది. నక్సల్స్ ప్రభావ ప్రాంతాల్లో శాంతి శకం ఆరంభమైంది'' అని వ్యాఖ్యానించారు. ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లో రూ.33,700 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం బిలాస్‌పూర్ జిల్లా మోహభాత్తా గ్రామంలో బహిరంగ సభలో పాల్గొన్నారు. ''దేశాన్ని 60 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్ ఏం చేసింది? అభివృద్ధికి నోచుకోని జిల్లాలను పట్టించుకోవడం మానేసింది. వాటిని 'వెనుకబడిన జిల్లాలు'గా ప్రకటించి చేతులు దులుపుకుంది. కాంగ్రెస్ విధానాల వల్లే ఛత్తీస్‌గఢ్ వంటి ఎన్నో రాష్ట్రాల్లో నక్సలిజం విజృంభించింది. అభివృద్ధి పడకేసింది. మావోయిస్టు హింసలో ఎంతోమంది తల్లులు కుమారులను కోల్పోయారు. నక్సలైట్ల బెడదతో అటవీ ప్రాంతాల్లో గిరిజనులకు అభివృద్ధి ఫలాలు అందలేదు. కాంగ్రెస్ పాలకులు వారినెప్పుడూ పట్టించుకోలేదు. మేమొచ్చాక స్వచ్ఛభారత్ అభియాన్, ఆయుష్మాన్ భారత్‌లతో ఉచితంగా రూ.5 లక్షల వరకు వైద్యసాయం అందిస్తున్నాం'' అని మోదీ అన్నారు. ''ఎవరికైనా ఆశ్రయం కల్పించడాన్ని భారత సంప్రదాయాల్లో గొప్పగా చెబుతారు. ఛత్తీస్‌గఢ్‌లో 'నవరాత్రి' సందర్భంగా 3 లక్షల పేద కుటుంబాలు సొంతిళ్లలోకి మారుతున్నాయి. ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజనతో లక్షలాది ఇళ్లు నిర్మించాం. ఫలితంగా ఆ ప్రాంతాల్లో ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయి. వాజ్‌పేయీ శత జయంతి వేడుకలు, ఛత్తీస్‌గఢ్ ఆవిర్భావ రజతోత్సవాలు ఈ ఏడాదే రావడం యాదృచ్ఛికం'' అని మోదీ అన్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

ఏప్రిల్ 30న తెరచుకోనున్న గంగోత్రి, యమునోత్రి

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని హిమాలయ పర్వత సానువుల్లో ఉన్న గంగోత్రి, యమునోత్రి ఆలయాల తలుపులు ఏప్రిల్ 30వ తేదీన తెరచుకోనున్నాయి. అక్షయ తృతీయను పురస్కరించుకుని ఏప్రిల్ 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు గంగోత్రి ఆలయాన్ని భక్తుల సందర్శనల కోసం తెరుస్తామని ఆలయ కమిటీ తెలిపింది. అదే రోజు యమునోత్రి ఆలయం తెరచుకోవడంతో చార్‌ధామ్ యాత్ర ప్రారంభం కానుంది. అదే విధంగా, మే 2న కేదార్‌నాథ్ ఆలయాన్ని, మే 4వ తేదీన బద్రీనాథ్ ఆలయాన్ని తెరవనున్నారు.

అమెరికాతో నేరుగా చర్చల ప్రశ్నే లేదు: ఇరాన్

దుబాయ్: అణు కార్యక్రమంపై అమెరికాతో నేరుగా చర్చలు జరిపే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఇరాన్ సుప్రీం నేత ఖొమైనీకి రాసిన లేఖపై ఈ మేరకు అధికారికంగా స్పందించింది. అమెరికాతో చర్చల నుంచి తప్పించుకోవడం లేదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. అయితే, ''ఎన్నో వాగ్దానాలను అమెరికా కాలరాసింది. దీనిపైనే మాకు భేదాభిప్రాయాలున్నాయి. ముందుగా ఆ దేశం మాకు నమ్మకం కలిగించాలి'' అని పేర్కొన్నారు. దీనిద్వారా పరోక్ష చర్చలు మాత్రమే సాధ్యమని చెప్పారు. పెజెష్కియాన్ స్పందనపై అమెరికా విదేశాంగ శాఖ స్పందించింది. 'అధ్యక్షుడు ట్రంప్ ఈ విషయంలో చాలా స్పష్టతతో ఉన్నారు. ముందుగా ఆయన చర్చలకు దారి తెరిచారు. కాదన్న పక్షంలో ఇరాన్ అణు కార్యక్రమమే లక్ష్యంగా సైనిక చర్య చేపట్టే ప్రమాదముంది'అంటూ వ్యాఖ్యానించింది.

రైతులకు రుణ మాఫీ చేయలేం: అజిత్

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై దుమారం

ముంబై: రైతులకు రుణ మాఫీ ఇవ్వలేమంటూ మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. అజిత్ వ్యాఖ్యలపై మహాయుతి పక్షాలు మద్దతు ప్రకటించగా ప్రతిపక్ష శివసేన(యూబీటీ) మాత్రం తప్పుడు ఎన్నికల వాగ్దానాలతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మండిపడింది. మార్చి 28న బారామతిలో జరిగిన కార్యక్రమంలో అజిత్ పవార్..'దేవేంద్ర ఫడ్నవీస్ అయినా ఏక్‌నాథ్ షిండే అయినా ప్రధానలక్ష్యం ప్రజా సంక్షేమమే. ఎన్నికల హామీ అయిన రుణ మాఫీపై చాలా మంది అడుగుతున్నారు. మార్చి 31వ తేదీ కల్లా రుణాలను తిరిగి చెల్లించాల్సిందేనని మహారాష్ట్ర ప్రజానీకానికి స్పష్టం చేయదల్చుకున్నా. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అన్ని వేళలా కార్యరూపంలోకి రావు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రస్తుతానికి, వచ్చే ఏడాదిలో కూడా రుణాలను మాత్రం తిరిగి చెల్లించాల్సిందే'అని స్పష్టం చేశారు. అజిత్ వ్యాఖ్యలపై ప్రతిపక్ష శివసేన(యూబీటీ)నే అంబాదాస్ దన్వే తీవ్రంగా మండిపడ్డారు. మహాయుతి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందన్నారు. రుణ మాఫీ అని చెప్పి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడేమో ఆ హామీ అమలు అసాధ్యమంటున్నారు. ఈ నిర్ణయం రైతులను ఆర్థికంగా మరింత ఇబ్బందుల్లోకి నెడుతుంది'అని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్త అదానీకి వేలకోట్ల రుణాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం రైతు రుణ మాఫీ హామీని మాత్రం అమలు చేయలేకపోతోందని విమర్శించారు. రాజకీయ దుమారం నేపథ్యంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, మరో డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేలు అజిత్ పవార్‌కు మద్దతుగా నిలిచారు. అజిత్ పవార్ కేవలం ప్రభుత్వ పరిస్థితిని వివరించారే తప్ప, రుణమాఫీ అస్సలు సాధ్యం కాదని అనలేదంటూ సరిచేసే ప్రయత్నం చేశారు. ఎన్నికల హామీలన్నిటినీ ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిగా అమలు చేస్తామన్నారు.

అధికారులను తరచూ మారుస్తుండాలి

ఒకే చోట పాతుకుపోవడం వల్లే అవినీతి: పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ: ఉద్యోగులను ఒకే చోట పోస్టింగుల్లో సుదీర్ఘకాలం కొనసాగనివ్వడం వల్లే అవినీతికి ఆస్కారం ఏర్పడుతోందని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. ఈ ఒరవడిని మార్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని, అధికారులను నిర్దిష్ట కాల పరిమితికి మించి ఒకే చోట ఉంచరాదని సూచించింది. ఈ నియమాన్ని అన్ని శాఖల్లోనూ అమలు చేయాలని తెలిపింది. అధికారులను తరచూ మార్చుతుండాలన్న విధానం ఎక్కడా అమలవడం లేదని సిబ్బంది వ్యవహారాల శాఖ అనుబంధ పార్లమెంటరీ కమిటీ కుండబద్దలు కొట్టింది. ఈ మేరకు మార్చి 27వ తేదీన పార్లమెంట్‌కు నివేదిక సమర్పించింది. కొందరు అధికారులు తమకిష్టమున్న శాఖలు, ప్రాంతాల్లో 8, 9 ఏళ్లపాటు ఒకేచోట కొనసాగుతున్నారని, మరిముఖ్యంగా ఆర్థిక, సున్నితమైన మరికొన్ని శాఖల్లో ఈ పరిస్థితి ఉందని గమనించింది. ఆయా శాఖల అధిపతులు నాలుగైదు సార్లు మారినా ఈ అధికారులు మాత్రం పదవీ కాలమంతా ఒకే చోట తిష్ట వేస్తున్నారని తెలిపింది. ఈ పరిస్థితిలో తక్షణం మార్పుతేవాలని సూచించింది. సున్నితమైన విభాగాల్లోని అధికారులను మూడేళ్ల మించి ఒకే చోట కొనసాగనివ్వరాదని కోరింది.

హిమాచల్‌లో విరిగిపడిన కొండచరియలు

ఆరుగురు మృతి, పలువురికి గాయాలు

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని కులు జిల్లాలో మణికరణ్ సాహిబ్ గురుద్వారా సమీపంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురు మహిళలు సహా ఆరుగురు చనిపోయారు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. కొండపై నుంచి మట్టి, రాళ్లతోపాటు చెట్టు విరిగిపడిన ఈ ఘటనలో పార్కు చేసి ఉన్న వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. మృతుల్లో ఒకరు బెంగళూరుకు చెందిన వర్షిణి, ఒకరు మణికరన్‌కు చెందిన రీనా, నేపాల్ వాసి సమీర్ అని తేలిందని పోలీసులు తెలిపారు. మిగతా వారిని గుర్తించే పనిలో ఉన్నామన్నారు. క్షతగాత్రుల్లో బెంగళూరుకు చెందిన రమేశ్ దంపతులు, కుమారుడు భార్గవ్, హరియాణా వాసి ప్రాచితోపాటు విక్రమ్ ఆచార్య దంపతులు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారని, వీరికి ప్రమాదం తప్పిందని వివరించారు.

డోజ్‌కు త్వరలో మస్క్ గుడ్‌బై?



వాషింగ్టన్: అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) సారథ్య పదవికి ఎలాన్ మస్క్ రాజీనామా చేయబోతున్నారని తెలుస్తోంది. ఈ విషయాన్ని మస్క్ స్వయంగా వెల్లడించారు. ఫాక్స్ న్యూస్ వార్తాసంస్థకు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావిస్తూ డోజ్‌కు వీడ్కోలు పలకబోతున్న అంశాన్ని కూడా పేర్కొన్నారు. ఆయన ఇప్పటికే డోజ్ బృందంలోని కీలకమైన ఏడుగురు సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై సంస్థ తదుపరి కార్యాచరణపై చర్చించారు. ఆరామ్ మొఘద్దాషీ, స్టీవ్ డేవిడ్, బ్రాడ్ స్మిత్, ఆంటోనీ ఆర్మ్‌స్ట్రాంగ్, జోయా గిబ్బియా, టోమ్ క్రాస్, టైలర్ హాసేన్‌లతో మస్క్ సమావేశమయ్యారు. వివాదాస్పద నిర్ణయాలతో వరసబెట్టి కార్యనిర్వాహక ఉత్తర్వులిస్తున్న డొనాల్డ్ ట్రంప్‌కు కుడిభుజంగా వేలమంది కేంద్ర ప్రభుత్వోద్యోగులను మస్క్ సాగనంపడం, వేలకోట్ల విలువైన ప్రభుత్వ ఒప్పందాలు, కాంట్రాక్టులను రద్దుచేయడం తెలిసిందే. దాంతో ఆయన తప్పుకున్నాక డోజ్ విభాగం ఉంటుందా, ఉంటే నూతన సారథి ఎవరంటూ చర్చ మొదలైంది. సొంత సమస్యలను పరిష్కరించుకునేందుకే మస్క్ ఇలా హడావుడిగా డోజ్ నుంచి వైదొలగుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఆయన టెస్లా కంపెనీ కార్ల పనితీరు, సంస్థలో శ్వేతజాతీయేతర ఉద్యోగుల పట్ల వివక్ష, భాగస్వాముల విభేదాలు, వినియోగదారుల ఫిర్యాదుల వంటి సమస్యలతో మస్క్ సతమతమవుతున్నారు. ట్రంప్ నిర్దేశించిన లక్ష్యాన్ని దాదాపు చేరుకున్నాకే డోజ్ నుంచి నిష్క్రమించబోతున్నానని ఆయన చెప్పుకొచ్చారు. ''అమెరికా ఆర్థిక భారాన్ని కనీసం ట్రిలియన్ డాలర్ల మేర తగ్గించాలన్న లక్ష్యం దాదాపు సాధించాం''అని చెప్పారు.

గ్రీన్‌లాండ్ కోసం... అవసరమైతే సైనిక చర్య!

దాన్నెప్పుడూ నిరాకరించలేదు: ట్రంప్

న్యూక్(గ్రీన్‌లాండ్): గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కు తగ్గడం లేదు. దాన్ని సొంతం చేసుకునేందుకు సైనిక శక్తిని ఉపయోగించే అవకాశం లేదని తానెన్నడూ చెప్పలేదన్నారు. ''సైనిక బలంతో పని లేకుండానే గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకుకుంటామని అనుకుంటున్నా. ప్రపంచ శాంతికి, భద్రతకు ఇదెంతో అవసరం. ఇందుకోసం ఏ అవకాశాన్నీ కొట్టిపారేయలేం'' అని శనివారం ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. గ్రీన్‌లాండ్ నాటో సభ్యదేశమైన డెన్మార్క్ అధీనంలో ఉంది. దాన్ని ఆక్రమించుకోవడం అమెరికాకు అవసరమని ట్రంప్ వాదిస్తున్నారు. 'గ్రీన్‌లాండ్‌కు మద్దతుగా అమెరికా' క్యాప్షన్‌తో ఓ వీడియో విడుదల చేశారు.

వాన్స్‌పై డెన్మార్క్ ఆగ్రహం

భార్య ఉషతో కలిసి గ్రీన్‌లాండ్ సందర్శన సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలపై డెన్మార్క్ మండిపడింది. శుక్రవారం భార్య ఉషతో కలిసి గ్రీన్‌లాండ్ వెళ్లిన ఆయన, ఆ ప్రాంతాన్ని డెన్మార్క్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రజలను కోరారు. దీనిపై డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లొక్కె రస్ముసెన్ మండిపడ్డారు. ట్రంప్ ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు. ''సన్నిహిత దేశంపై చేయాల్సిన విమర్శలు కావవి. అమెరికా మా మిత్ర దేశమని ఇప్పటికీ భావిస్తున్నాం'' అన్నారు. ట్రంప్ చర్యలను సమైక్యంగా ఎదుర్కోవాలని గ్రీన్‌లాండ్ ఎంపీలు నిర్ణయించారు. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఎదుట వేలాది మంది గ్రీన్‌లాండ్‌వాసులు నిరసనను చేపట్టారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 31 । మార్చి । 2025



మండే ఎండలోనే..!

నగరంలో బస్ షెల్టర్లు సరిగా లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎండలతో బేజారవుతున్నారు.

-8లో



సైబర్ భద్రతపై అలర్ట్

సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వివిధ వర్గాలకు అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు వివిధ వర్సిటీల సహకారం తీసుకోనున్నారు.

-8లో

గరిష్ఠం/కనిష్ఠం
39.0/25.0

వాతావరణం

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 39, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

నిజాంపేట బాచుపల్లి క్రాంతినగర్‌లో...







రవీంద్రభారతిలో నృత్య విన్యాసాలు..



ఉగాది సంబరం.. నృత్య విన్యాసం

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆదివారం నగరవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. నిజాంపేటలోని బాచుపల్లి క్రాంతినగర్‌లో సాక్షి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ నర్తకి యామినీరెడ్డి శిష్యబృందం ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. - సాక్షి, సిటీబ్యూరో

- మూడు భాగాలుగా మెగా మాస్టర్‌ప్లాన్-2050
- ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్లాన్, బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్‌గా ఏర్పాటు
- మూడింటిపైన అధ్యయనం కోసం ప్రత్యేకంగా కన్సల్టెన్సీలు

మెగా మాస్టర్ ప్లాన్‌పై ముందడుగు



తుది దశకు చేరిన ముసాయిదా

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి కోసం రాబోయే 25 సంవత్సరాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని రూపొందిస్తోన్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా మెగా మాస్టర్ ప్లాన్-2050 పైన వివిధ దశల్లో అధ్యయనం కొనసాగుతోంది. మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించిన మూడు విభాగాలపైన సమగ్రమైన ముసాయిదా ప్లాన్‌ను ప్రభుత్వానికి అందజేసేందుకు కన్సల్టెన్సీలు కసరత్తు చేపట్టాయి. ప్రస్తుతం ఉన్న వివిధ రకాల మాస్టర్‌ప్లాన్‌లన్నింటినీ కలిపి సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం గత సంవత్సరమే ప్రణాళిక రూపొందించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ మహానగరాన్ని ప్రపంచంలోని 10 అగ్రగామి గ్లోబల్ నగరాల పక్కన నిలిపే లక్ష్యంతో రీజనల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా అభివృద్ధికి అనుగుణంగా మెగామాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ మహానగర పరిధి 7,257 చదరపు కిలోమీటర్ల నుంచి 10,472.723 చదరపు కిలోమీటర్లకు పెరిగిన సంగతి తెలిసిందే. నగరం చుట్టూ సుమారు 354 కిలోమీటర్ల పరిధిలో నిర్మించనున్న రీజనల్ రింగ్ రోడ్డు వరకు అభివృద్ధి ప్రణాళికల కోసం హెచ్ఎండీఏ కసరత్తు చేపట్టింది.

మూడు విభాగాలుగా...

- మెగామాస్టర్‌ప్లాన్ మూడు విభాగాలుగా ఉంటుంది.
- మొదటిది ఆర్థిక మండళ్లు, పారిశ్రామిక ప్రాంతాలు, అంతర్జాతీయ బహుళ జాతి సంస్థల వ్యాపార కార్యకలాపాల విస్తరణ కోసం ఆర్థికాభివృద్ధి ప్రణాళిక (ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్లాన్)గా నిర్ణయించారు.
- రెండోది హైదరాబాద్ మెట్రో ఏరియా వరకు రహదారులు, మౌలిక సదుపాయాలు, ప్రజారవాణా సదుపాయాల విస్తరణ కోసం కాంప్రహెన్సివ్ మొబిలిటీప్లాన్‌ను రూపొందించారు.
- జలవనరులు, అర్బన్‌ఫారెస్టులు, పచ్చదనం అభివృద్ధి లక్ష్యంగా మూడో ప్రణాళిక బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్‌ను ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే ఈ మూడింటిపైన ముసాయిదా ప్లాన్ వెలువడనుంది.

హెచ్ఎంఏ డెవలప్‌మెంట్ ప్లాన్.....

- హెచ్ఎండీఏ పరిధి విస్తరణతో ప్రస్తుతం 11 జిల్లాలు కొత్త మెగా మాస్టర్ ప్లాన్‌లో భాగం పచుకోనున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లోని 104 మండలాలు, 1355 గ్రామాలతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్ఎంఏ) ఏర్పడింది.
- హెచ్ఎంఏ ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై అధ్యయనం చేసి సమగ్రమైన ప్రాజెక్టు నివేదికను అందజేసేందుకు ప్రభుత్వం క్రిసిల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేసింది. గత సంవత్సరం మార్చిలో ఈ సంస్థకు బాధ్యతలను అప్పగించారు. ఎకనమిక్ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై అధ్యయనం కోసం సుమారు రూ.1.35 కోట్లు కేటాయించారు. ప్రపంచంలోని పది ప్రముఖ నగరాల సరసన హైదరాబాద్‌ను నిలబెట్టేందుకు అమలు చేయవలసిన భవిష్యత్తు ఆర్థిక ప్రణాళికలపైన క్రిసిల్ అధ్యయనం చేసి నివేదికను అందజేయాల్సి ఉంది.
- సర్కార్ విజన్, లక్ష్యాలు, ప్రాధాన్యతలు, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు, పెట్టుబడులు, ఏయే రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయనే అంశాలపైన ఈ అధ్యయనం కొనసాగుతోంది. ప్రస్తుతం ఇది తుది దశకు చేరుకుందని, త్వరలోనే ముసాయిదా నివేదికను అందజేసే అవకాశం ఉందని హెచ్ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు.

జలవనరులు, పచ్చదనం పరిరక్షణ...

- బ్లూ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్ కోసం ఎస్‌సీపీఈ కన్సల్టెన్సీని ప్రభుత్వం ఎంపిక చేసింది. సుమారు రూ.3.44 కోట్లతో ఆ సంస్థ ముసాయిదా ప్రాజెక్టును దక్కించుకుంది. గత సంవత్సరం మార్చి నుంచి 9 నెలల వ్యవధిలో ప్రాజెక్టు నివేదికను అందజేయవలసి ఉండగా ప్రస్తుతం తుదిదశ అధ్యయనం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.
- బ్లూన్‌గ్రీన్ ప్రణాళికలో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్ఎంఏ) వరకు చెరువులు, కుంటలు, తదితర నీటివనరులను గుర్తించి వాటి పరిరక్షణకు చేపట్టవలసిన చర్యలను ఈ ప్రాజెక్టులో సూచిస్తారు. ఇందుకోసం స్పష్టమైన కాంటూర్ సర్వే కొనసాగుతోంది.
- అలాగే భవిష్యత్తులో నగరానికి వరదముప్పు రాకుండా చేపట్టవలసిన కార్యక్రమాలను కూడా ఇందులో పొందుపరుస్తారు. అర్బన్‌ఫారెస్టుల అభివృద్ధి, లేక్‌ఫ్రంట్ సుందరీకరణ, పచ్చదనం పెంపు వంటి లక్ష్యాలతో 2050 నాటి వరకు హైదరాబాద్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ బ్లూగ్రీన్ ప్రాజెక్టును రూపొందించనున్నారు.

కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ ఇలా....

- జాతీయ పట్టణ రవాణా పాలసీకి అనుగుణంగా భవిష్యత్తులో ప్రజారవాణా సదుపాయాలు, రహదారులు, మెట్రో వంటి ప్రాజెక్టుల విస్తరణ లక్ష్యంగా కాంప్రహెన్సివ్ మొబిలిటీప్లాన్ (సీఎంపీ)ని సిద్ధం చేయనున్నారు.
- సుమారు రూ.5.59 కోట్లతో లీ అసోసియేషన్ ఈ ప్రాజెక్టు ముసాయిదాను రూపొందించనుంచి. గతేడాది మార్చిలోనే ఈ ప్రాజెక్టు ఆరంభమైంది. 12 నెలల్లో నివేదికను అందజేయవలసి ఉండగా, ఇప్పటి వరకు 2050 నాటికి మెట్రోరైలుకు ట్రాఫిక్ డిమాండ్ ఏ స్థాయిలో ఉండనుందనే అంశంపైన నివేదికను అందజేశారు. దాని ఆధారంగానే రెండో దశకు ప్రణాళికలను సిద్ధం చేశారు.
- త్వరలో సీఎంపీ తుది నివేదిక వెలువడనుంది.

సన్న బియ్యం పంపిణీపై

సందిగ్ధం!

జీహెచ్ఎంసీ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు

- ఇప్పటికే రేషన్ షాపులకు చేరిన సన్నబియ్యం కోటా
- అందుబాటులో దొడ్డు బియ్యం నిల్వలు కూడా
- గ్రేటర్‌లో12.56 లక్షలపైనే లబ్ధి కుటుంబాలు
- ఎన్నికల కమిషన్ అనుమతి కోరిన పౌరసరఫరాల శాఖ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీపై సందిగ్ధత నెలకొంది. జీహెచ్ఎంసీలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు ఉండటంతో సన్నబియ్యం పంపిణీపై స్పష్టత లేకుండా పోయింది. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ కోటా నుంచి సన్నబియ్యం పథకం అమలు కానుంది. అయితే బియ్యం పంపిణీ నిరంత ప్రక్రియ అయినప్పటికీ ఏప్రిల్ కోటా నుంచి బియ్యం కేటగిరి మారుతుండటంతో ఎన్నికల కోడ్ నేపథ్యంలో సన్నబియ్యం పంపిణీపై పౌరసరఫరాల శాఖ ఎన్నికల కమిషన్‌కు అనుమతి కోరింది. ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా అమలు తలపెట్టిన సన్న బియ్యం పంపిణీ ఏప్రిల్ కోటా నుంచి అమలు చేయాలా? లేక ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎప్పటి మాదిరిగా దొడ్డు బియ్యం పంపిణీ చేయాలా? స్పష్టత ఇవ్వాలని కోరింది. అయితే ఇప్పటి వరకు ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. దీంతో ఎన్నికల కమిషన్ నుంచి స్పష్టత వచ్చే వరకు ఏప్రిల్ బియ్యం పంపిణీ ప్రారంభించవద్దని పౌరసరఫరాల శాఖ అధికారులు డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రేషన్ షాపులకు ఏప్రిల్ కోటా కింద సన్నబియ్యం సరఫరా పూర్తయింది. మరోవైపు దొడ్డు బియ్యం నిల్వలు కూడా అందుబాటులో ఉంచింది. దీంతో గ్రేటర్ పరిధిలో బియ్యం పంపిణీ కొద్దిగా ఆలస్యంగా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

43.39 లక్షల లబ్ధిదారులు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పౌరసరఫరాల పరిధిలో సుమారు 12,56,803 ఆహార భద్రత (రేషన్) కార్డులు ఉండగా, అందులో సుమారు 43,39,887 మంది లబ్ధిదారులు ఉన్నారు. అందులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలోని తొమ్మిది సర్కిల్స్‌లో 6,39,337 కార్డులు, అందులో 22,98,644 లబ్ధిదారులు ఉన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని రెండు సర్కిల్స్‌లో 3,85,386 కార్డులు, 12,84,143 లబ్ధిదారులు, సంగారెడ్డి జిల్లాలోని రెండు సర్కిల్స్‌లో 22,286 కార్డులు, 74,506 యూనిట్లు, రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఒక సర్కిల్‌లో 2,09,894 కార్డులు, 6,82,594 మంది లబ్ధిదారులు ఉన్నారు.

సన్న బియ్యం కేటాయింపు

గ్రేటర్ పరిధిలో రేషన్ షాపులకు సుమారు 2,73,320 క్వింటాళ్లు సన్న బియ్యం కోటా సరఫరా అయింది. అందులో హైదరాబాద్ పరిధిలో 1,44,105 క్వింటాళ్లు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 78,612 క్వింటాళ్లు, రంగారెడ్డి జిల్లా పరిధిలో 41,862, సంగారెడ్డి అర్బన్ పరిధిలో 87,405 క్వింటాళ్లు బియ్యం కేటాంచినట్లు పౌరసరఫరాల అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

> **ఎన్నికల కమిషన్ అనుమతి కోరాం**
>
> జీహెచ్ఎంసీలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా రేషన్ షాపుల్లో అమలు తలపెట్టిన సన్న బియ్యం పంపిణీపై ఎన్నికల కమిషన్ అనుమతి కోరుతూ లేఖ రాశాం. ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదు. ఏప్రిల్ కోటా కింద ఇప్పటికే రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా చేశాం. అలాగే దొడ్డు బియ్యం నిల్వలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఎన్నికల కమిషన్ నిర్ణయం బట్టి బియ్యం పంపిణీ చేస్తాం.
>
> – రమేశ్, జిల్లా పౌరసరఫరాల అధికారి, హైదరాబాద్

చేయని రికవరీని తామే చేశామంటూ బిల్డప్

- తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిర్వాకం
- ఇటీవల డీపీ ఫ్రాడ్‌లో రూ.1.95 కోట్లు కోల్పోయిన కంపెనీ
- ఫిర్యాదు అందడంతోనే స్పందించిన సిటీ పోలీసులు
- ఆ మొత్తం నేరగాళ్లకు చేరకుండా ఎన్సీఆర్పీతో చర్యలు
- ఆనక విషయం తెలుసుకున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- ఆ ఫ్రీజింగ్ తామే చేసినట్లు పత్రికా ప్రకటన విడుదల
- విషయం తెలిసి ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు

'క్రెడిట్' క్రైమ్!



సాక్షి, సిటీబ్యూరో: ఏదైనా పని తాను చేయకుండా చేసినట్లు చూపిస్తే చట్ట ప్రకారం నేరమే అవుతుంది. దీనికోసం డాక్యుమెంట్లు సైతం సృష్టిస్తే వంద శాతం క్రైమే. ఇలాంటి పని సాధారణ వ్యక్తులు చేస్తే పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటారు. పోలీసు శాఖలో అంతర్భాగంగా ఉన్న ప్రత్యేక విభాగం చేస్తే... ఇటీవల సరిగ్గా ఇదే జరిగింది. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు పూర్తి ఆధారాలు సేకరించారు. ఆ ప్రత్యేక విభాగంలో బాధ్యులను తీవ్రంగా మందలించారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) మధ్య గత వారం జరిగిన ఈ వివాదానికి సంబంధించిన అంశాలిలా...

డీపీ ఫ్రాడ్‌లో నష్టపోయిన కంపెనీ...

పంజగుట్ట కేంద్రంగా కార్యకలాపాలు సాగించే పీవీఆర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థకు పూండ్ల వెంకు రెడ్డి సీఎండీగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 12న పీవీఆర్ సంస్థలో పని చేసే ఉద్యోగి ఎం.అశోక్ కుమార్‌కి సీఎండీ డిస్‌ప్లే పిక్చర్‌తో (డీపీ) ఉన్న కొత్త నెంబర్ నుంచి వాట్సాప్ సందేశాలు వచ్చాయి. డీపీ చూసిన అశోక్ ఆ సందేశాలు తన సీఎండీ పంపుతున్నట్లు



ఈ నెల 18న సిటీ సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్

భావించారు. మరుసటి రోజు అదే నెంబర్ నుంచి కొత్త ప్రాజెక్టు కోసం తాను సూచించిన సింగపూర్ బ్యాంకు ఖాతాకు రూ.1.95 కోట్లు బదిలీ చేయాల్సిందిగా మరో సందేశం వచ్చింది. ఇది చూసిన అశోక్



ఈ నెల 14న సైబర్ సెక్యూరిటీ బ్యూరో జారీ చేసిన పత్రికా ప్రకటన

తన సహచర ఉద్యోగి హరి ప్రసాద్‌తో సంప్రదించారు. ఆయన కూడా ఆ సందేశం తన సీఎండీ నుంచే వచ్చినట్లు భావించారు. వీరిద్దరూ కలిసి ఆ సందేశంలో ఉన్న ప్రకారం సింగపూర్ బ్యాంకు ఖాతాకు రూ.1.95 కోట్లు ఆ రోజు మధ్యాహ్నం 1.02 గంటలకు బదిలీ చేశారు. మరోసారి రూ.1.2 కోట్లు పంపాల్సిందిగా మరో సందేశం అశోక్‌కు వచ్చింది. దీంతో అనుమానించిన ఆయన విషయాన్ని హరిప్రసాద్ ద్వారా సీఎండీ దృష్టికి తీసుకువెళ్లారు. ఫలితంగా సైబర్ నేరగాళ్ల సీఎండీ ఫొటోను డీపీగా పెట్టి మోసం చేశారని తేలింది.

తక్షణం స్పందించిన సిటీ సైబర్ కాప్స్...

ఈ విషయం తెలియడంతోనే అప్రమత్తమైన అశోక్, హరి ప్రసాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఆశ్రయించారు. కేసు నమోదు కంటే బాధితుల సొమ్ము పరిరక్షించడానికే ప్రాధాన్యం ఇచ్చిన అధికారులు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో (ఎన్సీఆర్పీ) ఈ విషయం పొందుపరిచారు. బాధిత కంపెనీ ఖాతా ఉన్న కొటక్ బ్యాంక్‌తో పాటు ఆ నగదు సింగపూర్ చేరే వరకు ఎక్కడెక్కడకు వెళ్తాయో...అన్ని బ్యాంకుల్నీ సంప్రదించారు. కొన్ని గంటల్లోనే మొత్తం రూ.1.95 కోట్లు సైబర్ నేరగాళ్లకు చేరకుండా ఫ్రీజ్ చేయించారు. ఈ నేరానికి సంబంధించి నమోదైన కేసు విచారణలో ఎలాంటి ఇక్కట్లు రాకుండా ఉండటానికి సీఎండీ లేదా ఈడీ నుంచి ఫిర్యాదు తీసుకోవాలని భావించారు. వాళ్లిద్దరూ అందుబాటులో లేకపోవడంతో 18వ తేదీ వరకు కేసు నమోదు ప్రక్రియను ఆపారు. ఇలా అనేక కేసుల్లో సైబర్ క్రైమ్ పోలీసులు నగదు ఫ్రీజ్ చేయిస్తున్నారు. ఆ మొత్తం కోర్టు ద్వారా బాధితులకు అందిన తర్వాతే ప్రకటన విడుదల చేస్తున్నారు.

క్రెడిట్ కొట్టేయాలని భావించిన టీజీసీఎస్‌బీ...

ఒక్కో సైబర్ నేరానికి ఒక్కో టిక్కెట్ నెంబర్ ఇస్తుంటారు. టీజీసీఎస్‌బీకి రాష్ట్రంలో నమోదయ్యే ప్రతి సైబర్ క్రైమ్ వివరాలతో పాటు దాని స్టేటస్ తెలుసుకునే అవకాశం ఉంది. ఇలానే ఈ నెల 14న రూ.1.95 కోట్ల ఫ్రీజింగ్ విషయం వీరికి తెలిసింది. ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్ పోలీసుల పనితీరును ఫ్రీజింగ్-రిఫండ్ ఆధారంగానే లెక్కిస్తున్నారు. దీంతో ఈ క్రెడిట్ కోట్టేయాలని భావించిన టీజీసీఎస్‌బీ అధికారులు ఆ ఫ్రీజింగ్ మొత్తం తామే చేసినట్లు ఓ టిక్కెట్ నెంబర్ సృష్టించారు. అప్పటికే ఉన్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల టిక్కెట్‌లో మార్పులు చేస్తూ.. కోల్పోయిన మొత్తాన్ని రూ.1.95 కోట్ల నుంచి రూ.1.95గా మార్చారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధన ప్రకారం రూ.లక్ష కంటే తక్కువ మొత్తంలో ముడిపడి ఉన్న నేరాలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేయరు. క్రెడిట్ కాంక్షలో ఉన్న టీజీసీఎస్‌బీ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఆ రూ.1.95 కోట్లు తమ శ్రమ వల్లే ఫ్రీజ్ అయ్యాయని, త్వరలోనే బాధితులకు తిరిగి ఇస్తామంటూ 14వ తేదీ సాయంత్రం ప్రకటన విడుదల చేశారు.

కంగుతిన్న సైబర్ క్రైమ్ పోలీసులు...

మరుసటి రోజు మీడియా ద్వారా ఈ విషయం తెలుసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కంగుతిన్నారు. తాను చేసిన పనిని, కేవలం తమ చేతిలో ఉన్న సాంకేతిక ఆధారంగా తెలుసుకున్న టీజీసీఎస్‌బీ వారి ఖాతాలో వేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఈ విషయాన్ని పూర్తి ఆధారాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఫిర్యాదు వచ్చిన సమయం, ఎన్సీఆర్పీలో నమోదు, బ్యాంకులతో సంప్రదింపులు, ఫ్రీజింగ్ ఖరారు ఇలా ప్రతి రికార్డును పరిగణలోకి తీసుకున్న ఉన్నతాధికారులు సైబర్ సెక్యూరిటీ బ్యూరో వ్యవహారాన్ని తప్పుపట్టారు. మరోసారి ఇలాంటివి పునరావృతం చేయద్దంటూ హెచ్చరించారు.


పంజగుట్ట చౌరస్తాలో బస్సుల కోసం ఎండలోనే వేచిచూస్తున్న ప్రయాణికులు

మండే ఎండలోనే..!

- షెల్టర్లు లేక బస్టాపుల్లో ప్రజల తిప్పలు
- ఉన్న చోటా కప్పుల్లేక ఎండకు మాడుతున్న ప్రయాణికులు

ఏసీ బస్‌షెల్టర్ ఇలా...

ఇది సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని ఏసీ బస్‌షెల్టర్‌లోని దృశ్యం. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, మీడియాలో వెలువడిన కథనాలతో ఏసీ బస్ షెల్టర్లలో ఏసీలు పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. కానీ.. ఈ షెల్టర్‌లో ఏసీ పనిచేయడం లేదు. ఇలాగే ఇంకొన్ని. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు కనీసం బస్టాపుల్లో నిలువనీడనైనా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



సాక్షి, సిటీబ్యూరో: పంజగుట్ట బస్టాప్... ఇది నగరంలో అత్యధిక రద్దీ ఉండే కూడళ్లలో ఒకటి. బంజారాహిల్స్, మాసబ్ ట్యాంక్, మెహిదీపట్నం వైపు వెళ్లే బస్సుల కోసం ఎదురు చూస్తున్న వారు. ఎప్పుడూ ఎందరో ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూసే ఇక్కడ కనీసం బస్‌షెల్టర్ లేదు. వేసవి ప్రారంభంలోనే భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎలాంటి నీడ లేకపోవడంతో మండుటెండల్లోనైనా, వర్షాలు పడే సమయంలోనైనా ఎండకు ఎండాల్సిందే. వానకు తడవాల్సిందే. డివైడర్‌కు అటు వైపు బేగంపేట, సికింద్రాబాద్, ఈసీఐఎల్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఆగుతాయి. ఆవైపునా ఇదే దుస్థితి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన జంక్షన్‌లో రెండు వైపులా ఇదీ పరిస్థితి. బస్‌షెల్టర్లలో ఏసీలతో సహా సకల సదుపాయాలు కల్పిస్తున్నామని, త్వరలోనే ప్రజలు తమ ఫోన్ నుంచే నేరుగా క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేస్తే సమస్య తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తామని, ఏ బస్సు ఎక్కడ ఉందో, ఎంత సమయంలో బస్టాప్‌కు చేరుతుందో కూడా తెలుసుకునేలా బస్టాపుల షెల్టర్లలో సకల సదుపాయాలు కల్పిస్తామని చెబుతున్న అధికారులు.. అవి అందుబాటులోకి వచ్చేసరికి ఎంత కాలమవుతుందో చెప్పలేం. ఇలాంటి ప్రకటనలు ఏళ్ల తరబడిగా ప్రజలు వింటూనే ఉన్నారు. వారు చెప్పిన సదుపాయాల కల్పనకు సైతం ఇంకా టెండర్ల ప్రక్రియే పూర్తి కాలేదు. ఆ సదుపాయాల సంగతటుంచి నిలువ నీడ కూడా లేని ప్రాంతాల్లో కనీసం నీడనివ్వమని ప్రయాణికులు కోరుతున్నారు. ఇక కొన్ని ప్రాంతాల్లో బస్‌షెల్టర్లున్నా కప్పుల్లేక అదే పరిస్థితి. కనీసం అక్కడ నిలబడేందుకు కాసింత చోటైనా ఉంటుంది. కానీ ఇలాంటి ప్రాంతాల్లోనే రోడ్ల పైనే పడిగాపులు. బస్సెక్కే ప్రయాణికులు తక్కువగా కానీ, అసలేకానీ ఉండని ప్రాంతాల్లో మాత్రం రాత్రిళ్లు జిగేల్‌మనే ప్రకటనలు వెదజల్లే బస్‌షెల్టర్లు ఉన్నా.. తమకేమీ అభ్యంతరం లేదు కానీ, కనీసం ఎక్కువ మంది వేచి చూసే ప్రాంతాల్లో నీడనైనా కల్పించాలని కోరుతున్నారు. అసలు బస్‌షెల్టర్లే లేని ప్రాంతాలు నగరంలో ఎన్నున్నాయో కూడా సంబంధిత అధికారులకే తెలియాలి.

సైబర్ భద్రతపై అలర్ట్!

- విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు శిక్షణ
- హెచ్‌సీయూ, ఓయూ, జేఎన్‌టీయూ వంటి వర్సిటీలలో ఆన్‌లైన్ కోర్సులు

సాక్షి, సిటీబ్యూరో: రోజురోజుకూ సైబర్ మోసాలు పెను సవాల్‌గా మారుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం, పోలీసులు సైబర్ మోసగాళ్ల పనిపడుతుంటే.. మరోవైపు రోజుకో రకం మోసాలతో వారికే సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నతనం నుంచే సైబర్ మోసాలు, నియంత్రణ, భద్రత, చట్టాలపై అవగాహన కల్పించుకోవడం అనివార్యం. దీంతో కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ వంటి పలు విశ్వవిద్యాలయాలు సైబర్ భద్రతపై ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాయి. విద్యార్థులు, మహిళలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నాయి. దీంతో సైబర్ భద్రతపై నైపుణ్యత సాధించుకుంటే.. సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కకుండా రక్షించుకోవచ్చు.

- ఈ రోజుల్లో సెల్‌ఫోన్, ఇంటర్నెట్ వినియోగించని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను వినియోగిస్తున్నప్పుడు సైబర్ నేరస్తులు పంపుతున్న లింకులు, ప్రమాదకర వైరస్‌ల బారి నుంచి కాపాడుకునేందుకు జేఎన్టీయూ హైదరాబాద్ సైబర్ భద్రతపై ప్రత్యేక కోర్సు ప్రవేశ పెట్టింది.
- ఇంజినీరింగ్ విద్యార్థులు, వృత్తినిపుణులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులకు నాలుగు వారాలపాటు ఆన్ లైన్‌లో శిక్షణ ఇస్తుంది.
- దైనందిన వ్యవహారాల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఉపకరణాలలో కొత్త ప్రోగ్రామ్‌లు, ఆప్లికేషన్లను ప్రవేశపెట్టకముందే.. ఆయా ప్రోగ్రామ్‌లు, అప్లికేషన్లలోని లోపాలను గుర్తించి అవి వైరస్ దాడులను సైబర్ భద్రత తట్టుకునేలా కోర్సులో చేరిన వారికి నేర్పించనున్నారు.



దాడులను ముందే గుర్తిస్తే...

నిత్యావసర వస్తువుల నుంచి ఐపీఎల్ టికెట్ల వరకు ఆన్‌లైన్‌లోనే కొంటున్నాం. కోట్ల మంది వినియోగిస్తున్న యాప్‌లు, ఇతర అప్లికేషన్లు భద్రతపరంగా సురక్షితంగా ఉన్నా.. ఆన్‌లైన్‌లో ఏదైనా వస్తువు కొన్న వెంటనే.. భారీ బహుమతులు, రాయితీలంటూ సెల్‌ఫోన్‌కు, ఈ-మెయిల్స్‌కు మెసేజ్‌లు వస్తున్నాయి. వీటిని క్లిక్ చేస్తే సైబర్ నేరస్తుల బారిన పడినట్టే.

- ఈ ముప్పు ముందే గుర్తించి కొత్త అప్లికేషన్లు, ప్రోగ్రామ్‌లలో సైబర్ నేరస్తుల బారినపడే అవకాశాలు ఎక్కడున్నాయి? తదితర అంశాలను సైబర్ భద్రత కోర్సుల్లో శిక్షణ పొందుతున్న వారికి నేర్పిస్తారు. ఓయూ, హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ ప్రొఫెసర్లతో పాటు సైబర్ భద్రతపై పరిశోధనలు నిర్వహించి నిపుణులతో ఆన్‌లైన్‌లో పాఠాలు చెబుతున్నారు.

ప్రత్యేక పరికరాలు...


సైబర్ భద్రత కోర్సుల్లో ప్రధానంగా దాడులు, వైరస్‌ల తీవ్రతను గుర్తించడం, వాటి బారిన పడకుండా ఏఏ చర్యలు చేపట్టాలన్న అంశాల పైనే వృత్తి నిపుణులు శిక్షకులకు బోధిస్తున్నారు.

- నాలుగైదు ప్రోగ్రామ్‌లు, అప్లికేషన్లను ప్రయోగాత్మకంగా పరిశీలించి వాటిలో వైరస్‌లు, సైబర్ దాడులకు అనుకూలమైనవేవైనా ఉన్నాయా? అని గుర్తించేందుకు సాఫ్ట్‌వేర్ పరికరాలు, పనిముట్లతో శిక్షణ ఇస్తున్నారు. సాంకేతిక పరిభాషలో ఎన్ మ్యాప్, వైర్ షార్క్, మెటా స్ప్లాయిట్, బర్స్ సూట్ వంటి పనిముట్లను వినియోగిస్తున్నారు. న్యాయపరమైన, నైతిక అంశాలను పరిగణలోకి తీసుకుని వాటిని కూడా పరిశీలిస్తున్నారు.

నాలుగు పోస్టులు.. ఒక్కరే అధికారి!

ఖాళీగా పలు పోస్టులు

- పదేళ్లుగా నియామకాలు నిల్
- 40 మంది పని చేయాల్సిన చోట 15 మందే...
- సీఈఐజీ గుప్పిట్లోనే కీలక పోస్టులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి కార్యాలయంలో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. పదేళ్లుగా కొత్త నియామకాలు లేకపోవడం, ఉన్నవాళ్లకు పదోన్నతులు రాకపోవడంతో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ గవర్నమెంట్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ హైదరాబాద్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రూరల్, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ నిజామాబాద్ పోస్టుల్లో ఒక్కరే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇప్పటికే ఉన్న 17,130 హెచ్‌టీ కనెక్షన్లకు పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహించడంతోపాటు కొత్తగా పుట్టుకొచ్చే చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమలు, సినిమా థియేటర్లు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, హోటల్స్, ఐటీ, అనుబంధ సంస్థల కార్యాలయాలు, క్రషర్ మిషన్లు, రెడీమిక్స్ ప్లాంట్లు, గృహ, వాణిజ్య బహుళ అంతస్తుల భవన సముదాయాలను తనిఖీ చేసి వాటికి అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది.

- కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండటం, ఒక్కరే ఈ బాధ్యతలన్నీ నిర్వర్తించాల్సి రావడంతో అనుమతుల జారీలో తీవ్ర జాప్యం చోటు నెలకొంటోంది.

అడ్డుకుంటూ.. అడ్డగోలుగా సంపాదిస్తూ...

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ హైదరాబాద్ పరిధిలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలు ఉంటాయి. డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రూరల్ పరిధిలో మెదక్, ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ నిజామాబాద్ పరిధిలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలు ఉన్నాయి.

- 2014 నుంచి కొత్త నియామకాలు లేకపోవడంతో 15కు పైగా ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 11 కేవీ కనెక్షన్లు 16,140 వరకు ఉండగా, 33 కేవీఏ కనెక్షన్లు 883 వరకు ఉన్నాయి. 132కేవీ కనెక్షన్లు 107 వరకు ఉన్నాయి. మెజార్టీ కనెక్షన్లు గ్రేటర్ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్లలో భాగంగా ఒక్కో అధికారి రోజుకు సగటున 50 కనెక్షన్లను తనిఖీ చేయాల్సి వస్తోంది. వీటితో పాటు కొత్త వాటికి అనుమతులు జారీ చేయాలి. కొంత మంది అధికారులు ఒకే చోట ఏళ్లుగా పాతుకుపోయారు. సమాన కేడర్‌లో పని చేస్తున్న తోటి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి, పోస్టులు కట్టబెట్టే అవకాశం ఉన్నా.. తమకున్న ఆర్థిక పలుకుబడితో వాటికి అడ్డుపడుతున్నట్లు తెలిసింది. ఫలితంగా కొత్తవాళ్లకు అవకాశాలు లేకుండా పోతుండటంతో పాటు ఏళ్లుగా పాతుకు పోయి వాళ్ల అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

థర్డ్‌పార్టీ నివేదికలను గుడ్డిగా అనుసరిస్తూ...

విద్యుత్ పనుల్లో నాణ్యత ప్రమాణాల పెంపు, ప్రమాదాల నియంత్రణ కోసం ప్రభుత్వం విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి విభాగాన్ని ఏర్పాటు చేసింది. 75 కేవీఏ సామర్థ్యం దాటిన ఏదైనా బహుళ అంతస్తుల భవనం సహా పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్లను జారీ చేయాలంటే ముందు ఈ సీఈఐజీ అనుమతి తప్పని సరి. అధికారులు తమ తనిఖీల్లో భాగంగా ఎర్తింగ్, వైరింగ్, బ్రేకర్స్ పని తీరు, షార్ట్ సర్క్యూట్ ప్రొటెక్షన్స్, లైటింగ్ ఎరిస్టర్స్ ఎర్తింగ్, హెచ్‌టీ, ఎల్టీ ప్రొటెక్షన్స్, ట్రాన్స్‌ఫార్మర్ ప్రైమరీ, సెకండరీ ప్రొటెక్షన్స్‌ను పరిశీలించాల్సి ఉంది.

- ఐఎస్ఐ ప్రమాణాల మేరకు ఆయా సాంకేతిక పరికరాలను, కేబుళ్లు, స్విచ్ బోర్డులు వాడారా లేదో? పరిశీలించాలి. నిర్దేశిత ప్రమాణాల మేరకు అన్నీ ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాతే ఆయా భవనాలు, పరిశ్రమలకు అనుమతులు జారీ చేయాల్సి ఉటుంది. అయితే సిబ్బంది కొరత వల్ల థర్డ్‌పార్టీ సమర్పించిన నివేదికను గుడ్డిగా అనుసరిస్తున్నారు. క్షేత్రస్థాయి వరకు వెళ్లినా.. కారు దిగకుండానే ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు.

పెట్టుబడుల పేరుతో మోసం

మళ్లీ అరెస్టయిన వ్యాపారవేత్త తొనంగి కాంతిదత్

బంజారాహిల్స్: ప్రముఖ వ్యాపారవేత్త తొనంగి కాంత్‌దత్‌ను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. గతంలో ఒకసారి సంతకాల ఫోర్జరీ కేసులో అరెస్టయిన కాంతిదత్‌ను మరోసారి పెట్టుబడుల పేరుతో మోసం చేసిన కేసులో సీసీఎస్–ఈఓడబ్ల్యూ ఎస్ఐ అనిల్ కుమార్ నేతృత్వంలో కాంత్‌దత్‌ను శనివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయనపై నగరంలోని వివిధ ప్రాంతాల్లో అనేక కేసులు నమోదయ్యాయి. 2024 డిసెంబర్‌లో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కాంతిదత్‌పై మొదటి కేసు నమోదైంది.

- 'త్రితీయా ఫైన్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్' సహ వ్యవస్థాపకురాలు తిప్పల శ్రీజ ఫిర్యాదుతో సంతకాలు ఫోర్జరీ చేసి కంపెనీ నుంచి ఆమెను బహిష్కరించాడనే ఆరోపణలపై ఆయనను అరెస్టు చేశారు. శ్రీజ కంపెనీలో సుమారు రూ. 2.5 కోట్లు పెట్టుబడి పెట్టగా, కొన్ని వారాల్లోనే కాంతిదత్ నకిలీ పత్రాలతో ఆమె స్థానంలో తన తల్లి తొనంగి శ్రీదేవిని నియమించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- ఈ వ్యవహారం తర్వాత 2025 ఫిబ్రవరిలో నగరానికి చెందిన జూపల్లి సౌజన్య అనే మహిళ ఫిర్యాదు మేరకు సీసీఎస్‌లో మరో కేసు నమోదైంది. తప్పుడు హామీలతో ఆమె నుంచి రూ. 4.3 కోట్లు నుంచి రూ. 4.5 కోట్లు తీసుకుని వ్యాపార విస్తరణ పేరుతో మోసం చేశాడని ఆరోపించారు.
- 'శ్రీ సమీర హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పీ' పేరుతో వ్యాపారం నడిపినట్టు చెప్పి పెట్టుబడిదారులను మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. 2019 నుంచి కాంతిదత్‌పై ఆర్థిక మోసాలకు సంబంధించి అనేక ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. 'సస్టెన్ కార్ట్ మార్కెట్ ప్లేస్' అనే కంపెనీని డిజైనర్ శిల్పారెడ్డితో కలిసి స్థాపించి, ప్రముఖ నటీమణులు కీర్తి సురేష్, కాజల్ అగర్వాల్, దేదస్రి నడెండ్ల వంటి సెలబ్రిటీల ద్వారా పెట్టుబడులను సేకరించాడు.



- అయితే 2023లో సంస్థ మూసివేయడంతో నిధుల మళ్లింపు ఆరోపణలు ఎదురయ్యాయి. తాజాగా అరెస్టయిన కాంతిదత్‌ను న్యాయపరమైన విచారణ కోసం రిమాండ్‌కు తరలించారు. పెట్టుబడులు పెట్టే ముందు పూర్తి పరిశీలన చేయాలని, కాంతిదత్ సంబంధిత మోసాలకు గురైన వారు సీసీఎస్‌ను సంప్రదించవచ్చని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి


స్వరూపారాణి (ఫైల్)

ఉప్పల్: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో రోడ్డు దాటుతున్న ఓ మహిళ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఉప్పల్ పోలీసుల సమాచారం మేరకు.. శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో స్టోర్ కీపర్‌గా పని చేస్తున్న మాగంటి స్వరూపారాణి(58) తన భర్త సురేందర్‌తో కలిసి బోడుప్పల్‌లో ఉంటున్నారు. వీరిది ధర్మాసాగర్ మండలం తాటికాయల గ్రామం. శనివారం డ్యూటీకి వెళ్లి తిరిగి వస్తూ ఉప్పల్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో ముషీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన స్వరూపారాణి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

చదువు ఇష్టం లేక..
ఫుట్ ఓవర్ బ్రిడ్జి నుంచి దూకి బలవన్మరణం

జీడిమెట్ల: చదువు ఇష్టం లేని ఓ యువకుడు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ సమాచారం మేరకు... ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన అల్లి రాంబాబు కుమారుడు సాయి ప్రకాష్(20) భద్రాచలంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సాయిప్రకాష్‌కు చదువుకోవడం ఇష్టం లేదు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సొంత ఊరికి వచ్చి తనకు చదువుకోడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెప్పాడు. అందుకు వారు వారిస్తూ చదువుకోవాలని కోరారు. లేదు నేను హైదరాబాద్ వెళ్లి ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటానని తెలిపాడు. వద్దని వారించిన వినకుండా హైదరాబాద్ వచ్చాడు. సాయి ప్రకాష్ జాడ తెలుసుకున్న తండ్రి శనివారం జీడిమెట్లకు వచ్చాడు. షాపూర్‌నగర్‌లో ఇద్దరు కలుసుకుని మట్లాడుతుండగానే సాయి ప్రకాష్ రాత్రి 10 గంటల ప్రాంతంలో షాపూర్‌నగర్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి కిందకు దూకాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తండ్రి సాయిప్రకాష్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్‌గా ప్రమీల



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీసెల్ మహిళా విభాగం కన్వీనర్‌గా జి.ప్రమీలను నియమిస్తూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా ఎస్సీ సెల్ విభాగం ఇన్‌చార్జి పెంటయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'విశ్వావసు'తో అభయం

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్


పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: విశ్వావసు నామ సంవత్సరం అభయం ప్రసాధిస్తుందని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. ఉగాది సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. ముందుగా స్వామి వారిని ఆలయ మండపంలో ఆసీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో పంచాంగం చదివి వినిపించారు. విశ్వావసు నామ సంవత్సరం ఏ విధమైన భయం లేకుండా అభయం ఇస్తుందన్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా పడకపోయినా అనావృష్టి మాత్రం ఉండదన్నారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉంటాయన్నారు.

బ్రహ్మోత్సవాల పత్రిక విడుదల

చిలుకూరు బాలాజీ దేవాలయం బ్రహ్మోత్సవాల పత్రికను ఆదివారం ఆలయ అర్చకులు ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణం అనంతరం స్వామివారి పాదాల వద్ద పత్రికను ఉంచి పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలతో కలిసి పత్రికను విడదలు చేశారు. ఏప్రిల్ 7 నుంచి 14 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని అర్చకుడు రంగరాజన్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సంతానం లేని మహిళలకు స్వామివారి గరుడ ప్రసాదం పంపిణీ ఈసారి ఉండదని స్పష్టం చేశారు. సంతాన భాగ్య ప్రసాదాన్ని మే నెల నుంచి ప్రతి శుక్రవారం పంపిణీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు బాలాజీ, కిట్టు, సురేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెండి నాగాభరణం బహూకరణ


శివాలయానికి నాగాభరణం అందచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి బాలాపూర్‌లో ప్రసిద్ధి చెందిన శివాలయానికి అదే గ్రామానికి చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జయమ్మ దంపతులు 1.255 కిలోల (రూ. 1.43 లక్షలు) కలిగిన వెండి నాగాభరణాన్ని కానుకగా ఆదివారం అందజేశారు. దాతతో పాటు వారి కుమారులు శివకాంత్‌రెడ్డి, స్వాతి, ఓంకాశీరెడ్డి, శ్రీజ దంపతులు శివుడికి అభిషేకం నిర్వహించి ఆలయ కమిటీ సభ్యులకు నాగాభరణం అందజేశారు. చాలా రోజుల నుంచి శివుడిని నమ్ముకున్నామని, అంతా మంచే జరుగుతుందని పేర్కొన్నారు. ఇంతుకు గాను తమ కానుకగా నాగాభరణం అందిస్తున్నామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతనర్సింహా రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర జైహింద్‌కుమార్, శివాలయ కమిటీ చైర్మన్ క్శెం శశిధర్‌రెడ్డి, అర్చకుడు దుర్గాప్రసాద్, ఆలయ కమిటీ డైరెక్టర్లు ఎక్క మాధవి శ్రీనివాస్, పగడాల ఉమేశ్, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, వంగేటి సుధాకర్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, జుకంటి సురేశ్‌గౌడ్, ఎక్క శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


కృతికను అభినందిస్తున్న మాజీ కార్పొరేటర్లు

గ్రూప్-1 ర్యాంకర్‌కు అభినందనలు

మీర్‌పేట: గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు సాధించిన మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన సిద్దాల కృతికకు ఆదివారం పలువురు అభినందనలు తెలిపారు. మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్‌యాదవ్, దోమలపల్లి ధనలక్ష్మి, బీఆర్ఎస్ నాయకుడు రాజ్‌కుమార్‌లు కృతికకు మిఠాయి తినిపించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యువతి తల్లిదండ్రులు బీరప్ప, లావణ్య ఉన్నారు.

భగీరథ మహర్షి సేవలు అమోఘం



ఫిలింనగర్: శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సరం(ఉగాది) సందర్భంగా ఫిలింనగర్‌లోని భగీరథ మహర్షి విగ్రహానికి సగర ఉప్పర సంఘం సభ్యులు పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా భగీరథుడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గుంటి వెంకటేషసాగర్, గుంటి నాగేష్‌సాగర్, దిగుళ్ల రవీందర్, పెద్దబూది తిరుపతయ్య, చీర్ల వెంకటయ్య, ఎస్.గోపీ, రవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పారిశుద్ధ్య కార్మికులకు ఉగాది కానుకలు అందిస్తున్న రవిశేఖర్‌రెడ్డి

వెంగళరావునగర్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కన్జ్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి తెలియజేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన వెంగళరావు నగర్ కాలనీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఉగాది కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం మన కోసం శ్రమిస్తున్న కార్మికులను గౌరవించాలని అన్నారు. కాంగ్రెస్ వెంగళరావునగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాణి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సన్నీగౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లేష్ గౌడ్, కుమారి, నాగరాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పంచెకట్టుతో వాకింగ్



కేబీఆర్ పార్కులో పంచెకట్టులో వాకింగ్ చేస్తున్న వాకర్లు

వెంకటేశ్వరకాలనీ: తెలుగుదనం ఉట్టిపడేలా.. తెలుగు పండుగల విశిష్టత అందరికీ తెలియజేసేలా కేబీఆర్ పార్కు వాకర్లు ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం పార్కులో పంచెకట్టులో వాకింగ్ చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫణీంద్ర మాట్లాడుతూ తెలుగు పండుగల విశిష్టతలను అందరికీ మరోసారి గుర్తు చేసేందుకు తాము ఇలా ప్రయత్నం చేశామని అన్నారు. పంచెకట్టులో ఉన్న వాకర్లతో పలువురు సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి కనబర్చారు.

హెచ్‌సీయూ విద్యార్థుల అరెస్టు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల దాడులు, అరెస్టుల అన్యాయమని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎస్ నాగేశ్వర్ రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం విక్రయించడాన్ని అడ్డుకుంటున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

బన్సీలాల్‌పేట్: టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సంస్థ మేనేజర్ మాల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిలైన వారు 18 నుంచి 27 ఏళ్ల వయస్సు ఉన్న యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. ట్యాలీ జీఎస్టీ, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్. కంప్యూటర్ బేసిక్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, టైపింగ్, ఇంటర్నెట్ కాన్సెప్ట్‌ల్లో 3 నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న భోలక్‌పూర్ ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీహాల్‌లోని అప్నా, టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ వృత్తి శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9154990133, 8498089786 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైభవంగా ఉగాది వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అన్ని ఆలయాల్లో ఉగాది పూజలు



దైవసన్నిధానంలో పంచాంగ శ్రవణం చేస్తున్న రాఘవశర్మ



బంజారాహిల్స్‌లోని శ్రీలక్ష్మి నర్సింహ స్వామి హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో



శ్రీనగర్ కాలనీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..



శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పచ్చడి పంపిణీ

బంజారాహిల్స్: శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెలుగు సంవత్సరాది నేపథ్యంలో అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం ఆలయంలో పంచాంగ శ్రవణం తర్వాత భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు నగర వ్యాప్తంగా పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయానికి దారి తీసే మార్గాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ఫిలింనగర్ దైవసన్నిధానంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆయన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితో పాటు సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ పాల్గొన్నారు. ఆలయంలో అర్చకులు రాఘవ శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. కొత్త ఏడాది తమ రాశుల పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున అవధానం, పంచాంగ శ్రవణం వేడుకల్లో పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో..



ఫిలింనగర్ దైవసన్నిధానంలో పూజల్లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దంపతులు

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై కేసు

వెంగళరావునగర్: ప్రేమించానని నమ్మించి పలుమార్లు లైంగికదాడి చేసి మోసం చేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ఓ యువతి తొమ్మిదేళ్ల క్రితం డిగ్రీ చదివేందుకు నగరంలోని బేగంపేటకు వచ్చింది. ఆ సమయంలో తన స్నేహితురాలి ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా గార్ల మండలానికి చెందిన భూక్యా వినోద్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి ఎనిమిది సంవత్సరాలుగా పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకోవాలని పలుమార్లు వేడుకున్నా దాటవేస్తూ వస్తున్నాడు. కొంతకాలంగా ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

వెంగళరావునగర్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. మధురానగర్–ఎస్ఆర్‌నగర్ ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఎన్.ప్రవీణ్‌కుమార్ అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. తాను ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు ఒప్పుకోవడంతో అతడి ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీం ఇండియా జెర్సీ ఆవిష్కరణ



కేశవరావు, మేయర్ విజయలక్ష్మిలకు జెర్సీని అందజేస్తున్న దేవరాజ్

బంజారాహిల్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సెక్రటరీ ఆర్.దేవరాజ్ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, విప్లవకుమార్‌ను ఆదివారం కలిశారు. భారత్ కెప్టెన్ రోహిత్‌శర్మ సంతకం చేసిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ–2025 టీం ఇండియా జెర్సీని అందజేశారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హెచ్‌సీఏ నిర్వహిస్తున్న ఐపీఎల్ మ్యాచ్‌లను సజావుగా నిర్వహించడంలో పూర్తి సహకారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, గౌరవ మేయర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి చేస్తున్న కృషితో పాటు కొత్త క్రికెట్ స్టేడియం కోసం భూమి కేటాయింపునకు జరుగుతున్న ప్రయత్నాలకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రారంభమైన ఉగాది నాటకోత్సవాలు

ఫిలింనగర్: ఉగాది పండుగ సందర్భంగా ఫిలిం చాంబర్ రామానాయుడు కళామండపంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఉగాది నాటకోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రంగస్థల నటులచే ఐదు రోజుల పాటు పాత్తూరి వెంకట సుబ్బారావు నిర్వహించే ఈ ఉగాది నాటకోత్సవాల్లో భాగంగా తొలి రోజు కళాకారులు శ్రీకృష్ణ తులాభారం నాటికను ప్రదర్శించారు. శ్రీవెంకటలక్ష్మీ దుర్గ నాట్యమండలి తెనాలి వారిచే నిర్వహించిన శ్రీకృష్ణ తులాభారం నాటిక ఆసక్తికరంగా సాగింది. అంతరించిపోతున్న రంగస్థల నాటికలను నేటి తరానికి పరిచయం చేసేందుకు ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు సుబ్బారావు తెలిపారు.



శ్రీకృష్ణ తులాభారం నాటకంలో కళాకారుల అభినయం

భక్తిశ్రద్ధలతో 'శ్రీరామ లిఖితం'



సనత్‌నగర్: సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం (సెవెన్ టెంపుల్స్) ప్రాంగణంలోని హనుమాన్ కళావేదిక వద్ద 'శ్రీరామ నామ లిఖితం' కార్యక్రమాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ దుస్తులతో పెద్ద సంఖ్యలో హాజరై శ్రీరామ నామం ఉచ్చరిస్తూ భక్తి తన్మయత్వంలో మునిగిపోయి శ్రీరామ నామ లిఖితం చేశారు.. అనంతరం పిల్లలకు ఆశీర్వచనం, ప్రసాద వితరణ చేశారు. సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ప్రతినిధి దండా బుచ్చిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆలయ ఈఓ సత్యనారాయణ, ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, శ్రీవిష్ణు సహస్రనామ సత్సంగ సభ్యులు హాజరయ్యారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



మాదాపూర్: ఉగాది పండుగను పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం సంపాదకులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సాగి కమలాకర శర్మ పంచాంగ పఠనం చేశారు. ఉగాది విశిష్టత, రుతువులు వాటి ప్రభావాలు, ద్వాదశ రాశుల ఆదాయ వ్యయాల గురించి వివరించారు. శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు పంచాంగ కర్తని సత్కరించారు. అపర్ణధూళిపాళ్ల శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకస్తుతి, నీలిమేఘ శరీర, బృందావన సారంగి తిల్లాన అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు ఆరుషి, శ్రీనిక, యామిని, సురభి, అనన్య, నిత్యశ్రీ, శ్రీకృతి ఉన్నారు.

ఉదయనగర్ బస్తీలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో బంజారాహిల్స్ ఎస్ఐ రవీందర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–11లోని ఉదయనగర్ బస్తీలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ ఎస్ఐ రవీందర్ హాజరై ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్, వెంకట్‌చారి, రాములు యాదవ్, శివ, బాలు, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని మాదిగ రీసెర్చ్ స్కాలర్స్ స్టూడెంట్స్ ఐక్య వేదిక కన్వీనర్ వలిగొండ నరసింహ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. జగ్జీవన్‌రామ్ నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీకి సాంప్రదాయ ఓటు బ్యాంక్‌గా మాదిగలు ఉన్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలను విస్మరించినందునే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారని తెలిపారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: క్రైస్తవులపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణ కల్పించాలని సామాజిక విప్లవకారుడు డా.ప్రేమ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఏపీలో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి దాడులను ప్రేరేపించే సంస్థలపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తున్న పాస్టర్లను మత ప్రచారకులుగా ముద్ర వేసి దూషించడం తగదని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితపై విమర్శలు తగవు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ జాగృతి అధినేత్రి, ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ నేతల విమర్శలు చేయడం తగదని ఓయూ జేఏసీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు డాక్టర్ కందుల మధు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ బిల్లుపై పోరాడిన కవితను ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించడం సిగ్గు చేటు అన్నారు. వెంటనే అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఏబీవీపీ నాయకులపై లాఠీచార్జి తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ భూముల వేలాన్ని అడ్డుకున్న ఏబీవీపీ నాయకులు, ఇతర విద్యార్థులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నగర కార్యదర్శి పృథ్వీతేజ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 60 ఏండ్లుగా ఎంతోమంది విద్యావంతులను అందించిన హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను కార్పొరేట్ శక్తులకు విక్రయించాలనుకోవడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం వర్సిటీల భూములు అమ్మడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. హెచ్‌సీయూలో ఇంచుభూమిని విక్రయించకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా ఆస్థానం వేడుకలు


బంజారాహిల్స్: ఉగాది పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీవారి ఆలయంలో ఆస్థానం వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రతియేటా ఉగాది సందర్భంగా స్వామివారికి నూతన పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ఆస్థానం వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఆరాధన, అక్షతారోపన, వస్త్ర సమర్పణ, అవధానం తదితర పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో..



ముగిసిన 'బర్డ్స్ ఐ వ్యూ'చిత్ర ప్రదర్శన



మాదాపూర్: యువ, అభివృద్ధి చెందుతున్న కళాకారుల కోసం నిధులు సమీకరించేందుకు బన్యాన్ ఆర్ట్ స్టూడియో ఆర్ట్ గ్యాలరీలో నిర్వహిస్తున్న 'బర్డ్స్ ఐ వ్యూ'చిత్ర ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. 40 మంది కళాకారులు వేసిన 100కి పైగా చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రత్యేక కళాకృతులతో పాటు అరుదైన సేకరణలు ప్రదర్శించారు.



మేధో వికాసానికి వేద గణితం దోహదం

బంజారాహిల్స్: విద్యార్థి దశలో వేద గణిత శాస్త్రం అభ్యాసం మేధో వికాసానికి దోహదం చేస్తుందని అబాకస్ శిక్షణ సంస్థ నిర్వాహకులు పరిమళ సూచించారు. ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులకు తాము ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఎంఎస్ఎంఈలో జరిగిన ఇంజినియం పాఠశాల చిన్నారుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వేద గణిత శాస్త్ర నిపుణులు సత్యదేవ్, సీనియర్ జర్నలిస్ట్ అద్దేపల్లి నరసింహరావు, పాఠశాల నిర్వాహకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చి కార్యక్రమానికి వన్నె తెచ్చారు.



కేక్ బాగా లేదన్నందుకు హోటల్ సిబ్బంది దాడి

రాంగోపాల్‌పేట్: కేక్ బాగా లేదన్నందుకు ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. శామీర్‌పేట్‌కు చెందిన శేఖర్ పని మీద సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చాడు. తన కుమార్తె పుట్టిన రోజు కావడంతో కేక్ తీసుకునేందుకు స్టేషన్ ఎదుట ఉన్న ఆల్ఫా హోటల్‌కు వచ్చాడు. అక్కడ కౌంటర్‌లో ఉండే వ్యక్తి కేక్ చూపించగా ఫ్రెష్‌గా లేదని శేఖర్ ప్రశ్నించాడు. దీంతో అక్కడే ఉన్న 10 మంది సిబ్బంది అతడిపై దాడి చేశారు. వెంటనే బాధితుడు మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన

మోతీనగర్: కాలానుగుణంగా వస్త్రాలు ధరించాలని కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన నిర్వాహకులు వినోద్ జైన్ అన్నారు. మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. మేళాలో వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత, ఖాదీ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎర్రగడ్డ, బోరబండ, అల్లాపూర్, శ్రీరామ్‌నగర్, రెహ్మత్‌నగర్‌లతో పాటు వివిధ ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





పంచాంగ పఠనం చేస్తున్న శ్రీవత్సాచార్య

పంచాంగ శ్రవణం.. తరలివచ్చిన జనం

సాక్షి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ● కిటకిటలాడిన క్రాంతినగర్ వేంకటేశ్వర ఆలయం


సాక్షి ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న 'సాక్షి' డైరెక్టర్ రాణిరెడ్డి, ఆలయ చైర్మన్ కాంతారావు తదితరులు


పంచాంగ శ్రవణం కార్యక్రమానికి హాజరైన ప్రజలు



నిజాంపేట్: అది వేంకటేశ్వర స్వామి సన్నిధి.. భక్తులకు పెన్నిధి.. ఆలయ ప్రాంగణం వేదికగా పంచాంగ శ్రవణం.. స్థానికులు భారీగా తరలివచ్చి శ్రద్ధాసక్తులతో వీక్షించారు. ఇదీ ఆదివారం సాయంత్రం బాచుపల్లిలోని క్రాంతినగర్ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కనిపించిన సన్నివేశం. 'సాక్షి'మీడియా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం సాయంత్రం ఆరు నుంచి రాత్రి 9 గంటల వరకు సాగింది. 'సాక్షి'డైరెక్టర్ రాణిరెడ్డి, ఆలయ చైర్మన్ కాంతారావు, సర్క్యులేషన్ జీఎం కీర్తికిరణ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రఖ్యాత నర్తకి యామినిరెడ్డి బృందం చేసిన కళాత్మక కూచిపూడి నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం సిద్ధాంతి చక్రవర్తుల శ్రీవత్సాచార్యులు పంచాంగ పఠనం చేశారు. విశ్వావసు నామ సంవత్సరంలో రాశిఫలాల గురించి చాలా విపులంగా వివరించారు. 'విశ్వాసం అని నామధేయంతో ఈ సంవత్సరముంది. విశ్వాసులు అంటే సూర్యుడి ప్రజ్వలితం ఏ విధంగా ఉంటుందో ఈ సంవత్సరం కూడా అంతే ప్రజ్వలితంగా ఉంటుంది. అందరి జీవితాల్లో విశ్వావసు అంత గొప్ప వెలుగును నింపుతుంది. 12 రాశుల వారికి 12 స్థానాల్లో శుభ ఫలితాలను తెలుసుకోవచ్చు'అని పేర్కొన్నారు. అనంతరం అన్ని రాశుల వారి ఆదాయం, వ్యయం, రాజయోగం, అవమానం ఏ యే స్థాయిల్లో ఉందో వివరించారు. తర్వాత భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భారతీ సిమెంట్స్ ఈ కార్యక్రమానికి స్పాన్సరర్‌గా వ్యవహరించింది. కార్యక్రమంలో సాక్షి సర్క్యులేషన్ మేనేజర్ వినోద్‌కుమార్, మహేశ్‌రెడ్డి, స్థానిక నాయకులు జీవీ రెడ్డి, కొమ్మరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, సంగమేశ్, మహేశ్, వెంకటేశ్, భూపతి, చరణ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది..



ఉగాది పండుగను ఇలా నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో విశ్వావసు నామ ఉగాదిని ఈ విధంగా నిర్వహించడం చాలా గొప్ప విషయం. తెలుగు పండుగల ప్రాధాన్యతను ఇలా చాటి చెప్పడం మంచి పరిణామం. ప్రజలంతా ఎంతో సంతోషంగా ఈ పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు.

– కాంతారావు,
ఆలయ కమిటీ చైర్మన్, క్రాంతినగర్

'సాక్షి' చొరవ అభినందనీయం



ప్రతి నిత్యం ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు సాక్షి మీడియా ఎంతగానో కృషి చేస్తోంది. వాటితోపాటు పండుగలను నిర్వహిస్తూ తెలుగు సంప్రదాయాల్లో ప్రజలను భాగస్వాములను చేసేందుకు ఇలాంటి కార్యక్రమం చేయడం చాలా ఆనందకరమైన విషయం.

– నందిగామ సత్యనారాయణ,
మాజీ ఎంపీటీసీ బాచుపల్లి

రాశి ఫలాలు తెలుసుకున్నాం..



ఉగాది పండుగ సందర్భంగా మా కాలనీలో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయడం మా అందరికీ సంతోషంగా ఉంది. పంచాంగంతో మా రాశుల ఫలాలు తెలుసుకున్నాం. సిద్ధాంతి గారి ఆధ్యాత్మిక ప్రసంగం ఎంతో ఆలోచింపజేయడంతోపాటు ఆచారించాల్సిన ఆవశ్యకతను తెలిపింది.

– జి.ప్రసన్న, క్రాంతినగర్

అవగాహన కలిగింది..



శుభ ముహూర్తాలు, అందులో గ్రహాల బలాల వల్ల జరిగే ఫలితాలు బాగా అర్థమయ్యాయి. సాక్షి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహాన్ని ఇవ్వడంతోపాటు రాశి ఫలాలపట్ల అవగాహన ఏర్పడింది.

–ఎ.ఊర్మిళ

నిమ్స్‌లో ఇక డిజిటలైజేషన్ సేవలు!

- రోగి ఉన్న చోటే సీఎంఆర్ఎఫ్ సాయం
- మూడంచెల విధానంతో ఆన్‌లైన్ సేవలు
- పేద రోగులకు మరింతగా మెరుగైన సేవలు



లక్డీకాపూల్: శస్త్ర చికిత్సల్లోనే కాదు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలోనూ నిమ్స్ ప్రత్యేకతను చాటుకుంటుంది. ఇప్పటికే సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను సునాయసంగా విజయవంతం చేస్తున్న నిమ్స్ వైద్యులు అవయమార్పిడి శస్త్రచికిత్సలను సైతం అంతే ఈజీగా సక్సెస్‌ఫుల్‌గా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఏ ఆస్పత్రిలో లేని విధంగా కియోస్క్ మిషన్‌ల ద్వారా ఓపీ కార్డు జారీ విధానాన్ని తీసుకువచ్చి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే బాధ తప్పించింది. సాధారణ వైద్య పరీక్షలకు సైతం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సెక్యూరిటీ ఆఫీస్, ట్రామా బ్లాక్‌ల వద్ద ఏర్పాటు చేస్తున్న ఈ ప్రత్యేక కేంద్రాల ద్వారా బీపీ వంటి సాధారణ పరీక్షలను రోగులు నేరుగా పొందవచ్చు. ఆరోగ్యశ్రీ కార్డు లేని రోగులు సైతం ఉచితంగా చికిత్స చేయాలన్న ప్రభుత్వసంకల్పానికి అనుగుణంగా ఆన్‌లైన్‌లోనే సాయాన్ని పొందే సదుపాయాల్ని కల్పించింది. పేదలకు వైద్యఖర్చులకు అందించే ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) సాయానికిగాను నిమ్స్ మూడంచెల విధానంలో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆర్థిక స్థోమత లేని రోగులు ఆన్‌లైన్‌లోనే ఇక సీఎంఆర్ఎఫ్ సాయాన్ని అందుకోవచ్చు. చికిత్సకు అయ్యే ఖర్చుపై సంబంధిత వైద్యులు నిర్ణయించే అంచనా వ్యయం మేరకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ)ని ప్రభుత్వం జారీ చేస్తుంది. ఇదివరకు చికిత్సకు అయ్యే ఖర్చుపై సంబంధిత వైద్యులు ఎస్టిమేట్ కాపీని ఇచ్చేవాళ్లు. దాని ఆధారంగా సీఎంఆర్ఎఫ్ కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, మంత్రుల సిఫారసు లేఖల కోసం తిరగాల్సి వచ్చేది. ఇందుకు రోగులు అనేక వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వచ్చేది.

ఎస్టిమేట్ కాపీ కోసం..

నోడల్ అధికారులు డాక్టర్ చరణ్‌రాజ్ మేడె, డాక్టర్ రాకేష్‌ల పర్యవేక్షణలో ఈ నెల 4 నుంచి అమలులోకి వచ్చిన ఈ విధానంలో తొలుత డాక్టర్‌కు ఎస్టిమేట్ కాపీ కోసం రిక్వెస్ట్ పెట్టుకోవాలి. ఆ మేరకు ఎంఆర్‌డీ విభాగంలో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య ఎస్టిమేట్ కాపీని రూ.50 రుసుముతో పొందాలి. nims.edu.in ద్వారా ఎస్టిమేట్ సర్టిఫికెట్ పొందవచ్చు. ఈ కాపీకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీల సిఫారసు లేఖను జత చేసి సీఎంఆర్ఎఫ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవాలి. ఆ మేరకు వచ్చిన టోకెన్ నెంబర్‌తో ఏఎంఎస్‌లు వెరిఫికేషన్ చేసి సీఎంఆర్ఎఫ్‌కు పంపిస్తారు. దాంతో లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ)ను ప్రభుత్వం నేరుగా ఏఎంఎస్‌కు పంపుతుందని డాక్టర్ చరణ్ తెలిపారు. ఈ సదుపాయన్ని కేవలం ఇన్ పేషెంట్లే కాకుండా అవుట్ పేషెంట్లు కూడా పొందవచ్చన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యం

టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ


ఉప్పల్ భగాయత్‌లో 33/ 11 కేవీ విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ముషారఫ్ ఫారూఖీ, ఎస్ఈ బ్రహ్మం తదితరులు

ఉప్పల్: నిరంతర విద్యుత్ సరఫరాయే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీఎస్‌పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ స్పష్టం చేశారు. ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్‌లో రూ.8.5 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ ఫీడర్‌ను ఆయన హబ్సిగూడ సర్కిల్ సూపరింటెండెంట్ బ్రహ్మంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రాంతాల్లో కన్నా హబ్సిగూడ సేవల్లో ముందు ఉందని, అందుకు కృషి చేస్తున్న అధికారులను ఆయన అభినందించారు. త్వరలో పదవి విరమణ చేయనున్న హబ్సిగూడ సర్కిల్ ఎస్ఈ బ్రహ్మం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఈ బ్రహ్మం, డైరెక్టర్ సాయిబాబ, సీజీఎం నర్సింహ స్వామి, డీఈలు, ఏడీఈలు, ఏఈలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మానాన్న ప్రోత్సాహంతోనే విజయం

గ్రూప్–1లో 30వ ర్యాంకర్ శంతన్ కుమార్‌రెడ్డి


శంతన్ కుమార్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు రవీందర్‌రెడ్డి, గీత

చైతన్యపురి: చైతన్యపురి కమలానగర్‌కు చెందిన బసిరెడ్డి శంతన్‌కుమార్ రెడ్డి టీజీపీఎస్సీలో 30వ ర్యాంక్, మల్టీజోన్–2లో 12వ ర్యాంక్ సాధించారు. తండ్రి రవీందర్‌రెడ్డి డీఎస్పీ కాగా, 30వ ర్యాంక్ సాధించిన శంతన్ కుమార్‌రెడ్డి కూడా డీఎస్పీ అవుతుండటం గమనార్హం. రవీందర్‌రెడ్డి స్వస్థలం నల్లగొండ జిల్లా హాలియా మండలం రామడుగు. 1995 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచి ఏసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. టీజీపీఎస్సీ ఫలితాల్లో శంతన్ ర్యాంక్ సాధించటం పట్ల తల్లిదండ్రులు రవీందర్‌రెడ్డి, గీత, సోదరి కృతిక సంతోషం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ఇంట్లో కేక్ కట్ చేసి శంతన్‌కు తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు. ఉగాది పండుగతోపాటు ఈ విజయం తమకు మరో పండుగ లాంటిదని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో తన అంతరంగాన్ని పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లో...

నా కృషికి తోడుగా తల్లిదండ్రుల ప్రోత్సాహం

ఎస్ఐటీ సూరత్‌లో 2020లో బీటెక్ పూర్తి చేశాను. సోదరి కృతిక ఖరగ్‌పూర్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. రెండున్నర సంవత్సరాలకుపైగా గ్రూప్స్‌కు సిద్ధమయ్యాను. రెండు పర్యాయాలు 4, 5 మార్కులలో యూపీఎస్సీ మిస్ అయింది. అయితే ఆ ప్రిపరేషన్ టీజీపీఎస్సీకి దోహదపడింది. గ్రూప్స్‌కు నలుగురు స్నేహితులతో కలిసి అశోక్‌నగర్‌లోని ఓ ఫ్లాట్‌లో ఉంటూ చదువుకున్నా. ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. సొంతంగానే రోజుకు ఆరుగంటలు చదివాను. పరీక్షకు ముందు మాత్రం రోజుకు 12 గంటలు అన్ని సబ్జెక్స్ ప్రిపేర్ అయ్యాను. గ్రూప్స్ సాధించాలనేది నా తల్లిదండ్రుల కోరిక. వారి ప్రోత్సాహ వల్లే ఈ విజయం సాధ్యమైంది. యూపీఎస్సీ కన్నా టీజీపీఎస్సీలో జాబ్ రావాలని భావించాను. తెలంగాణలోనే ప్రజలకు సేవ చేయాలని సంకల్పించా. సామాన్యులకు చట్టాలపై అవగాహన కల్పించి వారికి న్యాయం చేయటమే నా లక్ష్యం.

నేడు జూ పార్క్ తెరిచే ఉంటుంది

చార్మినార్: సందర్శకుల సౌకర్యార్థం నెహ్రూ జూలాజికల్ పార్క్ ఈ సోమవారం తెరిచే ఉంటుందని సంబంధిత క్యూరేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగ అయినప్పటికీ.. నెహ్రూ జూలాజికల్ పార్క్ తెరిచే ఉంటుందన్నారు. ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకుల సందర్శనార్థం అందుబాటులో ఉంటుందనే విషయాన్ని గమనించాలని కోరారు. సాధారణంగా ప్రతి సోమవారం నెహ్రూ జూలాజికల్ పార్కు సందర్శన ఉండదని...ఈ సోమవారం ప్రత్యేక పరిస్థితుల కారణంగా పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్), చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఆదేశాల మేరకు తెరిచి ఉంటుందని తెలిపారు.

ఉగాది ఘనమైనది

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు నేలపై ఉగాది పండుగకు ఘనమైన చరిత్ర ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, భరత్‌గౌడ్, ఏడెల్లి అజయ్ కుమార్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఎక్కాల నందు, కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్ యాదవ్, వై.అమృత, పార్టీ నేతలు డాక్టర్ సమత, సుప్రియ, సాధన ఠాకూర్, సి.నందకిషోర్ యాదవ్, చిట్టి శ్రీధర్, ఎ.యశ్వంత్, కన్నా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో...

కాచిగూడ డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు సుభాష్ పటేల్, శీరసాగర్, హజారీ బాబు, అరవింద్, వాసు, మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, రాము, కృష్ణ, ఓంప్రకాష్, ఆనంద్, రాజు, రాజేశ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన స్కల్ప్చర్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- హ్యాండ్‌లూమ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సిల్క్ మార్క్ ధ్రువీకృత సిల్క్‌ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ సమ్మర్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

వైభవంగా కీసర రామలింగేశ్వరుడి పల్లకీ సేవ



కీసర: కీసరగుట్ట రామలింగేశ్వస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ చైర్మన్ నారాయణ శర్మ, కార్య నిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, రాజు, ఆర్.ప్రవీణ్ కుమార్, ముత్యాలు, దుర్గాప్రసాద్‌గౌడ్, అమరేందర్, అనిత, రాజిరెడ్డి, కుమార్, శంకరయ్య, సాయిలు, ప్రభాకర్‌గౌడ్, సురేష్‌యాదవ్, బలరామ శర్మ భక్తులు పాల్గొన్నారు.

రెయిన్‌బో చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ పురస్కారాల ప్రదానం



సాక్షి, సిటీబ్యూరో: సినీ కళాకారులను, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నవారిని, వైద్య రంగంలో సేవలు అందిస్తున్న పులువురిని ఉగాది సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ఉగాది పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సత్కరించింది. కూకట్‌పల్లిలోని భారత వికాస్ పరిషత్ ఆడిటోరియంలో ఈ 'ఉగాది పురస్కార్'ప్రదానోత్సవంలో భాగంగా చిల్డ్రన్స్ కల్చరల్ ప్రోగ్రామ్స్ – కాంపిటీషన్స్ జరిగాయి. క్లాసికల్, సెమీ క్లాసికల్, వెస్టర్న్, ఫోక్ వంటి నృత్య పోటీల్లో పిల్లలు ప్రతిభ చాటుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిక్కవల్లి సత్యానందం (రిటైర్డ్ తహసిల్దార్), గౌరవ అతిథులుగా చదలవాడ హరికృష్ణ (టీవీ ఆర్టిస్ట్), నటుడు బోసుబాబు (టీవీ ఆర్టిస్ట్), అతిథిగా మహిజ (టీవీ ఆర్టిస్ట్) పాల్గొని పిల్లలకు జ్ఞాపికలు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. ఇంకా బండి రాములు (యోగా గురువు) పిల్లలతో యోగాసనాలు చేయించారు. 'రెయిన్‌బో చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ఇలా ప్రతి ఉగాదికి అవార్డ్స్ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఎప్పటిలానే ఈసారి కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'అని సొసైటీ జనరల్ సెక్రెటరీ, ఫిలిం డైరెక్టర్ కె. మోహన్ అన్నారు.. ఈ కార్యక్రమానికి జ్యోతి యాంకర్‌గా వ్యవహరించారు.

రంజాన్ ప్రార్థనలకు భారీ ఏర్పాట్లు

చార్మినార్: నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సోమవారం ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పండుగను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నగరవ్యాప్తంగా భారీ ఎత్తున సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, పాతబస్తీలోని మక్కా మసీదులో టెంట్లు వేసి భారీ ఏర్పాట్లు చేశారు. పాత బస్తీ మీరాలం ఈద్గాలో సామూహిక ప్రార్థనల నేపథ్యంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11:30 గంటల వరకు ఈ రూట్లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి. ఈ దారిలో వెళ్లే వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించనున్నారు. బహదూర్‌పురా, కాలా పత్తర్, నవాబ్ సాబ్ కుంట, శాస్త్రి పురం, దానమ్మ గుడిసెలు తదితర రూట్లలో వాహనాల దారి మళ్లింపు ఉంటుందని నగర ట్రాఫిక్ డీసీపీ–3 ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు.

120 కిలోల బండరాయిని ఎత్తిన మొనగాళ్లు

ఉగాది రోజున హమాల్‌బస్తీలో బండరాయి బలప్రదర్శన పోటీలు


120 కిలోల గుండ్రని బండరాయిని ఎత్తిన యువకుడు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో ఆదివారం కూలీనాలీ చేసుకొని జీవనం సాగిస్తున్న పాలమూరు, కర్ణాటక యువకుల బండరాయి బలప్రదర్శన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ప్రతి సంవత్సరం ఉగాది పండగ రోజు ఇక్కడ ఈ పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ పోటీల్లో 120 కిలోల బండరాయిని ఎత్తిన విజేతలను మొనగాళ్లుగా గుర్తించి సన్మానిస్తారు. 50 ఏళ్ల క్రితం పాలమూరు జిల్లా, కర్ణాటక నుంచి పొట్టచేత పట్టుకొని బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని హమాల్‌బస్తీలో అనేక కుటుంబాలు స్థిరపడ్డాయి. అనేక కుటుంబాలు కూలీనాలీ చేసుకుంటూ ఇక్కడ జీవనం సాగిస్తున్నాయి. సొంత ఉరులో ఉగాది పండుగ రోజు నిర్వహించుకునే పోటీల తరహాలో హమాల్‌బస్తీలో కూడా 120 కిలోల బండరాయి ఎత్తే బల ప్రదర్శన పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా హమాల్‌బస్తీలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో బస్తీ ప్రజల సమక్షంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అనేక మంది యువకులు పాల్గొన్నారు. అయితే 120 కిలోల బండరాయిని ఎం.విజయ్(మట్టి), ఇ.శ్రీనివాస్, శ్రీను, హనుమదాస్, సోను, షాను, విజయ్‌కుమార్ మాత్రమే ఎత్తారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ప్రత్యేకంగా కర్ణాటక నుంచి శ్రీను, షాను, విజయ్‌కుమార్ హమాల్‌బస్తీకి వచ్చారు. అయితే ఈ పోటీల్లో ఏడుగురు కూడా 120 కిలోల గుండ్రని బండరాయిని ఎత్తారు. వీరిని బస్తీ నాయకులు యాదగిరి, రవి, కె.శ్యామ్, రాజు తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేషన్‌రాజు, అంబులెన్స్ సురేష్, సుధాకర్ రెడ్డి, రాందాస్‌లతో పాటు పెద్ద ఎత్తున బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

త్వరలో లిఫ్ట్ అండ్ ఎస్కలేటర్స్ యాక్ట్!

- లిఫ్టుల నిర్వహణపై నియంత్రణ కరువు
- తరచూ వెలుగు చూస్తున్న ప్రమాదాలు
- 2015 డ్రాఫ్ట్ బిల్లులో మార్పులు, చేర్పులు
- ఇతర రాష్ట్రాల్లోని నిబంధనలపై సీఈఐజీ అధ్యయనం

"గత ఏడాది మే 27న నాగోల్‌లోని ఓ హోటల్లో లిఫ్ట్ కేబుల్ తెగి ఎనిమిది మంది గాయపడ్డారు. అదే ఏడాది జూలై 27న తుకారాం గేట్‌లో 68 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. జూలై 15న హఫీజ్‌పేటలో లిఫ్ట్ వైర్ తెగిపడి ఒకరు చనిపోగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఆగస్టు 26న గుడిమల్కాపూర్‌లో లిఫ్ట్ పైకప్పు కూలి 65 ఏళ్ల వృద్ధుడు చనిపోయాడు. గత నెల 22న మాసబ్‌ట్యాంక్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లోని లిఫ్ట్ మధ్యలో ఇరుక్కుని ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. తాజాగా మార్చి 12న సంతోష్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌లో చిక్కుకుని నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు'ఇలా నిత్యం ఏదో ఒక అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అనేక మంది మృత్యువాతకు కారణమవుతున్న ఈ లిఫ్టుల నియంత్రణ కోసం ప్రత్యేకచట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ లిఫ్ట్ అండ్ ఎస్కలేటర్ యాక్ట్–2025ను రూపొందించాలని నిర్ణయించింది."



సాక్షి, రంగారెడ్డి జిల్లా: షాపింగ్ మాల్స్, హోటళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనే కాదు సామూహిక, వ్యక్తిగత గృహ సముదాయాల్లో చాలావరకు నాసిరకం లిఫ్టులు/ఎస్కలేటర్లు దర్శనమిస్తున్నాయి. నిర్మాణ ఖర్చులను తగ్గించుకునేందుకు చాలామంది బిల్డర్లు మార్కెట్లో తక్కువ ధరకు లభించే లిఫ్ట్ పరికరాలను కొనుగోలు చేసి అమర్చుతున్నారు. వీటిపై సరైన నియంత్రణ, నిర్వహణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మెజార్టీ భవనాల్లో ఇన్వర్టర్లు లేకపోవడం, అకస్మాత్తుగా కరెంట్ సరఫరా నిలిచిపోతుండటంతో లిఫ్ట్ మధ్యలోనే ఆగిపోతున్నాయి. లిఫ్ట్ బాడీ చుట్టూ స్టీలు రేకు కవర్లు అమర్చుతుండటం, లోపల సరైన గాలి, వెలుతురు ఉండటంలేదు. అత్యవసర సమయంలో ఫోన్ చేసే వెసులుబాటు కూడా లేకపోవడం, సామర్థ్యానికి మించి లిఫ్ట్‌లోకి ఎక్కడంతో కేబుల్ వైర్లు తెగిపడుతున్నాయి. డోర్లు తెరుచుకునే సమయంలోనే కాదు మూసుకునే సమయంలో సెన్సార్లు పనిచేయక పోవడంతో లిఫ్ట్‌లోకి ఎక్కేందుకు ప్రయత్నించేవారు మధ్యలో ఇరుక్కపోతున్నారు. కొంతమంది మృత్యువాతపడుతుండగా, మరికొంత మంది కాళ్లు, చేతులను కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ప్రమాదాలకు చెక్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఏపీలో అమల్లో ఉన్న లిఫ్ట్ పాలసీని తెలంగాణలోనూ తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. అధ్యయనం, ముసాయిదా రూపకల్పన కోసం రెండు రోజుల క్రితం ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఆ బాధ్యతను తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ విభాగం చేపట్టింది. 2015లో ప్రభుత్వానికి పంపిన ముసాయిదాను పరిశీలించనుంది.

బీఐఎస్ ప్రమాణాలు లేకపోవడం వల్లే...

అపార్ట్‌మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) ఇవ్వడానికి పురపాలక శాఖ జారీ చేస్తున్న జీఓ 168లో లిఫ్ట్ ఏర్పాటు గురించి ప్రస్తావన ఉన్నా.. దాని నాణ్యత, నిర్వహణ, నియంత్రణపై ఎలాంటి ఆంక్షలు లేవు. ఇది నాసిరకం లిఫ్ట్ పరికరాల తయారీ కంపెనీలకు కలిసి వస్తోంది. తెలంగాణ ఎలివేటర్స్ అండ్ ఎస్కలేటర్స్ అసోసియేషన్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 10 వేల వరకు ఎలివేటర్లను విక్రయిన్నారు. వీటిలో 20 శాతమే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ప్రమాణాల మేరకు ఉన్నట్లు అంచనా. తయారీ సంస్థల వద్ద ఐదారు సంవత్సరాలు పని చేసిన వర్కర్లే స్వయంగా ఎలివేటర్ల తయారీని ప్రారంభిస్తున్నారు. వీరు బిల్డర్ల వద్ద తక్కువ ధరకు కాంట్రాక్టులు తీసుకుని నాసిరకం లిఫ్టలను అమర్చుతున్నారు. బీఐఎస్ నిబంధన 7175 ప్రకారం లిఫ్టను నిర్మించే సమయంలో దానిలో ఎంత మంది ప్రయాణించవచ్చు? ఎంత బరువు మోయగలదు? వంటి అంశాలను స్పష్టం చేయాల్సి ఉంది. ప్రమాణాల మేరకు కరెంట్ సరఫరా ఉందా? నాణ్యమైన పరికరాలు(ఆటోమెటిక్ డోర్లు, మోటారు, కేబుల్, సెన్సార్లు, ఫ్యాన్లు, లైట్లు, అత్యవసర ఫోన్, అగ్ని నిరోధక పరికరాలు, అత్యవసర (బ్రేకింగ్ సిస్టం) ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నా మెజార్టీ తయారీ దారులు దీన్ని పట్టించుకోవడం లేదు. 20 ఏళ్లకు పైబడిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉన్నా, సాంకేతిక నిపుణులతో తరచూ ఎలివేటర్ల భద్రత ఆడిట్ నిర్వహించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. సర్టిఫైడ్ నిపుణులతోనే ఎలివేటర్లను ఇన్‌స్టాల్ చేసుకోవడంతోపాటు నిర్వహణ సరిగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతే వాటిని వినియోగించుకోవడం ద్వారా లిఫ్ట్ ప్రమాదాల నుంచి బయటపడొచ్చని తెలంగాణ విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి సీహెచ్ రామాంజనేయులు వివరించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం
31 మార్చి 2025



ప్రపంచంలోని ఏ ప్రదేశం, ప్రాంతానికి సంబంధించిన ఫొటోలు, ఇతర సమాచారం తెలుసుకోవాలన్నా.. కేరాఫ్ అడ్రస్ 'గూగుల్ మ్యాప్స్'. ఈ వేదికలో ప్రాధాన్యత, విశిష్టత తెలుసుకున్నాకే ఆ ప్రదేశానికి వెళ్లాలా వద్దా అని ప్లాన్ చేసుకుంటారు. గూగుల్ లోకల్ గైడ్స్ విభిన్న ప్రదేశాలు సందర్శించి ఈ ఆన్‌లైన్ వేదికలో ఫొటోలు పోస్ట్ చేస్తారు. ఇలా ఎక్కువ ఫొటోలు ట్యాగ్ చేసిన అతికొద్ది మందిలో నగరానికి చెందిన కావలి చంద్రకాంత్ కూడా ఒకరు. 2017 నుంచి ఇప్పటి వరకూ ఆయన షేర్ చేసిన వేల ఫొటోలకు ప్రపంచవ్యాప్తంగా ఏకంగా మిలియన్ల కొద్దీ వ్యూస్ రావడం విశేషం. టాప్ గూగుల్ లోకల్ గైడ్‌గా తన ప్రయత్నాన్ని గూగుల్ సంస్థ కూడా ప్రత్యేకంగా అభినందించడం మరో విశేషం. ఇప్పటి వరకూ గూగుల్ మ్యాప్స్‌కు తాను అందించిన వేల ఫొటోలు కేవలం తన మొబైల్ ఫోన్‌లో మాత్రమే తీశానని మరో ఆశ్చర్యకరమైన విషయాన్ని వెల్లడించారు. తన గూగుల్ ప్రయాణాన్ని, ఆయన చెబుతున్న ఫొటోల కథలు తయన మాటల్లోనే..

- సాక్షి, సిటీబ్యూరో

గూగుల్ లోకల్ గైడ్..



- టాప్ గూగుల్ లోకల్ గైడ్‌గా నగరవాసి కావలి చంద్రకాంత్
- మ్యాప్స్‌లో తన ఫొటోలకు మిలియన్ల కొద్దీ వ్యూస్
- రాష్ట్రంలోని 287 పైగా ప్రాంతాలను పరిచయం చేసిన యువ ఫొటోగ్రాఫర్
- మొబైల్ ఫోన్‌లోనే ఈ ఫొటోలన్నీ తీయడం విశేషం

18 వేలకు పైగా ఫొటోలకు గూగుల్ ప్రత్యేక అభినందన

నాకు ఫొటోలు తీయడమంటే చాలా ఇష్టం. నా హాబీ మరొకరికి ఏదో విధంగా ఉపయోగపడితే ఎలా ఉంటుంది అనే ఆలోచనలోంచి ఈ గూగుల్ మ్యాప్స్ కాంట్రిబ్యూషన్ మొదలైంది. ఇలా ఇప్పటి వరకూ గూగుల్ మ్యాప్స్‌లో 22 వేల ఫొటోలను ట్యాగ్ చేశాను. ఇందులో 18,888 కు పైగా ఫొటోలు అందుబాటులో ఉన్నాయి. ఇది ఓపెన్ ఫ్లాట్ ఫాం.. ఎవరైనా ఫొటోలు వినియోగించుకోవచ్చు. గూగుల్ లోకల్ గైడ్‌గా వాడుకోవచ్చు. అంతేకాదు ఇదే వేదికలో 382కు పైగా వీడియోలు కూడా పొందుపరిచాను. ఫొటోలు, వీడియోలు పెట్టడంతో పాటు గూగుల్ మ్యాప్స్‌లో వాటి విశిష్టతను, ప్రాధాన్యతను తెలియజేసే 257 పైగా సమీక్షలు రాశాను.


మొదటి సారి మ్యాప్స్‌లో..

గతంలో హైదరాబాద్‌లోని మూసీ నది వరదల్లో చిక్కుకున్న 150 మంది వారి ప్రాణాలను కాపాడిన చింత చెట్టు (ఉస్మానియా ఆస్పత్రి ప్రక్కన ఉన్న చింత చెట్టు)ను మొదటి సారి గూగుల్ మ్యాప్‌లో చేర్చాను. ఇలా హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 287 పైగా ప్రదేశాలను మొదటిసారి నేనే గూగుల్ మ్యాప్స్‌కు పరిచయం చేశాను.



నా ఫొటోలు శాశ్వతం..

నగరంలోని జేఎల్ఎల్ అనే మల్టీ నేషనల్ కంపెనీలో టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ జాబ్ చేస్తున్నాను. వీకెండ్స్, ప్రత్యేక సెలవులు, ఖాళీ సమయాల్లో ఈ ఫొటోలు తీస్తుంటాను. బీటెక్, పీజీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ చేశాను. ప్రకృతి, వారసత్వ కట్టడాలు, నగరంలోని మల్టీనేషనల్ కంపెనీలు, రాష్ట్రంలోని చారిత్రాత్మక అంశాలు–కట్టడాలు, అత్యుత్తమ ప్రాజెక్టులు, అరుదైన విషయాలు–వింతలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఇలా పలు అంశాలను ఫొటోలుగా బంధిస్తుంటాను. నగరంలోని అమేజాన్, అంజాన్, గూగుల్ మొదలు టీ హబ్ వరకూ అన్ని కంపెనీలకు సంబంధించిన ఫొటోలు ప్రత్యేకంగా తీసి గూగుల్ మ్యాప్స్‌లో షేర్ చేశాను. 2015 నుంచి ఫొటోలు తీస్తున్నాను.. కానీ నాకు ఇప్పటి వరకూ కెమెరా లేదు. నా మొబైల్ ఫోన్‌లో మాత్రమే ఫొటోలు తీస్తాను. ఇప్పటి వరకూ సుమారు 50 వేల ఫొటోలు తీశాను. గూగుల్ మ్యాప్స్‌లో ప్రస్తుతం మిలియన్ల కొద్దీ వ్యూస్ రావడం చాలా ఆనందంగా ఉంది. గతంలో 25 కోట్ల వ్యూస్ వచ్చినప్పుడు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అభినందించారు. మా స్వగ్రామం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పెద్ద మునగల్ చేడ్ గ్రామం. మా ఊరిలోని స్కూల్ శిథిలావస్థలో ఉంటే.. వాటిని ఫొటోలుగా తీసి గ్రామ పెద్దలు, సంబంధిత అధికారుల దృష్టి తీసుకెళ్లగా.. వారి స్పందనతో నూతన స్కూల్ నిర్మించారు. ఈ సందర్భంగా నా మొదటి ఫొటో ఎగ్జిబిషన్ ఈ ప్రారంభోత్సవంలో పెట్టాను. మండలంలోని అడ్డాకల్‌లోని అన్ని గ్రామాలకు సంబంధించిన సమగ్ర అంశాలతో ఒక ప్రాజెక్టు ఫొటోగ్రఫీ జియో ట్యాగింగ్‌లో నిక్షిప్తం చేశాను. ఈ ప్రపంచంలో నేను శాశ్వతం కాదు.. కానీ నా ఫొటోలు శాశ్వతంగా నిలిచిపోతాయి. ఇంతకు మించిన సంతృప్తి ఏం ఉంటుంది.



లోకల్ గైడ్స్ కనెక్ట్‌లో బెస్ట్ ఫొటో..

ఇలా గూగుల్‌కు ఫొటోలు అనుసంధానం చేసే వారిని 1 నుంచి 10 వరకూ టాప్ లెవల్స్‌లో గుర్తిస్తారు. ఇందులో నేను టాప్ 10 స్థానికి చేరుకున్నాను. ఇలాంటి వారందరి కోసం గూగుల్ ఆధ్వర్యంలో సాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో గూగుల్ లోకల్ గైడ్స్ కనెక్ట్ అనే ప్రతిష్టాత్మక కార్యక్రమం నిర్వహిస్తారు. కరోనా పరిస్థితుల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని 2019లో హైదరాబాద్ నగర కేంద్రంగా నిర్వహించిన కార్యక్రమంలో టాప్ లోకల్ గైడ్‌గా నన్ను కూడా ఆహ్వానించడం, ఈ వేదికపై కొండాపూర్ జాలన్‌లోని నేను తీసిన నాగ శివాలయం ఫొటో బెస్ట్ ఫొటోగ్రాఫ్‌గా ఎంపిక చేయడం ఎప్పటికీ మర్చిపోలేను. గతంలో జరిగిన గూగుల్ లోకల్ గైడ్స్ ప్రత్యేక సమావేశంలో పాల్గొని ఈ వేదికలో మార్పులు, చేర్పులకు సంబంధించిన సూచనల అంశంలో భాగస్వామ్యం పంచుకున్నాను.

ఇతర రాష్ట్రాల సమాచారం..

తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట వంటి ప్రాంతాల్లోని ఫొటోలు గూగుల్‌లో ట్యాగ్ చేశాను. గూగుల్‌లోనే కాదు నేను తీసిన పలు ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇలా విభిన్న ప్రాంతాలు తిరిగి గూగుల్‌కు ఫొటోలను అందించిన ప్రదేశాలు, కట్టడాలు తదితర అంశాలకు సంబంధించి 1,272పైగా రేటింగ్స్, వాటికి సంబంధించి వ్యూయర్స్ అడిగిన 1,419 పైగా ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాను.





లగ్జరీ ఫ్యాషన్ వేదికగా ఒరాకిల్



- ఫ్యాషన్ షోలో క్యాట్ వాక్‌తో అలరించిన మోడల్స్

సాక్షి, సిటీ బ్యూరో: నగరంలోని ఒరాకిల్ – ది ట్రూత్ స్టోరీస్ బోటిక్ వేదికగా నిర్వహించిన ఫ్యాషన్ షోలో అందాల ముద్దుగుమ్మలు క్యాట్ వాక్‌తో అలరించారు. బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 11లో ఆదివారం మనుశ్రీ ఒరాకిల్ – ది ట్రూత్ స్టోరీస్ బోటిక్‌ను ఆదివారం ప్రారంభించారు. బ్రైడల్ ఫ్యాషన్ లగ్జరీ వస్త్రాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఒరాకిల్ సంస్థ నిర్వాహకులు తెలిపారు.



నగలు

నా ఫేవరెట్ కలెక్షన్

- నా పేరుతో నగలుంటే అంతకంటే ఆనందమేంటి
- పీఎంజే జ్యువెలర్స్ షోరూమ్ ప్రారంభోత్సవంలో సితార ఘట్టమనేని



లక్డీకాపూల్: నగలంటే నాకెంతో ఇష్టం.. నగల కలెక్షన్ నా ఫేవరెట్.. దీంతోపాటు నా పేరుతో నగలు ఉన్నాయంటే అంతకంటే ఆనందమేంటి.. అంటూ సంతోషం వ్యక్తం చేశారు.. సూపర్‌స్టార్ మహేష్‌బాబు తనయి సితార ఘట్టమనేని. పంజాగుట్టలోని పీఎంజే జ్యువెలర్స్ 40వ స్టోర్‌ను ఆదివారం తన తల్లి నమ్రతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్‌లో విభిన్న రకాల కలెక్షన్లను సితార ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను హెవీగా ఉండే జ్యువెలరీతో పాటు సందర్భాన్ని బట్టి లైట్ జ్యువెలరీని కూడా ఇష్టపడుతుంటానని చెప్పారు. తన తండ్రి మహేష్‌బాబు యాడ్‌లో నటించడం చాలా ఆనందంగా ఉందని, తాను బాగా ఎంజాయ్ చేశానని చెప్పారు. తామిద్దరం ఇంట్లో ఎలా ఉంటామో ఆ యాడ్‌లో కూడా అలాగే చేశామని సితార చెప్పుకొచ్చారు. నటి నమ్రత మాట్లాడుతూ.. సితార, తాను ఎప్పటికప్పుడు గిఫ్టులు ఇచ్చిపుచ్చుకుంటామని చెప్పారు. ఏది నచ్చినా అది కొనేస్తుంటామని, సితార ఎక్కువగా సైలెంట్‌గా ఉండటానికి ఇష్టపడుతుందని నమ్రత తెలిపారు.



హైదరాబాద్ రన్నర్స్ ఆధ్వర్యంలో 'సండే లాంగ్ రన్'

పాల్గొన్న 46 మంది రన్నర్లు

రాయదుర్గం: హైదరాబాద్ రన్నర్స్ ఆధ్వర్యంలో 'సండే లాంగ్ రన్' ఆదివారం నిర్వహించారు. ఈ రన్ గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ లేక్ పాయింట్ వద్ద ఉదయం 5.45 గంటలకు ప్రారంభించారు. అక్కడి నుంచి ఖజాగూడ, ఓక్రిడ్జ్ స్కూల్ మీదుగా నానక్‌రాంగూడ సర్కిల్ వరకూ వెళ్లారు. తిరిగి అదే మార్గంలో ఖాజాగూడ లేక్ పాయింటుకు చేరుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ప్రధాన రోడ్డు పక్కనే ఉండే కేర్ ఆస్పత్రి వరకూ కొనసాగించి అక్కడి నుంచి తిరిగి ప్రారంభించిన ప్రాంతానికి చేరుకున్నారు. ఈ రన్‌లో మొత్తం 46 మంది రన్నర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ రన్నర్ ఎస్.యలమందారావు పర్యవేక్షించారు.





పండుగ విల్లాసం.. ఉత్సాహం..

సాక్షి, సిటీబ్యూరో: అసలే ఆదివారం.. పైగా అచ్చమైన తెలుగు సంవత్సరాది సంబరం.. దీంతో నగర వ్యాప్తంగా గేటెడ్ కమ్యూనిటీల్లో ఉగాది సంబరాలు ఆహ్లాదకరంగా సాగాయి. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ఇండిపెండెంట్ గృహాలలో నివాసితులను ఒకే కుటుంబంలా మారుస్తూ ఉరుకుల పరుగుల బిజీ జీవితాలకు ఆటవిడుపు లభించింది. ఆటలు, పాటలు, ఫ్యాన్సీడ్రెస్ పోటీలతో పాటు సామూహిక వంటకాల తయారీతో పలు గేటెడ్ కమ్యూనిటీలు ఒకనాటి గ్రామీణ అనుబంధాలను గుర్తు చేశాయి. ఈ సందర్భంగా కొల్లూరులో రాగా సైట్‌లో ఉత్సవాలు నిర్వహించిన రాధే గ్రూప్ ఎండీ రాధే దగ్గుమల్ల మాట్లాడుతూ 'ఉగాది అనేది కొత్త ప్రారంభాలకు.. కొత్త ఆశలకు ఊపిరిపోస్తుంది. అలాగే అనుబంధాలను బలోపేతం చేస్తూ ఐకమత్యాన్ని పెంపొందించేలా సంప్రదాయాలను అనుసరించడం మంచి పరిణామం. ఏటేటా ఇలాగే జరుపుకోవాలని కోరుకుంటున్నాం' అన్నారు.



నగర వేదికగా ఫైవ్ ఫిల్మ్స్ ఫర్ ఫ్రీడమ్..

బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, సిటీ బ్యూరో: ప్రపంచవ్యాప్తంగా లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్, ఇంటర్‌సెక్స్, అలైంగిక వ్యక్తులకు మద్దతుగా బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్, హైదరాబాద్, వీ హబ్ సహకారంతో ప్రపంచ ఎల్‌జీబీటీక్యూఐఏ+ కథల వార్షిక వేడుక అయిన ఫైవ్ ఫిల్మ్స్ ఫర్ ఫ్రీడమ్ ప్రదర్శనను నిర్వహించింది. బీఎఫ్ఐ ఫ్లేర్‌తో భాగస్వామ్యంలో భాగంగా బ్రిటిష్ కౌన్సిల్ నిర్మించిన లండన్ ఎల్‌జీబీటీక్యూఐఏ+ ఫిల్మ్ ఫెస్టివల్ ఈ సంవత్సరం, ఇండోనేషియా, న్యూజిల్యాండ్, యూకే, యూఎస్ఏ/చైనా నుంచి చిత్రనిర్మాతల రచనలను ప్రేమ, ధైర్యం, రహస్యాలు, ద్రోహానికి సంబంధించిన స్ఫూర్తిదాయకమైన కథలను పంచుకున్నారు. ఈ ప్రదర్శనలో ఎల్‌జీబీటీక్యూఐఏ+ కమ్యూనిటీలోని ప్రముఖ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఫైవ్ ఫిల్మ్స్ ఫర్ ఫ్రీడమ్ స్క్రీనింగ్ నిర్వహించినందుకు సంతోషంగా ఉందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. ఈ చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్న ఎల్‌జీబీటీక్యూఐఏ+ జీవితాలను ప్రేరేపిస్తాయని, వారి స్వేచ్ఛను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.



బీసీల ఆలోచన ఆ పూటకే!

బడుగు, బలహీనులు చెప్పినా కూడా ఆలోచించరు.. వాళ్ల ఆలోచనా విధానమే తప్పు

ఎస్సీ, బీసీ వర్గాలపై మరోసారి సీఎం చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు

- వాళ్ల ఆలోచన అంతా ఆ పూటకే ఉంటుంది...
- చెప్పినా కూడా వాళ్లు ఆలోచించరు..
- మీటింగ్ అయింది.. మా పనై పోయిందనుకుంటారు
- అసలు వాళ్ల ఆలోచనే తప్పు..

పేదల కోసం పీ-4 అంటూ నిండుసభలో అవమానించిన వైనం.. బాబు వ్యాఖ్యలపై భగ్గుమంటున్న బీసీ, ఎస్సీ వర్గాలు

గతంలోనూ ఎస్సీలు, బీసీలనుద్దేశించి దారుణంగా మాట్లాడిన బాబు

సాక్షి, అమరావతి:

"ఈ బడుగు, బలహీన వర్గాల ఆలోచన అంతా ఆ పూటకే ఉంది. చెప్పినా కూడా ఆలోచించరు... ఇప్పుడొచ్చారు.. సగం మంది వెళ్లిపోయారు. వారి ఆలోచన అంతా.. మీటింగ్ అయింది.. మా పని అయిపోయింది..! అంటే మన ఆలోచన విధానాన్ని నేను తప్పుబడుతున్నా.. మిమ్మల్ని కాదు.. అదే ఇక్కడున్న వాళ్లంతా ఉన్నారు.. వీళ్లకి ఓపిక ఉంది. బంగారు కుటుంబాలకు ఓపిక లేదు.. మార్గదర్శకులకు ఓపిక ఉంది. అంటే వాళ్లు నేర్చుకున్నారు. అది నేర్పాల్సిన బాధ్యత నాపై ఉంది. అందుకే నేను పట్టుదలగా ఉన్నా.. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి జీవితాల్లో వెలుగులు తెస్తా..!"

ఈ వ్యాఖ్యలు చూశారా..! 40 ఏళ్ల రాజకీయ అనుభవం, నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నానని చెప్పుకునే చంద్రబాబు దళిత, బలహీన వర్గాల నుద్దేశించి ఆదివారం నిర్వహించిన పీ 4 సభలో మాట్లాడిన దారుణమైన మాటలివీ!! దళితులు, బడుగు, బలహీనవర్గాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు అలవాటైన రీతిలో మళ్లీ నోరు పారేసుకున్నారు. బడుగు, బలహీనవర్గాల ఆలోచన ఆ పూట వరకే ఉంటుందని అవమానకరమైన వ్యాఖ్యలు చేశారు. వాళ్లు చెప్పినా కూడా ఆలోచించరని నిందించారు. వచ్చాం.. మీటింగ్ అయిపోయింది.. మా పని అయిపోయిందని అనుకుంటూ ఉంటారని.. వాళ్ల ఆలోచనా విధానమే తప్పని వ్యాఖ్యానించారు. పేదలను ధనికులను చేస్తానంటూ జీరో పావర్టీ పీ-4 పేరుతో నిర్వహించిన సభలోనే వారిపై తనకున్న ఏహ్య భావాన్ని ఆయన బయటపెట్టారు. గతంలోనూ చంద్రబాబు పలు సందర్భాల్లో ఎస్సీ, బీసీ వర్గాలను నేరుగా దూషించి వారి పట్ల తనకున్న చులకన భావాన్ని చాటుకున్నారు. దీనిపై ఎస్సీ, బీసీ వర్గాలు భగ్గుమంటున్నాయి. చంద్రబాబుకు దళితులు, బీసీలంటే ఎప్పుడూ చులకన భావమేనని, తమను అవమానించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా..? అని గతంలో వారి పుట్టుకనే హేళన చేసిన హీనమైన భావజాలం చంద్రబాబుదని మండిపడుతున్నారు. నాడు తమ బాధలు చెప్పుకునేందుకు సచివాలయానికి వచ్చిన నాయీ బ్రాహ్మణులను.. 'మీ తోకలు కత్తిరిస్తా..! తమాషాలు చేస్తున్నారా? మిమ్మల్ని ఇక్కడి వరకూ రానివ్వడమే తప్పు..' అంటూ హూంకరించిన నిర్వాకం ఆయనదే. అందుకు అనుగుణంగానే టీడీపీ నేతలు దళితులు, బీసీల పట్ల తరచూ హీన వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. 'మీరు దళితులు.. మీకెందుకురా రాజకీయాలు, పదవులు..?' అంటూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఒక సభలో ఎస్సీల పట్ల అవమానకరంగా మాట్లాడటం తెలిసిందే. 'ఎస్సీలు శుభ్రంగా ఉండరు. వాళ్ల దగ్గరకు వస్తే వాసన వస్తుంది. వాళ్లకి చదువు రాదు..' అంటూ టీడీపీలో ఉండగా మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి దారుణంగా మాట్లాడారు. తాజాగా చంద్రబాబు వారి పట్ల తనకున్న చులకన భావాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు. బడుగు, బలహీన వర్గాలకు అసలు ఆలోచనలే ఉండవని, డబ్బులు ఇస్తే మీటింగ్‌కు వస్తారనే రీతిలో అడ్డగోలు వ్యాఖ్యలు చేశారు. పేదలను గొప్పోళ్లను చేస్తానంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ తన ప్రసంగం వినలేక వెళ్లిపోతున్న వారిని చూసి చంద్రబాబుకు కోపం కట్టలు తెంచుకుంది. వారి పట్ల తన మనసులో ఉన్న మాటను వెళ్లగక్కి బడుగులంటే తనకు ఏమాత్రం గిట్టదని మరోసారి రుజువు చేసుకున్నారు.



చరిత్రలో ఎవరూ చేయలేదు..

పేదరికం లేని సమాజం కోసం పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఇది వినూత్న కార్యక్రమమని, కొత్త ప్రయోగమని, ఇంతవరకూ చరిత్రలో ఎవరూ అమలు చేయలేదని తెలిపారు. వెలగపూడి సచివాలయంలో సమీపంలో నిర్వహించిన సభలో జీరో పావర్టీ పీ-4 కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి చంద్రబాబు ప్రారంభించారు. పథకం లోగో, పోర్టల్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. శాయోజీరావు సహాయం వల్లే అంబేడ్కర్ ఎదిగారని, శివసుబ్రహ్మణ్యం అయ్యర్ వల్ల అబ్దుల్ కలాం ముందుకెళ్లారన్నారు. కలాంను రాష్ట్రపతిని చేయడంలో తన పాత్ర కూడా ఉందన్నారు. ఎన్టీఆర్ లేకపోతే తాను కూడా అందరిలా మామూలుగానే ఉండేవాడినన్నారు. హైదరాబాద్ దశ, దిశ మారడానికి తాను చేసిన ఆలోచనలే కారణమన్నారు. పీ-4 గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. ఇప్పటికీ పైకి రాని కుటుంబాలు 20 శాతం ఉన్నాయని, మార్గదర్శులుగా ఉండేవారు బంగారు కుటుంబాలతో కలసి పని చేయాలన్నారు. తలసరి ఆదాయం 2028-29 నాటికి రూ.5.42 లక్షలు, 2047కి రూ.55 లక్షలు చేయాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. టాప్ టెన్‌లో ఉన్న పది శాతం శ్రీమంతులు అట్టడుగున్న ఉన్న 20 శాతం మందిని పైకి తెచ్చే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

పవన్ దొరకడం నా అదృష్టం..

2047కి స్వర్ణాంధ్రప్రదేశ్ 2.0 సాధించడమే తన లక్ష్యమని, పీ-4 అందుకు మార్గదర్శి అని చంద్రబాబు పేర్కొన్నారు. ఆగస్టు 15 నాటికి ఈ కార్యక్రమాన్ని ఒక రూపం తీసుకొచ్చి మళ్లీ ఉగాది నాటికి ప్రగతిని ప్రజలకు వెల్లడిస్తామన్నారు. 2029కి రాష్ట్రం జీరో పావర్టీలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే ప్రపంచమే ఆచరించే పరిస్థితికి వస్తుందన్నారు. పవన్ కల్యాణ్ లాంటి మిత్రుడు దొరకడం తన అదృష్టమని, ఆయనతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు రెండు మూడు తరాల కోసం ఆలోచిస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కాగా 20 లక్షల బంగారు కుటుంబాలను పైకి తెచ్చే లక్ష్యంతో పని చేస్తున్నట్లు ప్రభుత్వం విడుదల చేసిన విధాన పత్రంలో తెలిపింది. సంపన్న కుటుంబాలు పీ 4 ప్లాట్‌ఫామ్‌లోకి లాగిన్ అయి కనీసం ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుని మార్గదర్శి కుటుంబంగా నిలవాలని కోరింది.

- మంగళగిరికి చెందిన గొర్రెల పెంపకందారు కడియం నరసింహ కుటుంబాన్ని తొలి బంగారు కుటుంబంగా, విజయవాడకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఇమ్మాన్యుయేల్ కుటుంబాన్ని రెండో బంగారు కుటుంబంగా పీ 4 పథకం ప్రారంభం సందర్భంగా ప్రకటించారు. నరసింహ తన పిల్లల్ని చదివించాలని కోరగా గ్రీన్‌కో ఎనర్జీ అధినేత చలమలశెట్టి అనిల్‌కుమార్ మార్గదర్శిగా ముందుకొచ్చారు. ఇమ్మాన్యుయేల్ తన కూతుర్ని ఎంబీబీఎస్ చదివించాలని కోరగా మెయిల్ సంస్థల అధినేత మేఘా కృష్ణారెడ్డి వారికి మార్గదర్శిగా ముందుకొచ్చారు. కృష్ణా జిల్లాలోని తన సొంత మండలం గుడ్లవల్లేరు బాధ్యత మొత్తం తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఇంత హీనంగా మాట్లాడతారా?



పేదల విషయంలో మొదటి నుంచి చంద్రబాబుది ప్యూడలిస్టు భావజాలమే. ఎస్సీలు, బీసీల పట్ల ఆయన మాటలు, చేతలు ఎప్పుడూ లోకువగానే ఉంటాయి. బడుగు, బలహీనవర్గాల గురించి అంత హీనంగా మాట్లాడడం సరికాదు. వారికి ఆలోచనలు లేవని చెప్పడం సిగ్గుచేటు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి అలాంటి మాటలు మాట్లాడతారా? ఇప్పుడే కాదు.. అనేక సందర్భాల్లో ఎస్సీలు, బీసీల గురించి తక్కువగా మాట్లాడారు. ఆయనకిది తగదు. వెంటనే దళితులు, బడుగు వర్గాలకు క్షమాపణ చెప్పాలి.

– చింతపల్లి గురుప్రసాద్, బహుజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

బాబులో రెండో వ్యక్తి బయటకొచ్చాడు



చంద్రబాబు చేతలకి, మాటలకి పొంతన ఉండదు. పేదలను ఎప్పుడూ అవమానిస్తారు. ఇప్పుడు మరోసారి అవమానించారు. ఎస్సీలు, దళితులంటేనే ఆయనకు పడదు. పేదల కోసమని నిర్వహించిన సభలో జనం వెళ్లిపోతున్నారని సహనం కోల్పోయి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం ఏమిటి? చంద్రబాబులో రెండో వ్యక్తి బయటపడ్డాడు. ఆయన్ను దళిత, బీసీలు నమ్మకూడదు. ఆయన తన మాటలను ఉపసంహరించుకోవాలి.

– నత్తా యోనారాజు, మాల మహానాడు నాయకుడు

గుణపాఠం తప్పదు



పేదలకు మేలు చేయకపోగా వారి గురించి తరచూ అవమానకరంగా మాట్లాడడం చంద్రబాబుకే చెల్లింది. పీ-4 మీటింగ్ అని పిలిచి ఒక్కరికి మేలు చేయకపోగా తిట్లు బహుమతిగా ఇస్తారా? బీసీ, ఎస్సీలను తిట్టడానికి బహిరంగ సభ పెడతారా? పేదల గురించి ఇంత అన్యాయంగా మాట్లాడిన రాజకీయ నాయకుడు దేశంలో మరొకరు లేరు. వారికి ఆలోచనలే లేవని అనడం అహంకారం. త్వరలోనే బీసీలు, ఎస్సీలు ఆయనకు గుణపాఠం చెబుతారు.

– ఆదిమూలం సురేష్, మాజీ మంత్రి

నీచంగా మాట్లాడడం తగదు



పేదలు ఎప్పుడూ తమ బానిసలుగా ఉండాలనే ఆలోచన ఉన్న వ్యక్తి చంద్రబాబు. జీరో పావర్టీ పీ-4 సభలో దాన్ని బయటపెట్టారు. ఎస్సీ, బీసీల గురించి అంత నీచంగా మాట్లాడడం దారుణం. గతంలోనూ ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని నీచంగా మాట్లాడారు. ఆయన పైకి చెప్పే మాటలు వేరు, లోపల ఆయన భావజాలం వేరు. పేదలు ఎప్పుడూ తమ కాళ్ల దగ్గరే ఉండాలనే ఆలోచన చంద్రబాబుది. అందుకు తగ్గట్టుగానే వారిని అవమానించే వ్యాఖ్యలు చేశారు.

– కైలే అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

అసలు మనిషి బయటపడ్డాడు..



చంద్రబాబులోని అసలు మనిషి పీ-4 మీటింగ్‌లో బయటపడ్డాడు. వారి కోసమని మీటింగ్ పెట్టి తిట్టడం ఏమిటి? సభకు వచ్చిన జనం వెళ్లిపోతుంటే ఇష్టం వచ్చినట్లు తిడతారా? పేదలు కూడా సంపన్నుల్లా ఆలోచించాలని చెప్పి వారిని తిట్టడం అన్యాయం. వారు మారరని, వారి ఆలోచనలు అంతేనంటూ అడ్డగోలుగా మాట్లాడడం మంచిది కాదు. బీసీలు, ఎస్సీలను చంద్రబాబు ఎప్పుడూ గౌరవించలేదు. అనేకసార్లు అవమానించారు. ఇప్పుడు మరోసారి తన నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నారు.

– జోగి రమేష్, మాజీ మంత్రి

ఏ ఎన్నికలొచ్చినా బీఆర్‌ఎస్‌దే గెలుపు

కేసీఆర్ ఈ ఏడాది సీఎం పీఠం ఎక్కే అవకాశం

- రాష్ట్రంలో ప్రజాపాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- బీఆర్‌ఎస్ నేతలు మీడియాతో మాట్లాడేటప్పుడు జాగ్రత్త వహించాలి
- కోర్టు మెట్లు ఎక్కితేనే రాష్ట్రంలో ఎన్నికలు వచ్చే అవకాశం
- తెలంగాణభవన్‌లో రాజేశ్వర సిద్ధాంతి ఉగాది పంచాంగ శ్రవణం



రాజేశ్వర సిద్ధాంతి నుంచి ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న కేటీఆర్. చిత్రంలో తలసాని, మధుసూదనాచారి, రమణ, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, రావుల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాపాలన కోరుకుంటున్నారని.. కేసీఆర్ సీఎంగా సేవలు అందించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని పంచాంగకర్త రాజేశ్వర సిద్ధాంతి అన్నారు. కేసీఆర్‌కు ఈ ఏడాది సానుకూలంగా ఉంటుందని, మళ్లీ ముఖ్యమంత్రిగా పదవీయోగం దక్కే అవకాశముందని చెప్పారు. తెలంగాణభవన్‌లో ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో రాజేశ్వర సిద్ధాంతి పంచాంగ శ్రవణం చేశారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా ఈ ఏడాది బీఆర్‌ఎస్‌దే విజయమని తెలిపారు. 'కుజుడు నీచస్థానంలో ఉన్నాడు కాబట్టి ఈ ఏడాది రైతులను పట్టించుకునే స్థితి ఉండదు. వర్షాలకు అనుగుణంగా పంటలు వేసుకోవాలి' అని సూచించారు. ఈ ఏడాది చివరి వరకు కూడా ప్రభుత్వం చెప్పుచేతల్లోనే అధికార దుర్వినియోగం అవుతుందని చెప్పారు.

కేసీఆర్‌కు సంపూర్ణ ఆరోగ్యం

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ది కర్కాటక రాశి అని రాజేశ్వర సిద్ధాంతి చెప్పారు. ఈ రాశికి ఆదాయం 8, వ్యయం 2, రాజపూజ్యం 7, అవమానం 3 ఉందన్నారు. ఆశ్లేష నక్షత్రం, కర్కాటక రాశిలో కేసీఆర్ జన్మించారని.. మేష లగ్నం, బృహస్పతి ద్వితీయ స్థానంలో, శనైశ్చరుడు ఉచ్ఛ స్థానంలో ఉన్నాడని చెప్పారు. బృహస్పతి వ్యయంలో ఉన్నా..అష్టమ స్థానంలో ఉన్న శనైశ్చరుడి ఇబ్బంది పోతుందన్నారు. ఫలితంగా కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ ఏడాది మళ్లీ ముఖ్యమంత్రిగా పట్టం కట్టడానికి అవకాశముందని చెప్పారు. నృసింహ కటాక్షం ఉంటుందని వెల్లడించారు. బీఆర్‌ఎస్ పార్టీది ధనుస్సు రాశి అని చెప్పారు. ఈ ఏడాది పార్టీపై మీడియా దుష్ప్రచారం చేసే అవకాశం ఎక్కువ అని, ఆ పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

తెలంగాణ సీఎంకు మే 14 నుంచి పదవీగండం

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాశిలో ఇన్ని రోజులు మంచి స్థితిలో ఉన్న బృహస్పతి.. మే 14 రోజున స్థానచలనం చెందుతాడని, అప్పటి నుంచి ఆయనకు పదవీగండాలు ఎక్కువయ్యే అవకాశం ఉందని రాజేశ్వర సిద్ధాంతి హెచ్చరించారు. బృహస్పతి సప్తమి స్థితిలో ఉన్నాడని, వార్డు మెంబర్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ స్థాయివరకు ఏ ఎన్నికలు జరిగినా బీఆర్‌ఎస్‌దే విజయమని స్పష్టం చేశారు. కానీ పాలకులు ఎన్నికలు పెట్టేందుకు ఇబ్బంది పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. వారి రాజ్యాధికారం కాపాడుకునేందుకే తాపత్రయ పడాల్సి వస్తుందని చెప్పారు. కోర్టులు ముందుకొచ్చి చెబితేనే ఎన్నికలు పెట్టే పరిస్థితి వస్తుందన్నారు. ఈ ఏడాదిలో వీలైనంత ఎక్కువగా ఎన్నికలు వాయిదా పడొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్‌కుమార్, తలసాని శ్రీనివాస్ యాదవ్, చామకూర మల్లారెడ్డి, మాజీఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రమణ, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు మంచిపేరు వస్తుంది

- రాజు బాగుండాలంటే ఆదివారం చుక్క, ముక్క వద్దు
- శృంగేరీ ఆస్థాన పండితుడు బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి
- రవీంద్రభారతిలో ఘనంగా ఉగాది వేడుకలు

సాక్షి, హైదరాబాద్: 'విశ్వావసు నామ సంవత్సరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి పేరు ప్రఖ్యాతులు సాధిస్తారు' అని శృంగేరీ ఆస్థాన పండితుడు బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి చెప్పారు. ఆదివారం ఉదయం దేవాదాయ, ధర్మాదాయ, పర్యాటక, సాంస్కృతిక శాఖలు సంయుక్తంగా రవీంద్రభారతిలో విశ్వావసు ఉగాది వేడుకలను నిర్వహించాయి. సంతోష్‌కుమార్‌శాస్త్రి చెప్పిన పంచాంగ శ్రవణ వివరాలు పూర్తిగా ఆయన మాటల్లోనే....

రేవంత్‌కు కుజ మహాదశ ప్రారంభమైంది

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది తులారాశి. ఈ రాశి వారికి ఈ సంవత్సరం సానుకూల ఫలితాలు వస్తాయి. మంచి జరుగుతుంది. వీరికి ఇటీవల కుజ మహాదశ ప్రారంభమైనందున మంచి యోగం ఉంటుంది. ముఖ్యమంత్రి మంచి పేరు ప్రఖ్యాతులు సాధిస్తారు. కానీ, విపరీతమైన నరఘోష కొంత కదిలిస్తుంది. దీని నుంచి దూరం కావటానికి లక్ష్మీనరసింహ ఆరాధన, కాలభైరవ స్తోత్ర పారాయణం చేస్తే మంచిది. ఈ రాశిలో ఆదాయం 8, వ్యయం 5, రాజపూజ్యం 2, అవమానం 2గా ఉంది' అని బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి చెప్పారు.

ప్రభుత్వం కఠిన నిర్ణయాలకు వెనుకాడదు

పాలనలో రాష్ట్రానికి కొన్ని ఇబ్బందులు తప్పవు. కానీ, సత్సంకల్పం, ఆత్మబలం, మంచి శ్రమతో ముందుకు సాగితే అడ్డంకులను అధిగమించొచ్చు. సేనాధిపతిగా శని ఉన్నందున ప్రభుత్వం కఠిన నిర్ణయాలకు వెనుకాడదు. పోలీసు యంత్రాంగం కూడా గట్టిగానే పనిచేస్తుంది. ఈసారి మంచి వర్షాలు కురుస్తాయి. పాడిపంటలు మెరుగ్గా ఉంటాయి. ప్రభుత్వ పాలనతో ప్రజలు సంతృప్తిగా ఉంటారు. అకాల వర్షాలు, భూకంపాలు, తుపానులు దేశాన్ని ఇబ్బందికి గురి చేస్తాయి. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం దక్కుతుంది. అనుకోని సంఘటనలతో కొన్ని సంక్షేమ ఫలితాలు ప్రజలకు అందవు. అయితే సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవటంలో ప్రభుత్వం విజయం సాధిస్తుంది. మే 18 నుంచి ఆచితూచి అడుగులేయాల్సి ఉంటుంది. వ్యవసాయ రంగంలో కల్తీ చీడ రైతులను ఇబ్బందికి గురి చేస్తాయి. కందులు, మిర్చి బాగా పండుతాయి. సెప్టెంబరు 7, మార్చి 3న చంద్ర గ్రహణాలుంటాయి. వాటి ప్రభావం సానుకూల ఫలితాలనిస్తాయి. కాళేశ్వరంలోని అంతర్వాహిణి సరస్వతి నదికి పుష్కరాలు ఘనంగా నిర్వహించాలి. ప్రధాని నరేంద్ర మోదీది వృశ్చిక రాశి.. ఈ సంవత్సరం ఈ రాశి వారికి మధ్యస్థ ఫలితాలు ఉంటాయి. కొంత బాగానే ఉన్నా.. కొన్ని ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవుతాయి.

పండుగ ఆదివారం వచ్చినందుకే..

ఉగాది ఈసారి ఆదివారం వచ్చింది. ఈ సంవత్సరం రాజు స్థానంలో సూర్యుడు ఉన్నాడు. రాజు బాగుండాలి అంటే ఆదివారం చుక్క ముక్క (మద్యం, మాంసాహారం)కు దూరంగా ఉండటం మంచిది. దీనివల్ల రాజు స్థానంలో ఉన్న సూర్య భగవానుడి అనుగ్రహం కలుగుతుంది. మంచిపాలన, మంచి ఆరోగ్యానికి ఈ ఆదివార నియమం అవకాశం కల్పిస్తుంది.

మరో పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం

- గాంధీభవన్‌లో జరిగిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



పంచాంగ శ్రవణం చేస్తున్న శ్రీనివాసమూర్తి. చిత్రంలో భట్టి, మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో పదేళ్లపాటు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేబినెట్ మంత్రులందరూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం గాంధీభవన్‌లో పండితుడు శ్రీనివాసమూర్తి పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాది తెలంగాణలో అంతా బాగుంటుందని, వర్షాలు బాగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని చెప్పారు. కొత్త ఉత్పత్తులు వస్తాయని, విద్యుత్ కూడా తగినంతగా అందుబాటులో ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో కొత్త సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్నారు. అనంతరం మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ గాంధీభవన్ పేదల దేవాలయం లాంటిదన్నారు. ప్రజల కోసమే పనిచేసే పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన సాగుతోందని, రాష్ట్రం పారిశ్రామిక, విద్య, సామాజిక రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, పార్టీ నేతలు కుమార్‌రావు, బొల్లు కిషన్, హరివర్ధన్‌రెడ్డి, మచ్చా వరలక్ష్మి, కోటూరి మానవతారాయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కరప్షన్ వైరస్ పట్టుకుంది

- సన్నబియ్యం పంపిణీని స్వాగతిస్తున్నాం
- రేషన్ దుకాణాల్లో ప్రధాని మోదీ ఫొటో పెట్టాల్సిందే
- కరీంనగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్



మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్‌కు కరప్షన్ వైరస్ పట్టుకుందని..కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు కమీషన్లు దండుకుంటున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఈ ఏడాది దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడతారని, కొత్త వ్యాధి ప్రబలుతుందని జ్యోతిష పండితులు చెబుతున్నారని, కాంగ్రెస్ పాలనను గమనిస్తే అది నిజమేనని అర్థమవుతోందన్నారు. ఆదివారం కరీంనగర్‌లో బండి సంజయ్ విలేకరులతో మాట్లాడారు. సన్నబియ్యం పంపిణీని స్వాగతిస్తున్నామని, బియ్యం ఖర్చంతా కేంద్రమే భరిస్తుండడంతో రేషన్‌షాపులతోపాటు అంతటా ప్రధాని ఫొటోలు కూడా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబాన్ని కాంగ్రెస్ కాపాడుతోందని, కాంగ్రెస్ సర్కారు ఫోన్ ట్యాపింగ్ కేసును పూర్తిగా నీరుగారుస్తోందని విమర్శించారు. ప్రజలను దారి మళ్లించడానికి డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతున్నారని, దేశాన్ని విభజిస్తామంటూ బీఆర్‌ఎస్ నేతలు అవాకులు పేలుతూ దేశద్రోహానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటీకి దూరంగా ఉంటూ మజ్లిస్‌ను గెలిపించేందుకు సిద్ధమయ్యాయని వెల్లడించారు. బీజేపీకి సరిపడా బలం లేకపోయినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నామని స్పష్టం చేశారు. అతి త్వరలోనే వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడం తథ్యమన్నారు.

ప్రతి పండుగలో సైన్స్, సందేశం ఉంటుంది

- కులాలకతీతంగా ప్రజలు కలసి ఉండడమే పండుగల సారం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్య
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం



మాట్లాడుతున్న కాకునూరి. చిత్రంలో కిషన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: హిందువులు చేసుకునే ప్రతి పండుగలో సైన్స్‌తో పాటు సందేశం ఉంటుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పంచాంగశ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులాలకు అతీతంగా సామూహికంగా ప్రజలందరూ కలసిమెలిసి ఉండాలని ఈ పండుగలు మనకు సూచిస్తాయన్నారు. దేశం మరింత సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మరింత పురోగమించడంతో పాటు ప్రపంచంలో మన దేశ ఖ్యాతి మరింత పెరగాలన్నారు.

భారీగా వర్షాలు..: కాకునూరి సూర్యనారాయణ మూర్తి పంచాంగ శ్రవణం వినిపిస్తూ.. ఈ సారి జూలై చివరి వారంలో, ఆగస్టు నెలలో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. వర్షాలతో పల్లెలన్నీ సస్యశ్యామలమవుతాయని చెప్పారు. విద్యార్థులకు కొద్దిపాటి ఇబ్బందులు వస్తాయన్నారు. భారతదేశాన్ని రక్షించే రాజకీయ పక్షం బీజేపీ మాత్రమే అని, ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం చేసే శక్తి భారత్‌కు మాత్రమే ఉందని పేర్కొన్నారు.

నేడు రంజాన్ పర్వదినం

ప్రేమను పంచే శుభదినం ఈద్



ఈదుల్ ఫిత్ర్ లేక రంజాన్ పర్వదినం ప్రపంచంలోని ముస్లిం సమాజానికి అత్యంత పవిత్రమైన, ఆనందకరమైన వేడుక. అత్యంత ఉత్సాహంగా, ఆనందంగా వారు ఈవేడుకను జరుపుకుంటారు. ఈ పర్వదినాన్ని 'ఈద్' అని కూడా పిలుస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ను అనుసరించి రంజాన్ నెల ముగిసిన మరునాడు దీన్ని జరుపుకుంటారు.

రంజాన్, ఇస్లామిక్ క్యాలెండర్‌లో తొమ్మిదవ నెల. ఇది ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సమాజంలో చాలా ప్రత్యేకమైనదిగా పరిగణించబడుతుంది. ఈ నెలలో ముస్లింలు ప్రత్యేకంగా ఉపవాసం (సియామ్) పాటిస్తారు, అంటే ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు భోజనం, పానీయాలు, ఇతర శరీర సంబంధిత అవసరాలన్నీ త్యజిస్తారు. ఉపవాసం ఆధ్యాత్మిక దృష్టికోణంలో ఒక శుద్ధి ప్రక్రియగా భావించ బడుతుంది, ఇది స్వీయ నియంత్రణ, ప్రేమ, దయ, జాలి, క్షమ, సహనం, పరోపకారం, త్యాగం లాంటి అనేక సుగుణాలను పెంపొందించడానికి సహాయపడుతుంది. ఈ సందర్భంగా వారు వారి దైనందిన సేవాకార్యక్రమాలను మరింత విస్తరించుకొని, నైతికంగా, ఆధ్యాత్మికంగా తమ వ్యక్తిత్వాలను నిర్మించుకొని దేవుని కృపా కటాక్షాలు పొందడానికి ప్రయత్నిస్తారు.

ఈదుల్ ఫిత్ర్ పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని, సమాజంలో పేదరికాన్ని తొలగించే ప్రయత్నం కూడా ఎంతో కొంత జరుగుతుంది. దాతృత్వం, సామాజిక సేవలకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ పండుగ ప్రధాన లక్ష్యం. ప్రతి ఒక్కరూ తమ తోటి సోదరులకు సహకరిస్తూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోడానికి ప్రయత్నిస్తారు. సదఖ, ఫిత్రా, జకాత్ ల ద్వారా అర్హులైన అవసరార్థులకు ఆర్థిక సహాయం అందిస్తారు.

ఈదుల్ ఫిత్ర్ పర్వదినం సమస్త మానవాళి, సర్వ సృష్టిరాశి సుఖ సంతోషాలను కాంక్షించే రోజు. ఆనందం, శాంతి, సంతోషం, సమానత్వం, క్షమ, దయ, జాలి, పరోపకారం, సామాజిక బాధ్యతలను ప్రతిబింబించే ప్రత్యేకమైన రోజు. ఇది కేవలం ఒక ఆధ్యాత్మిక క్రతువు కాదు. సమాజంలో ప్రేమ, సహకారం, పరస్పర మైత్రి, బాధ్యత, ఆనందాలను పంచుకునే వేడుక. రంజాన్ నెల రోజుల శిక్షణ ద్వారానూ, ఈద్ పండుగ ద్వారానూ సమాజం ఆధ్యాత్మికతను, మానవతా విలువలను పునరుద్ధరించుకుంటుంది.

రంజాన్ నెల ముగియగానే, షవ్వాల్ నెల మొదటి రోజు ముస్లిం సోదరులు 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినం జరుపుకుంటారు. 'ఫిత్ర్' అంటే దానం, పవిత్రత లేదా శుద్ధి అని కూడా అంటారు. ఇది ఉపవాసం, ప్రార్థనల ధార్మిక విధిని పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని దైవానికి కృతజ్ఞతలు తెలుపుకునే అపురూప సందర్భం.

ఈ రోజు ముస్లింలు ఉదయాన్నే నిద్రలేచి పరిశుభ్రతను పొందుతారు. ఈద్ నమాజ్ / ప్రార్థన ఆచరించి కుటుంబంతో, స్నేహితులతో కలిసి పండుగను జరుపుకుంటారు. ప్రతి ఒక్కరూ ఈ రోజున వారి వారిస్థోమత మేరకు కొత్త దుస్తులు ధరించి, పలు రకాల తీపి వంటకాలు ముఖ్యంగా సేమియా/షీర్ ఖుర్మా తీసుకుంటారు.ఈదుల్ ఫిత్ర్ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, సమాజంలో నైతిక, ఆధ్యాత్మిక, మానవీయ సుగుణాలను పునరుద్ధరించే మహత్తరమైన రోజు. ఈ పండుగ రోజున ముస్లిం సమాజం జకాతుల్ ఫిత్ర్ అనే దానం కూడా ఇస్తారు. పేదసాదలను గుర్తించి వారికి ఫిత్రా దానాలు చెల్లించడం ద్వారా తమ దాతృత్వాన్ని చాటుకోవడం కాకుండా తమ బాధ్యతను నెరవేర్చామని భావిస్తారు.


పండగ తర్వాత కూడా...

ఈద్ తో రోజాలకు వీడ్కోలు పలికినప్పటికీ, నెలరోజులపాటు అది ఇచ్చినటువంటి తర్ఫీదు అనంతర కాలంలోనూ తొణికిస లాడాలి. పవిత్ర రంజాన్ లో పొందిన దైవభీతి శిక్షణ, దయాగుణం, సహనం, సోదరభావం, పరస్పర సహకార, సామరస్య భావన, ఒకరి కష్టసుఖాల్లో ఒకరు పాలు పంచుకునే గుణం, పరమత సహనం, సర్వ మానవ సమానత్వం లాంటి అనేక సదాచార సుగుణాలకు సంబంధించిన తర్ఫీదు ప్రభావం మిగతా పదకొండు నెలలకూ విస్తరించి, తద్వారా భావి జీవితమంతా మానవీయ విలువలే ప్రతిబింబించాలి. సమస్త మానవాళికీ సన్మార్గభాగ్యం ప్రాప్తమై, ఎలాంటి వివక్ష, అసమానతలులేని, దైవభీతి, మానవీయ విలువల పునాదులపై ఓ సుందర సమసమాజం, సత్సమాజ నిర్మాణం జరగాలి. ఇహపర లోకాల్లో అందరూ సాఫల్యం పొందాలి. ఇదే రంజాన్ ధ్యేయం.

– మదీహా అర్జుమంద్

రంజాన్ విందు

షీర్ ఖుర్మా



కావల్సినవి: **పాలు** – అర లీటర్ (3 కప్పులు); **నెయ్యి** – టేబుల్‌స్పూన్; **పంచదార** – ఒకటిన్నర టేబుల్ స్పూన్ (డేట్స్ ఎక్కువ వాడితే తక్కువ పంచదార వేసుకోవాలి); **సేవియాన్ (వెర్మిసెల్లి)**– అర కప్పు; **జీడిపప్పు** – 8 (తరగాలి); **బాదంపప్పు** – 8 (సన్నగా తరగాలి); **పిస్తా పప్పు** – 8 (తరగాలి); **ఖర్జూర** – 9 (సన్నగా తరగాలి); **యాలకులు** – 4 (లోపలి గింజలను పొడి చేయాలి); **బంగారు రంగులో ఉండే కిస్‌మిస్** – టేబుల్ స్పూన్; **రోజ్‌వాటర్** – టీ స్పూన్

తయారీ: ● సేవియాన్‌ను కొద్దిగా నెయ్యి వేసి బంగారురంగు వచ్చేలా వేయించి తీసి పక్కన పెట్టాలి ● అదే గిన్నె లేదా పాన్‌లో మరికాస్త నెయ్యి వేసి డ్రై ఫ్రూట్స్ వేసి వేయించి తీయాలి ● విడిగా పాలు మరిగించి, సన్నని మంట కాగనివ్వాలి. పాలు కొద్దిగా చిక్కబడ్డాక దీంట్లో వేయించిన సేవియాన్, పంచదార వేసి ఉడికించాలి. సేవియాన్ ఉడికాక మంట తగ్గించి డ్రై ఫ్రూట్స్ మిశ్రమం, యాలకుల పొడి వేసి కలిపి, మంట తీసేయాలి. తీపిదనం ఎక్కువ కావాలనుకునేవారు మరికాస్త పంచదార కలపుకోవచ్చు ● కుంకుమపువ్వు, గులాబీ రేకలు, మరిన్ని డ్రై ఫ్రూట్స్ చివరగా అలంకరించుకోవచ్చు.

నోట్: ఎండుఖర్జూరం ముక్కలు కలుపుకోవాలంటే వాటిని రాత్రిపూట నీళ్లలో నానబెట్టి మరుసటి రోజు ఉపయోగించాలి.

కచ్చీ బిర్యానీ



కావల్సినవి: **బాస్మతి బియ్యం** – పావు కేజీ (250 గ్రా.ములు); **మటన్** – కేజీ (ముక్కలు 2 అంగుళాల పరిమాణం); **అల్లం– వెల్లుల్లి పేస్ట్** – టేబుల్ స్పూన్; **ఉల్లిపాయలు** – 5 (నిలువుగా సన్నగా తరిగి, విడిగా వేయించి పక్కనుంచాలి); **కారం** – టేబుల్ స్పూన్; **పసుపు** – అర టీ స్పూన్; **పచ్చి బొప్పాయి ముక్క** – పేస్ట్ చేయాలి; **చిలికిన పెరుగు** – కప్పు; **కుంకుమపువ్వు** – కొన్ని రేకలు (గరిటెడు వేడి పాలలో కలిపి పక్కనుంచాలి)

మటన్ మసాలా కోసం... (దాల్చిన చెక్క, 2 యాలకులు, 3 పచ్చ యాలకులు, 3 లవంగాలు, బిర్యానీ ఆకు, అర టీ స్పూన్ మిరియాలు, అర టీ స్పూన్ సాజీర)

రైస్ మసాలా కోసం... (యాలకులు 2, దాల్చిన చెక్క, పచ్చ యాలక్కాయ, 2 లవంగాలు, నెయ్యి లేదా నూనె 3 టేబుల్‌స్పూన్లు, పుదీనా, కొత్తిమీర గుప్పెడు, ఉప్పు తగినంత)

తయారీ:
● బేసిన్‌లో మటన్ వేసి అందులో పెరుగు, అల్లం వెల్లుల్లి ముద్ద, బొప్పాయి ముద్ద, కారం, పసుపు, మసాలా, ఉప్పు, వేయించిన ఉల్లిపాయల తరుగు సగం వేసి కలిపి, 3 గంటల సేపు నానబెట్టాలి.
● కప్పు బియ్యానికి రెండున్నర కప్పుల చొప్పున నీళ్లు, మసాలా, బియ్యం, తగినంత ఉప్పు వేసి ముప్పావు వంతు వరకు ఉడికించి, నీళ్లను వడకట్టాలి.
● తర్వాత అందులో నెయ్యి వేసి కలపాలి.
● మరో మందపాటి డేకిసా(గిన్నె) తీసుకొని నెయ్యి వేసి వేడయ్యాక నానిన మటన్ వేసి కలపాలి. పైన పుదీనా, కొత్తిమీర, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, నిమ్మరసం వేయాలి. సగం ఉడికిన బియ్యం పైన లేయర్‌గా వేయాలి. మిగిలిన నెయ్యి, కుంకుమపువ్వు కలిపిన పాలు, నిమ్మరసం వేయాలి. డేకిసా మీద మూత పెట్టి, గోధుమపిండి ముద్దతో చుట్టూ మూసేయాలి. పెద్ద మంట మీద 20–25 నిమిషాలసేపు ఉడకనివ్వాలి. సన్నని మంట మీద మరో 40 నిమిషాలు ఉంచాలి. తర్వాత దించి, రైతా/ఏదైనా గ్రేవీతో వేడి వేడిగా వడ్డించాలి.

సాక్షి సినిమా

వారంలో తొలి షాట్



● రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఇటీవల పాన్ ఇండియా మూవీ 'పెద్ది' టైటిల్‌ని అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా... సినిమా టైటిల్ ప్రకటించిన రోజునే ఈ సినిమాలోని రామ్‌చరణ్ లుక్‌ని విడుదల చేశారు. ఇక ఉగాది సందర్భంగా ఈ సినిమాకి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు. అదేంటంటే... ఈ చిత్రానికి సంబంధించిన తొలి షాట్‌ను శ్రీరామ నవమి (ఏప్రిల్ 6)కి విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. మల్టీ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రం కోసం రామ్‌చరణ్ సరికొత్తగా మేకోవర్ అయ్యారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు ఇతర కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమేరా: ఆర్. రత్నవేలు.

ఉగాదికి క్లాప్... సంక్రాంతికి రిలీజ్



● వెంకటేశ్, చిరంజీవి

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా మెగా157 (వర్కింగ్ టైటిల్) ప్రారంభోత్సవం ఉగాది సందర్భంగా ఆదివారం జరిగింది. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుష్మితా కొణిదెల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి హీరో వెంకటేశ్ క్లాప్ ఇవ్వగా, నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సన్నివేశానికి దర్శక–నిర్మాత కె. రాఘవేంద్రరావు దర్శకత్వం వహించారు. నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్‌లు స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ''ఈ చిత్రంలో చిరంజీవిగారి పాత్ర పేరు శంకర్ వరప్రసాద్. చిరంజీవిగారిని డైనమిక్ అవతార్‌లో చూపించేందుకు స్వయంగా అనిల్ రావిపూడియే ఈ సినిమాకు అద్భుతమైన స్క్రీన్ ప్లే రాశారు. నవ్వులు, భావోద్వేగాలను బ్లెండ్ చేసి, మెమరబుల్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీని అందించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ వేడుకలో పలువురు సినీ రంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లుగా గతంలో మేకర్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమేరా: సమీర్ రెడ్డి.

పసందైన విందు

● సూర్య-జ్యోతికల ఇంట్లో తారల సందడి



● రమ్యకృష్ణ, జ్యోతిక, త్రిష



● సెల్ఫీ సందడి

క్రేజీ కపుల్ సూర్య–జ్యోతిక ఆదివారం ఉదయం చెన్నైలోని తమ ఇంట్లో విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో రాధికా శరత్ కుమార్, రమ్యకృష్ణ, త్రిష, నృత్య దర్శకురాలు బృంద తదితరులు పాల్గొన్నారు. ''రుచికరమైన ఆహారం... ఆప్త మిత్రులతో హ్యాపీగా సమయాన్ని గడిపాం. మేం ఒకరినొకరు ప్రోత్సహించుకున్నప్పుడు మరింత బలంగా మారిపోతాం'' అంటూ సోషల్ మీడియా వేదికగా ఫొటోలను షేర్ చేశారు త్రిష. అలాగే తారలతో సూర్య తీసిన సెల్ఫీ వైరల్‌గా మారింది.

– 'సాక్షి' తమిళ సినిమా, చెన్నై

ఆదిత్య 369 సీక్వెల్‌కి కథ సిద్ధమైంది – బాలకృష్ణ



● బాబీ, అనిల్ రావిపూడి, బాలకృష్ణ, కృష్ణప్రసాద్, బాబూ మోహన్

''ఆదిత్య 369' సినిమా సీక్వెల్‌కి కథ సిద్ధమైంది. పార్టు 2 సబ్జెక్ట్‌ను ఒక రాత్రిలో ఫైనలైజ్ చేశాం. నేను, సింగీతంగారు మళ్లీ మాట్లాడుకోవాలి'' అన్నారు బాలకృష్ణ. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా రూపొందిన చిత్రం 'ఆదిత్య 369'. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 4న రీ రిలీజ్ కానుంది. 34 సంవత్సరాల తర్వాత 4 ఓ డిజిటలైజేషన్, 5.1 సౌండ్‌తో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన 'ఆదిత్య 369' సినిమా రీ–రిలీజ్ ప్రీ రిలీజ్ వేడుకలో బాలకృష్ణ మాట్లాడుతూ – ''ఆదిత్య 369' ఫస్ట్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్. రీ రిలీజ్ తర్వాత ఇండియన్ ఫిల్మ్ కమ్యూనిటీ అంతా ఈ సినిమా గురించి మాట్లాడుకుంటుంది. ఈ సినిమాకు ముఖ్యమైన శ్రీకృష్ణ దేవరాయల పాత్రను నేను చేయడానికి కారకులైన ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంగారికి రుణపడి ఉంటాను. ఈ సినిమా నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుగార్లకు హ్యాట్సాఫ్'' అన్నారు. ''ఆదిత్య 369'ని నిర్మించు... కొన్ని దశాబ్దాల పాటు గుర్తుంటుందని ఎస్పీ బాలుగారు అన్నారు. ఈ సినిమా ఇప్పుడు రీ రిలీజ్ అవుతోందంటే అది నా పూర్వజన్మ సుకృతం'' అని తెలిపారు శివలెంక కృష్ణప్రసాద్. ''నాడు రామారావుగారు వేసిన శ్రీ కృష్ణదేవరాయల పాత్రలో ('మహామంత్రి తిమ్మరుసు'లో) అంతే అద్భుతంగా రాణించాలంటే బాలకృష్ణకు మాత్రమే సాధ్యమౌతుందని భావించి, ఆయన్ను సంప్రదించాను. బాలకృష్ణ ఓకే అనడం... 'ఆదిత్య 369' స్టార్ట్ కావడం... చకా చకా జరిగిపోయాయి. ఇంత పెద్ద సబ్జెక్ట్‌ను నమ్మి, నిర్మించిన శివలెంక కృష్ణప్రసాద్‌కి ఈ సినిమా క్రెడిట్‌లో సింహభాగం దక్కుతుంది'' అని వీడియో బైట్ రిలీజ్ చేశారు సింగీతం శ్రీనివాసరావు. అతిథులుగా దర్శకులు బాబీ, అనిల్ రావిపూడి పాల్గొన్నారు.

కాంబినేషన్ షురూ



● పూరి జగన్నాథ్, విజయ్ సేతుపతి, చార్మీ కౌర్

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఉగాది సందర్భంగా ఆదివారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ''ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ ఓ పవర్‌ఫుల్ స్టోరీ రాశారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి మునుపెన్నడూ కనిపించని క్యారెక్టర్‌లో కనిపిస్తారు. జూన్‌లో రెగ్యులర్ షూట్ ఆరంభించాలనుకుంటున్నాం. ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని పంచనున్న ఈ సినిమాని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

పదమూడేళ్లకు మళ్లీ...



● తనికెళ్ల భరణి

కమేడియన్‌గా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా... ఇలా ఏ పాత్ర చేసినా తిరుగు లేదనిపించుకున్నారు తనికెళ్ల భరణి. 'మిథునం' (2012) చిత్రంతో తనలో మంచి దర్శకుడు ఉన్న విషయాన్ని కూడా నిరూపించుకున్నారు. అయితే ఈ చిత్రం తర్వాత తనికెళ్ల మరో చిత్రానికి దర్శకత్వం వహించలేదు. పదమూడేళ్లకు ఇప్పుడు తన దర్శకత్వంలో ఓ సినిమాని ఉగాది సందర్భంగా ప్రకటించారు. ఈ చిత్రం ద్వారా కొత్త హీరో హీరోయిన్‌ను పరిచయం చేయనున్నారు. ''మా సినిమా కథ ప్రకారం 20–25 ఏళ్ల మధ్య వయసు ఉండే ఎనిమిది మందిని ఎంపిక చేసి, వారిని వెండితెరకు పరిచయం చేయబోతున్నాం. ఆసక్తి ఉన్నవారు మమ్మల్ని సంప్రదించవచ్చు'' అని పేర్కొన్నారు తనికెళ్ల భరణి.

అరవై ఐదేళ్లు వెనక్కి...



● మేకోవర్ పనుల్లో టీమ్

హీరో శర్వానంద్–దర్శకుడు సంపత్ నంది కాంబినేషన్‌లో ఓ పీరియాడికల్ యాక్షన్ మూవీ తెరకెక్కనుంది. లక్ష్మీ రాధా మోహన్ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. శర్వానంద్ కెరీర్‌లోని ఈ 38వ సినిమా కథనం 1960ల చివర్లలో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఉంటుంది. కాగా... ఈ మూవీ కోసం 1960 కాలంనాటి యువకునిగా శర్వానంద్ ప్రత్యేకంగా మేకోవర్ అవుతున్నారు. ఇందుకోసం బాలీవుడ్ స్టైలిస్ట్‌లు అలీమ్ హకీమ్, పట్టణం రషీద్ వర్క్ చేస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ సినిమా రెగ్యులర్ షూట్ మొదలు కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీతో సహా పలు భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

వేసవిలో బృందావనం

నూతన నటీనటులు బాలు, షిన్నోవా, సీనియర్ నటీనటులు అన్నపూర్ణమ్మ, శుభలేఖ శుధాకర్, శివాజీ రాజా తదితరులు నటించిన చిత్రం 'ఒక బృందావనం'. బొత్స సత్య దర్శకత్వంలో కిశోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ వేసవిలోనే సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రూపొందించిన ఈ చిత్రంలో వినోదంతో పాటు సందేశం ఉంది. పాటలను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేయనున్నాం. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేస్తాం. కొత్తదనం కోరుకునేవారికి నచ్చేలా మా సినిమా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సన్నీ–సాకేత్, కెమేరా: రాజ్ కె. నల్లి.



● 'ఒక బృందావనం' పోస్టర్

జగ్గారెడ్డి జీవితంతో...



● జగ్గారెడ్డి

రాజకీయ నాయకుడు జగ్గారెడ్డి జీవితం ఆధారంగా 'జగ్గారెడ్డి' టైటిల్‌తో ఓ మూవీ తెరకెక్కనుంది. వడ్డి రామానుజం దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమా టైటిల్ రోల్‌లో జగ్గారెడ్డి నటించనున్నారు. ఉగాది సందర్భంగా జగ్గారెడ్డి సినిమా ఆఫీస్‌ను ప్రారంభించారు ఆయన కుమార్తె జయలక్ష్మీ రెడ్డి, కుమారుడు భరత్ సాయిరెడ్డి. ఈ సినిమా గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ– ''దర్శకుడు రామానుజం చూపించిన జగ్గారెడ్డి 'వార్ ఆఫ్ లవ్' సినిమా పోస్టర్‌కి మొదట ఆకర్షితుడనయ్యాను. ఆ తర్వాత ఆయన చెప్పిన కథ నాకు నచ్చింది. విద్యార్థి నాయకుడిగా మొదలై, రాష్ట్ర నాయకుడి వరకూ... కుట్రలు, కుతంత్రాలు, హత్యా ప్రయత్నాలను దాటుకుని ఇంతవరకూ చేరిన నా ప్రయాణం ఈ కథలో కనబడుతుంది'' అన్నారు. ''ఈ చిత్రంలో జగ్గారెడ్డిగారి పాత్రతో పాటు మంచి ప్రేమకథ కూడా ఉంది. ఆయన జీవితంలోని ముఖ్య సంఘటనలు ఈ సినిమాలో ఉంటాయి'' అని చెప్పారు వడ్డి రామానుజం. ''నాన్నగారి జీవితంలోని సంఘటనలను తెరపై చూడబోతున్నామనే విషయం నన్ను ఎగ్జైట్ చేస్తోంది'' అని పేర్కొన్నారు జయలక్ష్మీ రెడ్డి.



హార్దిక్ పాండ్యాపై రూ. 12 లక్షల జరిమానా

గత ఏడాది ఐపీఎల్‌లో మూడుసార్లు స్లో ఓవర్‌రేట్ నమోదు చేసిన ముంబై ఇండియన్స్ జట్టు ఈ సీజన్‌లోనూ దానిని కొనసాగిస్తోంది. గుజరాత్ టైటాన్స్ జట్టుతో మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా నాయకత్వంలోని ముంబై నిర్ణీత సమయంలో పూర్తి 20 ఓవర్ల కోటా పూర్తి చేయలేకపోయింది. ఈ సీజన్‌లో ముంబై తొలిసారి స్లో ఓవర్‌రేట్ నమోదు చేసినందుకుగాను కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై రూ. 12 లక్షలు జరిమానా విధించారు.



10,000 మీటర్లలో గుల్‌వీర్ సింగ్ జాతీయ రికార్డు

భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్‌వీర్ సింగ్ 10,000 మీటర్ల విభాగంలో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును మరోసారి సవరించాడు. కాలిఫోర్నియాలో జరిగిన 'ద టెన్ ట్రాక్ ఫెస్టివల్ అథ్లెటిక్స్ మీట్‌లో గుల్‌వీర్ సింగ్ 10,000 మీటర్లను 27 నిమిషాల 00.22 సెకన్లలో పూర్తి చేసి ఆరో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో గత ఏడాది నవంబర్‌లో జపాన్‌లో జరిగిన మీట్ సందర్భంగా 27 నిమిషాల 14.88 సెకన్లతో తానే నెలకొల్పిన జాతీయ రికార్డును గుల్‌వీర్ బద్దలు కొట్టాడు. ఇండియన్ ఆర్మీలో నాయబ్ సుబేదార్‌గా పనిచేస్తున్న 26 ఏళ్ల గుల్‌వీర్ గత ఏడాది 5000 మీటర్లలోనూ జాతీయ రికార్డు సృష్టించాడు.



అక్షర్ పటేల్ మిచెల్ స్టార్క్

'సన్'కు స్టార్క్ స్ట్రోక్

సన్‌రైజర్స్‌కు వరుసగా రెండో ఓటమి

7 వికెట్లతో నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్ ● మిచెల్ స్టార్క్‌కు 5 వికెట్లు

సన్‌రైజర్స్ 'విధ్వంసక' బ్యాటింగ్ బృందం మరోసారి నిరాశపర్చింది. సొంతగడ్డపై ఓటమి తర్వాత వైజాగ్ చేరిన రైజర్స్ ఆట మాత్రం మారలేదు. బ్యాటింగ్ వైఫల్యంతో ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో జట్టు సాధారణ స్కోరుకే పరిమితమైంది. అనికేత్ వర్మ సిక్సర్లతో జోరు ప్రదర్శించినా అది సరిపోలేదు. ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ అలవోకగా విజయతీరం చేరింది. తొలి వికెట్‌కు 55 బంతుల్లోనే 81 పరుగులు వచ్చాక లక్ష్యం సునాయాసమైపోయింది. ఫలితంగా ఢిల్లీ ఖాతాలో వరుసగా రెండో విజయం చేరగా, హైదరాబాద్ వరుసగా రెండో ఓటమిని చవిచూసింది.

సాక్షి, విశాఖపట్నం: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండో పరాజయాన్ని ఎదుర్కొంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 18.4 ఓవర్లలో 163 పరుగులకే ఆలౌటైంది. అనికేత్ వర్మ (41 బంతుల్లో 74; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... హెన్రిచ్ క్లాసెన్ (19 బంతుల్లో 32; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ స్టార్క్ (5/35) ఐదు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా, కుల్దీప్ యాదవ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఢిల్లీ 16 ఓవర్లలో 3 వికెట్లకు 166 పరుగులు చేసి విజయాన్నందుకుంది. ఫాఫ్ డుప్లెసిస్ (27 బంతుల్లో 50; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేయగా... జేక్ ఫ్రేజర్ (32 బంతుల్లో 38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ పొరేల్ (18 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడిన సన్‌రైజర్స్ లెగ్‌స్పిన్నర్ జీషాన్ అన్సారీకే మూడు వికెట్లు దక్కాయి.

కీలక భాగస్వామ్యం...

స్టార్క్ వేసిన తొలి ఓవర్లో ట్రవిస్ హెడ్ (12 బంతుల్లో 22; 4 ఫోర్లు) రెండు ఫోర్లు కొట్టి జోరుగా మొదలు పెట్టినా, దురదృష్టవశాత్తూ అదే ఓవర్లో అభిషేక్ శర్మ (1) రనౌటయ్యాడు. హెడ్ బంతిని ఆడి సింగిల్ కోసం ప్రయత్నించగా నెమ్మదిగా స్పందించిన అభిషేక్ క్రీజ్‌కు చేరుకునేలోగా నిగమ్ విసిరిన త్రో వికెట్లను పడగొట్టింది. ఇషాన్ కిషన్ (2) ఈ మ్యాచ్‌లోనూ విఫలం కాగా, ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య గ్రౌండ్‌లోకి వచ్చిన 'లోకల్ బాయ్' నితీశ్ కుమార్ రెడ్డి (0) తీవ్రంగా నిరాశపర్చాడు. స్టార్క్ బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న రెండో బంతికే భారీ షాట్ ఆడబోయి గాల్లోకి లేపగా అక్షర్ పటేల్ చేతికి చిక్కాడు. స్టార్క్ తర్వాతి హెడ్ కూడా అవుట్ కావడంతో రైజర్స్ స్కోరు 4.1 ఓవర్లలో 37/4 వద్ద నిలిచింది. ఈ దశలో అనికేత్, క్లాసెన్ కలిసి జట్టును ఆదుకున్నారు. అప్పటికే నాలుగు వికెట్లు కోల్పోయినా... వీరిద్దరు దూకుడు మాత్రం తగ్గించకుండా ఓవర్‌కు 11 రన్‌రేట్‌తో పరుగులు రాబట్టారు. 6 పరుగుల వద్ద పొరేల్ క్యాచ్ వదిలేయడంతో అనికేత్‌కు లైఫ్ లభించింది. స్టార్క్ ఓవర్లో క్లాసెన్ వరుసగా 6, 4 కొట్టగా, నిగమ్ ఓవర్లో అనికేత్ వరుసగా 4, 6 బాదాడు. ఆ తర్వాత అక్షర్ ఓవర్లో అనికేత్ వరుసగా రెండు భారీ సిక్స్‌లు బాదాడు. ఈ జోడీ 42 బంతుల్లో 77 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పగా, నిగమ్ అద్భుత క్యాచ్‌తో క్లాసెన్ వెనుదిరిగాడు. 34 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అనికేత్ మరింత చెలరేగిపోతూ అక్షర్ ఓవర్లో వరుసగా 4, 6, 6 బాదడం విశేషం. అయితే ఇతర బ్యాటర్లంతా విఫలం కావడంతో మరో 8 బంతులు మిగిలి ఉండగానే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది.



డుప్లెసిస్

ఆరంభం నుంచే దూకుడు...

ఛేదనలో ఢిల్లీకి ఏ దశలోనూ ఇబ్బంది ఎదురుకాలేదు. ఓపెనర్లు జేక్ ఫ్రేజర్, డుప్లెసిస్ ధాటిగా ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టారు. దాంతో పవర్‌ప్లే ముగిసేసరికి ఢిల్లీ 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 52 పరుగులు చేసింది. ఈ క్రమంలో జేక్ ఫ్రేజర్ తనకు వచ్చిన రెండు 'లైఫ్'లను పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. 26 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న డుప్లెసిస్... 40 ఏళ్లు దాటిన తర్వాత ఐపీఎల్‌లో హాఫ్ సెంచరీ అరుదైన ఆటగాళ్లు గిల్‌క్రిస్ట్, గేల్, ద్రవిడ్ సరసన నిలిచాడు. అన్సారీ వేసిన 10వ ఓవర్ ఆసక్తికరంగా సాగింది. తొలి బంతికి అతను డుప్లెసిస్‌ను అవుట్ చేయగా, రెండో బంతికి పొరేల్ సింగిల్ తీశాడు. తర్వాతి మూడు బంతుల్లో వరుసగా 4, 4, 6 బాదిన జేక్ ఫ్రేజర్ చివరి బంతికి అవుటయ్యాడు. షమీ వేసిన తర్వాతి ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన కేఎల్ రాహుల్ (5 బంతుల్లో 15; 2 ఫోర్లు, 1 సిక్స్)ను కూడా అన్సారీనే వెనక్కి పంపించాడు. 52 బంతుల్లో 49 పరుగులు చేయాల్సిన ఈ స్థితిలో పొరేల్, స్టబ్స్ (14 బంతుల్లో 21 నాటౌట్; 3 ఫోర్లు) ఇక ఆలస్యం చేయలేదు. ఫటాఫట్‌గా 28 బంతుల్లోనే అభేద్యంగా 51 పరుగులు జత చేసి మ్యాచ్‌ను ముగించారు.



అనికేత్

ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి

ఆకట్టుకున్న అన్సారీ

సన్‌రైజర్స్ జట్టు తరఫున ఈ మ్యాచ్‌లో 25 ఏళ్ల లెగ్‌స్పిన్నర్ జీషాన్ అన్సారీ ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో స్వస్థలం. 5 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో బరిలోకి దిగిన అతను ఐపీఎల్‌కు ముందు యూపీ తరఫున ఒకే ఒక టి20 మ్యాచ్ ఆడాడు. 2016 అండర్-19 వరల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టులో రిషభ్ పంత్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, సర్ఫరాజ్‌లతో పాటు అన్సారీ కూడా సభ్యుడిగా ఉన్నాడు. గత ఏడాది యూపీ టి20 లీగ్‌లో మీరట్ మావెరిక్స్ తరఫున ఆడి అత్యధిక వికెట్లు (24) తీయడంతో అందరి దృష్టిలో పడ్డాడు. 'గూగ్లీ' అతని ప్రధాన బలం. వేలంలో సన్‌రైజర్స్ జట్టు విప్‌రాజ్ నిగమ్‌తో పాటు అన్సారీ కోసం పోటీ పడింది. నిగమ్‌ను ఢిల్లీ సొంతం చేసుకోగానే అన్సారీని రైజర్స్ ఎంచుకుంది.



స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (రనౌట్) 1; హెడ్ (సి) కేఎల్ రాహుల్ (బి) స్టార్క్ 22; ఇషాన్ కిషన్ (సి) స్టబ్స్ (బి) స్టార్క్ 2; నితీశ్ కుమార్ రెడ్డి (సి) అక్షర్ పటేల్ (బి) స్టార్క్ 0; అనికేత్ (సి) జేక్ ఫ్రేజర్ (బి) కుల్దీప్ 74; క్లాసెన్ (సి) నిగమ్ (బి) మోహిత్ 32; మనోహర్ (సి) డుప్లెసిస్ (బి) కుల్దీప్ 4; కమిన్స్ (సి) జేక్ ఫ్రేజర్ (బి) కుల్దీప్ 2; ముల్డర్ (సి) డుప్లెసిస్ (బి) స్టార్క్ 9; హర్షల్ పటేల్ (సి) అక్షర్ పటేల్ (బి) స్టార్క్ 5; షమీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (18.4 ఓవర్లలో ఆలౌట్) 163. వికెట్ల పతనం:** 1-11, 2-20, 3-25, 4-37, 5-114, 6-119, 7-123, 8-148, 9-162, 10-163. **బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 3.4-0-35-5, ముకేశ్ కుమార్ 2-0-17-0, అక్షర్ పటేల్ 4-0-43-0, విప్‌రాజ్ నిగమ్ 2-0-21-0, మోహిత్ శర్మ 3-0-25-1, కుల్దీప్ యాదవ్ 4-0-22-3.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: జేక్ ఫ్రేజర్ (సి అండ్ బి) అన్సారి 38; డుప్లెసిస్ (సి) ముల్డర్ (బి) అన్సారి 50; పొరేల్ (నాటౌట్) 34; కేఎల్ రాహుల్ (బి) అన్సారి 15; స్టబ్స్ (నాటౌట్) 21; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (16 ఓవర్లలో 3 వికెట్లకు) 166. వికెట్ల పతనం:** 1-81, 2-96, 3-115. **బౌలింగ్:** మొహమ్మద్ షమీ 3-0-31-0, అభిషేక్ శర్మ 3-0-27-0, ప్యాట్ కమిన్స్ 2-0-27-0, హర్షల్ పటేల్ 3-0-17-0, జీషాన్ అన్సారి 4-0-42-3, వియాన్ ముల్డర్ 1-0-16-0.

'మయామి' క్వీన్ సబలెంకా

కెరీర్‌లో 19వ సింగిల్స్ టైటిల్ సాధించిన బెలారస్ స్టార్

ఫ్లోరిడా: ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ హోదాకు తగ్గట్టు రాణించిన బెలారస్ టెన్నిస్ స్టార్ సబలెంకా తన కెరీర్‌లో 19వ సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం ముగిసిన మయామి ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 లెవెల్ టోర్నీలో సబలెంకా తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. 88 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సబలెంకా 7-5, 6-2తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)పై గెలిచింది. విజేత సబలెంకాకు 11,24,380 డాలర్ల (రూ. 9 కోట్ల 61 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ పెగూలాకు 5,97,890 డాలర్ల (రూ. 5 కోట్ల 11 లక్షలు) ప్రైజ్‌మనీ 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. టైటిల్ గెలిచే క్రమంలో సబలెంకా తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం గమనార్హం. సబలెంకా సాధించిన 19 టైటిల్స్‌లో 17 టైటిల్స్ హార్డ్‌కోర్టులపై రావడం విశేషం.



కాంస్యం నెగ్గిన మానవ్

చెన్నై: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చెన్నై స్టార్ కంటెండర్ లెవెల్ టోర్నీలో భారత నంబర్‌వన్ మానవ్ ఠక్కర్ కాంస్య పతకం సాధించాడు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో గుజరాత్‌కు చెందిన మానవ్ సెమీఫైనల్లో ఓడిపోయాడు. ప్రపంచ 54వ ర్యాంకర్ థిబాల్ట్ పొరెట్ (ఫ్రాన్స్)తో జరిగిన సెమీఫైనల్లో ప్రపంచ 63వ ర్యాంకర్ మానవ్ 10-12, 9-11, 11-7, 7-11తో ఓడిపోయాడు. మరో సెమీఫైనల్లో ఫ్లావిన్ కాటన్ (ఫ్రాన్స్) 4-11, 10-12, 7-11తో ఓ జున్‌సుంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓటమి చవిచూశాడు. సెమీఫైనల్లో ఓడిన మానవ్, ఫ్లావిన్ కాటన్‌లకు కాంస్య పతకాలు లభించాయి. ఫైనల్లో ఓ జున్‌సుంగ్ 9-11, 11-7, 11-3, 9-11, 11-4, 11-7తో పొరెట్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. పొరెట్‌తో 29 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో మానవ్ తన సర్వీస్‌లో 23 పాయింట్లు గెలిచి, 16 పాయింట్లు కోల్పోయాడు. సెమీఫైనల్లో ఓడిన మానవ్, కాటన్‌లకు 4,000 డాలర్ల (రూ. 3 లక్షల 42 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 210 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. చాంపియన్ ఓ జున్‌సుంగ్‌కు 10 వేల డాలర్లు (రూ. 8 లక్షల 55 వేలు), రన్నరప్ పొరెట్‌కు 7,525 డాలర్లు (రూ. 6 లక్షల 43 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.



భారత రెజ్లర్లకు మూడు పతకాలు

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో చివరిరోజు ఆదివారం భారత్‌కు మూడు పతకాలు లభించాయి. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో దీపక్ పూనియా (92 కేజీలు), ఉదిత్ (61 కేజీలు) రజత పతకాలు నెగ్గగా... దినేశ్ (125 కేజీలు) కాంస్య పతకాన్ని సాధించాడు. ఫైనల్స్‌లో దీపక్ పూనియా 0-10 పాయింట్ల తేడాతో అమీర్‌హుస్సేన్ (ఇరాన్) చేతిలో... ఉదిత్ 4-6 పాయింట్ల తేడాతో టకారా సుడా (జపాన్) చేతిలో ఓడిపోయారు. కాంస్య పతక బౌట్‌లో దినేశ్ తుర్క్‌మెనిస్తాన్ రెజ్లర్ సపరోవ్‌ను ఓడించాడు. ఆసియా చాంపియన్‌షిప్ చరిత్రలో 25 ఏళ్ల దీపక్ పూనియాకిది ఐదో పతకం కావడం విశేషం. 2021, 2022లలో రజతాలు నెగ్గిన దీపక్... 2019, 2020లలో కాంస్య పతకాలు సాధించాడు.



దీపక్

రాజస్తాన్ ఖాతా తెరిచింది

ఐపీఎల్‌లో తొలి గెలుపు

- 6 పరుగులతో ఓడిన చెన్నై
- నితీశ్ రాణా మెరుపు బ్యాటింగ్
- హసరంగకు 4 వికెట్లు

గువాహటి: ఐపీఎల్ సీజన్‌లో వరుసగా రెండు ఓటముల నుంచి రాజస్తాన్ రాయల్స్ కోలుకుంది. తమ మూడో మ్యాచ్‌లో విజయంతో పాయింట్ల పట్టికలో బోణీ చేసింది. ఆదివారం చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో రాజస్తాన్ 6 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌పై విజయం సాధించింది. చెన్నైకిది వరుసగా రెండో పరాజయం. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. నితీశ్ రాణా (36 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, రియాన్ పరాగ్ (28 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (44 బంతుల్లో 63; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా... రవీంద్ర జడేజా (22 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు.

రాణా మెరుపులు...

తొలి ఓవర్లోనే యశస్వి జైస్వాల్ (4) వెనుదిరగ్గా... సంజు సామ్సన్ (16 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్), రాణా కలిసి పరిస్థితిని చక్కదిద్దారు. ముఖ్యంగా రాణా ఏ బౌలర్‌నూ వదలకుండా చెలరేగిపోయాడు. ఓవర్టన్ వరుస రెండు ఓవర్లలో కలిపి 3 ఫోర్లు, సిక్స్ కొట్టాక అశ్విన్ ఓవర్లో అతను వరుసగా 6, 6, 4 బాదాడు. ఆ తర్వాత ఖలీల్ ఓవర్లోనూ 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన రాణా 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. సామ్సన్ అవుటయ్యాక కొద్దిసేపు రాణాకు పరాగ్ అండగా నిలిచాడు. అశ్విన్ ఓవర్లో మళ్లీ వరుసగా 6, 4 కొట్టాక తర్వాతి బంతికి స్టంపౌట్ కావడంతో రాణా మెరుపు ఇన్నింగ్స్ ముగిసింది. అయితే అతను అవుటయ్యాక పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించడంతో రాయల్స్ ఆశించిన స్కోరుకు చాలా దూరంలో ఆగిపోయింది. రాణా వెనుదిరిగాక 51 బంతుల్లో 58 పరుగులు మాత్రమే చేయగలిగిన జట్టు 6 వికెట్లు చేజార్చుకుంది. పవర్‌ప్లేలో 79 పరుగులు చేసిన రాజస్తాన్ మిగిలిన 14 ఓవర్లలో కలిపి 103 పరుగులు మాత్రమే సాధించింది.



నితీశ్ రాణా



హసరంగ

రుతురాజ్ హాఫ్ సెంచరీ...

ఛేదనలో చెన్నై మొదటి ఓవర్లోనే రచిన్ రవీంద్ర (0) వికెట్ కోల్పోగా, ఐదు బంతుల వ్యవధిలో 3 ఫోర్లు, సిక్స్ కొట్టి ధాటిని ప్రదర్శించిన రాహుల్ త్రిపాఠి (19 బంతుల్లో 23; 3 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. మరోవైపు రుతురాజ్ మాత్రం కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. సందీప్ ఓవర్లో అతను 3 ఫోర్లు కొట్టాడు. పరాగ్ అద్భుత క్యాచ్‌కు శివమ్ దూబే (18) వెనుదిరగ్గా, విజయ్‌శంకర్ (9) విఫలమయ్యాడు. 37 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన రుతురాజ్‌ను కీలక సమయంలో హసరంగ అవుట్ చేశాడు. 25 బంతుల్లో 54 పరుగులు చేయాల్సిన స్థితిలో ధోని (11 బంతుల్లో 16; 1 ఫోర్, 1 సిక్స్) క్రీజ్‌లోకి వచ్చాడు. అయితే అతనూ ప్రభావం చూపలేకపోగా, మరో ఎండ్‌లో జడేజా కూడా జట్టును గెలిపించడంలో సఫలం కాలేకపోయాడు. ఆఖరి 2 ఓవర్లలో విజయానికి 39 పరుగులు అవసరం కాగా, చెన్నై 32 పరుగులు రాబట్టగలిగింది.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) అశ్విన్ (బి) అహ్మద్ 4; సామ్సన్ (సి) రచిన్ (బి) నూర్ 20; నితీశ్ రాణా (స్టంప్డ్) ధోని (బి) అశ్విన్ 81; పరాగ్ (బి) పతిరణ 37; జురేల్ (సి) పతిరణ (బి) నూర్ 3; హసరంగ (సి) శంకర్ (బి) జడేజా 4; హెట్‌మైర్ (సి) అశ్విన్ (బి) పతిరణ 19; ఆర్చర్ (సి) గైక్వాడ్ (బి) అహ్మద్ 0; కార్తికేయ (రనౌట్) 1; తీక్షణ (నాటౌట్) 2; దేశ్‌పాండే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1-4, 2-86, 3-124, 4-134, 5-140, 6-166, 7-174, 8-175, 9-176. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-38-2, ఓవర్టన్ 2-0-30-0, అశ్విన్ 4-0-46-1, నూర్ అహ్మద్ 4-0-28-2, పతిరణ 4-0-28-2, జడేజా 2-0-10-1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ (సి) జురేల్ (బి) ఆర్చర్ 0; త్రిపాఠి (సి) హెట్‌మైర్ (బి) హసరంగ 23; రుతురాజ్ (సి) జైస్వాల్ (బి) హసరంగ 63; శివమ్ దూబే (సి) పరాగ్ (బి) హసరంగ 18; విజయ్‌శంకర్ (బి) హసరంగ 9; జడేజా (నాటౌట్) 32; ధోని (సి) హెట్‌మైర్ (బి) సందీప్ 16; ఓవర్టన్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 176. వికెట్ల పతనం:** 1-0, 2-46, 3-72, 4-92, 5-129, 6-164. **బౌలింగ్:** జోఫ్రా ఆర్చర్ 3-1-13-1, తుషార్ దేశ్‌పాండే 4-0-45-0, సందీప్ శర్మ 4-0-42-1, మహీశ్ తీక్షణ 4-0-30-0, హసరంగ 4-0-35-4, కార్తికేయ 1-0-10-0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
బెంగళూరు	2	2	0	4	2.266
ఢిల్లీ	2	2	0	4	1.320
లక్నో	2	1	1	2	0.963
గుజరాత్	2	1	1	2	0.625
పంజాబ్	1	1	0	2	0.550
కోల్‌కతా	2	1	1	2	-0.308
చెన్నై	3	1	2	2	-0.771
హైదరాబాద్	3	1	2	2	-0.871
రాజస్తాన్	3	1	2	2	-1.112
ముంబై	2	0	2	0	-1.163

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై X కోల్‌కతా
వేదిక: ముంబై

రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 191	నిఫ్టీ ▽ 73
77,415	23,519

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,323	▽	481
డోజోన్స్	41,584	▽	716
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,659	▽	7
డాక్స్	22,461	▽	217
షాంఘై	3,351	▽	22
నికాయ్	37,120	▽	680

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	85.25	86.27
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	109.60	112.48
€	యూరో	ఒకటి	91.25	93.90
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	56.14	57.57
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.80	55.02
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.42	66.10
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.89	23.53
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.46	24.25
¥	చైనా యువాన్	ఒకటి	10.93	12.75

రాబడిపై పన్ను సున్నా...



కొత్త బడ్జెట్‌లో ఆదాయపన్ను మినహాయింపు రాయితీలను గణనీయంగా పెంచడంతో మధ్యతరగతికి పెద్ద ఊరట లభించింది. వేతన జీవులకు స్టాండర్డ్ డిడక్షన్‌తో కలుపుకుని రూ.12.75 లక్షలు, ఇతరులకు రూ.12 లక్షల ఆదాయం ఉన్నా కానీ కొత్త విధానంలో రూపాయి పన్ను లేకుండా చేశారు ఆర్థిక మంత్రి. ఇప్పటికీ అధిక ఆదాయ పరిధిలో ఉండి, పన్ను ఆదా పెట్టుబడుల కోసం అన్వేషించే వారికి మెరుగైన మార్గం ఒకటి ఉంది. పన్ను ఆదా చేసే ట్యాక్స్ ఫ్రీ బాండ్లను ఎంపిక చేసుకోవడమే. వీటి నుంచి వచ్చే రాబడిపై ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. ఇందులో ఉండే ప్రయోజనాలు, ఎలా ఇన్వెస్ట్ చేయాలి? తదితర వివరాలతో కూడిన కథనమే ఇది...


–సాక్షి, బిజినెస్‌డెస్క్



- అందుబాటులో పలు రకాల ట్యాక్స్ ఫ్రీ బాండ్లు
- అధిక ఆదాయ వర్గాలకు ఎంతో ఆకర్షణీయం
- ప్రభుత్వరంగ సంస్థల జారీ
- అత్యుత్తమ రేటింగ్‌లు
- డిఫాల్ట్ దాదాపుగా ఉండదు
- పెట్టుబడుల్లో వైవిధ్యానికీ మెరుగైన ఎంపికే
- ఏడాదికోసారి రాబడి చెల్లింపులు

బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు), చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో పెట్టుబడులపై వచ్చే రాబడికి ఎలాంటి పన్ను ఆదా ప్రయోజనం లేదు. దీంతో రూ.12 లక్షలకు పైన ఆదాయం ఉన్న వారికి పన్ను ప్రయోజనం పరంగా ఇలాంటివి మెరుగైన సాధనాలు కాబోవు. ఎందుకంటే వీటిపై వచ్చే రాబడి పన్ను చెల్లింపుదారు వార్షిక ఆదాయానికి కలుస్తుంది. దాంతో చెల్లించాల్సిన పన్ను భారం పెరిగిపోతుంది. ఫలితంగా నికర ఆదాయం రూ.12.75 లక్షలకు మించిపోవచ్చు. దీనివల్ల పన్ను ఆదా రాయితీని కోల్పోవాల్సి వస్తుంది. కనుక అధిక ఆదాయం పరిధిలో ఉన్న వారికి అందుబాటులో ఉన్న మెరుగైన సాధనం ట్యాక్స్ ఫ్రీ బాండ్లే. ఎందుకంటే ఈ బాండ్లపై వచ్చే రాబడి ఇన్వెస్టర్ వార్షిక ఆదాయానికి కలవదు. దీంతో ఈ మేరకు ప్రయోజనం పొందొచ్చు. ముఖ్యంగా రూ.12 లక్షల స్థాయిలో ఆదాయం కలిగిన వృద్ధులు (సీనియర్ సిటిజన్లు/60 ఏళ్లు నిండిన వారు) తమ రిటైర్మెంట్ నిధిలో కొంత మొత్తాన్ని ఈ ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన నిర్ణయమే అవుతుంది. తద్వారా వారి పన్ను వర్తించే ఆదాయం రూ.12 లక్షలకు మించకుండా చూసుకోవచ్చు.

పలు సంస్థల నుంచి బాండ్లు..



గతంలో పలు ప్రభుత్వరంగ సంస్థలు జారీ చేసిన ట్యాక్స్ ఫ్రీ బాండ్లు ప్రస్తుతం బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో క్యాష్ విభాగంలో ట్రేడ్ అవుతున్నాయి. వీటిల్లో కొన్నింటిలో మెరుగైన లిక్విడిటీ (కొనుగోళ్లు, అమ్మకాల పరిమాణం)ని గమనించొచ్చు. ఇంకా 11 ఏళ్ల కాల వ్యవధితో బాండ్లు లభిస్తున్నాయి. ప్రస్తుతం వీటిల్లో పన్ను రహిత రాబడి రేట్లు 5.5–5.9 శాతం మధ్య ఉన్నాయి. పెట్టుబడికి రక్షణ, అదే సమయంలో స్థిరమైన ఆదాయం కోరుకునే వారికి ఇవి మెరుగైన ఆప్షన్ అని విశ్లేషకులు చెబుతున్నారు. 2012 నుంచి 2016 మధ్య కాలంలో 14 ప్రభుత్వరంగ ఇన్‌ఫ్రా ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌హెచ్ఏఐ, ఐఆర్ఎఫ్‌సీ, పీఎఫ్‌సీ తదితర) సెక్యూర్డ్ (రక్షణతో కూడిన) ట్యాక్స్ ఫ్రీ బాండ్లను జారీ చేశాయి. వీటి కాల వ్యవధి 10, 15, 20 ఏళ్ల చొప్పున ఉంది. ఈ బాండ్లలో పెట్టుబడులపై రాబడి చెల్లింపులు ఏడాదికోసారి చేస్తారు. వీటికి అధిక భద్రతను సూచించే 'ఏఏఏ' రేటింగ్‌ను క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు ఇచ్చాయి.

గతంలో జారీ చేసిన అన్ని ట్యాక్స్ ఫ్రీ బాండ్ల సిరీస్‌లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ అయి ఉన్నాయి. ఇప్పటి వరకు 193 ఇష్యూలు రాగా, అందులో 57 బాండ్ల మెచ్యూరిటీ (కాలవ్యవధి) ముగిసిపోయింది. మిగిలిన ట్యాక్స్ ఫ్రీ బాండ్లు ప్రస్తుతం స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడ్ అవుతున్నాయి. వీటి మెచ్యూరిటీ సగటున 11 ఏళ్ల వరకు ఉంది. ప్రభుత్వరంగ సంస్థలు జారీ చేసిన ఈ బాండ్లలో రిస్క్ చాలా చాలా తక్కువ. ఒక విధంగా ఉండదనే చెప్పుకోవాలి. దీనికితోడు పన్ను ప్రయోజనం కూడా ఉండడం అదనపు ఆకర్షణ.

ఎంపిక ఎలా..?



ఈ బాండ్ల ఎంపిక అంత కష్టమైన విషయం కాదు. ముఖ్యంగా చూడాల్సింది లిక్విడిటీయే. అంటే ఆయా బాండ్లు రోజువారీగా ఎక్స్ఛేంజ్‌లలో ట్రేడ్ అవ్వడంతోపాటు, తగినంత ట్రేడింగ్ వ్యాల్యూమ్ కూడా ఉండాలి. దీనివల్ల కొనుగోలు, విక్రయం సులభంగా మారుతుంది. ఆ తర్వాత చూడాల్సిన మరో ముఖ్యమైన అంశం బాండ్ ఈల్డ్ టు మెచ్యూరిటీ (వైటీఎం). అంటే ఆయా బాండ్‌పై మిగిలి ఉన్న కాలానికి ఎంత రాబడి వస్తుందో ఇది తెలియజేస్తుంది. అధిక లిక్విడిటీ ఉన్న బాండ్‌ను మెరుగైన ధరపై కొనుగోలు చేసుకోవచ్చు. అదే లిక్విడిటీ తగినంత లేని చోట (అమ్మకాలకు ఎక్కువ మంది లేనప్పుడు) బాండ్ కొనుగోలు వ్యయం పెరిగిపోతుంది. దీనివల్ల ఈల్డ్ తగ్గిపోతుంది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ డేటా ప్రకారం ప్రస్తుతం స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడ్ అవుతున్న వాటిల్లో 20 బాండ్లలో మెరుగైన లిక్విడిటీ ఉంటోంది. ఉదాహరణకు 'ఆర్ఈసీ బాండ్ '871ఆర్ఈసీ28'ను 2014లో 8.71 శాతం వార్షిక రేటుపై జారీ చేయగా.. గత నెలరోజులుగా రోజువారీ ట్రేడింగ్ వ్యాల్యూమ్ ఇందులో 1,534గా ఉంటోంది. ఈ బాండ్‌లో ఇటీవలి వైటీఎం 5.9 శాతంగా ఉంది.

రిటర్నులు ఆకర్షణీయం

సెకండరీ మార్కెట్లో ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడులు పెట్టే వారు మార్కెట్ రేటు కంటే ప్రధానంగా ఈల్డ్ టు మెచ్యూరిటీ (వైటీఎం) పైనే దృష్టి సారించాలి. ఇన్వెస్టర్ ఒక బాండ్‌ను కొనుగోలు చేసిన దగ్గర్నుంచి, అది మెచ్యూరిటీ అయ్యే వరకు ఏటా వచ్చే రాబడిని వైటీఎం సూచిస్తుంది. 15 ట్యాక్స్ ఫ్రీ బాండ్ల సిరీసీస్‌లలో ప్రస్తుతం వైటీఎం 5.5 శాతం నుంచి 5.9 శాతం మధ్య ఉంది.



మెరుగైన లిక్విడిటీ, రాబడితో కూడిన ట్యాక్స్ ఫ్రీ బాండ్లు

ఇష్యూ సంస్థ	సిరీస్	కూపన్ రేటు	ఇంకా ఎన్నేళ్లలో మెచ్యూరిటీ..	ఇటీవలి ధర (రూ.)	వైటీఎం	వ్యాల్యూమ్ ట్రేడింగ్
ఆర్ఈసీ	871ఆర్ఈసీ	8.71	3.64	1,105	5.94	1,534
ఎన్‌హెచ్ఏఐ	830ఎన్‌హెచ్ఏఐ27	8.30	1.97	1,073	5.86	2,958
ఐఆర్ఎఫ్‌సీ	ఐఆర్ఎఫ్‌సీ ఎన్2	8.10	2.05	1,067	5.86	1,159
నాబార్డ్	764నాబార్డ్31	7.64	6.13	1,160	5.82	928
హడ్కో	769హడ్కో31	7.69	6.11	1,110	5.74	550
ఎన్‌హెచ్ఏఐ	ఎన్‌హెచ్ఏఐ-ఎన్ఏ	7.60	5.93	1,163	5.63	2,110
పీఎఫ్‌సీ	892పీఎఫ్‌సీ33	8.92	8.78	1,245	5.59	882

తక్కువ ఆదాయం ఉన్న వారికి..?



ఆదాయపన్ను పరిధిలో లేకుండా.. ఆదాయం తక్కువగా ఉన్న వారు ప్రత్యామ్నాయాలను పరిశీలించొచ్చు. 'ఏఏఏ' రేటెడ్ కార్పొరేట్ బాండ్లలో రిస్క్ కొంత తక్కువగా ఉంటుంది. వీటిల్లో ఈల్డ్స్ 7.4 శాతం మేర ఉన్నాయి. అలాగే, వృద్ధులకు బ్యాంక్ ఎఫ్‌డీలపై 8 శాతం వరకు వడ్డీ రేటు ప్రస్తుతం లభిస్తోంది. కానీ, కార్పొరేట్ బాండ్లు, బ్యాంక్ ఎఫ్‌డీలపై వచ్చే రాబడి పూర్తిగా పన్ను పరిధిలోకి వస్తుంది. మెచ్యూరిటీతో సంబంధం లేకుండా ఆయా పెట్టుబడులపై ఏటా వచ్చే రాబడిని ఆదాయానికి కలిపి చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అధిక ఆదాయపన్ను శ్లాబు రేటులో ఉన్న వారికి పన్ను చెల్లింపులు పోగా మిగులు నికర రాబడి 4.6–5.1 శాతం మించదు. అయితే, తక్కువ ఆదాయ శ్లాబుల్లో ఉన్న వారు, పన్ను వర్తించేంత ఆదాయం లేని వారికి.. కార్పొరేట్ బాండ్లు, బ్యాంక్ ఎఫ్‌డీలు తదితర సాధనాలను పరిశీలించొచ్చు. ఎందుకంటే వీటి నుంచి వచ్చే వడ్డీ రాబడి కలిసిన తర్వాత కూడా వారి ఆదాయం పన్ను పరిధిలోకి రాదు.

ఇది అనుకూల తరుణం..



ఆర్‌బీఐ ఇటీవలే రెపో రేటును పావు శాతం తగ్గించింది. రానున్న రోజుల్లో మరో 50 బేసిస్ పాయింట్ల వరకు (0.50 శాతం) రేట్లు తగ్గుతాయని విశ్లేషకుల అంచనాగా ఉంది. ఇప్పటికీ దీర్ఘకాల డెట్ సాధనాలపై రాబడులు మెరుగ్గానే ఉన్నాయని చెప్పుకోవచ్చు. కనుక డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టుకోవాలని భావించే వారికి ప్రస్తుతం అనుకూల సమయం. పన్ను లేకపోవడం, పెట్టుబడులపై గరిష్ట పరిమితి లేకపోవడంతో ట్యాక్స్ ఫ్రీ బాండ్లు అధిక ఆదాయ వర్గాలకు మెరుగైన సాధనం అవుతుంది. పైగా ట్యాక్స్ ఫ్రీ బాండ్ల జారీ నిలిచిపోయింది. అంటే కొత్తగా బాండ్ల ఇష్యూలు రావడం లేదు. కనుక వీటిల్లో పెట్టుబడులు పెట్టుకోవాలంటే సెకండరీ మార్కెట్లో ట్రేడ్ అవుతున్న వాటి నుంచే ఎంపిక చేసుకోవాలి. ఇన్వెస్టర్లు ఇక్కడి నుంచి ఎంత కాలానికి పెట్టుబడులు పెట్టుకోవాలని అనుకుంటున్నారో.. అంత కాలంలో మెచ్యూరిటీ తీరిపోయే ట్యాక్స్ ఫ్రీ బాండ్లను ఎంపిక చేసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది.

ఇవి గమనించాలి..

- 30 శాతం ఆదాయపన్ను పరిధిలో ఉన్న వారికి 6 శాతం పన్ను రహిత రాబడి నిజంగా ఎంతో మెరుగైనది. పన్ను ప్రయోజనం కూడా కలుపుకుంటే 8.5 శాతం రాబడి వచ్చినట్టు.
- 20 శాతం పన్ను పరిధిలో ఉన్న వారికి సైతం 7.5 శాతం రాబడి వచ్చినట్టు అవుతుంది.
- 10 శాతం పన్ను పరిధిలో ఉన్న వారికి దక్కే ప్రయోజనం తక్కువే.
- కార్పొరేట్ బాండ్లతో పోల్చితే ట్యాక్స్ ఫ్రీ బాండ్లు అధిక రేటింగ్ కలిగినవి. ఈ బాండ్లను జారీ చేసేవి ప్రభుత్వరంగ సంస్థలే కనుక డిఫాల్ట్ దాదాపుగా ఉండదు.
- ఇన్వెస్టర్ తనకు వీలైనంత ఇందులో పెట్టుబడి పెట్టుకోవచ్చు. గరిష్ట పరిమితి ఉండదు.
- స్వల్పకాల లక్ష్యాల కోసం ఉద్దేశించిన పెట్టుబడులకు వీటిని ఎంపిక చేసుకోవడం సరికాదు.
- వీటిల్లో ఒక్కోసారి లిక్విడిటీ తక్కువగా ఉంటుంది. కనుక కాల వ్యవధి ముగిసేంత వరకు కొనసాగే వెసులుబాటు ఉన్న వారే వీటిని ఎంపిక చేసుకోవాలి.
- కేవలం పన్ను ప్రయోజనం కోసమే వీటిల్లో ఇన్వెస్ట్ చేయడం సరైన నిర్ణయం అనిపించుకోదు. రిస్క్ తీసుకునే వారికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఇంతకంటే ఎక్కువ రాబడినే (పన్ను పోను) ఇస్తాయి. పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడుల వైవిధ్యం కోసం డెట్ విభాగం కింద ట్యాక్స్ ఫ్రీ బాండ్లను ఎంపిక చేసుకోవచ్చు.
- అధిక లిక్విడిటీ, మెరుగైన వైటీఎం ఉన్న వాటికే పరిమితం కావాలి.



బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా పీఎం విద్యాలక్ష్మీ రుణాలు


PM VIDYALAXMI SCHEME

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda

న్యూఢిల్లీ: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన్ మంత్రి విద్యాలక్ష్మీ (పీఎం–విద్యాలక్ష్మి) పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. దేశంలోని టాప్ 860 నాణ్యమైన ఉన్నత విద్యా సంస్థల్లో (క్యూహెచ్ఈఐ) ప్రవేశం పొందిన విద్యా ర్థులు ఈ పథకం కింద రుణం కోసం అర్హులు. రూ.7.5 లక్షల వరకు రుణాలకు 75% క్రెడిట్ గ్యారంటీ కూడా ఉంటుంది. విద్యార్థులు లేదా వారి కుటుంబాలు ఎటువంటి ఆస్తులను తన ఖాగా ఇవ్వాల్సిన అవసరం లేదు. దరఖాస్తుదారులు పీఎం–విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా బ్యాంక్ ఆఫ్ బరోడా నుండి విద్యా రుణం కోసం డిజిటల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాంక్‌కు 8,300కి పైగా బ్రాంచ్‌లు, 12 ప్రత్యేక విద్యా రుణ ఆమోద కేంద్రాలు, 119 రిటైల్ అస్సెట్ ప్రాసెసింగ్ కేంద్రాలు ఉన్నాయి. అర్హులైన వి ద్యార్థులందరూ నాణ్యమైన విద్య పొందేందుకు అవసరమైన ఆర్థిక తోడ్పాటు అందించ డం తమ లక్ష్యమని బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ ముదలియార్ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
మార్కెట్‌కు గణాంకాలే కీలకం | వొడాఫోన్‌లో ప్రభుత్వ వాటా అప్

కొత్త విధానంలో పీపీఎఫ్‌పై పన్ను లేదా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఒక ఇన్వెస్టర్ ఒక పథకంలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌ను నిలిపివేసి, ఆ పెట్టుబడులను కొనసాగించినట్టయితే.. ఎక్స్‌పెన్స్ రేషియోని ఆ పెట్టుబడుల నుంచి వసూలు చేస్తూనే ఉంటారా?

– అనిల్ మిశ్రా

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను కొనసాగించినంత కాలం వాటి విలువపై ఎక్స్‌పెన్స్ రేషియోని అమలు చేస్తుంటారు. ఎక్స్‌పెన్స్ రేషియో అన్నది మ్యూచువల్ ఫండ్ సంస్థ వసూలు చేసే వార్షిక చార్జీ. పెట్టుబడుల నిర్వహణ కోసం అయ్యే వ్యయాలు, ఇతర నిర్వహణ వ్యయాలను చార్జీల రూపంలో వసూలు చేసుకుంటాయి. వార్షిక చార్జీ అయినప్పటికీ.. దీన్ని ఏరోజుకారోజు పెట్టుబడుల విలువ నుంచి మినహాయించుకుంటాయి. మనకు రోజువారీగా మార్పునకు గురయ్యే ఫండ్ యూనిట్ల ఎన్ఏవీ తెలుసుకదా. చార్జీలను మినహాయించుకున్న తర్వాతే ఈ ఎన్ఏవీ ఖరారవుతుంది. సిప్ నిలిపివేశారంటే అప్పటి నుంచి ఆయా పథకంలో మీరు తాజా పెట్టుబడులు పెట్టరనే అర్థం. కానీ, అప్పటికే చేసిన పెట్టుబడులను ఆ ఫండ్ సంస్థ నిర్వహించాలి కదా. అందుకని తమ నిర్వహణలోని మొత్తం ఆస్తులపై (ఏయూఎం) ఎక్స్‌పెన్స్ రేషియోని వసూలు చేసుకుంటాయి. కాకపోతే తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియో ఉన్న పథకాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా దీర్ఘకాలంలో రాబడులను మరింత వృద్ధి చేసుకోవచ్చు.

నేను పన్ను ఆదా కోసం ప్రజా భవిష్యనిధి పథకంలో (పీపీఎఫ్) క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఆదాయపన్నులో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంలోనూ నేను పీపీఎఫ్ పెట్టుబడులపై పన్ను ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చా? ఈ ప్రయోజనం గరిష్టంగా ఎంత వరకు ఉంటుంది?

– బల్లూ నాయక్

ఆదాయపన్ను పాత విధానంలో పీపీఎఫ్‌లో ఒక ఆర్థిక సంవత్సరంలో చేసే పెట్టుబడి గరిష్టంగా రూ.1.5 లక్షలపై సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. దీనికి అదనంగా వడ్డీ ఆదాయం, గడువు తీరిన తర్వాత చేతికి వచ్చే మొత్తంపైనా పన్ను లేదు. ఒకవేళ కొత్త పన్ను విధానాన్ని మీరు ఎంపిక చేసుకున్నట్టయితే.. సెక్షన్ 80సీ కింద పీపీఎఫ్‌లో చేసే పెట్టుబడులపై పన్ను ప్రయోజనాన్ని కోల్పోవాల్సి వస్తుంది. ఎందుకంటే కొత్త ఆదాయపన్ను విధానం తక్కువ పన్ను రేట్లతో ఉంటుంది. ఇందులో చాలా వరకు పన్ను మినహాయింపులను తొలగించేశారు. పీపీఎఫ్‌లో పెట్టుబడులపై పన్ను ఆదా ప్రయోజనం కూడా కొత్త విధానంలో లేదు. అయితే, కొత్త పన్ను విధానాన్ని ఎంపిక చేసుకోవాలా లేక పాత విధానమా? అన్నది మీ ఆదాయం, మినహాయింపులను ఎంత మేర క్లెయిమ్ చేసుకోగలరన్న పరిస్థితులపైనే ఆధారపడి ఉంటుంది. పాత పన్ను విధానంలో పీపీఎఫ్, ఇన్సూరెన్స్, గృహ రుణం చెల్లింపులు.. ఇలా అన్ని రకాల మినహాయింపులను క్లెయిమ్ చేసుకునేట్టు అయితే అదే ఎక్కువ ప్రయోజనాన్ని ఇస్తుంది. కొత్త విధానం సులభతరంగా, తక్కువ పన్ను రేట్లతో ఉంటుంది.



లుమాక్స్ ఆటోటెక్

బ్రోకరేజ్: ఎస్‌బీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 541   టార్గెట్: రూ. 857

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో లుమాక్స్ ఆటో టెక్నాలజీస్ అంచనాలకు అనుగుణమైన ఫలితాలు సాధించింది. వార్షిక ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ ఆదాయం 24 శాతం ఎగసి రూ. 906 కోట్లను తాకింది. నిర్వహణ లాభం(ఇబిటా) 11 శాతం బలపడి రూ. 118 కోట్లకు చేరింది. నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 45 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో స్టాండెలోన్ బిజినెస్‌లు మెటాలిక్ ఫ్రేములతోపాటు, లైటింగ్ నుంచి ఆదాయం నిలకడగా 10 శాతం వృద్ధి సాధించడం ఇందుకు దోహదపడింది. అంతేకాకుండా భాగస్వామ్య కంపెనీలు, అనుబంధ సంస్థల పనితీరు సైతం ఇందుకు జత కలసింది. అడ్వాన్స్‌డ్ ప్లాస్టిక్ విభాగ ఆదాయం 20 శాతం ఎగసి రూ. 513 కోట్లకు చేరింది. తద్వారా కన్సాలిడేటెడ్ ఆదాయంలో 57 శాతాన్ని ఆక్రమిస్తోంది. మెకట్రానిక్స్ ఆదాయం వార్షికంగా 75 శాతం దూసుకెళ్లింది. భాగస్వామ్య కంపెనీల కొత్త ఆర్డర్ల ప్రొడక్షన్ ప్రారంభంకావడం ఇందుకు సహకరించింది. కఠిన లిక్విడిటీ, ధరల ఒత్తిడి నేపథ్యంలో ఆఫ్టర్ మార్కెట్ విభాగ లాభదాయకత మందగించింది. మార్జిన్లు బలహీనపడ్డాయి. అయితే ప్రస్తుతం కంపెనీ ఆర్డర్ బుక్ విలువ రూ. 1,350 కోట్లను తాకింది. వీటిలో 90 శాతం తాజాగా లభించిన ఆర్డర్లేకావడంతో భవిష్యత్‌లో అమ్మకాలు మరింత జోరందుకోనున్నాయి. వెరసి పరిశ్రమ వృద్ధి రేటును మించి కంపెనీ పనితీరు ప్రదర్శించే వీలుంది. ఇతర సంస్థల కొనుగోళ్లు, భాగస్వామ్య కంపెనీల అండతో అధిక వృద్ధిని అందుకోనుంది. దీనికితోడు గత రెండు త్రైమాసికాల్లో మందగించిన ఆఫ్టర్ మార్కెట్ బిజినెస్ సైతం జనవరి–మార్చి(క్యూ4) నుంచి పుంజుకోనున్నట్లు అంచనా వేస్తున్నాం. గ్రీన్‌ఫ్యూయల్ ఎనర్జీ విభాగంలో కన్సాలిడేషన్ వచ్చే ఏడాది(2025–26) నుంచి మార్జిన్లకు బలాన్నివ్వనుంది.



వా టెక్ వాబాగ్

బ్రోకరేజ్: యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,448   టార్గెట్: రూ. 1,970

ఎందుకంటే: వాటర్ ట్రీట్‌మెంట్ సేవల ఇంజినీరింగ్ దిగ్గజం వా టెక్ వాబాగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో రూ. 2,781 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లను సంపాదించింది. దీంతో ఫ్రేమ్‌వర్క్ కాంట్రాక్టులతో కలిపి కంపెనీ మొత్తం ఆర్డర్ల బుక్ విలువ 2024 డిసెంబర్‌కల్లా రూ. 14,200 కోట్లను తాకింది. కంపెనీ ఇటీవలే సౌదీఅరేబియాలోని రియాద్‌లో కన్సార్షియం ద్వారా 37.1 కోట్ల డాలర్ల(రూ. 3,251 కోట్లు) విలువైన కాంట్రాక్టును పొందింది. అల్ హెయిర్ ఇండిపెండెంట్ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటుకు ఈ ఆర్డర్ లభించింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్డర్ల బుక్ విలువ రూ. 16,000 కోట్ల లక్ష్యాన్ని అధిగమించే అవకాశముంది. భారత్‌సహా.. మధ్యప్రాచ్యం, ఆఫ్రికాల నుంచి లభించనున్న కాంట్రాక్టుల అంచనాలతో ఆదాయంలో పటిష్ట వృద్ధిని అందుకోనున్నట్లు కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. రానున్న మూడు నుంచి ఐదేళ్ల కాలంలో వార్షిక ప్రాతిపదికన ఆదాయంలో 15–20 శాతం పురోగతిని అంచనా వేస్తోంది. ఈ బాటలో నిర్వహణ లాభం(ఇబిటా)తోపాటు నికర లాభం మరింత అధిక వృద్ధిని సాధించనున్నట్లు అభిప్రాయపడుతోంది. ఇబిటా మార్జిన్లు 13–15 శాతం స్థాయిలో నమోదుకాగలవని ఆశిస్తోంది. వెరసి వాస్తవిక ఫలితాలు అంచనాలను మించవచ్చని భావిస్తోంది. ప్రస్తుతం వరుసగా ఎనిమిదవ త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్) లోనూ కంపెనీ నికర నగదు ఆర్జనను సాధించింది. క్యూ3కల్లా రూ. 263 కోట్ల నికర నగదును అందుకుంది. వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను తగ్గించుకోవడంపై ప్రత్యేక దృష్టిని కొనసాగిస్తోంది. ఈ అంశంలో నాలుగో త్రైమాసికం(జనవరి–మార్చి)లో మరింత పురోగతిని సాధించగలమని ఆశిస్తోంది. లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయంలో అంతర్జాతీయ ప్రాజెక్టుల నుంచి 50%, ఇండస్ట్రియల్ కస్టమర్ల నుంచి 30% చొప్పున సమకూర్చుకుంటోంది. తద్వారా మార్జిన్లు మరింత బలపడనున్నాయి.



ఇప్పపువ్వు లడ్డూ గిఫ్ట్ ఆఫ్ నేచర్

మన్ కీ బాత్‌లో ఆదిలాబాద్ ఆదివాసీ మహిళలను అభినందించిన ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ/ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూర్‌లో తయారు చేసే ఇప్పపువ్వు లడ్డూలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసల వర్షం కురిపించారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన 120వ ఎపిసోడ్‌లో పీఎం ప్రత్యేకంగా ఇప్పపువ్వు లడ్డూను ప్రస్తావించారు. ఆదివాసీ మహిళలు వీటి తయారీతో గిఫ్ట్ ఆఫ్ నేచర్‌గా నిలుస్తున్నట్టు పేర్కొన్నారు. అధిక పోషకాలు కలిగిన ఈ లడ్డూ తయారీని ప్రత్యేకంగా అభినందించారు. ఇప్ప పువ్వుల్లో గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల మాధుర్యం ఉంటుందని మోదీ కొనియాడారు.



మన్‌కీ బాత్ కార్యక్రమంలో నిర్వాహకులను ప్రశంసిస్తున్న పీఎం మోదీ

మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో ఇప్ప పువ్వుతో కుకీలు తయారు చేస్తున్నారని గుర్తుచేశారు. రాజఖో గ్రామానికి చెందిన నలుగురు మహిళలు ఇందులో ప్రాచుర్యం పొందారని తెలిపారు. వారి స్ఫూర్తితో తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో మహువా (ఇప్ప)పువ్వులతో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని, వాటిని ప్రజలు ఎంతో ఇష్టపడుతున్నారని మోదీ చెప్పుకొచ్చారు.

తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు: మోదీ

మన్ కీ బాత్‌లో భాగంగా ఏపీ, తెలంగాణలోని ప్రజలకు ప్రధాని మోదీ తెలుగులోనే ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను రెండు రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకుంటారని గుర్తుచేశారు. 'ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, శ్రేయస్సు, విజయాలను తీసుకురావాలని ప్రార్థిస్తున్నాను. సంతోషం, సామరస్యాల స్ఫూర్తి వృద్ధి చెందుతూ మరింతగా వర్ధిల్లుతుందని ఆకాంక్షిస్తున్నాను'అని 'ఎక్స్'లో మోదీ పేర్కొన్నారు.

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాలు కూడా తెలుగు రాష్ట్రాల ప్రజలకు 'ఎక్స్'వేదికగా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.



ఎడ్ల బండ్ల ప్రదర్శనలు బైక్ విన్యాసాలు

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలో ఆదివారం విశ్వా వసునామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు వినూత్న రీతిలో నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎడ్ల బండ్ల ప్రదర్శనలు నిర్వహించారు. యువకులు బైక్ విన్యాసాలతో అలరించారు.

– మోత్కూరు

వైఎస్ జగన్ మళ్లీ సీఎం అవుతారు

- పంచాంగ పఠనంలో ఆధ్యాత్మికవేత్త 'బ్రహ్మశ్రీ' నూరి నారాయణమూర్తి



సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త 'బ్రహ్మశ్రీ' నూరి నారాయణమూర్తి ఈ ఏడాది పంచాంగం, రాశి ఫలాలు చదివి వినిపించారు. 'మిథున రాశి వారికి ఈ సంవత్సరమంతా మంచి జరుగుతుంది. అదే మిథున రాశిలో జన్మించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కూడా మళ్లీ మంచి రోజులు వస్తాయి. వైఎస్ జగన్ మళ్లీ విజయ దుందుభి మోగిస్తారు. శ్రీకృష్ణదేవరాయలులాగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు. ఓడిపోతే ఎవరైనా ధైర్యం కోల్పోతారు. భయపడతారు. కానీ, తిరుగులేని నాయకత్వ లక్షణాలు, అంతులేని ప్రజాదరణ కలిగిన వైఎస్ జగన్ ఏనాడూ వెనక్కి తగ్గబోరు. ఆయన రాశిఫలంలోనూ అదే ఉంది. సాంఘికంగా కూడా ఎంతో ఔన్నత్యాన్ని పొందే వైఎస్ జగన్... మళ్లీ తప్పనిసరిగా విజయం సాధిస్తారు. కచ్చితంగా సీఎం అవుతారు. వైఎస్ జగన్ అఖండ విజయం తథ్యం' అని పంచాంగ పఠనం చేసిన నూరి నారాయణమూర్తి స్పష్టం చేశారు. మాజీమంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, హను మంతరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మన దగ్గరే బంగారు కొండ

భారతీయుల వద్ద 25,000 టన్నుల గోల్డ్

టాప్-10 కేంద్ర బ్యాంకులను మించిన నిల్వలు

హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ తాజా నివేదికలో వెల్లడి



సుమారు 25,000 టన్నులు.. భారతీయుల వద్ద ఉన్న మొత్తం బంగారం నిల్వలు ఇవి. ఇందులో కొత్తేముంది అనుకుంటున్నారా... బంగారం అంటే మన వాళ్లకు అమితమైన ప్రేమ ఉంది కాబట్టి ఆ మాత్రం ఉండొచ్చు అనే కదా మీ ఆలోచన. అసలు విషయం చెబితే నోరెళ్లబెట్టాల్సిందే. ప్రపంచంలో ఉన్న 10 ప్రధాన కేంద్ర బ్యాంకుల (ఆర్‌బీఐలాంటి సెంట్రల్ బ్యాంక్స్) వద్ద ఉన్న మొత్తం పసిడి నిల్వల కంటే మన భారతీయుల వద్ద ఉన్న బంగారమే ఎక్కువని హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ తాజా నివేదికలో వెల్లడించింది. భారతీయుల కుటుంబాల్లో ఉన్న 'బంగారు కొండ'ఏపాటితో దీనిని బట్టి అర్థం అవుతుంది. తరతరాలుగా సంపదను సంరక్షించుకోవడం, భద్రత కోసం బంగారాన్ని ఒక ప్రాధాన్య ఆస్తిగా మనవారు ఆధారపడిన విధానాన్ని ఈ కొండ నొక్కి చెబుతోంది. భారతీయులు పసిడిని ఇలా విస్తారంగా కూడబెట్టుకోవడం దేశ ఆర్థిక, సాంస్కృతిక నిర్మాణంలో పుత్తడికి ఉన్న ప్రాముఖ్యతకు నిదర్శనం.

– సాక్షి, స్పెషల్ డెస్క్

ప్రత్యామ్నాయంగా పుత్తడి..

యూఎస్ఏ, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, చైనా, స్విట్జర్లాండ్, భారత్, జపాన్, తుర్కియే దేశాలు ఈ టాప్-10 జాబితాలో ఉన్నాయి. ఈ దేశాల సెంట్రల్ బ్యాంకుల మొత్తం బంగారం నిల్వలను మించి భారతీయుల వద్ద పసిడి ఉందంటే.. పొదుపు, పెట్టుబడి వ్యూహం విషయంలో భారతీయుల్లో ఈ యెల్లో మెటల్ ఎంతటి కీలకపాత్ర పోషిస్తోందో అవగతం అవుతుంది. భారతీయ కుటుంబాలకు బంగారం ప్రాధాన్యత కలిగిన ఆస్తిగా ఉందనడంలో సందేహం లేదు. ద్రవ్యోల్బణం, ఆర్థిక అనిశ్చితి, కరెన్సీ విలువల హెచ్చుతగ్గులకు దీనిని ఒక విరుగుడుగా ప్రజలు భావిస్తున్నారు. వివాహాలు, పండుగలు, మతపర వేడుకలు గోల్డ్ డిమాండ్‌ను గణనీయంగా పెంచుతున్నాయి. బ్యాంకుల్లో పొదుపు చేస్తే వచ్చే వడ్డీ కంటే బంగారం కొనుగోలు ద్వారా దీర్ఘకాలంలో అధిక ఆదాయం పొందవచ్చన్నది ప్రజల మాట. అందుకే అత్యధిక కుటుంబాల్లో బ్యాంకు డిపాజిట్లకు ప్రత్యామ్నాయంగా పుత్తడి అవతరించింది.

సెంట్రల్ బ్యాంక్స్ సైతం..

ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నా, చైనా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా భారత్ నిలిచింది. పుత్తడి దిగుమతులు సైతం భారత వాణిజ్య లోటు పెరగడానికి కారణం అవుతున్నాయి. అయితే కుటుంబ సంపద పరిరక్షణలో పసిడి ఇప్పటికీ ముఖ్యమైన భాగంగా ఉంది. భారతీయ కుటుంబాలు వ్యక్తిగతంగా బంగారాన్ని దాచుకోవడంలో ముందంజలో ఉండగా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు కూడా ఇటీవలి కాలంలో పుత్తడి కొనుగోళ్లను పెంచాయి. ఆర్థిక అస్థిరతల నుంచి రక్షణ ఇచ్చే సాధనం బంగారమేనని ఇవి భావిస్తుండడమే ఇందుకు కారణం. ఈ ప్రపంచ ధోరణులకు అనుగుణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తన బంగారు నిల్వలను క్రమంగా పెంచుకుంటోంది. 2024 డిసెంబర్ నాటికి ఆర్‌బీఐ వద్ద 876.18 టన్నుల నిల్వలు పోగయ్యాయి. తొలిస్థానంలో ఉన్న యూఎస్ఏ 8,133 టన్నులు, రెండోస్థానంలో ఉన్న జర్మనీ వద్ద 3,352 టన్నుల నిల్వలు ఉన్నాయి.






మహిళా జ్యోతిషుల పంచాంగ పఠనం

కామారెడ్డి జిల్లాకేంద్రంలోని శివపురంలోగల శ్రీసంకష్టహర గణపతి ఆలయంలో ఆదివారం ఉగాది సందర్భంగా మహిళా జ్యోతిషులు పంచాంగ పఠనం చేశారు. కాచాపురం శివరంజని, అన్నదేవర శ్వేతాదేవి, ఉమాపతి శైలజ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరు పంచాంగం చెబుతుంటే కాలనీవాసులు ఆసక్తిగా ఆలకించారు. పట్టణంలో తొలిసారిగా మహిళా జ్యోతిషులతో పంచాంగ పఠనం నిర్వహించిన ఆలయ వేద పండితులు నారాయణశర్మ, ఆంజనేయశర్మలను కాలనీవాసులు అభినందించారు.

– కామారెడ్డి అర్బన్

నా కథ నేనే రాసుకున్నా

- జగ్గారెడ్డి సినిమాలో యథాతథంగా నా రాజకీయ జీవితం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'విద్యార్థి నాయకుడిగా మొదలైన నా రాజకీయ ప్రయాణం, రాష్ట్ర నాయకుడిగా ఎదిగే వరకు చాలా మలుపులు తిరిగింది. ఎన్నో కుట్రలు, కుతంత్రాలు, హత్యా ప్రయత్నాలను దాటుకుని ఇంతవరకూ వచ్చా. రాజకీయంగా నేను ఎదుర్కొన్న కష్టాలు, బాధలు ఈ సినిమాలో కనిపిస్తాయి. సినీ పరిశ్రమలో నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది'అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) తెలిపారు. 'జగ్గారెడ్డి'సినిమా కార్యాలయం బంజారాహిల్స్‌లో ప్రారంభమైన సందర్భంగా జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. తన రాజకీయ జీవిత కథను తానే రాసుకున్నట్లు చెప్పారు. సినిమాల్లో పలు సందర్భాల్లో పోలీసులతో గొడవ పడినట్టు నటిస్తారు కానీ.. తాను నిజ జీవితంలోనే కొట్లాడానని తెలిపారు. తన జీవితంలో జరిగిన పలు ఘటనలనే ఈ సినిమాలో చూపిస్తామని, ఇక మీదట ఈ సినిమా కార్యాలయమే తన అడ్డాగా ఉంటుందని ప్రకటించారు. ఎవరో రాసిన మాటలు మాట్లాడే పాత్రలో తాను నటించబోనని.. కథ, స్క్రీన్‌ప్లే, స్టోరీ తానే రాసుకున్నానని వెల్లడించారు. ఈ సినిమాలో ఒరిజినల్ జగ్గారెడ్డిని చూస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కుమారుడు భరత్‌సాయిరెడ్డి పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వర్క్ ఫోర్స్‌లో పెరిగిన మహిళా భాగస్వామ్యం

2019లో 21 శాతం.. 2024లో 25 శాతానికి పెరుగుదల

- అయినప్పటికీ ఇంటి పనులు, బాధ్యతల బరువు అంతా ఆడవారిపైనే
- పురుషుల్లో 15–59 ఏళ్ల మధ్యలో 71 నుంచి 75 శాతానికి వృద్ధి
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ సర్వే 'టైం యూస్ ఇన్ ఇండియా -2024'లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ వర్క్‌ఫోర్స్‌లో మహిళల భాగస్వామ్యం క్రమంగా పెరుగుతోంది. గత కొన్నేళ్లుగా ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళల భాగస్వామ్యం కొంతమేర సంతృప్తికరంగా ఉంటున్నట్టు వివిధ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఉపాధి సంబంధిత కార్యకలాపాలలో... 15–59 ఏళ్ల మధ్యలోని మహిళలు పాల్గొనే శాతం 2019లో 21.8%గా ఉంటే... 2024లో అది 25 శాతానికి పెరిగింది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ తాజా సర్వే 'టైం యూస్ ఇన్ ఇండియా -2024'లో ఆయా అంశాలు వెల్లడయ్యాయి. అయితే అదే సమయంలో పురుషుల్లో 15–59 ఏళ్ల మధ్య లో నున్నవారు ఉపాధి రంగంలో... 2019లో 71.9 శాతంగా ఉన్న వారి సంఖ్య కాస్తా 2024 సర్వేలో 75 శాతానికి పెరిగింది. మొత్తంగా చూస్తే ఉపాధి స్థాయిలు 2019లో 46.4% ఉండగా, 2024లో 49.9%కి పెరిగినట్టు తేలింది.

జాతీయస్థాయిలో రెండోసారి నిర్వహించిన (2019లో తొలిసారి) ఈ తరహా సర్వేలో...వివిధ వర్గాల ప్రజలు ఆర్థిక, ఆర్థికేతర కార్యకలాపాల్లో పాల్గొన్న సందర్భంగా వెచ్చించే సమయం, అదీకూడా పురుషులు, స్త్రీలు పాల్గొనే పనిపద్ధతులు తదితర అంశాలపై ఈ అధ్యయనంలో దృష్టి నిలిపారు. ఈ సర్వేను పరిశీలిస్తే...గత ఐదేళ్ల కాలంలో ఆయా అంశాలకు సంబంధించి చోటుచేసుకున్న మార్పులు తదితరాలు చర్చకు వస్తున్నాయి. ఈ నివేదికను బట్టి చూస్తే... మహిళల ఉద్యోగ హక్కుల బలోపేతానికి, సమాన పనికి సమాన వేతనం వంటి విధానాలను ప్రోత్సహించడానికి ఇది ఉపయోగపడనుంది. అయితే మహిళలు కేంద్రీకృతంగా... ఉపాధి అవకాశాలు పెంపొందేందుకు, గృహ కార్యభారం తక్కువయ్యే విధంగా ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ అధ్యయనంలో భాగంగా...ప్రజలు తమ 24 గంటల జీవనయానాన్ని ఎలా సాగిస్తారు ? పని తదితర విషయాల్లో వెచ్చించే సమయం వంటి వాటిని పరిశీలించారు. ఉపాధి రంగంలో మహిళల పాత్ర విషయానికొస్తే వారు...వారు పనిప్రదేశాల్లో వేతనం కోసం విధుల నిర్వహణతో పాటు ఇళ్లలో, ఇతరత్రా చేసే పనులు, శ్రమకు ఎలాంటి జీతాల చెల్లింపు లేకపోవడం (పెయిడ్ అండ్ అన్‌పెయిడ్ వర్క్స్)వంటి వాటిపైనా సమాచారాన్ని రాబట్టే ప్రయత్నం చేశారు. ఇందులో...

ముఖ్యంగా మహిళల వ్యవసాయ, పశు సంరక్షణ, గృహాధారిత ఉపాధికి సంబంధించిన కార్యకలాపాలు తగిన రీతిలో వర్గీకరించలేదనే విమర్శలున్నాయి. అయితే ఈ సర్వే నిర్వహణ సందర్భంగా ప్రత్యక్షంగా ఎవరైతే ఆయా విధుల్లో నిమగ్నమవుతున్నారో (కొన్ని సందర్భాల్లో) వారి నుంచి నేరుగా కాకుండా కుటుంబసభ్యుల నుంచి వివరాలను సేకరించడం వల్ల పూర్తిస్థాయిలో సరైన సమాచారం రాలేదనే విమర్శలు కూడా ఒకవైపు వినిపిస్తున్నాయి. మహిళలు ఉచిత సేవల (అన్‌పెయిడ్) రూపంలో గణనీయమైన స్థాయిలో శ్రమ చేస్తున్నా...దాని విలువను గుర్తించే విధంగా ఈ సర్వే రూపొందించలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా, పిల్లల సంరక్షణ, వృద్ధుల సేవలు, గృహ పనులు వంటి కార్యకలాపాలు జాతీయ ఆదాయ లెక్కల్లో సరైన స్థానం పొందలేకపోతున్నాయి.

గతంలోనే మరిన్ని సర్వేలు...

ఇదిలా ఉంటే... 1983లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్ సంస్థ 'టైమ్ అలొకేషన్ స్టడీ' పేరిట ఓ అధ్యయనం నిర్వహించింది. 1996లో తమిళనాడు డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ కూడా ఓ పైలెట్ సర్వే చేపట్టింది. అదేవిధంగా 1998లో అప్పటి కేంద్ర ప్రభుత్వం కేరళ, మేఘాలయ, హరియాణ, మధ్యప్రదేశ్, ఒరిస్సా, గుజరాత్‌లలో పైలెట్ సర్వే నిర్వహించినపుడు...58 శాతం గ్రామీణ మహిళలు ఆర్థిక కార్యకలాపాల్లో నిమగ్నమైనట్టుగా వెల్లడైంది. అయితే ఇదే సమయంలో లేబర్ ఫోర్స్ సర్వే మాత్రం వీరి శాతం 25 శాతంగానే ఉన్నట్టుగా తెలిపింది.

'టైం యూస్ ఇన్ ఇండియా -2024' ముఖ్యాంశాలు...

అన్ పెయిడ్ యాక్టివిటీస్ విషయానికొస్తే...

- గ్రామీణ ప్రాంతాల్లో **65.9** శాతం మంది
- పట్టణప్రాంతాల్లో **67.1** శాతం మంది
- పురుషులు **45.8** శాతం
- మహిళలు **83.9** శాతం

పెయిడ్ యాక్టివిటీస్ విషయానికొస్తే...

- గ్రామీణ ప్రాంతాల్లో **40.9** శాతం మంది
- పట్టణ ప్రాంతాల్లో **40.2** శాతం మంది
- పురుషులు **60.5** శాతం
- మహిళలు **20.6** శాతం

ప్రధాన అంశాలు...

- ఉదయం 4 గంటలకు మొదలుపెట్టి...24గంటల సమయంలో భారత ప్రజలు విభిన్నమైన కార్యకలాపాల్లో నిమగ్నమైన తీరును పరిశీలించారు
- 24 గంటలను...30 నిముషాలకు ఒక స్లాట్ చొప్పున విభజించారు. ఈ స్లాట్‌లో కనీసం 10 నిముషాల పాటు నిర్వహించే కార్యకలాపాలను పరిశీలించారు.
- ఎంపికచేసిన కుటుంబాల్లోని ఆరేళ్లకు పైబడిన కుటుంబసభ్యుల నుంచి వారు ఏయే పనులకు ఎంతెంత సమయాన్ని వెచ్చిస్తున్నారనే దానిపై సమాచారం సేకరించారు
- ఈసర్వేలో భాగంగా...మొత్తం 1,39,487 కుటుంబాలను సర్వే చేశారు. వాటిలో గ్రామీణ ప్రాంతాల్లో 83,247, పట్టణ ప్రాంతాల్లో 56,240 కుటుంబాల నుంచి వివరాలు సేకరించారు.
- ఆరేళ్లకు పైబడిన 4,54,192 మంది నుంచి వివరాలుసేకరించారు. వారిలో పురుషులు 2,28,576, మహిళలు 2,25,565 ఉన్నారు

ఆరేళ్లకు పైబడిన వారు ఒక రోజులో వివిధ కార్యకలాపాల్లో వెచ్చించే సగటు సమయం (నిముషాల్లో)

కార్యకలాపాలు	పురుషులు	మహిళలు
ఎంప్లాయ్‌మెంట్ సంబంధిత కార్యకలాపాలు	287	71
అన్‌పెయిడ్ డొమెస్టిక్ సర్వీసెస్	24	236
కుటుంబసభ్యులకు సేవ (అన్‌పెయిడ్)	13	47
ఏదైనా నేర్చుకోవడం	94	84
సోషలైజింగ్, కుటుంబ ఫంక్షన్లు, మతపరమైన ఆచారాలు	124	126
సాంస్కృతిక కార్యకలాపాలు, క్రీడలు వంటి వాటికి	168	148
సెల్ఫ్‌కేర్ మెయింటెనెన్స్	710	706

ఎంప్లాయ్‌మెంట్, సంబంధిత కార్యకలాపాలు...

- 15-59 ఏళ్ల ఏజ్‌గ్రూప్‌లోని వారి భాగస్వామ్యం...
- గ్రామీణ ప్రాంతాల్లో 50.1 శాతం
- పట్టణ ప్రాంతాల్లో 49.6 శాతం
- మొత్తంగా చూస్తే పురుషులు 75 శాతం, మహిళలు 25 శాతంగా ఉన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా...



పంపిణీకి సిద్ధం చేసిన మామిడి మొక్కలు

చేగొమ్మ ఉద్యానవన నర్సరీలో నాణ్యమైన పండ్ల మొక్కలు

ఉద్యాన పంట సాగుపై శిక్షణ, సలహాలు కూడా..

నర్సరీకి జాతీయ ఉద్యాన బోర్డు గుర్తింపు



కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీ ద్వారా రైతులకు మేలు రకాలకు సంబంధించి మొక్కలు అందుతున్నాయి. ఇక్కడి నుంచి రైతులకు నాణ్యమైన వివిధ పండ్ల మొక్కలను సరఫరా చేయడమే కాక ఉద్యాన పంటల సాగులో రైతులకు శిక్షణ కూడా ఇస్తూ వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారు. సంప్రదాయ పంటల నుంచి రైతులను ఉద్యాన పంటల సాగు వైపు మళ్లించేలా 2017లో నాటి పాలేరు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు చేగొమ్మలో నర్సరీ ఏర్పాటు చేయించారు. గ్రామంలోని 15 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ నర్సరీని ఏర్పాటుచేయగా.. ఖమ్మం జిల్లాలో ఏకైన ఉద్యాన నర్సరీ కావడం విశేషం.

నాణ్యమైన పండ్ల మొక్కల ఉత్పత్తి

ఈ నర్సరీలో రైతులకు కావాల్సిన మామిడి తదితర పండ్ల మొక్కలతో పాటు పామాయిల్, కొబ్బరి తదితర మొక్కలను ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ నర్సరీలు, పరిశోధనా కేంద్రాల నుంచి నాణ్యమైన వివిధ రకాల మొక్కలను ఇక్కడికి తీసుకొచ్చి తోటలు పెంచుతున్నారు. ఆపై చెట్ల నుంచి తిరిగి మొక్కలను అంటుకట్టి రైతులకు తక్కువ ధరకు సరఫరా చేయడం కొనసాగుతోంది. దీంతో రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇబ్బందులు తప్పినట్లయింది. నర్సరీలో మామిడి, నిమ్మ, కొబ్బరి, వెదురు లాంటి నాణ్యమైన మొక్కలు ఉత్పత్తి చేస్తున్నారు. మరికొన్ని మొక్కల ఉత్పత్తికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇక్కడ బంగినపల్లి, తోతాపురి తదితర రకాల మామిడి మొక్కలు ఒక్కొక్కటి రూ.40కే విక్రయిస్తున్నారు. ఈ ధర ప్రైవేట్ నర్సరీల్లోనైతే రూ.100 వరకు ఉంటుంది. ఏటా జూన్ నుంచి మొక్కల విక్రయాన్ని ప్రారంభిస్తారు.



మొక్కలకు అంట్లు కడుతున్న సిబ్బంది

రైతులకు శిక్షణ.. అవగాహన



మొక్కల సంరక్షణలో భాగంగా మందు పిచికారీ చేస్తూ

చేగొమ్మ ఉద్యానవన నర్సరీ ద్వారా రైతులకు మొక్కలను సరఫరా చేయడమే కాకుండా ఉద్యాన పంటల సాగుపై శిక్షణ కూడా అందిస్తున్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు తరచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం నర్సరీలో ప్రత్యేకంగా శిక్షణ గది నిర్మించి ల్యాబ్ ఏర్పాటుచేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కొనసాగిస్తున్నారు.

ఎన్‌హెచ్‌బీ గుర్తింపు..

ఈ నర్సరీకి జాతీయ ఉద్యాన బోర్డు (ఎన్‌హెచ్‌బీ) నుంచి 2022లో గుర్తింపు లభించింది. వివిధ రకాల మొక్కల పెంపకం, సాగులో పాటిస్తున్న యాజమాన్య పద్ధతులకు రెండేళ్ల కాలానికి ఈ గుర్తింపు ఇచ్చారు. తద్వారా దేశంలో ఎక్కడికైనా నర్సరీ నుంచి మొక్కలను సరఫరా చేసే అవకాశం ఏర్పడింది. అయితే గుర్తింపు 2024తో ముగియగా.. త్వరలోనే పునఃపరిశీలించనున్న ఎన్‌హెచ్‌బీ అధికారుల కొనసాగింపుపై నిర్ణయం తీసుకోనున్నారు.



చేగొమ్మలోని ఉద్యాన నర్సరీ ముఖద్వారం

ఉద్యానసాగు మరింత పెంచేలా..

"చేగొమ్మ ఉద్యాన నర్సరీ ద్వారా రైతులకు నాణ్యమైన పండ్ల మొక్కలు సరఫరా చేస్తున్నాం. అలాగే ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తూ సాగును ప్రోత్సహిస్తున్నాం. ఉద్యానసాగుపై రైతులకు ఆలోచన కలిగించి సాగును పెంచేలా కృషి చేస్తున్నాం. ఉద్యాన పంటల సాగుతో లాభాలు ఉండటం, ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకునేలా చూస్తున్నాం."

– అపర్ణ, ఉద్యానవనశాఖ అధికారి, పాలేరు డివిజన్





అలసి.. సేదతీరుతూ..

ఆహార సేకరణలో రోజంతా శ్రమించిన ఈ కొంగలు.. అలసిపోయి చెరువు ఒడ్డుపై చేరాయి. పదుల సంఖ్యలో ఒడ్డుపై సేదతీరుతూ 'సాక్షి' కెమెరాకు ఇలా అందంగా చిక్కాయి. పెద్దపల్లి శివారు బొంపల్లి గ్రామ శివారు చెరువులో ఆదివారం కనిపించిందీ దృశ్యం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఉగాది సంబరాలు



భద్రాచలంలో జరిగే శ్రీరాముడి కల్యాణానికి హాజరు కావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి రాజపత్రం అందజేస్తున్న అర్చకులు, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి తదితరులు



గాంధీభవన్‌లో...



తెలంగాణ భవన్‌లో జరిగిన ఉగాది వేడుకలకు సంప్రదాయ దుస్తుల్లో హాజరైన కేటీఆర్ ...



బీజేపీ ఆఫీసులో ...

కేరళలో అత్యధికం.. తెలంగాణలో అతి తక్కువ

- ఫిబ్రవరి నెల ద్రవ్యోల్బణం దేశంలో అత్యల్పంగా నమోదైంది మన రాష్ట్రంలోనే
- కేరళలో 7.3 శాతం.. తెలంగాణలో 1.3 శాతం
- మన తర్వాతి స్థానంలో ఢిల్లీ
- ధరల తగ్గుదల, ఆర్‌బీఐ వడ్డీరేట్లపై ఆశాజనక అంచనాలే కారణమంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతి తక్కువ ద్రవ్యోల్బణం తెలంగాణలో నమోదైంది. ఫిబ్రవరి నెలలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని రిటైల్ ద్రవ్యోల్బణంతో పోలిస్తే మన రాష్ట్రంలో చాలా తక్కువగా ఉందని జాతీయ గణాంక కార్యాలయ (ఎన్ఎస్ఓ) డేటా వెల్లడించింది. ఈ గణాంకాల ప్రకారం వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా తెలంగాణలో ద్రవ్యోల్బణం 1.3 శాతంగా నమోదైంది. మన తర్వాత ఢిల్లీలో 1.5 శాతం నమోదు కాగా, దేశంలోనే అత్యధికంగా కేరళలో 7.3 శాతం నమోదైందని ఎన్ఎస్ఓ గణాంకాలు చెబుతున్నాయి. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న జాబితాలో కేరళ కంటే ముందు ఛత్తీస్‌గఢ్ (4.9%), కర్ణాటక, బిహార్ (4.5%), జమ్మూ కశ్మీర్ (4.3%) రాష్ట్రాలున్నాయి. ఇక, దేశం మొత్తం మీద జనవరితో పోలిస్తే ద్రవ్యోల్బణం 0.7 శాతం తగ్గి.. 3.6 శాతంగా నమోదు కావడం గమనార్హం. వాస్తవానికి, ద్రవ్యోల్బణ స్థాయిని 4 శాతం కంటే దిగువకు తీసుకురావాలనే లక్ష్యానికి అనుగుణంగా దేశంలోని 12 రాష్ట్రాలు విజయం సాధించాయి.

ఆ రెండే ప్రధాన కారణాలు

తెలంగాణలో ఈసారి అత్యల్ప ద్రవ్యోల్బణ స్థాయి నమోదయ్యేందుకు రెండు ప్రధాన కారణాలున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ద్రవ్యోల్బణంపెరిగేందుకు లేదా తగ్గేందుకు అనేక కారణాలున్నప్పటికీ ఆహార ధరల తగ్గుదలతోపాటు ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలతోనే ఫిబ్రవరిలో తక్కువ ద్రవ్యోల్బణం నమోదైందని అంటున్నారు. తెలంగాణలో డిసెంబర్, జనవరి నెలల్లో పంటలు చేతికొచ్చే నేపథ్యంలో ఆహార పదార్థాల డిమాండ్, సరఫరా మధ్య వ్యత్యాసం ఉండదని, డిమాండ్‌కు తగినట్టు సరఫరా ఉంటుందని, ఈ కారణంతోనే ముఖ్య ఆహార పదార్థాల ధరలు తగ్గుతాయని ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు అందె సత్యం అభిప్రాయపడ్డారు. నగదు లావాదేవీల తగ్గుదల, వస్తుమార్పిడి పెరిగినప్పుడు కూడా ద్రవ్యోల్బణం తగ్గుతుందని, పంటల కాలం, పండించే పంటలను బట్టి వివిధ రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం స్థాయి నమోదవుతుందని చెప్పారు.



నగరంపై మంచు దుప్పటి

ఉదయం ఎనిమిది గంటల వరకు శ్రీకాకుళం నగరం పొగమంచు దుప్పటి కప్పుకుంటోంది. 10 గంటల నుంచి ఎండ చుర్రుమనిపిస్తోంది. ఆదివారం ఉదయం నగరాన్ని పొగమంచు దట్టంగా కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



గోవులకు గొంతెండిపోతోంది

వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం జ్యోతి క్షేత్రంలో అటవీశాఖ అధికారులు గోశాలలను కూల్చివేయడంతో మండువేసవిలో మూగజీవులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఎండవేడిమికి తాళలేక కాశినాయన క్షేత్రం మెయిన్ రోడ్‌లో ఉన్న నీటి ట్యాంక్ వద్ద ఓ గోవు దాహం తీర్చుకుంటున్న దృశ్యం

– సాక్షి ఫొటో గ్రాఫర్, కడప



తీరంలో కోతకు కట్టడి

విశాఖ నగరంలో సముద్ర తీరం కోతకు గురికాకుండా అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు. సముద్రంలో ఉన్న ఇసుకను ఒడ్డుకు చేర్చేందుకు డ్రెడ్జింగ్ చేపడుతున్నారు. ఒక భారీ డ్రెడ్జింగ్ నౌక సముద్రంలో అడుగున ఉన్న ఇసుకను పైప్ లైన్ ద్వారా ఒడ్డుకు వేస్తున్న దృశ్యం

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

జీవసమాధిలోకి వెళ్లేందుకు యత్నం

అడ్డుకున్న పోలీసులు



సమాధిలోకి ప్రవేశిస్తున్న కైపు కోటిరెడ్డి

తాళ్లూరు: సజీవ సమాధి కావాలనే ఉద్దేశంతో ఓ వ్యక్తి సమాధిలోకి ప్రవేశించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతడిని సమాధి నుంచి బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం విఠలాపురంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కైపు కోటిరెడ్డి అనే వ్యక్తి విఠలాపురంలోని భూదేవి ఆలయం వద్ద తాను సజీవ సమాధి అవుతున్నానని చెప్పి అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుని ఆదివారం తెల్లవారుజామున సమాధిలోకి ప్రవేశించాడు. విషయం తెలుసుకున్న ప్రజలు అది చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎందుకు ఇలా చేస్తున్నావని గ్రామస్తులు అడిగితే ఈ ప్రపంచం శాంతియుతంగా ఉండాలని, కులమతాలు లేకుండా అందరూ ఐకమత్యంతో మెలగాలని కోరుకుంటూ తాను దీక్ష తీసుకొని సజీవ సమాధి అవుతున్నట్లు చెప్పాడు. ఈలోపు విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అతనిని సమాధి నుంచి బయటకు తీశారు. అతను ఆరోగ్యంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు.

రవాణా.. దివాలా

మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా మారింది లారీ రవాణా రంగ పరిస్థితి. డీజిల్, ఇన్సురెన్స్, టోల్‌ట్యాక్స్‌లు, స్పేర్‌పార్ట్స్ మోతతో ఇప్పటికే చుక్కలు చూస్తుండగా.. తాజాగా కిరాయిలు దొరక్క.. ఏమి చేయాలో పాలుపోక ఆందోళనకు గురవడం లారీ యజమానుల వంతవుతోంది. ఒకవేళ అరకొరగా దొరికినా ఐదేళ్ల క్రితం నాటి ధరలే లభిస్తుండటం వీరిని ఆవేదనకు గురిచేస్తోంది.

సంక్షోభంలో కూరుకుపోతున్న రంగం

- లీటర్ డీజిల్ ధర రూ.98కి చేరువలో
- 25 శాతానికి పైగా పెరిగిన టైర్లు, విడిభాగాల ధరలు
- ఐదేళ్ల క్రితం నాటి కిరాయిలే నేటికీ
- లోడింగ్ అంతా రైలు వైపే
- నాడు 30 వేల లారీలు.. నేడు పది వేల్లోపే



నెల్లూరు(టౌన్): లారీ ఉందంటేనే అదో ఠీవి. అబ్బో యజమానా.. ఇంకేమిలే అనే మాట తరచూ వినిపించేది. అయితే ఇదంతా గతం. రవాణాలో కీలక పాత్ర పోషించే ఈ రంగం ప్రస్తుతం కకావికలమవుతోంది. డీజిల్ ధర లీటర్ రూ.98కి చేరువలో ఉండటం.. జాతీయ రహదారిపై ప్రతి 50 కిలోమీటర్లకో టోల్‌గేట్.. జీఎస్టీ మోతతో ఆదాయం సంగతి దేవుడెరుగు.. కనీస ఖర్చులొస్తే చాలు మహాప్రభో అనే స్థితికి యజమానులు వస్తున్నారు.

అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో వ్యత్యాసం

గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 30 వేలకు పైగా లారీలు ఉండేవి. ప్రధానంగా కృష్ణపట్నం పోర్టుకు ఎగుమతులు, దిగుమతులు అధిక సంఖ్యలో జరిగేవి. దీంతో పాటు ఇసుక, సిలికా, క్వార్ట్జ్, ధాన్యం, బియ్యం తదితరాల్లో వీటి పాత్ర కీలకం. లాభాలెక్కువగా ఉండటంతో వీటిని కొనుగోలు చేసేందుకు ఎంతో మంది ఉత్సాహం చూపేవారు. అయితే కాలక్రమంలో ఇది పతనావస్థకు చేరుతోంది. కొత్తగా కొనుగోలు చేసే వారి సంగతి అటుంచితే.. ఉన్నవి కాపాడుకోవడమే గగనంగా మారింది. ప్రస్తుతం జిల్లాలో లారీల సంఖ్య పది వేల్లోపే ఉంటాయని సమాచారం.



డ్రైవర్లేరీ..?

రవాణా రంగ సంక్షోభానికి డ్రైవర్ల కొరతా ఓ కారణమవుతోంది. కొత్తగా ఇందులోకి వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడంలేదు. పైగా వీరికిచ్చే కమీషన్‌ను పది శాతానికి పెంచారు. ఉదాహరణకు కిరాయి రూ.లక్ష ఉంటే అందులో రూ.పది వేలను డ్రైవర్‌కు ఇవ్వాల్సిందే. లోడింగ్, అన్ లోడింగ్ బాధ్యతను యజమానే భరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ మేరకు కిరాయి వస్తే అన్ని ఖర్చులు పోనూ రూ.20 వేలు కూడా మిగలని పరిస్థితి నెలకొంది.

అన్నింట్లో మోతే..

- పెరిగిన ఇన్సురెన్స్, టైర్లు, విడి భాగాల ధరలు ఈ రంగాన్ని కకావికలం చేస్తున్నాయి.
- లారీ, దాని విలువ బట్టి థర్డ్ పార్టీ ఇన్సురెన్స్ రెండేళ్ల క్రితం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ఉండేది. ప్రస్తుతం ఇది రూ.40 వేల నుంచి రూ.80 వేల వరకు ఎగబాకింది.
- 22 చక్రాల కొత్త లారీకి ఇన్సురెన్స్ రూ.1.25 లక్షల వరకు ఉంది.
- లారీని బట్టి త్రైమాసిక పన్ను రూ.8 వేల నుంచి రూ.14 వేల వరకు ఉంది.
- నేషనల్ పర్మిట్‌కు రూ.17 వేలు అదనం.
- ఏడేళ్లు దాటిన రవాణా వాహనానికి ఏటా గ్రీన్ ట్యాక్స్‌ను చెల్లించాల్సి ఉంటుంది.

టైర్లు కొనలేక బెంబేలు..



టైరు ధర మూడేళ్ల క్రితం రూ.16 వేలుంటే, ప్రస్తుతం అది రూ.21,500కు చేరింది. రేడియల్ టైర్లు ఒక్కొక్కటి రూ.22 వేలు ఉంటే, రూ.26 వేలకు ఎగబాకాయి. ఇంజిన్ ఆయిల్‌తో పాటు విడి భాగాల ధరలను 20 శాతం మేర పెంచారు. లారీని బట్టి నిర్వహణ రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుంది. అన్ని పత్రాలున్నా పోలీస్, రవాణా అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పందే అక్కడి నుంచి పంపే పరిస్థితి లేదు.

కాలం మారింది.. కిరాయే మారలేదు

రవాణా రంగంలో నెలకొన్న తీవ్రమైన పోటీ కారణంగా ఐదేళ్లుగా ఉన్న కిరాయే నేటికీ కొనసాగుతోంది. లోడింగూ అంతంతమాత్రంగానే ఉంది. మరోవైపు సరుకుల రవాణాకు ఇటీవలి కాలంలో రైళ్లను ఎక్కువ మంది ఆశ్రయిస్తున్నారు. రాబడి తగ్గి.. ఖర్చులు అమాంతం పెరగడంతో కొందరు యజమానులు తమ లారీలను విక్రయానికి పెట్టారంటే సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. మరికొందరు బయటకొచ్చి ఏ వ్యాపారం చేయలేక అందులోనే కాలం వెళ్లదీస్తున్నారు.

ఇన్సురెన్స్, గ్రీన్ ట్యాక్స్ తగ్గించాలి



లారీ తిప్పడం ప్రస్తు తం కష్టంగా మారింది. ఇన్సురెన్స్, గ్రీన్‌ట్యాక్స్‌ను అమాంతంగా పెంచేశారు. ఈ రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శీతకన్ను వేశాయి. జీఎస్టీతో యజమానులపై పెనుభారం పడింది. టోల్‌గేట్ల సంఖ్యను తగ్గించడంతో పాటు కొత్తగా వచ్చే ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ స్టేషన్లను నిలిపేయాలి. రవాణా రంగాన్ని ఆదుకోకపోతే పూర్తిగా విక్రయించే పరిస్థితి వస్తుంది.

– గోపాలనాయుడు, లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

డీజిల్‌పై వ్యాట్‌ను తగ్గించాలి

డీజిల్‌పై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న నాలుగు శాతం వ్యాట్‌ను తగ్గించాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే దీని ధర ఇక్కడే ఎక్కువగా ఉంది. కిరాయిలూ అంతంతమాత్రంగానే ఉన్నాయి. డ్రైవర్లు దొరకని పరిస్థితి. విడిభాగాల ఖరీదులు బాగా పెరిగాయి. ప్రస్తుత రోజుల్లో పాత లారీని తిప్పే పరిస్థితే లేదు.

– దయాకర్‌రెడ్డి, యజమాని

అక్కిరాజు సుందర రామకృష్ణకు ఉగాది పురస్కారం



విజయభావన ఉగాది సాహితీ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ

విజయనగరం టౌన్: ప్రముఖ రంగస్థల, చలన చిత్ర నటుడు, గాయకుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ విజయభావన సాహితీ ఉగాది పురస్కారం అందుకున్నారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత డాక్టర్ అక్కిరాజు రామకృష్ణ మాట్లాడుతూ విద్యల నగరమైన విజయనగరంలో విజయభావన 40వ వార్షికోత్సవంలో ఉగాది పురస్కారం అందుకోవడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ జి.సన్యాసమ్మ, ఎం.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై నిరసన



మద్యం దుకాణం ఏర్పాటుపై నిరసన తెలుపుతున్న స్థానికులు

తెనాలిరూరల్: గుంటూరు జిల్లా తెనాలి పట్టణం ముత్తెంశెట్టిపాలెంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ముత్తెంశెట్టిపాలెం ప్రధాన సెంటరు వద్ద మద్యం దుకాణాన్ని ఆదివారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ కింద పాత రత్నా టాకీసు వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని ముత్తెంశెట్టిపాలెంకు తరలించారు. ఆదివారం దుకాణాన్ని తెరవడంతో స్థానికులు వ్యతిరేకించారు. ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దని అడ్డుకున్నారు. మహిళలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన కొనసాగించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. రోడ్డుపై నిరసన తెలుపడం సరికాదని, సంబంధిత ఎక్సైజ్ అధికారులను, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ అభ్యంతరాన్ని తెలియజేయాలని సూచించారు.



స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: విశాఖలోని బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఉగాది పురస్కరించుకుని ఆదివారం అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు.

మావుళ్లమ్మకు 108 వంటకాలతో సారె



సీతానగరం: తూర్పు గోదారి జిల్లా సీతానగరం గ్రామ దేవత మావుల్లమ్మ అమ్మవారికి ఆదివారం 108 రకాల వంటకాలతో సారెను సమర్పించారు. 108 రకాల వంటలను 900 బిందెల్లో ఉంచారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా బిందెలు తీసుకుని లంకూరు, నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా పాత పోలీస్ స్టేషన్, వెలమపేట, పోలీస్ స్టేషన్ మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు.

- ఏడాది కిందట పెళ్లైన ఓ జంట ఉద్యోగం చేసుకుంటోంది. భర్త చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తే... భార్య ప్రైవేటుగా పనిచేస్తోంది. ఈ ఇద్దరూ వారి వృత్తిలో బిజీగా గడుపుతున్నారు. వంట చేయడం రాదు. దీంతో కొన్ని నెలలు వంట మనిషిని పెట్టుకున్నారు. రుచి లేదని ఆమెను చాలించారు. ఈ కారణంగా ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. ఆస్పత్రి ఆవరణం, పలమనేరు రోడ్డు, మురకంబట్టు రోడ్డు, లేకుంటే తమిళనాడులోని వేలూరుకు సైతం వెళుతున్నారు.

- కొత్త జంటలకు వంట కష్టాలు
- ఆన్‌లైన్‌లో ఆర్డర్ల వెల్లువ
- వంట గదిని ముట్టుకోని వైనం
- కొందరు యూట్యూబ్ ద్వారా వంట పాఠాలు.. ఇంకొందరికి పని ఒత్తిళ్లు
- ఫాస్ట్ ఫుడ్‌కు రుచి మరిగిన వైనం
- వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

కొత్త జంటలు వంటపై తంటాలు పడుతోంది. పెళ్లి కూతుర్లు వంటింట్లో అడుగు పెట్టాలంటే తెగ ఫీలైపోతున్నారు. వంట చేయడం రాక కొంత మంది వంట గదికి దూరంగా ఉండిపోతున్నారు. మరికొంత మంది పని ఒత్తిళ్లతో వంట దగ్గరికి వెళ్లలేకపోతున్నారు. ఇంకొంత మంది యూట్యూబ్ పాఠాలతో వంట వండేందుకు అపసోపాలు పడుతున్నారు. వారు వండిందే వారికే నచ్చక సింపుల్‌గా ఆన్‌లైన్ ఆర్డర్లు పెట్టుకుంటున్నారు. లేకుంటే ఫాస్ట్ ఫుడ్‌ను వెతుక్కుంటున్నారు. వీటి సంఖ్య జిల్లాలో గణనీయంగా పెరిగింది. ఇలా ఆరగించడం వల్ల అనారోగ్య సమస్యలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



మామా.. ఆర్డర్ చేస్తున్నా..!

కాణిపాకం: ఒకప్పుడు పెళ్లి చూపులంటే.. వరుడు వైపు వరకట్నంతో పాటు అమ్మాయికి వంటా వచ్చా అని అడిగేవాళ్లు. ఏ రకమైనవి ఎక్కువగా వండుతావ్ అని గుచ్చి గుచ్చి ప్రశ్నించేవారు. అప్పట్లో చదువు, ఉద్యోగం చూసేవారు కాదు. అమ్మాయి చక్కగా వండి పెడుతూ..ఇంట్లో ఉంటే చాలనుకునేవారు. ఇప్పుడు అమ్మాయి ఎంత వరకు చదువుకుంది..ఏం చేస్తోంది అని మాత్రమే చూస్తున్నారు. వధువు వైపు నుంచి...వరుడు చదువు, ఉద్యోగం, ఫ్యామిలీ పరిస్థితి చూసి..పెళ్లి ఫిక్స్ చేసేస్తున్నారు. అమ్మాయికి వంట వచ్చా అని అడిగే వాళ్లు పూర్తిగా కరువయ్యారు.

చదువులపైనే దృష్టి పెడుతున్నారు..

ఒకప్పుడు ఆడ పిల్లలు 10 ఏళ్ల వయస్సు వచ్చిందంటేనే తల్లులు వంటింటికి తీసుకెళ్లి రకరకాల వంటలు చేయడం నేర్పేవాళ్లు. అత్తారింటికి వెళితే మీ అమ్మ వంట చేయడం నేర్పలేదా అని మమ్మలను చులకనగా మాట్లాడతారని తల్లులు పట్టుబట్టి వాళ్ల పిల్లలకు వంట నేర్పేవాళ్లు. ఇప్పుడు పల్లె, పట్నం అనే తేడా లేకుండా తల్లిదండ్రులు పిల్లలను చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచుతున్నారు. పిల్లల చదువుపై దృష్టి పెడుతున్నారు. బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం, ప్రభుత్వం ఉద్యోగం, డాక్టర్ అవ్వాలని, ఇతర ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్నారు. ఇందులో చాలా మంది ఉన్నత చదువుల కోసం బయట రాష్ట్రాలకు, విదేశాలకు పంపుతున్నారు. ఒకప్పుడు మగ పిల్లలను చదివిస్తే ప్రయోజకుడై..పోషిస్తారని అనుకునేవాళ్లు. ఇప్పుడు మగ పిల్లలతో పాటు ఆడ పిల్లలను సమానంగా చదివిస్తున్నారు. చదువు తప్ప మరేది ముట్టుకోనివ్వడం లేదు. ఈ క్రమంలో ఆడ పిల్లలు వంటింటికి దూరమవుతున్నారు. తల్లులు సైతం పెళ్లైతే వంట నేర్చుకుంటుంది లే అని తేలికగా వదిలేస్తున్నారు.

బయట ఫుడ్ డేంజర్..?

అధికంగా బయట ఫుడ్ తినడం వల్ల అనారోగ్య సమస్యలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, బ్రెయిన్ స్ట్రోక్, క్యాన్సర్, రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ తదితర సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా పెళ్లైన వారు లావు కావడానికి ఇది కూడా ఒక కారణమని వెల్లడిస్తున్నారు.

వంట చేయడం రాదు

పెళ్లైన కొత్త జంటలు లగ్జరీ లైఫ్ వెతుక్కుంటున్నారు. పెళ్లికి ముందు నుంచే ఏ పని ముట్టుకోకుండా జీవించాలని కలలు కంటున్నారు. ముఖ్యంగా ఆడ పిల్లలు పుట్టింట్లో ఉన్నట్లుగా ఉండాలని కోరుకుంటున్నారు. అత్తారింటికి వెళ్లినా.. కాఫీ అంటే బెడ్ రూమ్‌కే వచ్చేయాలనే అనుకుంటున్నారు. వంట వచ్చిన మొగుడైతే ఇంకా బెటర్ అని మొహమాటం లేకుండా చెప్పేస్తున్నారు. ఇలా పుట్టింట్లో వంట నేర్చుకోక కొత్త పెళ్లి కూతుర్లు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా కాపురం పెట్టిన వారైతే వంట కోసం తంటాలు పడుతున్నారు. కొందరు యూట్యూబ్ చూసి వంట పాఠాలు నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో చేతులు కాల్చుకుంటూ వద్దురా..ఈ వంట తంటా అంటూ చాలించుకుంటున్నారు. ఆ వండిన వంట రుచికరంగా లేకపోవడంతో అబ్బాయిలు ఆమడదూరం వెళ్లిపోతున్నారు. ఇక ఉద్యోగ రీత్యా దంపతులు ఇద్దరూ వంటింటికి దూరంగా ఉంటున్నారు. 8 గంటల పని, తర్వాత ఇంటి పని, ఇతర పనులు వెరసి అలసిపోతున్నారు.

ఫాస్ట్ ఫుడ్‌కు జై కొడుతున్నారు

దంపతులు ఇద్దరూ సంపాదన మీద పోటీ పడుతున్నారు. బిజీ లైఫ్‌లో పడిపోతున్నారు. నువ్వా నేనా అంటూ పనుల్లో నిమగ్నమైపోతున్నారు. ఈ తరుణంలో భార్య వంటింటికి దూరమై బయట ఫుడ్ కోసం అన్వేస్తున్నారు. అలాగే చాలా మంది వంట రాక అల్లాడిపోతున్నారు. యూట్యూబ్ చూసి వండిన ఆ టేస్ట్ రాకపోవడంతో ముద్ద మింగుడు పడడం లేదు. దీంతో ఫాస్ట్ ఫుడ్‌పై పడిపోతున్నారు. మూడు పూటల ఫాస్ట్‌ఫుడ్‌ను ఆరగిస్తున్నారు. లేకుంటే దర్జాగా ఇంట్లో కూర్చొని ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్లు పెట్టుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే వాళ్ల పరిస్థితి అయితే అర్ధరాత్రి కూడా ఆర్డర్లు పెట్టుకుని ఆవురావురమని తినేస్తున్నారు. ఫుడ్ దొరక్కపోయినా పిజ్జాలు, బర్గర్‌లు తెప్పించుకుని కడుపు నింపుకుంటున్నారు. దీని ఫలితంగా జిల్లాలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు విచ్చలవిడిగా పుట్టుకొచ్చాయి. బిర్యానీ సెంటర్లు సందుకొక్కటి ఉన్నాయి. వీరి రాకతో ఆ సెంటర్లు, హోటళ్లు నిండిపోతున్నాయి. కొత్త జంటలతో కళకళలాడుతున్నాయి.



రిజిస్ట్రర్ కార్యాలయంలో జరిగిన పెళ్లిళ్ల వివరాలు	
2022	2568
2023	4019
2024	4214
2025	1638

హోటళ్ల వివరాలు	
హోటళ్లు	73
రెస్టారెంట్‌లు	395
క్యాంటీన్లు	98
దాబాలు	56

అనారోగ్యం పాలుకావద్దు



ఫాస్ట్ ఫుడ్ ప్రస్తుత సమాజంలో ఫ్యాషన్‌గా మారింది. పేద, మధ్య ధనిక తేడా లేకుండా ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా కొత్తగా పెళ్లైన వారు చాలా మందికి వంట రాదు అని బయట ఫుడ్ తింటున్నారు. ఇది మంచిది కాదు. వీలైనంత వరకు తగ్గించుకుంటే మంచిది. తాజాగా వండి తినడం ఉత్తమం. బయట తినడం వల్ల అనేక రోగాలు మనిషిని చుట్టుముడుతాయి.

– వెంకట ప్రసాద్, వైద్య నిపుణుడు, చిత్తూరు

మే నెల 15వ తేదీ నుంచి సరస్వతి నదికి పుష్కరాలు.
పుణ్యస్నానానికి ముందు ఏమైనా చూడగలిగితే బావుణ్ను.
పుష్కరస్నానానికి ముందు ఐఆర్‌సీటీసీ వీటన్నింటినీ చూపిస్తోంది.
పురి... బీచ్‌లో పట్నాయక్ సైకత శిల్పాలు... ఆలయంలో జగన్నాథుడు.
కోణార్క్... బోధ్‌గయ... సారనాథ్ ఈ టూర్‌లో చూసే వరల్డ్ హెరిటేజ్ సైట్‌లు.
కాశీ విశ్వనాథుడు... విశాలాక్షి... అన్నపూర్ణలు గంగాసరయుల్లో హారతులు.
అయోధ్య బాలరాముడు... హనుమంతుడు... కైక బహుమతి కనక్‌భవన్.
ఈ ప్రయాణంలో... తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఒడిశాకి వెళ్తాం.
నాలుగో రోజుకు బీహార్‌లో అడుగుపెడతాం. ఐదవ రోజు ఉత్తరప్రదేశ్‌కి చేరుతాం.
ఎనిమిదవ రోజు త్రివేణి సంగమంలో అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కరస్నానం.



సరస్వతి నది పుష్కరాల కాలం

ఈ టూర్ మే నెల 8వ తేదీన మొదలవుతుంది. పుష్కరాలు మొదలయ్యే 15 తేదీ నాటికి ప్రయాగ్‌రాజ్‌కి తీసుకువెళ్తుంది. అంటే సరస్వతి నదికి పుష్కరాలు మొదలైన తొలిరోజే పుష్కర స్నానం ఆచరించే అవకాశం కలుగుతుంది. పుష్కరాలు మే నెల 26వ తేదీతో ముగుస్తాయి.

1 రోజు

ఈ రైలు మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. సికింద్రాబాద్‌లో మొదలై బోన్‌గిర్, జన్‌గాన్, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుంది. ఈ టూర్ ప్యాకేజ్‌లో పర్యాటకులు తమకు అనువైన స్టేషన్‌లో రైలెక్కవచ్చు. అలాగే దిగేటప్పుడు కూడా తమకు అనువైన స్టేషన్‌లో దిగవచ్చు. ఏ స్టేషన్‌లో రైలెక్కి, ఏ స్టేషన్‌లో దిగినా ప్యాకేజ్ ధరల్లో మార్పు ఉండదు.



2 రోజు

ఉదయం తొమ్మిది గంటలకు పురి పట్టణం సమీపంలోని మల్తీపత్‌పూర్ స్టేషన్‌కి చేరుతుంది. రైలు దిగి రోడ్డు మార్గాన పూరీకి వెళ్లాలి. హోటల్‌లో చెక్ ఇన్ అయి రిఫ్రెష్‌మెంట్, లంచ్ తర్వాత జగన్నాథ ఆలయం దర్శనం. రాత్రి బస పూరీలో.

ఇది పూరీ కాదు... పురి, అంటే పురం, జగన్నాథపురం అనే ఉద్దేశంలో జగన్నాతపురిగా వ్యవహారంలోకి వచ్చిన పేరు ఇది. ఇస్లాం దాడుల్లో 18 సార్లు ధ్వంసమైన ఆలయం ఇది. గజపతుల రాజ్యం. రాజ్యాలు, రాజరికాలు పోయినప్పటికీ గజపతుల రాజవంశీయులు ఇప్పటికీ ఆలయంలో సంప్రదాయ క్రతువులను నిర్వహిస్తోంది. పురి అనగానే జగన్నాథుడితోపాటు గుర్తు వచ్చే మరో పేరు పద్మశ్రీ పురస్కార గ్రహీత సుదర్శన్ పట్నాయక్. పురి బీచ్‌లో పట్నాయక్ చేతిలో రూపుదిద్దుకున్న బొమ్మలను చూడాలి. గోల్డెన్ బీచ్, చంద్రభాగ బీచ్‌లు అందంగా ఉంటాయి.



3 రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి కోణార్క్‌కు ప్రయాణం. ఆలయ వీక్షణం తరవాత మల్తీపత్‌పూర్ స్టేషన్‌కి చేరి రైలెక్కాలి. రైలు భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఆద్రా మీదుగా గయకు సాగిపోతుంది.

చేతిలో పది రూపాయల నోటుంటే... కోణార్క్ సూర్యదేవాలయాన్ని ఒకసారి చూసుకోండి. అసలైన సూర్యదేవాలయాన్ని ఆ తర్వాత చూడండి. కళింగ ఆర్కిటెక్చర్‌లో ఉన్న కదలని రథం యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్. ఈ ఆలయం వంద అడుగుల ఎత్తున్న రథం ఆకారంలో ఉంటుంది. 13వ శతాబ్దంలో తూర్పు కళింగ గంగ రాజు మొదటి నరసింగదేవ కట్టిన దేవాలయం ఇది. యూరప్ నుంచి వచ్చే నావికులు ఈ ఆలయాన్ని బ్లాక్ పగోడా అన్నారు. పురిలోని జగన్నాథ ఆలయాన్ని వైట్ పగోడా అన్నారు. బంగాళాఖాతంలో ప్రయాణిస్తున్న నౌకలకు ఈ ఆలయ శిఖరాలు పెద్ద ల్యాండ్‌మార్క్‌లు.





4 రోజు

ఉదయం తొమ్మిదిన్నరకు గయకు చేరుతుంది. రైలు దిగి బోధ్‌గయకు వెళ్లి హోటల్ గదికి వెళ్లి రిఫ్రెష్ అయిన తర్వాత లంచ్ చేసిన తర్వాత విష్ణుపాద ఆలయదర్శనం. రాత్రి బస బోధ్ గయలోనే.

బోధ్‌గయ కూడా యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్. ఇది బౌద్ధులకు పవిత్రమైన క్షేత్రం. బుద్ధుడిని హిందూ దశావతారాల్లో భాగంగా గౌరవించడంతో హిందువులకు కూడా ఈ ప్రదేశం గొప్ప యాత్రాస్థలమైంది. బుద్ధుడికి బోధి వృక్షం కింద జ్ఞానోదయం అయిందని చెప్పే ప్రదేశం ఇది. గయకు సమీపంలో (15 కి.మీలు) ఉండడంతో బుద్ధగయ, బోధ్‌గయగా వ్యవహారంలోకి వచ్చింది.

- విష్ణుపాద ఆలయం గయలో ఉంది. ఈ ఆలయంలో 40 సెంటీమీటర్ల పొడవుగా ఒక అడుగు ఉంటుంది. దాని చుట్టూ షట్‌భుజి ఆకారంలో పాలరాతి నిర్మాణం ఉంటుంది. దాని చుట్టూ కూర్చుని పాదానికి పూజలు చేస్తారు. ఇక్కడ పూజారుల దోపిడీకి గురి కాకుండా జాగ్రత్త పడాలి. భక్తులను దబాయిస్తుంటారు. నిర్వహణ సరిగ్గా ఉండదు, పరిశుభ్రత తక్కువ. పూజారులు తొలిచూపులోనే ఉత్తరాది- దక్షిణాది మనుషులను గుర్తించగలుగుతారు. దక్షిణాది వారి పట్ల వివక్ష స్పష్టంగా వారి కళ్లలో కనిపిస్తుంది. ఆలయ గోపురం నిర్మాణ కౌశలాన్ని ఆస్వాదించడానికి ప్రశాంతంగా సమయం కేటాయించాలి.





5 రోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసి ఎనిమిది గంటలకు గయ స్టేషన్‌కు చేరి రైలెక్కాలి. రైలు మధ్యాహ్నం ఒంటిగంటకు వారణాసికి చేరుతుంది. రైలు దిగి రోడ్డు మార్గాన సారనాథ్‌కు వెళ్లాలి. రాత్రి బస అక్కడే. సారనాథ్... ఇది బుద్ధుడు జ్ఞానోదయం తర్వాత ఐదుగురు శిష్యులకు తొలి ప్రవచనం ఇచ్చిన ప్రదేశం. ఇక్కడి స్థూపాన్ని ధమేక్ స్థూప అంటారు. ఇది కూడా యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్. మన అధికారిక చిహ్నం అశోకుడి ధర్మచక్రం కూడా ఉంది. టిబెట్ బౌద్ధులు కట్టిన బౌద్ధమఠం కూడా ఉంది. ప్రశాంతంగా చూడాల్సిన ప్రదేశం ఇది.



6 రోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత కాశీ (వారణాసి)కి ప్రయాణం. కాశీ విశ్వనాథుడు, విశాలాక్షి, అన్నపూర్ణ ఆలయాల దర్శనం. సాయంత్రం గంగా హారతి తర్వాత రాత్రి బస వారణాసిలో.

వారణాసిలో అడుగు పెట్టక ముందే మనోఫలకం మీద విశ్వనాథుడి రూపం మెదలుతుంది. కాశీ లైవ్ దర్శనం పేరుతో వెలువడిన వీడియోలను మన మైండ్ రీమైండ్ చేసుకుంటుంది. కొత్తగా కట్టిన ఆలయం నిర్మాణపరంగా ఒక అద్భుతం. విశ్వనాథుడి దర్శనం కోసం క్యూ లైన్‌లో ఉన్నప్పుడు పరిశీలనగా ఆలయ ప్రాంగణమంతా పరికించి చూస్తే ఇనుప కంచె వేసిన తెల్లటి నిర్మాణం కనిపిస్తుంది. అదే అప్పుడప్పుడూ వార్తల్లో కనిపిస్తున్న జ్ఞానవాపి. అక్కడి నంది విగ్రహం విశ్వనాథ ఆలయంలోని శివలింగానికి అభిముఖంగా ఉంటుంది. ఆ తర్వాత విశాలాక్షి, అన్నపూర్ణ, వారాహి, కాలభైరవ ఆలయాలను దర్శించుకుని గంగానదిలో పడవ విహారం చేయాలి. మణికర్ణికా ఘాట్, దశాశ్వమేధ ఘాట్‌ల వంటి అనేక ఘాట్‌లను సందర్శించి, గంగా హారతిని చూస్తే కాశీయాత్ర పరిపూర్ణమవుతుంది. ఇక్కడ ఉదయం పూట తాజా మీగడలో చక్కెర వేసి అమ్ముతారు. చాలా రుచిగా ఉంటుంది. మధ్యాహ్న భోజనం తర్వాత బనారస్ కిల్లీ వేసుకుని బనారస్ చీరలు, చుడీదార్‌లు కొనుక్కుంటే మనసు సంతృప్తి చెందుతుంది. సారనాథ్‌లో టైమ్ దొరికితే దుస్తుల షాపింగ్ అక్కడే చేయవచ్చు. సారనాథ్‌లో వీవర్స్ సొసైటీ మగ్గాలు, ప్రభుత్వ ఆథరైజ్‌డ్ దుకాణాలున్నాయి.







7 రోజు

ఉదయం వారణాసిలో గది చెక్ అవుట్ చేసి ఏడు గంటలకు రైలెక్కాలి. అయోధ్యకు ప్రయాణం. మధ్యాహ్నం 12.30కు అయోధ్యధామ్ స్టేషన్‌కు చేరుతుంది. రామజన్మ భూమి, హనుమాన్‌గరి దర్శనం తర్వాత సాయంత్రం సరయు నదిలో హారతిని వీక్షణం. రాత్రి భోజనం తర్వాత అయోధ్యధామ్ స్టేషన్‌కు చేరి రైలెక్కాలి. ప్రయాణం ప్రయాగ్‌రాజ్‌కి సాగుతుంది.

గంగా తీరం నుంచి సరయు తీరానికి చేరి అయోధ్యలో అడుగుపెట్టినప్పటి నుంచి బాల రాముడి రూపం త్వరగా రమ్మని పిలుస్తూ ఉంటుంది. విశాలమైన బాలరాముడి ఆలయాన్ని చూసిన తరవాత అయోధ్యలో చూడాల్సిన ముఖ్యమైన ప్రదేశం హనుమాన్ గరి, ఆ తర్వాత కనక్ భవన్. సీతారాములకు వారి వివాహ సందర్భంగా కైకేయి ఇచ్చిన బహుమతిగా చెబుతారు. అయోధ్యలో నాగేశ్వరనాథ్‌ఆలయాన్ని రాముడి కుమారుడు కుశుడు నిర్మించాడని చెబుతారు. సరయు నదిలో హారతి కూడా గంగాహారతిని తలపిస్తూ కనువిందు చేస్తుంది. అయోధ్యలో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటుతాయి.



8 రోజు

తెల్లవారు జామున 4.30 గంటలకు రైలు ప్రయాగసంగమం రైల్వేస్టేషన్‌కి చేరుతుంది. త్రివేణి సంగమంలో పవిత్రస్నానమాచరిండం ఇతర క్రతువులు పూర్తి చేసుకుని మధ్యాహ్నం రెండు గంటలకు రైలెక్కాలి.

ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) మనకు త్రివేణి సంగమస్థలిగానే గుర్తొస్తుంది. కుంభమేళా పూర్తి చేసుకుని నగరం సాధారణ స్థితికి చేరేలోపే సరస్వతి పుష్కరాల ఉత్సాహం మొదలైంది. త్రివేణి సంగమంలో గంగ, యమున నదులు స్పష్టంగా కనిపిస్తాయి. గంగ నీరు బురద మట్టి కలిసినట్లు గోధూళి వేళను తలపిస్తుంది.



యమున నీరు మన కృష్ణానది నీటిలాగ కారుమేఘాన్ని తలపిస్తుంది. పడవలో నది విహారం చేస్తూ రెండు నదుల నీటిని బాటిళ్లలో నింపుకోవచ్చు. సరస్వతి నది ఇక్కడ అంతర్వాహిని కావడంతో ఆ నీటిని వర్ణించడం సాధ్యం కాదు. పుష్కరాల సమయంలో ఇక్కడ తీర్థ స్నానం చేస్తారు. పూజాదికాలు నిర్వహిస్తారు.

9 రోజు

మొత్తం రైలు ప్రయాణమే. పదవరోజు తెల్లవారు జామున ఐదు గంటలకు రైలు విజయనగరం స్టేషన్‌కి చేరుతుంది. అదే రోజు రాత్రి తొమ్మిది గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరడంతో తీర్థయాత్ర పూర్తవుతుంది.


- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ప్యాకేజ్ వివరాలివి: అయోధ్య కాశీ పుణ్య క్షేత్ర యాత్ర (సరస్వతి పుష్కరాల స్పెషల్)

- ఇది 9 రాత్రులు, 10 రోజుల యాత్ర. పురి, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లు కవర్ అవుతాయి. ఐఆర్‌సీటీసీ నిర్వహిస్తున్న ఈ టూర్ ప్యాకేజ్ పేరు 'అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర యాత్ర (సరస్వతి పుష్కరాలు స్పెషల్), కోడ్ ఎస్‌సీజెడ్‌బీజీ 41
- ఇందులో ఎకానమీ (స్లీపర్ క్లాస్), స్టాండర్డ్ (3 ఏసీ), కంఫర్ట్ (2ఏసీ) కేటగిరీలుంటాయి. ఎకానమీలో ఒక్కొక్కరికి సుమారు 17 వేలు, స్టాండర్డ్‌లో 27 వేలు, కంఫర్ట్‌లో 35వేల రూపాయలు.

https://www.irctctourism.com/pacakage_description?packageCode=SCZBG41





నేను వైఫల్యం కన్నా పనిపట్ల విసుగు, స్తబ్ధత గురించి భయపడతాను
- రే డాలియో, బ్రిడ్జ్ వాటర్ అసోసియేట్స్ వ్యవస్థాపకుడు

బిజినెస్ రీల్

మ్యాక్స్ ఫైనాన్షియల్‌లో పెట్టుబడులు

1.6 శాతం వాటా కొనుగోలు చేసిన ఫండ్స్

న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్, మోర్గాన్ స్టాన్లీ, సొసైటీ జనరాలి తదితర 6 సంస్థలు మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో ఉమ్మడిగా 1.6 శాతం వాటా సొంతం చేసుకున్నాయి. ఇందుకు దాదాపు రూ. 612 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. షేరుకి రూ. 1,112 సగటు ధరలో 55 లక్షల షేర్లు కొనుగోలు చేశాయి. ప్రమోటర్ మ్యాక్స్ వెంచర్స్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ వీటిని విక్రయించింది.

బ్యాంక్‌టెక్‌లో బిలియన్ డాలర్ల పెట్టుబడులు

- 2027 నాటికి చేరుకుంటాయి
- సెడార్ ఐబీఎస్ఐ క్యాపిటల్ అంచనా



న్యూఢిల్లీ: బ్యాంక్‌టెక్ రంగంలోకి పెట్టుబడులు 2027 నాటికి బిలియన్ డాలర్లకు (సుమారు రూ.8,600 కోట్లు) చేరతాయని వెంచర్ క్యాపిటల్ సంస్థ 'సెడార్-ఐబీఎస్ఐ క్యాపిటల్' తన అంచనాను వెల్లడించింది. 2030 నాటికి భారత్ 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించే క్రమంలో వృద్ధిని నడిపించడంలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషించనున్నట్టు తెలిపింది. విప్లవాత్మక టెక్నాలజీలు భారత్‌లో బ్యాంకింగ్ సేవలను సమూలంగా మార్చేస్తున్నట్టు సెడార్ ఐబీఎస్ఐ వ్యవస్థాపకుడు, ఎండీ సాహిల్ ఆనంద్ తెలిపారు. సంప్రదాయ బ్యాంకింగ్ సేవల్లో 80 శాతాన్ని ప్రస్తుతం డిజిటల్‌గా నిర్వహిస్తున్నట్టు ఓ పరిశోధన వివరాలను గుర్తు చేశారు. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తున్నట్టు చెప్పారు. వీటి ఫలితంగా మారుమూల ప్రాంతాల్లోని వారికీ బ్యాంకింగ్ సేవలు అందుతున్నట్టు పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగాన్ని డిజిటల్‌గా మార్చడంలో క్లౌడ్ కంప్యూటింగ్ కీలకంగా పనిచేస్తోందంటూ.. సేవల విస్తరణ, చురుకుదనం, వ్యయాల కట్టడి ప్రయోజనాలు దీంతో లభిస్తున్నట్టు వివరించారు. సురక్షితమైన, పారదర్శకమైన లావాదేవీలకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ సాయపడుతన్నట్టు ఆనంద్ వెల్లడించారు. ముఖ్యంగా సప్లయ్ చైన్ ఫైనాన్స్, గుర్తింపు నిర్వహణలో ఇది ఎంతో మార్పును తీసుకొస్తున్నట్టు చెప్పారు. సెడార్-ఐబీఎస్ఐ క్యాపిటల్ ఇప్పటికే బ్యాంక్‌టెక్ రంగంలో రెండు లావాదేవీలతో మొత్తం రూ.240 కోట్ల పెట్టుబడులు పెట్టిందని.. తమ పోర్ట్‌ఫోలియోని 10-15 స్టార్టప్‌లకు విస్తరించనున్నట్టు ఆనంద్ ప్రకటించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-3-2025

విశాఖ	460-00
చిత్తూరు	520-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	460-00
విజయవాడ	470-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	455-00
వరంగల్	457-00
రిటైల్ ధర	5.15

మార్కెట్‌కు గణాంకాలే కీలకం

- వెల్లడికానున్న దేశ, విదేశీ గణాంకాలు
- అమల్లోకిరానున్న యూఎస్ టారిఫ్‌లు
- ఈ వారం ట్రేడింగ్ 4 రోజులకే పరిమితం

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్ ఈ వారం ప్రధానంగా గణాంకాలపై ఆధారపడనుంది. దేశ, విదేశీ తయారీ, సర్వీసు రంగ గణాంకాలు ఈ వారంలో విడుదలకానున్నాయి. దీనికితోడు పలు దేశాలపై యూఎస్ ప్రభుత్వ తాజా టారిఫ్‌లు బుధవారం(2) నుంచి అమల్లోకి రానున్నాయి. వెరసి ఈ వారం మార్కెట్లు ఆటుపోట్లను చవిచూసే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా నేడు(31న) స్టాక్ మార్కెట్లు పనిచేయవు. దీంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. ఇతర వివరాలు చూద్దాం.

గత వారమిలా..

గత వారం(24-28) దేశీ స్టాక్ మార్కెట్లు ఆటుపోట్ల మధ్య నికరంగా లాభపడ్డాయి. సెన్సెక్స్ 509 పాయింట్లు(0.7 శాతం) పుంజుకుని 77,415 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 169 పాయింట్లు(0.7%) బలపడి 23,519 వద్ద నిలిచింది. అయితే తిరిగి చిన్న షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం నీరసించింది. స్మాల్‌క్యాప్ మరింత అధికంగా 1.4% క్షీణించింది. తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం(2024-25)లో సెన్సెక్స్ 3,764 పాయింట్లు (5.1%) ర్యాలీ చేయగా.. నిఫ్టీ 1,192 పాయింట్లు (5.3 శాతం) లాభపడింది. ఈ బాటలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ 5.6%, స్మాల్ క్యాప్ 8 శాతం చొప్పున ఎగశాయి. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) 25,90,547 కోట్లు పెరిగి 4,12,87,647 కోట్ల(4.82 లక్షల కోట్ల డాలర్లు)కు చేరింది.

తయారీ, సర్వీసుల రంగాలపై దృష్టి



జీడీపీ ఎఫెక్ట్

గత కేలండర్ ఏడాది(2024) చివరి త్రైమాసికం(అక్టోబర్-డిసెంబర్)లో యూఎస్ జీడీపీ అంచనాలకు అనుగుణంగా నెమ్మదించింది. తుది అంచనాల ప్రకారం వార్షిక ప్రాతిపదికన వృద్ధి 3.1 శాతం నుంచి 2.4 శాతానికి మందగించింది. అయితే కొత్త ప్రెసిడెంట్ ట్రంప్ తెరతీస్తున్న టారిఫ్‌లు ఆర్థిక వ్యవస్థకు మరిన్ని సవాళ్లు విసరనున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. బిజినెస్ ప్రణాళికలు, కన్జ్యూమర్ వినియోగం తదితరాలపై ప్రతికూల ప్రభావం చూపే వీలున్నట్లు పేర్కొన్నారు. వెరసి ఈ ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై ప్రసరించనున్నట్లు అభిప్రాయపడ్డారు.

సుంకాలపై కన్ను

ఈ వారం అమల్లోకిరానున్న ట్రంప్ సుంకాల(టారిఫ్‌లు)పై ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు దృష్టిసారించనున్నట్లు మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ సీనియర్ వీపీ ప్రశాంత్ తాప్సే పేర్కొన్నారు. వీటితోపాటు గణాంకాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్‌కుమార్ తెలియజేశారు. మార్కెట్ ప్రభావిత అంశాలు కరవుకావడంతో గణాంకాలు, కీలక వాణిజ్య దేశాలపై యూఎస్ టారిఫ్‌లకు ప్రాధాన్యత ఏర్పడినట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా సైతం వివరించారు. అయితే గతేడాది క్యూ4 జీడీపీ నీరసించిన నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లపై కఠినంగా వ్యవహరించకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

హెచ్ఎస్‌బీసీ పీఎంఐ

బుధవారం మార్చి నెలకు హెచ్ఎస్‌బీసీ ఇండియా తయారీ పీఎంఐ గణాంకాలు వెల్లడికానున్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం 56.3 నుంచి 57.6కు బలపడింది. అయితే శుక్రవారం(4న) విడుదలకానున్న మార్చి సర్వీసుల రంగ ఇండెక్స్ తొలి అంచనాలలో 59 నుంచి 57.7కు బలహీనపడింది. కాంపోజిటల్ పీఎంఐ సైతం 58.8 నుంచి 58.6కు స్వల్పంగా వెనకడుగు వేసింది. ఇక విదేశీ మారక నిల్వల వివరాలు సైతం 4న వెల్లడికానున్నాయి. ఇక ప్రపంచ దేశాలలో చైనా ఎన్‌బీఎస్, కైగ్జిన్ తయారీ గణాంకాలు మార్చి నెలకు సోమవారం(నేడు), మంగళవారం(1న) విడుదలకానున్నాయి. ఈ బాటలో ఫిబ్రవరి నెలకు యూరో దేశాల రిటైల్ ధరల ద్రవ్యోల్బణ రేటు 1న వెల్లడికానుంది. ఫిబ్రవరిలో కన్జ్యూమర్ ధరల రేటు తొలి అంచనాల ప్రకారం 2.3 శాతంగా నమోదైంది. ఇదేరోజు యూఎస్ ఫిబ్రవరి ఐఎస్ఎం తయారీ ఇండెక్స్, ఉపాధి కల్పన గణాంకాలు విడుదలకానున్నాయి. 3న యూఎస్ ఐఎస్ఎం సర్వీసుల పీఎంఐ వెల్లడికానుంది. వారాంతాన(4న) వ్యవసాయేతర ఉపాధి, నిరుద్యోగిత గణాంకాలు వెల్లడికానున్నాయి.

ఇతర అంశాలు

టారిఫ్‌లు, గణాంకాలతోపాటు.. ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో పలు ఇతర అంశాలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు వివరించారు. గతేడాది(2024) అక్టోబర్ నుంచీ అమ్మకాల యూటర్న్ తీసుకున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఉన్నట్టుండి గత వారం నికర పెట్టుబడిదారులుగా స్టాక్స్ కొనుగోలు చేశారు. అయితే వారాంతాన(28న) తిరిగి భారీగా అమ్మకాలు చేపట్టారు. దీంతో ఎఫ్‌పీఐల పెట్టుబడులు లేదా అమ్మకాలకు ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు. ఇదేసమయంలో డాలరు ఇండెక్స్ బలహీనపడటం, దేశీ కరెన్సీ ఒక్కసారిగా బలపడటం మార్కెట్లకు జోష్‌నిచ్చినట్లు పేర్కొన్నారు. దిగుమతుల బిల్లుపై ప్రభావం చూపే ముడిచమురు ధరలు వెనకడుగు వేస్తున్నప్పటికీ బంగారం ధరలు మెరుస్తుండటం కొంత ప్రతికూలమేనని తెలియజేశారు.

ఎఫ్‌పీఐల కొనుగోళ్లు

కొద్ది నెలుగా అమ్మకాలకే అధికంగా ఆసక్తి చూపుతున్న విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఇటీవల పెట్టుబడులవైపు దృష్టి మరల్చారు. వెరసి గత ఆరు సెషన్లలో నికరంగా రూ. 31,000 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. పలు కంపెనీల షేర్లు అందుబాటు ధరల్లోకి రావడంతో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. దీంతో ఇటీవల మార్కెట్లు భారీ నష్టాల నుంచి బయటపడి 6 శాతం పుంజుకోడం గమనార్హం. కాగా.. తాజా పెట్టుబడుల ప్రభావంతో మార్చి నెలలో ఎఫ్‌పీఐల నికర అమ్మకాలు రూ. 3,973 కోట్లకు పరిమితమయ్యాయి! ఫిబ్రవరిలో రూ. 34,574 కోట్లు, జనవరిలో మరింత అధికంగా రూ. 78,027 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్న విషయం విదితమే.

అరుదైన వ్యాధులకు ఏ హెల్త్ పాలసీ?



అమితాబ్ జైన్
చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్

హీమోఫీలియా, మర్ఫాన్ సిండ్రోమ్ లాంటి అరుదైన వ్యాధులు కొద్ది మందికి మాత్రమే వస్తాయి. కానీ వాటి తీవ్రత మాత్రం చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మంది 7 వేల పైగా రకాల అరుదైన వ్యాధులతో బాధపడుతున్నారని అంచనా. ఇలాంటి వాటికి నాణ్యమైన చికిత్స దొరకడం కష్టంగానే ఉంటోంది.. అలాగే చికిత్స వ్యయాలు భారీగానే ఉంటున్నాయి. భారత్ విషయానికొస్తే 7 కోట్ల మంది అరుదైన వ్యాధులతో బాధపడుతున్నారని అంచనాలున్నాయి. అవగాహనారాహిత్యం, వైద్యపరీక్షల వ్యయాలు భారీగా ఉండటం, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు అంతగా లేకపోవడం వంటి అంశాల కారణంగా వారు సమయానికి సరైన చికిత్సను పొందలేకపోతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) 4,001 అరుదైన వ్యాధులను గుర్తించింది. కానీ, 450 వ్యాధుల రికార్డులు మాత్రమే ఆస్పత్రుల్లో అధికారికంగా అందుబాటులో ఉంటున్నాయి. వైద్యపరీక్షలు, డేటా సేకరణపరమైన సవాళ్లను ఇది సూచిస్తోంది. 80 శాతం అరుదైన వ్యాధులు జన్యుపరమైనవే కాగా మిగతావి ఇన్ఫెక్షన్లు, ఆటోఇమ్యూన్ లేదా పర్యావరణపరమైన అంశాల వల్ల వస్తున్నాయి. 50 శాతం పైగా అరుదైన వ్యాధుల లక్షణాలు ఎక్కువగా పిల్లల్లోనే ఉంటాయి కాబట్టి సాధ్యమైనంత ముందుగా వైద్యపరీక్షలు చేసి గుర్తించడం కీలకంగా ఉంటుంది. అరుదైన వ్యాధులకు ప్రత్యేకమైన చికిత్సలు, జీవిత కాల సంరక్షణ, కొన్ని సందర్భాల్లో ప్రయోగాత్మక చికిత్సలు కూడా అవసరమవుతాయి. అందుకే తగినంత బీమా కవరేజీ ఉండాలి. ఈ నేపథ్యంలో సాధారణ హెల్త్ ఇన్సూరెన్స్, క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్ల మధ్య వ్యత్యాసాలు, వాటితో ఏయే ప్రయోజనాలు ఉంటాయో తెలియజేసేదే ఈ కథనం.



రెగ్యులర్ హెల్త్ ఇన్సూరెన్స్ అంటే..

సమగ్ర ఆరోగ్య బీమా పాలసీలనేవి హాస్పిటలైజేషన్ చార్జీలు, డాక్టర్ల కన్సల్టేషన్లు, వైద్య పరీక్ష ప్రొసీజర్లు, ఆస్పత్రిలో చేరడానికి ముందు అలాగే ఆ తర్వాత తలెత్తే వ్యయాలకు కవరేజీనిస్తాయి. హంటింగ్టన్స్ డిసీజ్ లేదా రెట్ సిండ్రోమ్‌లాంటి నరాల సంబంధిత అరుదైన వ్యాధుల విషయంలో హాస్పిటలైజేషన్.. సపోర్టివ్ కేర్‌కి, జీవక్రియ సంబంధ గౌచర్ వ్యాధి లేదా ఫ్యాబ్రీ వ్యాధి, ఎంజైమ్ మార్పిడి థెరపీ కూడా కవరేజీ లభిస్తుంది. అయితే, సాధారణ పాలసీల్లో అన్ని రకాల అరుదైన వ్యాధులూ కవర్ కావు. కాబట్టి, జేబు నుంచి భారీగా పెట్టుకోవాల్సి వస్తుంది.

క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్ అంటే..

సాధారణ ఆరోగ్య బీమాతో పోలిస్తే క్రిటికల్ ఇల్‌నెస్ (సీఐ) స్వరూపం భిన్నంగా ఉంటుంది. ఆస్పత్రిలో చికిత్స వ్యయాలకు మాత్రమే చెల్లించడం కాకుండా, వ్యాధి నిర్ధారణయినప్పుడు ఏకమొత్తంగా బీమా మొత్తాన్ని కంపెనీ చెల్లిస్తుంది. దీన్ని చికిత్స వ్యయాల కోసం కావచ్చు, కోల్పోయిన ఆదాయాన్ని భర్తీ చేసుకోవడం కోసం కావచ్చు, ఇతరత్రా ప్రత్యామ్నాయ చికిత్స కోసం కావచ్చు. పాలసీదారు తనకు కావాల్సిన విధంగా ఉపయోగించుకోవచ్చు. లూపస్ లేదా స్లెరోడెర్మాలాంటి అరుదైన ఆటోఇమ్యూన్ వ్యాధులకు సీఐ ప్లాన్‌తో ఆర్థికంగా కొంత ఉపశమనం లభించవచ్చు. సాధారణంగా ముందస్తుగా నిర్ణయించిన వ్యాధుల కేటగిరీలకు మాత్రమే సీఐ ప్లాన్లు బీమా మొత్తాన్ని చెల్లిస్తాయి. ఒకవేళ ఏదైనా అరుదైన వ్యాధికి కవరేజీ నుంచి మినహాయింపు ఉంటే, పాలసీదారుకు ఆర్థిక ప్రయోజనం దక్కదు.

కవరేజీల్లో వ్యత్యాసం.. ఏది మెరుగైనది..

అరుదైన వ్యాధుల విషయంలో ప్రాథమిక ఆరోగ్య బీమా, హాస్పిటలైజేషన్, తక్షణ వైద్య వ్యయాలకు ఉపయోగపడుతుంది. డాక్టర్లను సంప్రదించడం, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేరడం, అవసరమైన ప్రొసీజర్లు మొదలైన వాటికి పాలసీ చెల్లిస్తుంది. అయితే, ఆదాయ నష్టం, దీర్ఘకాల సంరక్షణలాంటి పరోక్ష వ్యయాలకు కవరేజీనివ్వదు. మరోవైపు, క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ అనేది ఏకమొత్తంగా చెల్లిస్తుంది. దాన్ని పాలసీదారు తనకు కావాల్సిన విధంగా ఉపయోగించుకోవచ్చు. అయితే, సదరు వ్యాధి గురించి పాలసీలో ప్రస్తావిస్తేనే ఇది వీలవుతుంది. లేకపోతే కవరేజీ లభించదు. సాధారణంగా సీఐ పాలసీలు చాలా మటుకు అరుదైన వ్యాధులకు కవరేజీనివ్వవు. కాబట్టి ఆర్థిక భద్రత కోసం వాటిని మాత్రమే నమ్ముకోవడానికి ఉండదు. అరుదైన సమస్యలు ఉన్న వారు అధిక కవరేజీ ఉండే బేసిక్ హెల్త్ ఇన్సూరెన్స్, క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీని కలిపి తీసుకుంటే ఆర్థికంగా భరోసాగా ఉంటుంది.

అసాధారణ వ్యాధుల కోసం ఆర్థిక ప్రణాళిక..

అరుదైన వ్యాధులతో అధిక రిస్కులున్న వారు రెండు రకాల బీమాను తీసుకుంటే భరోసాగా ఉంటుంది. అధిక కవరేజీ ఉండే సాధారణ ఆరోగ్య బీమా పాలసీ, ఆస్పత్రి.. వైద్య వ్యయాలకు కవరేజీనిస్తుంది. ఇక క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీ (ఒకవేళ తీసుకుంటే) వైద్యయేతర వ్యయాలకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తుంది. కవరేజీల్లో అంతరాలను తగ్గించుకునేందుకు టాప్ అప్ ప్లాన్లు, నిర్దిష్ట వ్యాధి సంబంధిత పాలసీల్లాంటివి పరిశీలించవచ్చు.

వొడాఫోన్‌లో ప్రభుత్వ వాటా అప్

- రూ. 36,950 కోట్ల విలువైన షేర్లు జారీ
- 49 శాతానికి బలపడనున్న ప్రభుత్వ వాటా



న్యూఢిల్లీ: రుణ భారంతో కుదేలైన మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియాలో తాజాగా ప్రభుత్వం రూ. 36,950 కోట్ల విలువైన షేర్లను సొంతం చేసుకోనుంది. దీంతో కంపెనీలో ప్రభుత్వ వాటా 48.99 శాతానికి బలపడనున్నట్లు వొడాఫోన్ ఐడియా తాజాగా పేర్కొంది. ఇప్పటికే కంపెనీలో 22.6 శాతం వాటాతో ప్రభుత్వం అతిపెద్ద వాటాదారుగా నిలుస్తోంది. ప్రమోటర్లుగా కంపెనీలో వొడాఫోన్ గ్రూప్ 14.76 శాతం, ఆదిత్య బిర్లా గ్రూప్ 22.56 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయి. తాజా పెట్టుబడులతో ప్రభుత్వం ప్రమోటర్ల సంయుక్త వాటాను సైతం అధిగమించనుంది. కమ్యూనికేషన్ల శాఖ 2021 సెప్టెంబర్‌లో ప్రకటించిన టెలికం రంగ సహాయక ప్యాకేజీలో భాగంగా ప్రభుత్వం రూ. 36,950 కోట్లను ఈక్విటీ షేర్లుగా మార్పిడి చేసుకుంటున్నట్లు వొడాఫోన్ ఐడియా తాజాగా వెల్లడించింది. వెరసి కంపెనీ 30 రోజుల్లోగా ప్రభుత్వానికి 3,695 కోట్ల ఈక్విటీ షేర్లు జారీ చేయనుంది. 2026కల్లా వొడాఫోన్ ఐడియా చెల్లించవలసిన స్పెక్ట్రమ్, స్థూల ఆదాయ సర్దుబాటు(ఏజీఆర్) విలువ రూ. 32,724 కోట్లుకాగా.. ప్రభుత్వానికి తాజాగా ఈక్విటీ జారీ చేయనుంది.

ఇండస్‌ఇండ్‌పై ఆర్‌క్యాప్ రుణదాతల పిటిషన్ వాపస్

- ఆమోదించిన ఎన్‌సీఎల్ఏటీ
- చెల్లింపుల ప్రక్రియ పూర్తయిన నేపథ్యం

న్యూఢిల్లీ: జాతీయ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)లో ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్(ఐఐహెచ్ఎల్)పై దాఖలు చేసిన పిటిషన్‌ను రిలయన్స్ కాపిటల్ రుణదాతల కమిటీ (సీఓసీ) ఉపసంహరించుకుంది. పూర్తిగా చెల్లింపులు జరిపి ఇందుకు సంబంధించి నిర్దిష్ట ప్రణాళికను అమలు చేసినందున, ఐఐహెచ్ఎల్‌పై పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు అప్పీలేట్ ట్రిబ్యునల్‌కు ఆర్‌క్యాప్ సీఓసీ తెలిపింది. సీఓసీ పిటిషన్‌ను జస్టిస్ యోగేష్ ఖన్నా, జస్టిస్ అజయ్ దాస్ మెహ్‌రోత్రాలతో కూడిన ట్రిబ్యునల్ ద్విసభ్య ధర్మాసనం ఆమోదించింది. కేసు వివరాల్లోకి వెళితే, దివాలా కోడ్ చట్టం కింద ఐఐహెచ్ఎల్ ఆర్థిక సేవల సంస్థ- రిలయన్స్ క్యాపిటల్ కొనుగోలుకు 2023 ఏప్రిల్‌లో రూ.9,650 కోట్లతో అత్యధిక బిడ్‌ను నమోదుచేసింది. దీని ప్రకారం దివాలా పరిష్కార ప్రణాళికను ఐఐహెచ్ఎల్ 2924 మే 27 లోపు పూర్తి చేయాల్సి ఉంది. అటు తర్వాత ఈ కాల పరిమితిని 2024 ఆగస్టు 10 వరకూ పొడిగించడం జరిగింది.

నోటీసు వస్తే 'సంధి' చేసుకోండి..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు వస్తే, వెంటనే వారితో 'సంధి' లేదా రాజీ చేసుకోవచ్చు. దీనికి ఎవరి రాయబారమూ అక్కర్లేదు. మీరే స్వయంగా ఒప్పందంలాంటిది చేసుకోవచ్చు. 2025 మార్చి 17న ఓ సర్క్యులర్ ద్వారా డిపార్టుమెంటు వారు సులువుగా రాజీ చేసుకోమని మార్గదర్శకాలు ఇచ్చారు. దీన్నే ఇంగ్లీషులో COMPOUNDING అంటారు. ఎన్నో సందర్భాల్లో డిపార్టుమెంటు వారు నోటీసులు ఇస్తారు. వాటికి బదులివ్వకపోతే వారు కోర్టుకు వెళ్తారు. కొన్ని సీరియస్ కేసుల్లో జైలుకి పంపిస్తారు. అంతవరకు వెళ్లడం అవసరమా! పరువు గంగపాలై, బతుకు హాస్పిటల్ పాలై, కృష్ణ జన్మస్థానంలో గడపడమెందుకు? ఈ పథకం .. లేదా ఒప్పందం.. లేదా రాజీ మార్గం ప్రకారం..

1 కోర్టుకు వెళ్లక్కర్లేదు. లీగల్ ప్రాసిక్యూషన్ ఉండదు.
2. టైం కలిసి వస్తుంది.
3. మానసిక ఒత్తిడి ఉండదు
4. ఆర్థిక ప్రమాదం ఉండదు
5. బ్యాంకు అకౌంటు అటాచ్‌మెంట్ ఉండదు
6. వ్యాపారం సజావుగా చేసుకోవచ్చు
7. నలుగురికీ తెలియకుండా గొడవ సమసిపోతుంది
8. ఇది అతి పెద్ద ఉపశమనం

వివరాల్లోకి వెళ్తే.. అన్ని రకాల నేరాలకు ఇది వర్తిస్తుంది. ఎన్ని సార్లయినా ఈ స్కీమ్‌తో ప్రయోజనం పొందవచ్చు. కాల వ్యవధులు లేవు. వ్యాపార నిర్వహణలో ఉన్నప్పుడు తెలిసో, తెలియకో ఎన్నో నేరాలు, ఇన్‌కంట్యాక్స్ చట్టం ప్రకారం జరుగుతుంటాయి. వీటన్నింటి మీద సమయం వెచ్చించలేము. కోర్టు చుట్టూ తిరగలేము. తిరిగినా జడ్జిమెంటు ఎలా ఉంటుందో చెప్పలేము. ఇన్ని కష్టాలతో, ఇబ్బందులతో వ్యాపారం చేయలేము. వ్యాపారం కుంటుపడుతుంది. బైటి జనాలు రకరకాలుగా మాట్లాడుకుంటారు. వీటన్నింటిని అధిగమించేందుకు కల్పిస్తున్న ఈ వెసులుబాటు, పాత కేసులకూ వర్తిస్తుంది. పాత కేసులను తిరస్కరించినా ఈ ఒప్పందంలో చేరి, రాజీపడొచ్చు. మరీ మోసపూరితమైన కేసుల్లో తప్ప మిగతా అన్నింటికీ ఈ ''రాజీ''లో ఉపశమనం ఉంది. చాలా త్వరగా పరిష్కారం దొరుకుతుంది. ఒక దరఖాస్తు చేసుకోగానే మార్గం సుగమం అవుతుంది. హై-ప్రొఫైల్ కేసుల్లో ముందుగా స్పెషల్ పర్మిషన్ తీసుకుని గానీ రిలీఫ్ ఇవ్వరు. ఉదాహరణకు జైలు శిక్ష 2 సంవత్సరాలు దాటినా .. సీబీఐ, ఈడీ మొదలైన సంస్థలతో సమస్యలు ఉన్నా, కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు చైర్మన్ పర్మిషన్ అవసరం.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు..

- బిజినెస్ వ్యక్తులు
- టీడీఎస్ విషయంలో ప్రాసిక్యూషన్ ఎదుర్కొంటున్నవారు
- పన్నుభారాన్ని కోర్టుకు వెళ్లకుండా సెటిల్ చేసుకునే వారు
- గతంలో రాజీకి వెళ్లి తిరస్కరణకు గురైన వారు
- అనేక నేరాలు చేసి బైటికి రానివాళ్లు

ఎలా చేయాలి:

వంద రూపాయల స్టాంపు పేపరు మీద అన్ని వివరాలను మీ సంబంధిత అధికారికి సబ్మిట్ చేయాలి. దరఖాస్తుతో పాటు ఫీజు చెల్లించాలి. ఎంత చెల్లించాలో డిపార్టుమెంటు నిర్ణయిస్తుంది. రాజీపత్రం రాగానే ఉపశమనం వచ్చినట్లే. ప్రాసిక్యూషన్ ఆగిపోతుంది. మీరు మాత్రం అప్పీలులో ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలి.

రాజీకి వెళ్లకపోతే

షరా మామూలే. లీగల్ ప్రాసిక్యూషన్ కొనసాగుతుంది. ఫైన్ పడుతుంది. జైలు శిక్ష పడొచ్చు. కోర్టు ఖర్చులు భరించాలి. రికార్డుల్లో అలాగే ఉండిపోతే ఉత్తరోత్తరా డిపార్టుమెంటు వారి దృష్టిలో చెడుగా.. అంటే డిఫాల్టరుగా ఉండిపోతారు.

కాబట్టి వెంటనే రాజీమార్గంలో వెళ్లి, రాజీపడి అన్ని కష్టాల్లో నుంచి బైటపడండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాల పెట్టుబడులకు అనువైనది..

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్



దీర్ఘకాల లక్ష్యాలకు ఈక్విటీ పెట్టుబడులు అనుకూలమనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. కాకపోతే ఇన్వెస్టర్లు కేవలం రాబడుల దృష్టితో కాకుండా, తమ రిస్క్ సామర్థ్యానికి అనుకూలమైన ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవడం ఎంతో ముఖ్యమని గుర్తించాలి. ఈక్విటీల్లో లార్జ్‌క్యాప్‌తో పోల్చితే దీర్ఘకాలంలో మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ అధిక రాబడులను ఇస్తాయి. కానీ, ఈ రెండు విభాగాల్లో అస్థిరతలు ఎంతో ఎక్కువ. ఒక్కోసారి పెట్టుబడి విలువ 60-80 శాతం వరకు పడిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు. అదే లార్జ్‌క్యాప్ కంపెనీల్లో (బ్లూచిప్) స్థిరత్వం ఎక్కువ. మార్కెట్ కరెక్షన్లలో ఇవీ నష్టపోతాయి. కానీ, మిడ్, స్మాల్‌క్యాప్ కంటే లార్జ్‌క్యాప్‌లో నష్టం చాలా తక్కువగా ఉంటుంది. అందుకే రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్లు సైతం తమ మొత్తం ఈక్విటీ పెట్టుబడుల్లో కనీసం 50 శాతం అయినా లార్జ్‌క్యాప్ విభాగంలో ఉండేలా చూసుకోవాలన్నది నిపుణుల సూచన. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్లూచిప్ ఫండ్ బలమైన పనితీరు చూపిస్తోంది. స్థిరమైన ట్రాక్ రికార్డుతో మెరుగైన పెట్టుబడుల అవకాశాలను అందిస్తోంది.

రాబడులు..

ఈ పథకానికి 17 ఏళ్ల చరిత్ర ఉంది. ఎన్నో మార్కెట్ సైకిల్స్‌ను చూసిన అనుభవం ఉంది. ఈ కాలంలో ఎన్నో అస్థిరతలు, కరెక్షన్లు ఎదురైనప్పటికీ బెంచ్ మార్క్ సూచీలకు మించి స్థిరమైన రాబడులను అందించినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పథకం డైరెక్ట్ ప్లాన్‌లో ఏడాది కాల రాబడి 9 శాతంగా ఉంది. గడిచిన ఏడాది కాలంలో మార్కెట్ ఆటుపోట్లను చూడడం తెలిసిందే. మూడేళ్లలో 17 శాతం, ఐదేళ్లలో 26 శాతం, ఏడేళ్లలో 15.60 శాతం, పదేళ్లలో 14 శాతం చొప్పున వార్షిక రాబడులను అందించింది. ముఖ్యంగా నిఫ్టీ 100 టీఆర్ఐ కంటే రాబడి ఈ పథకంలోనే ఎక్కువగా ఉంది. అంతర్జాతీయంగా అనిశ్చితుల వాతావరణం నేపథ్యంలో దీర్ఘకాలానికి స్థిరత్వంతో కూడిన మెరుగైన రాబడుల కోసం ఇన్వెస్టర్లు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు.

పెట్టుబడుల విధానం

ఈ పథకం తన నిర్వహణలోని మొత్తం పెట్టుబడుల్లో 80-85 శాతం మేర లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తుంటుంది. అదే సమయంలో 5-10 శాతం మధ్య మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటుంది. బలమైన కంపెనీలనే ఎంపిక చేసుకుంటుంది. దేశీ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పెట్టుబడుల్లోనూ మార్పులు, చేర్పులు చేస్తుంటుంది. ఈ పథకంలో అప్‌సైడ్ క్యాప్చర్ రేషియో 100.8 శాతంగా ఉంది. అంటే మార్కెట్ ర్యాలీల్లో సూచీ కంటే కొంత అదనపు రాబడిని ఇస్తున్నట్టు ఇది తెలియజేస్తోంది. డౌన్‌సైడ్ క్యాప్చర్ రేషియో 74.3 శాతంగా ఉంది. మార్కెట్ పతనాల్లో సూచీల కంటే తక్కువ నష్టపోవడాన్ని ఇది సూచిస్తోంది.



పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.60,177 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 95.61 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, డెట్ సాధనాల్లో 0.78 శాతం పెట్టుబడి కలిగి ఉంది. నగదు, నగదు సమానాలు 3.61 శాతం ఉన్నాయి. మార్కెట్ దిద్దుబాటు తరుణంలో పెట్టుబడుల అవకాశాల కోసం నగదు నిల్వలు కలిగి ఉన్నట్టు అర్థం చేసుకోవచ్చు. ఈక్విటీల్లోనూ 97 శాతం మేర పెట్టుబడులు లార్జ్ క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్‌లో కేవలం 2.74 శాతం పెట్టుబడులు ఉన్నాయి. ప్రస్తుతం లార్జ్‌క్యాప్ కంపెనీలు చౌక వ్యాల్యుయేషన్లకు రావడంతో ఈ విభాగంలోనే పెట్టుబడులు అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో 30 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 13 శాతం, ఇంధన రంగ కంపెనీల్లో 11 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీల్లో 10 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.98
ఐసీఐసీఐ బ్యాంక్	8.11
ఎల్‌అండ్‌టీ	6.18
రిలయన్స్ ఇండస్ట్రీస్	4.67
భారతీ ఎయిర్‌టెల్	4.67
ఇన్ఫోసిస్	4.65
మారుతి సుజుకీ	4.61
యాక్సిస్ బ్యాంక్	4.10
అల్ట్రాటెక్ సిమెంట్	4.08
సన్‌ఫార్మా	2.71

బోటు షికారు



నూతన సంవత్సరాది సందర్భంగా ఆదివారం ఉజ్జయినిలో క్షిప్రా నదిలో బోటు షికారు చేస్తున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్

గదాధారి



ఢిల్లీలో జరిగిన బీజేపీ కార్యక్రమంలో కార్యకర్తలు అందించిన గదతో ముఖ్యమంత్రి రేఖా గుప్తా

లాహిరి లాహిరి లాహిరిలో...



చెర్రీ బ్లోజమ్ సీజన్ సందర్భంగా టోక్యోలోని చిదోరిగాఫుచీ రాజప్రాసాదంలో సందర్శకుల పడవ షికారు. జపాన్‌లో ఏటా మార్చి-ఏప్రిల్ నడుమ పూలు, కొత్త చిగుళ్లతో చెట్లన్నీ శోభాయమానంగా కనువిందు చేస్తుంటాయి.

పాక్‌లో డ్రోన్ దాడులు.. 12 మంది ఉగ్రవాదులు హతం

పెషావర్: కల్లోలిత ఖైబర్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదుల స్థావరంపై పాకిస్తాన్ సైన్యం చేపట్టిన డ్రోన్ దాడుల్లో కనీసం 12 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. మర్దాన్ జిల్లా కట్లాంగ్‌లోని మారుమూల కొండప్రాంతంలో శనివార ఉదయం దాడులు చేపట్టినట్లు ప్రావిన్షియల్ ప్రభుత్వం తెలిపింది. మృతుల్లో ఓ ఉగ్ర సంస్థకు చెందిన అగ్ర నేతలున్నట్లు పేర్కొంది. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నట్లు తెలిపింది.

హైవేలపై రాత్రి ప్రయాణాలు నిషేధం

ఖైబర్ ప్రావిన్స్‌లో మూడు జిల్లాల్లో జాతీయ రహదారులపై రాత్రి ప్రయాణాలపై నిషేధం విధించారు. మూడు వారాల క్రితం బలూచిస్తాన్ వేర్పాటువాదులు జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్ చేసి 18 మంది భద్రతా సిబ్బంది సహా ఎంతోమందిని చంపడం తెల్సిందే. హైవేలపై వాహనాలను అడ్డుకుని పంజాబీలను చంపుతున్న ఘటనలు పెరిగిపోయాయి. ఈ దృష్ట్యా రాత్రి పూట ప్రయాణాలపై నిషేధం ప్రకటించారు.

అమెరికా నటుడు చాంబర్లీన్ కన్నుమూత



లండన్: 1960ల్లో అత్యంత ప్రజాదరణ పొందిన 'డాక్టర్ కిల్‌డేర్' టీవీ సీరియల్‌తో అందరికీ సుపరిచితుడైన రిచర్డ్ చాంబర్లీన్(90) కన్నుమూశారు. వయో సంబంధ సమస్యలతో బాధపడుతున్న ఆయన హవాయ్‌లోని వైమనలో శనివారం రాత్రి గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచినట్లు సన్నిహితులు తెలిపారు. 91వ ఏట అడుగు పెట్టడానికి కొన్ని గంటల ముందే ఈ విషాదం చోటుచేసుకుందన్నారు. 'షోగున్, ది థోర్న్ బర్డ్స్' సీరియళ్లలో ప్రధాన పాత్రలు పోషించి 'కింగ్ ఆఫ్ ది మినీ సిరీస్'గా చాంబర్లీన్ మన్ననలు అందుకున్నారు. 1934లో కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్‌లో జన్మించిన ఈయన డాక్టర్ కిల్‌డేర్ సీరియల్‌లోని డాక్టర్ జేమ్స్ కిల్‌డేర్ పాత్రతో 1961లో ఒక్కసారిగా పాపులర్ అయ్యారు. 1980ల్లో షోగున్ సిరీస్‌లో ఖైదీగాను, అనంతరం థోర్న్ బర్డ్స్‌లో క్రైస్తవ గురువుగా పోషించిన పాత్రలు ఆయన్ను తిరుగులేని స్థాయికి చేర్చాయి. అప్పట్లో అమెరికాలో 60 శాతం మంది టీవీ వీక్షకులు థోర్న్ బర్డ్స్ సీరియల్‌నే చూడటం ఓ రికార్డు. ఇది ఏకంగా 16 ఎమ్మీ నామినేషన్లు పొందింది. స్వలింగ సంపర్కుడైన చాంబర్లీన్.. ఆ విషయాన్ని 70 ఏళ్ల వయస్సులో 'షట్టర్డ్ లవ్' పేరుతో విడుదల చేసిన ఆత్మకథలో మొదటిసారిగా అంగీకరించారు. నటుడు, దర్శకుడు మార్టిన్ రబెట్‌తో 30 ఏళ్లపాటు బంధం కొనసాగించారు. 2010లో వీరిద్దరూ విడిపోయారు.

దత్తత పర్వంలో... దారుణ కోణం!

దూర దేశాల్లో నిత్య వేధింపులు

- దక్షిణకొరియా చిన్నారుల దైన్యం
- దర్యాప్తు కమిషన్ విచారణలో వెలుగులోకి
- దశాబ్దాలుగా లోపభూయిష్టంగా కార్యక్రమం
- ప్రభుత్వ క్షమాపణకు కమిషన్ సిఫార్సు

దత్తత మాటున దారుణాలు. కొరియా యుద్ధం తాలూకు విషాదంలో మరో చీకటి అధ్యాయం. దీనికి సంబంధించి తాజాగా బహిర్గతమైన విషయాలు విస్మయం కలిగిస్తున్నాయి. 1950ల్లో యుద్ధం కారణంగా దక్షిణ కొరియా పేదరికంలో కూరుకుపోయింది. జనం తమ సంతానాన్ని పోషించుకోలేని దుస్థితికి దిగజారడంతో వారిని ఆదుకునే సాకుతో ప్రభుత్వం తెచ్చిన పథకం అక్రమాలకు నెలవుగా, అంతులేని విషాదానికి చిరునామాగా మారింది. తొలుత ప్రశంసలు అందుకున్నా విదేశీ దత్తత పథకంలోని చీకటి కోణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇందులో ఎన్నో అక్రమాలు జరిగాయని, లక్షలాది మంది చిన్నారులు సొంతవారికి దూరమై విదేశాల్లో కష్టాల పాలయ్యారని దీనిపై విచారణకు నియమించిన కమిషన్ కుండబద్దలు కొట్టింది. ''ఇది పిల్లల భవిష్యత్తులో క్రూర చెలగాటం. దీనికి ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి'' అని సిఫార్సు చేసింది. దత్తత పేరుతో దూర దేశాలకు తరలిపోయిన తమ చిన్నారుల కన్నీటి గాథలు దక్షిణ కొరియన్లను కంట తడి పెట్టిస్తున్నాయిప్పుడు...!

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎందుకీ దుస్థితి?

1950వ దశకంలో కొరియా ద్వీపకల్పంలో మొదలైన యుద్ధమే ఈ దత్తత దారుణాలకు ప్రధాన కారణం. దేశ భూభాగంలో ఉత్తరభాగం డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డీపీఆర్‌కే)గా, దక్షిణభాగం రిపబ్లిక్ ఆఫ్ కొరియాగా రెండు ముక్కలైంది. ఐక్యరాజ్యసమితి ఆంక్షలు విధించినాసరే అమెరికాసహా 17 దేశాలు ద.కొరియాకు మద్దతు ప్రకటించాయి. చైనా, రష్యాలు ఉత్తరకొరియాకు అండగా నిలబడ్డాయి. చాన్నాళ్లు కొనసాగిన ఈ యుద్ధంలో ఒక్క దక్షిణకొరియాలోనే దాదాపు 2,00,000 మందికిపైగా మహిళలు తమ భర్తలను కోల్పోయి వితంతువులుగా మిగిలిపోయారు. మరో 1,00,000 మంది చిన్నారులు అనాథలయ్యారు. వితంతులు తమ పిల్లలను పెంచే స్తోమతలేక అనాథాశ్రమాల్లో చేర్పించారు. దీంతో దేశవ్యాప్తంగా అనాథాశ్రయాల్లో చిన్నారుల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది. యుద్ధంకారణంగా పేదరికం కోరల్లో చిక్కుకుపోయిన ద.కొరియా సర్కార్‌కు వీళ్ల పోషణ పెద్ద భారంగా తయారైంది. యుద్ధంలో ద.కొరియాకు సాయంగా దేశంలో తిష్టవేసిన అమెరికా సైనికులు స్థానిక మహిళలతో సంబంధాలు పెట్టుకోవడంతో లక్షలాది మంది చిన్నారులు జన్మించారు. ఇలాంటి వాళ్లకు సమాజంలో ఆదరణ కరువైంది. ఛీత్కారాలను ఎదుర్కొన్నారు. వితంతువుల పిల్లలు, అమెరికన్ల పిల్లలు, అనాథాశ్రయాల్లోని చిన్నారుల బాగోగులు చూసేందుకు ప్రభుత్వం విదేశీ దత్తత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వీళ్లను దత్తత తీసుకునేందుకు పశ్చిమదేశాల్లోని జంటలు తెగ ఆసక్తి చూపించారు. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్‌లోని కొన్ని దేశాల నుంచి దత్తత డిమాండ్లు అధికమయ్యాయి. 1954లో ఈ ధోరణి ఊపందుకుంది. 1948 నుంచి 1960 వరకు సింగ్‌మాన్ రీ పాలనకాలంలో, తర్వాత పార్క్ చుంగ్ హీ హయాంలో 1961నుంచి 1979 కాలంలో ఈ పోకడ విపరీతంగా పెరిగిపోయింది.



నార్వేకు దత్తత వెళ్లిన యూరీ కిమ్ అనే మహిళ దైన్యాన్ని వింటూ చలించిపోతున్న దర్యాప్తు కమిషన్ చైర్‌పర్సన్ పార్క్ సన్ యంగ్

విదేశాల్లో మొదలైన కష్టాలు

దత్తత తీసుకున్న తల్లిదండ్రుల చెంత హాయిగా పెరిగిన పిల్లలు కొందరే. అత్యధికులు బానిసలుగా బతికారు. సరైన పోషణ, సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హింస, వేధింపులు నిత్యకృత్యమయ్యాయి. దత్తత తండ్రుల చేతుల్లో అత్యాచారాలకు బలైన అమ్మాయిలు కోకొల్లలు. దత్తత సమయంలో తప్పుడు ఊళ్లు, పేర్లు, అన్నీ మార్చేసిన కారణంగా అసలు తమ కన్న తల్లిదండ్రులు ఎవరనేదీ పెద్దయ్యాక ఆ పిల్లలకు తెలీకుండా పోయింది. నార్వేలో జీవిస్తున్న 60 ఏళ్ల ఇంగర్ టోన్ ఉయిలాండ్ షిన్ కన్నీటిగాథ ఇలాంటిదే. ''13 ఏళ్ల వయసులో నన్ను దత్తత తీసుకుని నార్వేకు తీసుకొచ్చారు. తిండి, వాతావరణం ఏదీ నాకు సరిపడలేదు. పెంపుడు తండ్రి లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయి. నాకన్నా పెంపుడు కుక్కనే బాగా చూసుకునేవాళ్లు. చేసిన నేరానికి శిక్ష అనుభవించకుండానే వాళ్లు చనిపోయారు. నేను మాత్రం ఇలా మిగిలిపోయా. చిన్ననాటి జ్ఞాపకాలు, అందమైన బాల్యం, సర్వం కోల్పోయా'' అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. అమెరికా, ఆస్ట్రేలియాతో పాటు యూరప్‌లోని ఎన్నో దేశాలకు దత్తు వెళ్లిన ఆయిలాండ్ వంటి చిన్నారుల కన్నీటిగాథలు కోకొల్లలని 'ట్రూత్ అండ్ రీకన్సిలియేషన్ కమిషన్' పేర్కొంది. మూడేళ్ల దర్యాప్తు తర్వాత బుధవారం సమగ్ర నివేదిక సమర్పించింది. అంతర్జాతీయ దత్తత చట్టాలు, చిన్నారుల పరిరక్షణపై 'ది హేగ్ ఒడంబడిక'ను దక్షిణ కొరియా ప్రభుత్వం తుంగలో తొక్కిందని కమిషన్ చైర్‌పర్సన్ పార్క్‌సన్ యంగ్ మండిపడ్డారు.

దారి తప్పిన పథకం

పశ్చిమ దేశాల జంటలకు అనాథలను దత్తతనిచ్చే కార్యక్రమం మొదట్లో సవ్యంగా సాగినా రానురాను ఇది అక్రమాలకు నెలవుగా తయారైంది. దత్తత ప్రక్రియ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం పూర్తిగా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి చేతులు దులుపుకుంది. దీంతో ఈ ఏజెన్సీలు పశ్చిమదేశాల జంటల నుంచి అత్యధిక మొత్తాలను వసూలుచేసి వాళ్లకు నచ్చిన పిల్లలను విదేశాలకు తరలించడం మొదలెట్టాయి. ఇందుకోసం ఏజెన్సీలు ఎన్నో అక్రమ మార్గాలను ఎంచుకున్నాయి. అక్రమాలు బయటపడకుండా ఉండేందుకు పిల్లల అసలు పేర్లను మార్చేసి దొంగ డాక్యుమెంట్లు సృష్టించేవారు. కుటుంబాలతో ఉంటున్న అందంగా, పుష్టిగా ఉన్న చిన్నారులు కొందరిని కిడ్నాప్ చేసి మరీ విదేశాలకు తరలించారు. కుటుంబాలకు చెందిన పిల్లలను అనాథలుగా ముద్రవేసి విదేశీ జంటలకు అప్పగించారు. ఇలా లక్షలాది మంది చిన్నారులను దేశం దాటించారు.

వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

దత్తత ప్రక్రియ పూర్తి లోపభూయిష్టమని, తమను అన్యాయంగా, అక్రమంగా విదేశాలకు తరలించారని చాలామంది చిన్నారులు పెద్దయ్యాక ఫిర్యాదులు చేశారు. వాటిపై కమిషన్ దర్యాప్తులో విస్మయకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ''దత్తత ప్రక్రియ తప్పులతడకగా సాగింది. పేర్లు మార్చేయడం, తల్లిదండ్రులున్నా అనాథ అని పేర్కొనడం వంటి ఎన్నో అక్రమాలు వెలుగు చూశాయి. విదేశీ జంటలకు అప్పగింతపై నెలవారీ పరిమితి ఉన్నా ఆ కోటాను ప్రభుత్వమే తుంగలో తొక్కింది. అలా ప్రైవేట్ ఏజెన్సీలు దశాబ్దాలుగా లక్షలాది మంది చిన్నారులను విదేశాలకు తరలించాయి. ఉచితంగా జరగాల్సిన దత్తత ప్రక్రియలో అడుగడుగునా భారీగా నగదు చేతులు మారింది'' అని కమిషన్ పేర్కొంది. ఎట్టకేలకు 2023లో దత్తత ప్రక్రియలో కఠిన నిబంధనలను అమల్లోకి తెచ్చారు. ఇకపై ప్రైవేట్ ఏజెన్సీలకు బదులు విదేశాంగ శాఖ ఆధ్వర్యంలో దత్తత కార్యక్రమం నడుస్తుందని ప్రకటించింది. కానీ కమిషన్ వెల్లడించిన కఠోర వాస్తవాలపై మాత్రం ప్రభుత్వం పెదవి విప్పలేదు. తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని తేలినా క్షమాపణ చెప్పలేదు. దీనిపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'ఎంపురన్' వివాదం విచారకరం

- మలయాళ స్టార్ మోహన్ లాల్
- సంఘ్ పరివారే కారణమన్న సీఎం విజయన్

తిరువనంతపురం: 'ఎల్2:ఎంపురన్' సినిమాలోని కొన్ని సన్నివేశాలపై వివాదం ముదురుతుండటంపై మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ విచారం వ్యక్తం చేశారు. సినిమాలోని వివాదాస్పదంగా ఉన్న సీన్లను తొలగిస్తామని హామీ ఇచ్చారు. సినిమా దర్శకుడు పృథ్వీరాజ్‌కు మద్దతిస్తూ ఆన్‌లైన్ వేదికపై సినిమాపై సంఘ్ పరివార్ చేస్తున్న విమర్శలను తప్పుపడుతూ సీఎం విజయన్, ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ చేసిన ప్రకటనలపై మోహన్‌లాల్ ఫేస్‌బుక్ పేజీలో స్పందించారు. ఈ వివాదంపై ఎంపురన్ సినిమా బృందం పశ్చాత్తాపం వ్యక్తం చేస్తోందన్నారు. సినిమాల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక, మతపరమైన విద్వేషాలను సృష్టించే ఉద్దేశం తనకు లేనేలేదని మోహన్‌లాల్ స్పష్టం చేశారు. గుజరాత్ అల్లర్ల నేపథ్యంలో ఉన్న ఎంపురన్‌పై వచ్చే అభ్యంతరాలకు తమదే పూర్తి బాధ్యతని కూడా పేర్కొన్నారు. అందుకు కారణమైన సన్నివేశాలను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు, ఎంపురన్ సినిమాను సీఎం విజయన్ కుటుంబసభ్యులతో కలిసి తిలకించారు. భయానక వాతావరణం సృష్టించేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోందని అనంతరం ఆయన ఆరోపించారు. 'లుసిఫెర్'కు సీక్వెల్‌గా పృథ్వీరాజ్-మోహన్‌లాల్ కలిసి తీసిన ఈ సినిమా గురువారం ప్రపంచవ్యాప్తంగా రిలీజైంది. హిందుత్వ రాజకీయాలను తీవ్రంగా తప్పుబడుతూ తీసిన ఈ సినిమా విడుదలపై కాంగ్రెస్, వామపక్ష పార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

పంట వ్యర్థాల దహనంపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: పంట వ్యర్థాల దహనాన్ని అడ్డుకునేందుకు కఠిన చర్యలు చేపట్టేలా పంజాబ్, హరియాణా ప్రభుత్వాలను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పిటిషన్‌లో స్పష్టమైన వివరాలేవీ లేవని పేర్కొంది. పర్యావరణ ఉద్యమ కారుడు విక్రాంత్ తొంగడ్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ఈ విషయంలో ఇప్పటికే పలు ఆదేశాలు జారీ చేశాం. ఇంకా కొన్ని పిటిషన్లు విచారణలోనే ఉన్నాయి. ఇదే అంశంపై వేర్వేరు వ్యక్తులు పిటిషన్లు దాఖలు చేయడాన్ని ప్రోత్సహించాలను కోవడం లేదు. అందుకే, పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం'అని స్పష్టం చేసింది. ఏప్రిల్-మే నెలల్లో పంట వ్యర్థాల దహనంతో ఉత్పన్నమయ్యే కాలుష్యంతో ఢిల్లీ పరిసర ప్రాంతాల ప్రజలకే కాదు, సంబంధిత రాష్ట్రాల ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు ప్రమాదకరం'అని పిటిషనర్ తెలిపారు.

పండుగలు ఐక్యతా ప్రతీకలు: మోదీ

న్యూఢిల్లీ: ''దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో నూతన సంవత్సర సంబరాలు ఘనంగా జరిగాయి. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచాయి'' అని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. ఆయన ఆదివారం 'మన్‌కీ బాత్'లో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలకు తెలుగులో శుభాకాంక్షలు చెప్పారు! ''ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో ఉగాది పర్వదినాన్ని ఆనందంగా జరుపుకున్నారు. మహారాష్ట్రలో గుడీపడ్వా కూడా చక్కగా జరిగింది. భిన్నత్వం, వైవిధ్యానికి నెలవైన భారత్‌లో కొద్ది రోజుల్లో మిగతా రాష్ట్రాల్లోనూ నూతన సంవత్సర వేడుకలు సందడి చేయనున్నాయి. అస్సాంలో రొంగాలి బిహు, పశ్చిమబెంగాల్‌లో పొయిలా బైషాఖ్, కశ్మీర్‌లో నవ్రేహ్ పేరుతో వేడుకలు జరగనున్నాయి. ఈద్ పర్వదినం కూడా కన్నులపండువగా సాగనుంది. ఏప్రిల్ 13, 15 మధ్య మరిన్ని ప్రాంతాల్లో నూతన సంవత్సర సంబరాలు జరగనున్నాయి. ఇలా ఏప్రిల్ మొత్తం పండుగలతో, పర్వదినాలతో సాగనుంది. ఈ ఐక్యతా స్ఫూర్తిని కలకాలం నిలవాలి'' అని ఆకాంక్షించారు. ఆయన ఇంకేమన్నారంటే...

'అలవాటు'గా ఆరోగ్యం

రోజూ ఎన్ని అడుగులు నడుస్తున్నాం, ఎన్ని కేలరీలు తింటున్నాం, ఎంత కరిగిస్తున్నామని ఈ మధ్య బాగా లెక్కలు వేసుకుంటున్నాం. అయితే మనమంతా కౌంట్‌డౌన్ చేసుకోవాల్సిన మరో విషయముంది. అదే అంతర్జాతీయ యోగా దినోత్సవం. దానికి (జూన్ 21) ఇంకా 100 రోజులు కూడా లేవు. నిత్యజీవితంలో యోగాకు చోటివ్వండి. ఆలస్యమైందన్న ఆలోచనే వద్దు. యోగా మానవాళికి భారత్ ఇచ్చిన అపూర్వ కానుక. ఈ ఏడాది యోగ దినోత్సవాన్ని 'ఐక్య ధరణి, అందరికీ ఆరోగ్యం కోసం యోగ (యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్)' ఇతివృత్తంగా జరుపుకుందాం.

ఆయుర్వేదంపై అమితాసక్తి

ఆరోగ్యానికి ఆయుర్వేదాన్ని ఆశ్రయిద్దాం. దక్షిణ అమెరికా ఖండంలోని చిలీ దేశంలో ఆయుర్వేదంపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. బ్రెజిల్ పర్యటన సందర్భంగా చిలీ అధ్యక్షుడు నాతో ఆయుర్వేదం గురించి ఎంతో మాట్లాడారు. సోమోస్ ఇండియా (మనమంతా భారతీయులం) అనే బృందం పదేళ్లుగా ఆయుర్వేదంపై అక్కడ అవగాహన పెంచుతోంది. యోగా, ఆయుర్వేదంపై సమాచారాన్ని స్పానిష్‌లో అందుబాటులోకి తెస్తోంది.



సెలవుల్లో కొత్త విషయాలు

ఈ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు మోదీ పిలుపునిచ్చారు. ''పిల్లలూ! కొత్త విషయాలు నేర్చుకోండి. మంచి అలవాట్లు చేసుకోండి. నైపుణ్యాలను పదును పెట్టుకోండి. వేసవిలో మీరు చేసిన పనులను నాకు 'హైహాబీస్' హ్యాష్‌ట్యాగ్‌లో పంపించండి. 'హాలిడేమెమరీస్' హ్యాష్‌ట్యాగ్‌లో పిల్లలు, తల్లిదండ్రులు కూడా నాకు పంపించొచ్చు. వాననీటి సంరక్షణ కార్యక్రమం 'క్యాచ్ ది రెయిన్' విజయవంతంగా సాగుతోంది. వాననీటి సమర్థ సంరక్షణ విధానాలతో ఏడెనిమిదేళ్లలో 1,100 కోట్ల ఘనపు మీటర్ల వర్షపు నీటిని ఒడిసిపట్టగలిగాం. ఈ నీటితో ఏకంగా భాక్రా నంగల్ డ్యామునే నింపొచ్చు'' అన్నారు.

మూలాలు గట్టిపడాలి

మన మూలాలను మర్చిపోకుండా ఉంటే ఎంతటి తుపాను వచ్చినా ఏమీ చేయలేదు. 200 ఏళ్ల క్రితం కార్మికులుగా మారిషస్‌కు వలస వెళ్లిన భారతీయులు ఇన్నేళ్లయినా మూలాలను మర్చిపోలేదు. భారతీయ వారసత్వాన్ని కాపాడుకుంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారు. గయానాలో కూడా 'చౌతల్' ప్రదర్శన అద్భుతంగా అనిపించింది.

వెకిలి వివాదంలో మరో కమేడియన్

ముంబై: రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రాణాల ఉదంతాలను మరవకముందే మరో స్టాండప్ కమెడియన్ స్వాతి సచ్‌దేవ వెకిలి జోకులతో వివాదంలో చిక్కుకుంది. 'ఫ్యామిలీ ఫస్ట్' పేరిట పది రోజుల క్రితం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన ఎపిసోడ్‌లో తనను, తన తల్లిని ఉద్దేశించి ఆమె చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. చివరికి తల్లిదండ్రులను కూడా వెకిలి వ్యాఖ్యలకు ముడిసరుకుగా వాడుకోవడం దారుణమంటూ దుయ్యబడుతున్నారు. చివరికి రోత పుట్టించే వెగటు వ్యాఖ్యలనే జోకులుగా పేల్చే స్థాయికి కామెడీ షోలు దిగజారాయని ఒక నెటిజన్ వ్యాఖ్యానించారు. రణ్‌వీర్, సమయ్ తర్వాత తానూ కోర్టు మెట్లు ఎక్కాలని స్వాతి భావిస్తున్నట్టుగా ఉందని మరొకరు అన్నారు.

ర్యాపర్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ: భారత సంతతికి చెందిన ర్యాపర్ 'హ్యూమన్‌కైండ్'పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. తాజాగా అతడు విడుదల చేసిన 'రన్ ఇట్ అప్' పాట వీడియోను మన్ కీ బాత్‌లో ప్రధాని ప్రస్తావించారు. ఈ పాటలో కేరళ సంప్రదాయ యుద్ధ విద్య 'కలరిపయట్టు'తోపాటు పంజాబీల యుద్ధవిద్య గట్కా, మణిపూర్ యుద్ధ విద్య 'థంగ్-టా' గురించి కూడా ఉందన్నారు. హ్యూమన్‌కైండ్ చేసిన ప్రయత్నంతో కలయరిపట్టు, గట్కా, థంగ్-టా గురించి ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారన్న ప్రధాని మోదీ అతడికి అభినందనలు తెలిపారు. తాజాగా, హ్యూమన్‌కైండ్ విడుదల చేసిన రన్ ఇట్ అప్‌లో ఏడు భారతీయ సంప్రదాయ కళారూపాల ప్రస్తావన ఉంది.

ప్రభుత్వానికి ఐఎండీతో కోట్లలో ఆదాయం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్త వాతావరణ సమాచారాన్ని అందించే భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ప్రభుత్వానికి మంచి ఆదాయ వనరుగా కూడా మారింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.226 కోట్లు సంపాదించి పెట్టిన ఈ విభాగం 2024-25లోని తొలి ఆరు నెలల్లో రూ.66 కోట్లు ఖజానాలో జమ చేసింది. భువనేశ్వర్ కలిత నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీకి మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ (ఎంఈఎస్) ఈ సమాచారం అందజేసింది. తమ శాఖలో అత్యధిక ఆదాయాన్నిస్తున్న విభాగంగా ఐఎండీ నిలిచిందని ఎంఈఎస్ పేర్కొంది.

బిహార్‌లో బీజేపీ ఎన్నికల నగారా

- మోదీ ప్రభుత్వానికి మద్దతివ్వండి: అమిత్ షా
- రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర హోం మంత్రి

గోపాల్‌గంజ్: హోం మంత్రి అమిత్ షా ఆదివారం బిహార్ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగించారు. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏకి తిరిగి అధికారం కట్టబెట్టడం ద్వారా ప్రధాని మోదీని బలపర్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతిపక్ష ఆర్‌జేడీకి గట్టిపట్టున్న గోపాల్ గంజ్‌లో జరిగిన బహిరంగ సభలో మంత్రి అమిత్ షా ప్రసంగించారు. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల అనంతరం అమిత్ షా పాల్గొంటున్న మొదటిసారి సభ ఇదే కావడం గమనార్హం. ఆర్‌జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీదేవి అధికారం చెలాయించిన 15 దశాబ్దాల కాలంలో బిహార్‌లో జంగిల్ రాజ్ నడిచిందని, కిడ్నాప్‌లు, హత్యలు, దోపిడీలు ఒక పరిశ్రమగా మారాయని నిప్పులు చెరిగారు. 'రాష్ట్రంలో రక్షణ కొరవడటంతో ముఖ్యమైన వ్యాపారవేత్తలంతా ఆ సమయంలో రాష్ట్రాన్ని వీడారు. దాణా కుంభకోణానికి పాల్పడిన లాలు ప్రసాద్ యాదవ్ పేరు ప్రపంచ దేశాల్లోనే మారుమోగింది, బిహార్‌కు ఆయన తీరని కళంకం తెచ్చారు'అని అమిత్ షా ఆరోపించారు. 'కుటుంబ రాజకీయాలు చేసే లాలు.. భార్యను సీఎం పీఠంపై కూర్చోబెట్టారు. కుమార్తెను పార్లమెంట్‌కు పంపారు. ఆయన ఇద్దరు కుమారులు ఇప్పుడు సీఎం అవ్వాలనుకుంటున్నారు'అని ఎద్దేవా చేశారు. 'అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా చెప్పుకునే లాలు.. దాణా కూడా బొక్కేశారు. అటువంటి వ్యక్తి రికార్డు స్థాయిలో స్కాములే తప్ప, పేదలకు చేసేదేమీ లేదు'అని మండిపడ్డారు. సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలో జేడీయూ, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాకే పరిస్థితులు మెరుగుపడ్డాయని చెప్పారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న వరదల సమస్యకు చెక్ పెట్టామని చెప్పారు. లాలు-రబ్రీల జంగిల్ రాజ్ కావాలో, మోదీ, నితీశ్‌ల అభివృద్ధి కావాలో తేల్చుకునే సమయం ఇప్పుడు వచ్చిందని షా అన్నారు. 'మరికొద్ది నెలల్లో అసెంబ్లీ జరిగే ఎన్నికల్లో కమలం గుర్తు బటన్‌నే మీరు నొక్కుతారని, బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏకే ఓటేస్తారని నాకు తెలుసు. మోదీ అంటే బిహార్ ప్రజలు ఎప్పుడూ అభిమానం చూపుతూనే ఉన్నారు. ఆయన్ను మళ్లీ మీరు బలపరుస్తారని ఆశిస్తున్నా'అని అమిత్ షా తెలిపారు. బిహార్ అసెంబ్లీకి వచ్చే అక్టోబర్ లేదా నవంబర్ నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి.



కలకాలం నిలిచి ఉండే కాకతీయుల ప్రాభవం



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయ యుగ విశేషాలు

పన్నులు

కాకతీయుల కాలంలో స్థూలంగా అయిదు రకాల పన్నులుండేవి.

అవి: 1. భూమి పన్ను, 2. పారిశ్రామిక, ఆస్తి పన్నులు, 3. వృత్తి పన్నులు, 4. వ్యాపార పన్నులు, 5. ఇతర పన్నులు.

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ మార్గం భూమి శిస్తు. వర్తకం, పరిశ్రమలు, వృత్తులపై విధించే పన్నులు రెండో ఆదాయ మార్గం. పశుగ్రాసానికి పనికి వచ్చే పచ్చికబయళ్లపై వసూలు చేసే పన్ను, అడవుల కలపపై వేసే పన్ను మూడో ఆదాయ మార్గంగా ఉండేది. వర్తక సరకులు, ఎగుమతి దిగుమతులు, తయారైన వస్తువుల మీద వేసే పన్నును 'సుంకం'గా పేర్కొనేవారు. సాధారణంగా సుంకాలు వసూలు చేసే అధికారం వర్తక శ్రేణులకు ఇచ్చేవారు.

న్యాయ పాలన

సామాన్యమైన వివాదాలన్నింటినీ గ్రామ సభల్లో గ్రామ ప్రభువులు పరిష్కరించేవారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా 'తలారి' అనే గ్రామోద్యోగి చూసేవాడు. రాజే అంతిమ న్యాయ నిర్ణేత. యాజ్ఞవల్క్య స్మృతి లాంటి ప్రాచీన స్మృతి గ్రంథాల్లో పేర్కొన్న సూత్రాలను అనుసరించి ధర్మాసనాలు ఏర్పరిచేవారు. ఒకరిద్దరు రాజాధికారులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సభల్లో న్యాయ సమస్యలు పరిష్కారమయ్యేవి. వీరిని 'మహాజనులు'గా పేర్కొనేవారు. సమస్య పరిష్కారమైన వెంటనే సభ రద్దయ్యేది. ప్రస్తుతం గ్రామ పెద్దల మాదిరిగా ఈ మహాజనులు పనిచేసేవారు. తెగల్లో వివాదాలను 'సమయాలే' పరిష్కరించేవి.

సైనిక వ్యవస్థ

కాకతీయ సైన్యంలో చక్రవర్తి సైన్యం, నాయంకర సైన్యం అని రెండు విభాగాలు ఉండేవి. కాకతీయ చక్రవర్తులు సైన్యానికి స్వయంగా నాయకత్వం వహించేవారు. వీరి రాజ్యంలో స్థల, జల, వన, గిరి అనే నాలుగు రకాల కోటలు ఉన్నట్లు తెలుస్తోంది. కాకతీయుల కాలంలో ఓరుగల్లు, రాయచూరు, గోల్కొండ, భువనగిరి, రాచకొండ, దేవరకొండ, నల్లగొండ, పానుగల్లు కోటలు శత్రు దుర్భేద్యమైనవిగా పేరు పొందాయి.

ఆర్థిక పరిస్థితులు

కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం సిరి సంపదలతో విలసిల్లినట్లు అమీర్ ఖుస్రూ, అబ్దుల్లా వాసఫ్, మార్కోపోలో లాంటి విదేశీ యాత్రికుల రచనల ద్వారా తెలుస్తోంది.

వ్యవసాయం: తెలంగాణా ప్రాంతంలో సాగు భూమిని, నీటి వనరులను పెంచడానికి కాకతీయులు ఎనలేని కృషి చేశారు. వీరు చెరువులు నిర్మించి నీటి పారుదలపై శ్రద్ధ వహించారు. రెండో బేతరాజు సెట్టి సముద్రం, కెరె సముద్రం, కేసరి సముద్రం చెరువులను నిర్మించాడు. గణపతిదేవుడు రాజ్యం నలుమూలలా అనేక చెరువులు నిర్మించాడు. గణపతిదేవుడి సేనాని రేచర్లరుద్రుడు 17,258 ఎకరాలకు సాగు నీరు అందించేవిధంగా పాకాల చెరువును నిర్మించాడు. దీని విస్తీర్ణం 12 చ.కి.మీ. రామప్ప చెరువును నిర్మించింది కూడా ఇతడే. రేచర్ల రెడ్లు 35 నీటి వనరులను ఏర్పాటు చేశారు. కాటచమూపతి కాట సముద్రం; చౌడ చమూపతి చౌడ సముద్రం; నామిరెడ్డి సబ్బి సముద్రం, గౌర సముద్రం, కోమటి చెరువు; ఎరకసాని ఎరక సముద్రం నిర్మించారు. వీటితో పాటు చింతల సముద్రం, నామా సముద్రం కూడా ఉండేవి. చెరువుల నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులకు దిన సరి వేతనాలు చెల్లించేవారు. చెరువులతో పాటు ఊట కాలువలను కూడా నిర్మించారు. మూసీ నది నుంచి సాగే మూసెటి కాలువ; ఆలేరు నది నుంచి ఆలేటి కాలువ; కూచినేని కాలువ, రావిపాటు కాలువ, బొమ్మకంటి కాలువ, ఊటుంకాలువ, చింతల కాలువల గురించి పిల్లలమర్రి శాసనాల్లో పేర్కొన్నారు. ఏతం, మోటలతో కూడా వ్యవసాయం చేసేవారు. కొత్తగా పొలాలను సాగు చేయడానికి కాకతీయ రాజులు కృషి చేశారు. ప్రతాపరుద్రుడి కాలంలో అడవులను నరికేసి విశాల భూభాగాలను సాగులోకి తీసుకువచ్చారు. నేటి రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ప్రతాపరుద్రుడి కాలంలో రూపొందినవేనని ఆ గ్రామ కైఫీయతుల ద్వారా తెలుస్తోంది. తెలంగాణలోని మంథెన, కాళేశ్వరం, చెన్నూరు, నర్సంపేట, అచ్చంపేట, ఖమ్మం మెట్టు, కొత్తగూడెం అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లో ఎక్కువ భాగం కాకతీయుల కాలంలోనే ఏర్పడినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. గ్రామం, చెరువును నిర్మించడం నాడు పుణ్యకార్యంగా భావించేవారు. గ్రామాలను ఏర్పరచడానికి అన్ని వృత్తుల వారికి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. చాలా మంది కాకతీయ రాజులు, రాణులు అటవీ, బీడు భూములను వ్యవసాయ యోగ్యంగా చేశారు. వీరి పేరు మీద అనేక గ్రామాలు ఏర్పడ్డాయి. గణపవరం, ఘన్‌పూర్, మహాదేవపురం, రుద్రవరం, బయ్యారం, ముప్పవరం, కుందవరం మొదలైనవన్నీ వీటికి ఉదాహరణ. భూమిపై ప్రాథమిక స్వామ్యం రాజుది, ద్వితీయ స్వామ్యం వ్యక్తిది.

రైతులు వరి, గోధుమలు, కొర్రలు, జొన్నలు, మొక్కజొన్నలు, నీలిమందు, ఆముదాలు, నువ్వులు, పెసలు, కందులు, చెరకు, నూనెగింజలు, ఆవాలు, సజ్జలు, మినుములు, ఉలవలు, పత్తి, అల్లం, పసుపు, ఉల్లి తదితర పంటలు పండించేవారు. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలు వెదజల్లే బియ్యం తయారైనట్లు సాహిత్యం ద్వారా తెలుస్తోంది. ఆ కాలంలో కొబ్బరి, చెరకు, మామిడి, జామ, అరటి తోటలు విస్తారంగా ఉండేవి. సాధారణంగా ప్రతి గ్రామంలో బెల్లం, నూనె గానుగలు ఉండేవి. పశు సంపద పుష్కలంగా ఉండేది.

పరిశ్రమలు: నాడు వ్యవసాయంతో పాటు అనేక పరిశ్రమలు కూడా ఉండేవి. పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్య చరిత్ర'లో ఇరవైకి పైగా వస్త్రాల గురించి పేర్కొన్నాడు. ఓరుగల్లులో రత్న కంబళ్లు, ముఖమల్ వస్త్రాలు నేసేవారు. ఏకామ్రనాథుడు ఓరుగల్లులో చిత్తరువులు రాసే ఇళ్లు 1500 వరకు ఉండేవని పేర్కొన్నాడు. నాడు చిత్రకళకు మంచి ఆదరణ ఉండేది. పాల్కురికి 'బసవపురాణం'లో యాభై రకాల దుస్తుల పేర్లను ప్రస్తావించాడు. కాకతీయుల రాజ్యంలో శ్రేష్ఠమైన సన్నని వస్త్రాలు నేసేవారని, అవి సాలెపురుగు జాలె మాదిరిగా ఉండేవని మార్కోపోలో ప్రశంసించాడు. వీటి ఆధారంగా ఆ కాలంలో పద్మశాలీలకు మంచి నైపుణ్యం ఉండేదని తెలుస్తోంది. పల్లకీల మీద చెక్కిన నగిషీల వర్ణనను పరిశీలిస్తే నాటి వడ్రంగుల పని నైపుణ్యం అర్థమవుతుంది. పంచలోహాలతో వివిధ రకాల వస్తువులను తయారు చేసేవారు. నిర్మల్‌లో తయారైన కత్తులకు డమాస్కస్‌లోనూ మంచి ఆదరణ ఉండేది. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులున్నట్లు మార్కోపోలో రాశారు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలను గ్రామాల్లోనే తయారు చేసేవారు. పానగల్లు, చందూరులో దేవాలయాల్లో ఉపయోగించే కంచు గంటలు, పళ్లాలు, పాత్రలను రూపొందించేవారు.

వర్తక – వాణిజ్యం: శాతవాహనుల తర్వాత క్రమంగా క్షీణించిన దేశీయ, విదేశీ వాణిజ్యాన్ని కాకతీయులు పునరుద్ధరించారు. కాకతీయుల కాలంలో దేశీయ వాణిజ్యానికి ప్రధాన కేంద్రం ఓరుగల్లు. ఆ తర్వాత తెలంగాణలో మంథెన, అలంపురం, జడ్చర్ల, మగతల, పేరూరు ప్రధాన వాణిజ్యకేంద్రాలుగా ఉండేవి. పలనాటి సీమ నుంచి వాడపల్లి, నకిరెకల్, పిల్లలమర్రి మీదుగా వ్యాపారులు వరంగల్ వచ్చేవారు. బళ్లారి–చిత్తూరు, రాయచూరు–కొలనుపాక, బీదరు–కొలనుపాక, కల్యాణి–కొలనుపాక–అనుమకొండ, బీదరు–పటాన్‌చెరువు–వరంగల్ మొదలైనవి ముఖ్యమైన వాణిజ్య మార్గాలుగా ఉండేవి.

కాకతీయుల పాలనలో తెలంగాణలో వర్తక శ్రేణుల నిర్మాణంలో గుర్తించదగిన మార్పు వచ్చింది. ఆ కాలంలో వ్యాపారం బలిజలకు, వైశ్యులకే పరిమితం కాలేదు. రెడ్లు, నాయుళ్లు, బోయలు, దాసర్లు, తెలికలు, పద్మశాలీలు, వ్యవసాయదారుల లాంటి ఉత్పత్తిదారులు, కమ్మరి, కంసాలి, మేదరి లాంటి వృత్తి కులాల వారు వ్యాపారంలోకి వచ్చారు. వివిధ వృత్తికారులు, ఉత్పత్తిదారులు సొంత సమయాలను ఏర్పరచుకొని తమ కులవృత్తులతో పాటు వ్యాపారాలను నిర్వహించుకునేవారు. వీరిలో కొంత మంది కేవలం తమ ఉత్పత్తులనే అమ్ముకునేవారు. అందువల్ల ఇంత మంది వ్యాపారంలోకి వచ్చినప్పటికీ ప్రధానంగా వ్యాపారం వైశ్యుల చేతిలోనే ఉండేది. గోధుమ, పెసలు, వడ్లు, జొన్నలు, ఉప్పు, నూనె, నెయ్యి, మిరియాలు, ఆవాలు, తేనె, తగరం, రాగి, కర్పూరం, కస్తూరి, పట్టు, రత్నాలు, ముత్యాలు, పూసలు, పసుపు, ఉల్లిగడ్డలు, అల్లం, నూలు, దుంపలు మొదలైన ఉత్పత్తుల వ్యాపారం జరిగేది.

విదేశీ వాణిజ్యం: కాకతీయుల కాలంలో 'మోటుపల్లి' విదేశీ వాణిజ్యానికి ప్రసిద్ధమైన రేవు పట్టణంగా గుర్తింపు పొందింది. చాళుక్య, చోళ రాజుల కారణంగా దెబ్బతిన్న విదేశీ వ్యాపారాన్ని గణపతిదేవుడు ఈ రేవు పట్టణం ద్వారా పునరుద్ధరించాడు. దీని ద్వారా ఇండోనేషియా, జావా, సుమత్రా, జపాన్, మలయా, బర్మాతో వ్యాపారం చేసేవారు. మార్కోపోలో ఈ రేవు పట్టణాన్ని సందర్శించాడు. ఇక్కడి నుంచి ఎగుమతయ్యే వస్తువుల్లో వజ్రాలు, పట్టుతో తయారయ్యే సన్నని వస్త్రాలు ముఖ్యమైనవని అతడు పేర్కొన్నాడు. కాకతీయుల నాణేలు ఎక్కువగా లభించలేదు. కానీ శాసనాలు, సాహిత్యంలో నాణేల ప్రస్తావన ఉండేది.

సాంఘిక పరిస్థితులు

కాకతీయుల కాలంనాటి సంఘంలో ప్రధానంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు ఉండేవి. ప్రతి కులంలో అనేక ఉపకులాలు ఏర్పడ్డాయి. ఏకామ్రనాథుడు 'ప్రతాపచరిత్ర'లో, వినుకొండ వల్లభరాయుడు 'క్రీడాభిరామం'లో కాకతీయుల కాలంనాటి వివిధ వృత్తుల గురించి ప్రస్తావించారు. కోమట్లు, ఈదురవారు, గొల్లవారు, అక్కలవారు (ఆగసాల), సాలెవారు, మంగలులు, కుమ్మరివారు, బోయవారు, రుంజులు, పిచ్చుకుంట్లు, పంబల, బవని, మేదర, గాండ్ల మొదలైన కులాల పేర్లను శాసనాల్లోనూ పేర్కొన్నారు.

హిందూ మతాన్ని సంస్కరించే ఉద్దేశంతో శైవ, వైష్ణవ మతాలు ఆవిర్భవించాయి. కుల నిర్మూలన కోసం పుట్టిన వీటి ద్వారా సంఘంలో కొత్త కులాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా శైవుల్లో లింగాయతులు, బలిజలు, జంగాలు, తంబళ్ల మొదలైన కులాలు ఏర్పడ్డాయి. వైష్ణవుల్లో నంబులు, సాతానులు, దాసర్లు మొదలైన కులాలు ఆవిర్భవించాయి. 'అష్టాదశ కులాలు' అప్పటికే ప్రాచుర్యంలో ఉన్నాయి.

కాకతీయుల కాలంలో బాల్యవివాహాలు జరిగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహ పద్ధతులు ఉండేవి. రుద్రమదేవి కుమార్తె రుయ్యమను బ్రాహ్మణ మంత్రి ఇందులూరి అన్నయ్య దేవుడు పెళ్లి చేసుకోవడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. అయినప్పటికీ కుల నిర్మూలన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాకతీయుల కాలంలో వెలమలు సంఘ సంస్కర్తలుగా, రెడ్లు పూర్వాచార పరాయణులుగా ఉన్నట్లు తెలుస్తోంది. నాడు రాజకీయంగా ప్రాబల్యం వహించిన రెడ్లు, వెలమల మధ్య అధికారం కోసం పోటీ ప్రారంభమైంది. ఈ కాలంలో అష్టాదశ వర్ణాల్లో అగ్రవర్ణమైన బ్రాహ్మణ వర్గానికి చెందినవారు రాజకీయ ప్రాబల్యాన్ని కోల్పోయారు. రాజకీయాధికారం చతుర్థ వర్ణ పరమైంది. క్షత్రియ వంశాలు నామమాత్రంగా అధికారంలో ఉండేవి.

కాకతీయుల కాలంనాటి సాంఘిక జీవితానికి సంబంధించిన ఒక ప్రధాన లక్షణం కుల సంఘాలు. వీటిని 'సమయములు' అనేవారు. నగరాలు, గ్రామాలు పేటలుగా విభజించి ఉండేవి. అక్కలవాడ, భోగంవీధి, వెలిపాళె, మేదరవాడ, మోహరినాడు మొదలైనవి ఇలాంటివే. పూటకూళ్ల ఇళ్లు ఉండేవి. బసవ పురాణం ఆధారంగా ఆనాటికే వెట్టి వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తోంది. మహిళలు పాత్ర, గొండ్లి, పేరణి, కోలాటం, గొబ్బిళ్లు, గుర్రం, భంజళి మొదలైన క్రీడలతో వినోదం పొందేవారు.

వాస్తు, శిల్ప కళ

కాకతీయ రాజులు, వారి సామంతులు అనేక జైన, శైవ, వైష్ణవాలయాలను నిర్మించారు. దేవాలయ నిర్మాణంలో కాకతీయులు పశ్చిమ చాళుక్యుల వాస్తు విధానాన్ని అనుసరించారు. వీరు త్రికూటాలయాలను ఇదే పద్ధతిలో నిర్మించారు. బేతిరెడ్డి భార్య ఎరకేశ్వరాలయం నిర్మించారు. నామిరెడ్డి పిల్లలమర్రిలో కాటేశ్వర, కాచేశ్వర, నామేశ్వర ఆలయాలను నిర్మించాడు. పాలంపేట, పిల్లలమర్రి, పానగల్లు, హన్మకొండలో ఉన్న ఆలయాలను త్రికూట పద్ధతిలోనే నిర్మించారు.

నంది విగ్రహాలు కాకతీయ శిల్ప ప్రాభవానికి నిదర్శనాలు. కాకతీయ శిల్పం చాళుక్యుల శిల్పం కంటే నిగ్గు తేలి ఉంది. ఇది కొంత ప్రాంతీయ లక్షణాలను సంతరించుకొని ఉంటుంది. దేశీయ నృత్య రీతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాట్యగత్తెల కోలాట దృశ్యాలు కూడా కాకతీయుల కళా నైపుణ్యానికి తార్కాణంగా ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఏ కాకతీయ పాలకుడి కాలంలో విశాల భూభాగాలు సాగులోకి వచ్చాయి?
   1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు 4) రెండో బేతరాజు
2. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ఎవరి కాలంలో ఏర్పడ్డాయని కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది?
   1) బేతరాజు 2) ప్రోలరాజు
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రమదేవి
3. కాకతీయ రాజ్యంలో శ్రేష్ఠమైన వస్త్రాలు ఉన్నాయని ప్రశంసించిన విదేశీ యాత్రికుడు?
   1) మెగస్తనీస్ 2) ప్లీని
   3) మార్కోపోలో 4) నికోలో కాంటి
4. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులు ఉన్నట్లు రాసిన విదేశీ యాత్రికుడు?
   1) టాలెమి 2) మార్కోపోలో
   3) ప్లీని 4) కొలంబస్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2.

అక్వేరియంలో ఏ మొక్కలను పెంచుతారు?



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

బయాలజీ

బోధనోపకరణాలు

1. బోధనోపకరణం ద్వారా దృష్టి, వినికిడిని ఏకకాలంలో ఉపయోగించి విద్యార్థి అభ్యసన అనుభవాన్ని పెంపొందిస్తే దాన్ని దృశ్య శ్రవణ బోధనోపకరణం అంటారని నిర్వచించిందెవరు?
   1) బర్టన్ 2) కార్టర్ గుడ్
   3) ఎడ్గర్ డేల్ 4) జేమ్స్ వాట్
2. చూడడం ద్వారా అభ్యసన స్థాయి శాతం?
   1) 11% 2) 35% 3) 83% 4) 100%
3. చెప్పడం, చేయడం ద్వారా స్మృతి స్థాయి శాతం?
   1) 60% 2) 75%
   3) 50% 4) 90%
4. అభ్యసనానుభవాలను బట్టి బోధనోపకరణాలను మూడు విధాలుగా వర్గీకరించినవారు?
   1) జి.ఎస్.బ్రూనర్ 2) కార్టర్ ఎ.గుడ్
   3) బర్టన్ 4) ఎడ్గర్ డేల్
5. నమూనాలు ఏ రకానికి చెందిన బోధనోపకరణాలు?
   1) ప్రత్యక్షానుభవాన్నిచ్చేవి
   2) ఆరోపిత అనుభవాన్నిచ్చేవి
   3) గుర్తులతో అనుభవాన్నిచ్చేవి
   4) సంకల్పిత అనుభవాన్నిచ్చేవి
6. ప్రయోగాలు చేయడం ఏ రకమైన బోధనోపకరణం?
   1) ఆరోపిత 2) ప్రత్యక్ష అనుభవ
   3) మాటలు లేదా గుర్తులతో
   4) ఏదీకాదు
7. దృశ్య, శ్రవణ, దృశ్య–శ్రవణ, కృత్యాధార అనే బోధనోపకరణాల వర్గీకరణ దేన్ని బట్టి జరిగింది?
   1) అనుభవాలు 2) పరిమాణం
   3) లభ్యత 4) లక్షణాలు
8. క్షేత్ర పర్యటన ఏ రకం బోధనోపకరణం?
   1) దృశ్య 2) దృశ్య–శ్రవణ
   3) కృత్యాధార 4) శ్రవణ
9. ఎడ్గర్ డేల్ బోధనోపకరణాలను అనుభవాలను బట్టి ఏ ఆకారంలో అమర్చారు?
   1) గోళాకారం 2) చతురస్రాకారం
   3) శంఖాకారం 4) చతుర్భుజాకారం
10. ఎడ్గర్ డేల్ శంఖువులో ప్రత్యక్ష అనుభవాల స్థానం?
    1) పీఠ భాగం 2) శిఖర భాగం
    3) మధ్య భాగం 4) కింది భాగం
11. ఎడ్గర్ డేల్ శంఖువులో శాబ్దిక చిహ్నాల స్థానం?
    1) పీఠ భాగం 2) శిఖర భాగం
    3) మధ్య భాగం 4) ఎక్కడైనా ఉండొచ్చు
12. పోషకాహార విలువలను నృత్య రూపకంగా చేసి బోధించడం?
    1) ప్రత్యక్ష అనుభవం 2) క్షేత్ర పర్యటన
    3) ప్రదర్శన 4) నాటకీకరణ
13. ఫ్లానెల్ బోర్డ్ ఏ రకానికి చెందిన బోధనోపకరణం?
    1) ప్రదర్శనా ఉపకరణాలు
    2) త్రిపరిమాణ ఉపకరణం
    3) రేఖీయ చిత్రం
    4) ప్రక్షేపిత ఉపకరణం
14. మాతృకలు (స్పెసిమన్) ఏ రకం బోధనోపకరణం?
    1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
    3) కృత్యాధార 4) త్రిపరిమాణ
15. ఫిల్మ్ ప్రొజెక్టర్ ఏ రకం బోధనోపకరణం?
    1) ప్రదర్శన 2) ప్రక్షేపిత
    3) కృత్యాధార 4) త్రిపరిమాణ
16. ఎడ్గర్ డేల్ అనుభవ శంఖువులో ప్రొజెక్టర్ల స్థానం?
    1) ప్రదర్శన బల్లలపైన
    2) చార్టు తర్వాత 3) చలనచిత్రాలపైన
    4) శాబ్దిక చిహ్నాలపైన
17. జంతువుల వర్గీకరణ రాయడానికి ఏ రకం చార్ట్ అవసరం?
    1) వ్యవస్థానుక్రమ 2) దత్తాంశ
    3) వంశవృక్ష 4) క్రమానుగత
18. బార్ గ్రాఫ్‌లను ఏ విధంగా పిలుస్తారు?
    1) హిస్టోగ్రామ్‌లు 2) లైన్ గ్రాఫ్‌లు
    3) సెక్టర్ గ్రాఫ్‌లు 4) వ్యంగ్య చిత్రాలు
19. వీటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉంటుంది?
    1) రేఖా చిత్రం 2) త్రిమితీయ ఉపకరణం
    3) రేడియో 4) శాబ్దిక చిహ్నం
20. తోలుబొమ్మలు ఏ రకం బోధనోపకరణం?
    1) కృత్యాధార 2) ప్రదర్శన
    3) ప్రక్షేపిత 4) త్రిమితీయ
21. అపార దర్శక వస్తువులను ఏ ఉపకరణం ద్వారా ప్రక్షేపితం చేయొచ్చు?
    1) ఫిల్మ్ ప్రొజెక్టర్
    2) ఓవర్‌హెడ్ ప్రొజెక్టర్
    3) ఎపిడయాస్కోప్
    4) మైక్రో ప్రొజెక్టర్
22. మైక్రో ప్రొజెక్టర్ ప్రత్యేకత ఏమిటి?
    1) ఉపాధ్యాయుడి వెనుక ప్రతిబింబం
    2) అపారదర్శకత కలిగిన వస్తువుల ప్రక్షేపణ
    3) సూక్ష్మదర్శినిలోని స్లైడుల ప్రక్షేపణ
    4) సెల్లోఫెన్ పేపర్‌పైన వేసిన బొమ్మల ప్రక్షేపణ
23. ప్రొజెక్టర్ ఉపాధ్యాయుడి దగ్గరే ఉండి ప్రతిబింబం కూడా ఆయన వైపే ప్రక్షేపించడం ఏ ప్రొజెక్టర్ లక్షణం?
    1) స్లైడ్ ప్రొజెక్టర్
    2) ఓవర్ హెడ్ ప్రొజెక్టర్
    3) ఎపిడయాస్కోప్ 4) మైక్రో ప్రొజెక్టర్
24. భారతదేశంలో దూరదర్శన్ ప్రయోగాత్మక ప్రసారాలు ప్రారంభించిన సంవత్సరం?
    1) 1959 2) 1961
    3) 1987 4) 1998
25. బడి తోట పెంచడం ఏ కమిటీ సూచించిన SUPWలో ఒక భాగం?
    1) మొదలియార్ 2) తారాదేవి
    3) ఈశ్వరీబాయి 4) కొఠారీ
26. వైజ్ఞానిక సంఘాలు ఏ రకం బోధనోపకరణాల కిందకు వస్తాయి?
    1) ప్రక్షేపిత 2) కృత్యాధార
    3) పరోక్ష 4) దృశ్య శ్రవణ
27. 1959లో మొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) కోల్‌కతా 2) ముంబై
    3) హైదరాబాద్ 4) ఢిల్లీ
28. 1977లో ముంబైలో ఏ విజ్ఞాన శాస్త్ర కేంద్రాన్ని ఏర్పాటు చేశారు?
    1) బిర్లా ప్లానిటోరియం
    2) విశ్వేశ్వరయ్య మ్యూజియం
    3) నెహ్రూ విజ్ఞాన కేంద్రం
    4) జాతీయ విజ్ఞాన కేంద్రం
29. మొక్కలను లేదా వాటి భాగాలను కొంతకాలం ఎండబెట్టి భద్రపర్చే విధానం?
    1) వివేరియం 2) ఛేదనం
    3) టెర్రేరియం 4) హెర్బేరియం
30. అక్వేరియం అనేది ఒక?
    1) అందాన్నిచ్చే వస్తువు
    2) కృత్రిమ జీవావరణ వ్యవస్థ
    3) అన్ని రకాల జీవులుండే స్థలం
    4) చీకటి జీవులను తెలుసుకునేది
31. ప్రత్యేక స్థలాల్లో జీవించి ఉన్న జంతువులకు సహజ స్థితులను ఏర్పర్చి పరిశీలించడాన్ని ఏమంటారు?
    1) వివేరియం 2) అక్వేరియం
    3) హెర్బేరియం 4) టెర్రేరియం
32. కీటకాల జీవిత చరిత్రను బోధించేందుకు దేన్ని ఉపయోగించవచ్చు?
    1) అక్వేరియం 2) వివేరియం
    3) హెర్బేరియం 4) టెర్రేరియం
33. భూచరాలయాన్ని ఏ విధంగా పిలుస్తారు?
    1) వివేరియం 2) హెర్బేరియం
    3) అక్వేరియం 4) టెర్రేరియం
34. అక్వేరియంలో ఉండే జీవులు?
    1) కీటకాలు 2) చేపలు
    3) వృక్షాలు 4) మానవులు
35. అక్వేరియంలో ఏ మొక్కలను పెంచుతారు?
    1) గులాబీ మొక్కలు 2) కాక్టస్
    3) హైడ్రిల్లా 4) గడ్డి మొక్కలు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 1;
5) 2; 6) 2; 7) 4; 8) 3;
9) 3; 10) 1; 11) 2; 12) 4;
13) 1; 14) 4; 15) 2; 16) 3;
17) 3; 18) 1; 19) 2; 20) 4;
21) 3; 22) 3; 23) 2; 24) 1;
25) 3; 26) 2; 27) 1; 28) 3;
29) 4; 30) 2; 31) 1; 32) 2;
33) 4; 34) 2; 35) 3.

అనియత విజ్ఞాన శాస్త్ర విద్య

1. ఏ రకమైన నియమ నిబంధనలు లేకుండా సైన్స్‌పై అవగాహన ఏర్పర్చి, శాస్త్రీయ వైఖరులను అభివృద్ధి చేయడానికి పాటించే పద్ధతులేవి?
   1) విద్యా సాంకేతిక శాస్త్ర కార్యక్రమాలు
   2) నిర్బంధ విద్యా కార్యక్రమాలు
   3) అనియత విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
   4) పాఠ్యేతర విజ్ఞాన శాస్త్ర కార్యక్రమాలు
2. వైజ్ఞానిక సంఘాలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, మ్యూజియాలు, సైన్స్ కమ్యూనిటీ సెంటర్లు.. సైన్స్ ఫెయిర్స్ (ప్రదర్శన)ల ద్వారా అందించే విజ్ఞాన శాస్త్ర విద్య?
   1) నియత విజ్ఞాన శాస్త్ర విద్య
   2) నిర్బంధ విజ్ఞాన శాస్త్ర విద్య
   3) విద్య సాంకేతిక శాస్త్రం
   4) అనియత విజ్ఞాన శాస్త్ర విద్య
3. వైజ్ఞానిక సంఘాలు ఏ రంగాలను ప్రభావితం చేస్తాయి?
   1) జ్ఞానాత్మక – భావావేశ
   2) భావావేశ, మానసిక చలనాత్మక
   3) మానసిక చలనాత్మక, జ్ఞానాత్మక
   4) జ్ఞాన, భావావేశ, మానసిక చలనాత్మక
4. వైజ్ఞానిక సంఘాలు విద్యార్థులకు పని – అనుభవం కలిగించే ప్రక్రియలు అని తెలిపినవారు?
   1) మొదలియార్ 2) కొఠారీ
   3) తారాదేవి 4) రాధాకృష్ణన్
5. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ లక్ష్యం కాదు?
   1) విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను పెంపొందించడం
   2) అనాదిగా వస్తున్న ఆచారాలను నమ్మడం
   3) విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, పెంపొందించడం
   4) విరామకాలాన్ని సద్వినియోగపర్చుకునేలా చేయడం
6. సాధారణ సంఘాలు, ప్రత్యేక అభిరుచి సంఘాలు అనేవి ఏ సంఘంలో రకాలు?
   1) వైజ్ఞానిక సంఘం
   2) విహార యాత్ర సంఘం
   3) సేవా సంఘం
   4) శాస్త్రవేత్తల సంఘం
7. ఫొటోగ్రాఫర్ క్లబ్ ఏ రకమైన సంఘం?
   1) సాధారణ సంఘం
   2) సాంస్కృతిక సంఘం
   3) ప్రత్యేక అభిరుచి సంఘం
   4) సేవా సంఘం
8. పాఠశాలలో వైజ్ఞానిక సంఘానికి మార్గదర్శి లేదా ప్రతిపాదకుడుగా వ్యవహరించాల్సిన వారు?
   1) ప్రధానోపాధ్యాయుడు
   2) డీఈవో
   3) ఆ ప్రాంతంలోని శాస్త్రవేత్త
   4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
9. కిందివాటిలో వైజ్ఞానిక సంఘం ఏర్పాటుకు పరిగణనలోకి తీసుకోని అంశం ఏది?
   1) ప్రభుత్వ గుర్తింపు
   2) కమిటీల ఏర్పాటు
   3) నియమాలు
   4) సమావేశాలు, కార్యక్రమాలు
10. NCERT సూచనల ప్రకారం వైజ్ఞానిక సంఘంలో ప్రధానోపాధ్యాయుని పాత్ర?
    1) మార్గదర్శి 2) నియంత
    3) పోషకుడు 4) సేవకుడు
11. సంఘం ఉద్దేశాలను, సంఘ కార్యక్రమాలను, ప్రదర్శనలు, వైజ్ఞానిక నాటకాల గురించి పరిసర సమాజానికి తెలియజేసే వైజ్ఞానిక సంఘ నిర్వాహక కమిటీ వ్యక్తి?
    1) అధ్యక్షుడు 2) కార్యదర్శి
    3) పోషకుడు 4) ప్రచారాధికారి
12. కిందివాటిలో ఏది వైజ్ఞానిక సంఘ కార్యక్రమం కాదు?
    1) క్షేత్ర పర్యటన
    2) మాక్ పార్లమెంట్ నిర్వహణ
    3) బడి తోట నిర్వహణ
    4) పర్యావరణ దినోత్సవ నిర్వహణ
13. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు, తగిన నైపుణ్యాలు పెంపొందించి వారు భావి శాస్త్రవేత్తలుగా రూపుదిద్దుకొనేందుకు ప్రతి ఏటా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు?
    1) మండల విద్యాశాఖ
    2) రాష్ట్ర విద్యాశాఖ
    3) NCERT 4) CBSE
14. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల వైజ్ఞానిక ప్రదర్శనలు ఎవరి ఆర్థిక సహాయంతో జరుగుతాయి?
    1) NCERT– SCERT
    2) విద్యా శాఖా మంత్రి
    3) ముఖ్యమంత్రి 4) డీఈవో
15. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన కమిటీ చైర్మన్‌గా వ్యవహరించేవారు?
    1) కలెక్టర్ 2) డీఈవో
    3) డైట్ ప్రిన్సిపాల్
    4) జిల్లాలో అవార్డు తెచ్చుకున్న సైన్స్ టీచర్
16. లైబ్రరీ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
    1) గ్రీకు 2) పర్షియా
    3) ఇంగ్లిష్ 4) లాటిన్
17. 'లైబర్' అనే మాటకు అర్థం?
    1) పుస్తకం 2) రాయడం
    3) జ్ఞానం 4) సేకరించడం
18. విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఎవరి ఆధీనంలో ఉంటుంది?
    1) ప్రధానోపాధ్యాయుడు
    2) జిల్లా విద్యాశాఖాధికారి
    3) తరగతిలో, సైన్స్‌లో తెలివి కలిగిన విద్యార్థి
    4) విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు
19. వేటి నిర్వహణలో ఇండెక్స్ కార్డ్, క్యాటలాగ్‌లను తప్పనిసరిగా ఏర్పర్చాలి?
    1) సైన్స్ క్లబ్ 2) సైన్స్ లైబ్రరీ
    3) సైన్స్ ఫేర్ 4) ఫీల్డ్ ట్రిప్
20. ప్రతి పాఠశాలలో ప్రత్యేక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలయం ఉండాలి అని ప్రతిపాదించిన వారు?
    1) కొఠారీ కమిషన్
    2) మొదలియార్ కమిషన్
    3) ఆలిండియా సైన్స్ సెమినార్
    4) రాధాకృష్ణన్ కమిషన్
21. హైదరాబాద్‌లోని ప్లానిటోరియం పేరు?
    1) బిర్లా 2) టాటా
    3) గెలాక్సీ 4) గెలీలియో
22. విక్రం సారాభాయ్ సమాజ విజ్ఞాన కేంద్రాన్ని 1966లో ఎక్కడ ప్రారంభించారు?
    1) అహ్మదాబాద్ 2) ముంబై
    3) లక్నో 4) అలహాబాద్
23. అంతర్జాతీయ సైన్స్ మ్యూజియాన్ని కేంద్ర ప్రభుత్వం ఎక్కడ నిర్వహిస్తుంది?
    1) హైదరాబాద్ 2) కోల్‌కతా
    3) చెన్నై 4) న్యూఢిల్లీ

సమాధానాలు

1) 3; 2) 4; 3) 4; 4) 2;
5) 2; 6) 1; 7) 3; 8) 4;
9) 1; 10) 3; 11) 4; 12) 2;
13) 3; 14) 1; 15) 2; 16) 1;
17) 1; 18) 4; 19) 2; 20) 3;
21) 1; 22) 1; 23) 2.

వాణిజ్యపరంగా తయారు చేసే ఇన్సులిన్‌లో ఉండే లోహం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

కెమిస్ట్రీ

మాదిరి ప్రశ్నలు

1. మానవ శరీరంలో అత్యధిక శాతం ఉండే మూలకం ఏది?
 1) కార్బన్ 2) ఆక్సిజన్
 3) నైట్రోజన్ 4) సోడియం
2. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజల్లో ఎక్కువగా కనిపించే వ్యాధి ఏది?
 1) కంటి శుక్లాలు 2) రక్తహీనత
 3) గాయిటర్ 4) ఫ్లోరోసిస్
3. అయోడిన్‌కు సంబంధించి సరికాని వాక్యం ఏది?
 1) సముద్రపు ఆహారంలో ఎక్కువగా లభిస్తుంది
 2) ఎత్తైన ప్రదేశాల్లోని నీటిలో అయోడిన్ లభ్యత తక్కువగా ఉంటుంది
 3) పిల్లల ఆహారంలో అయోడిన్ లోపిస్తే మందకొడిగా ఉండటంతో పాటు పెరుగుదల లోపిస్తుంది
 4) అయోడిన్ ఫ్లోరోసిస్ వ్యాధికి కారణమవుతుంది
4. కింది వాటిలో నీటిని శుద్ధి చేయడానికి దేన్ని ఉపయోగించవచ్చు?
 1) అయోడిన్ 2) ఫ్లోరిన్
 3) ఆక్సిజన్ 4) క్లోరిన్
5. కింది వాటిలో కాల్షియం ఉపయోగం కానిది ఏది?
 1) ఆరోగ్యవంతమైన ఎముకలు, దంతాల కోసం కాల్షియం అవసరం
 2) కండరాల సంకోచానికి అవసరం
 3) రక్తం గడ్డకట్టడానికి అవసరం
 4) ఆక్సిజన్ రవాణాకు అవసరం
6. రక్తంలోని హిమోగ్లోబిన్‌లో ఉండే లోహ అయాన్ ఏది?
 1) మాంగనీస్ 2) కాపర్
 3) ఐరన్ 4) జింక్
7. రక్తహీనతతో సంబంధం ఉన్న లోహం ఏది?
 1) ఐరన్ 2) జింక్
 3) అయోడిన్ 4) కార్బన్
8. కింది వాటిలో మాంసకృత్తుల తయారీకి అవసరం లేని మూలకాలేవి?
 i. కార్బన్ ii. నైట్రోజన్
 iii. ఆక్సిజన్ iv. హైడ్రోజన్
 v. ఐరన్ vi. కాల్షియం
 1) i, ii మాత్రమే 2) iii, iv మాత్రమే
 3) v, vi మాత్రమే 4) ii, iv మాత్రమే
9. కిరోసిన్‌లో ఏ లోహాన్ని నిల్వ చేస్తారు?
 1) సోడియం 2) మెగ్నీషియం
 3) ఐరన్ 4) ఫాస్ఫరస్
10. సిలికాన్ మూలకం ప్రధానంగా దేనిలో లభిస్తుంది?
 1) బొగ్గు 2) ఇసుక
 3) సున్నపురాయి 4) ఉప్పు
11. అయోడిన్ కలిగి ఉండే హార్మోన్ ఏది?
 1) ఇన్సులిన్ 2) టెస్టోస్టెరాన్
 3) థైరాక్సిన్ 4) ప్రొజెస్టిరాన్
12. కింది ఏ విటమిన్‌లో కోబాల్ట్ ఉంటుంది?
 1) B_1 2) B_6 3) B_{12} 4) B_2
13. కింది వాటిలో ఫెర్రో అయస్కాంత లోహాలని వేటిని అంటారు?
 1) ఐరన్, కోబాల్ట్, నికెల్
 2) ఐరన్, నికెల్, జింక్
 3) కాపర్, క్రోమియం, జింక్
 4) కాపర్, నికెల్, జింక్
14. గోర్లు, వెంట్రుకల పెరుగుదలకు అవసరమయ్యే లోహం ఏది?
 1) కాల్షియం 2) మాంగనీస్
 3) జింక్ 4) క్రోమియం
15. విటమిన్ B_1 (థయమిన్)లో ఉండే ప్రత్యేక మూలకం ఏది?
 1) ఫాస్ఫరస్ 2) క్లోరిన్
 3) అయోడిన్ 4) సల్ఫర్
16. కింది వాటిలో దేనిలో ఇనుము అధికంగా లభిస్తుంది?
 1) బెల్లం 2) కాలేయం
 3) తోటకూర 4) పైవన్నీ
17. కేన్సర్ చికిత్సలో ఉపయోగించే కోబాల్ట్ - 60 నుంచి విడుదలయ్యే వికిరణాలేవి?
 1) ఆల్ఫా కిరణాలు 2) బీటా కిరణాలు
 3) ఎక్స్ కిరణాలు 4) గామా కిరణాలు
18. సమయాన్ని కచ్చితంగా కొలవడానికి ఉపయోగించే పరమాణు గడియారాల్లో ఏ లోహాన్ని వాడతారు?
 1) కాడ్మియం 2) సీజియం
 3) టైటానియం 4) ఐరన్
19. గుండె కొట్టుకోవడంలో ముఖ్య పాత్ర పోషించే లోహం ఏది?
 1) పొటాషియం 2) కాల్షియం
 3) సీజియం 4) కాపర్
20. థర్మామీటర్‌లో ఉపయోగించే లోహం?



 1) పొటాషియం 2) ఐరన్
 3) కాపర్ 4) మెర్క్యురీ
21. జతపరచండి.

 జాబితా - I
 a) హిమోగ్లోబిన్‌లో ఆక్సిజన్ వాహకం
 b) క్లోరోఫిల్‌లోని ఆకుపచ్చ పదార్థం
 c) రబ్బర్ వల్కనైజేషన్
 d) కండరాల కదలిక

 జాబితా - II
 i) ఫాస్ఫరస్ ii) ఐరన్
 iii) మెగ్నీషియం iv) సల్ఫర్

	a	b	c	d
1)	iv	iii	ii	i
2)	iii	iv	i	ii
3)	ii	iii	iv	i
4)	i	iii	ii	iv

22. కింది వాటిలో కందెనగా వాడే పదార్థాలేవి?
 i. గ్రీజు ii. గ్రాఫైట్
 iii. టెఫ్లాన్ iv. డైమండ్
 1) i మాత్రమే 2) i, ii మాత్రమే
 3) i, ii, iii మాత్రమే 4) i, ii, iii, iv
23. కింది వాటిలో ఎమల్షన్ ఏది?
 1) పాలు 2) మీగడ
 3) వెన్న 4) పైవన్నీ
24. ఆక్వాడాగ్ (Aquadag) అంటే ఏమిటి?
 1) డాగ్ వాటర్
 2) గ్రాఫైట్ కొల్లాయిడల్ ద్రావణం
 3) గోల్డ్ కొల్లాయిడ్ 4) లేటెక్స్
25. ఆక్వాడాగ్‌ను ప్రధానంగా వేటి తయారీలో ఉపయోగిస్తారు?
 1) కాథోడ్ రే ట్యూబ్ (CRT)
 2) థర్మామీటర్ 3) పెయింట్
 4) పైవన్నీ
26. కింది వాటిలో సరికాని జత ఏది?
 1) పచ్చి కాయలను పక్వానికి తీసుకురావడం - ఇథిలీన్
 2) నీటిశుద్ధి - బ్లీచింగ్ పౌడర్
 3) మత్తు మందు - క్లోరోఫామ్
 4) దంతాల్లో ఎనామిల్ ఏర్పర్చడం - సోడియం క్లోరైడ్
27. టీ, కాఫీలను ఎక్కువగా తాగేవారిలో ఏ లోహం శోషణ తక్కువగా ఉంటుంది?
 1) కోబాల్ట్ 2) ఇనుము
 3) సోడియం 4) మెగ్నీషియం
28. వాణిజ్యపరంగా తయారు చేసే ఇన్సులిన్‌లో ఉండే లోహం ఏది?
 1) జింక్ 2) ఐరన్
 3) సెలీనియం 4) మెర్క్యురీ
29. రక్తం గడ్డకట్టడానికి అవసరమయ్యే విటమిన్ ఏది?
 1) ఎ 2) కె 3) డి 4) ఇ
30. ఏ విటమిన్ లోపిస్తే కండరాల బలహీనత, వంధ్యత్వం కలుగుతుంది?
 1) ఎ 2) బి 3) సి 4) ఇ
31. కింది వాటిలో కృత్రిమ తీపికారిణి కానిదేది?
 1) సుక్రలోజ్ 2) ఆస్పార్టేమ్
 3) సుక్రోజ్ 4) శాకరీన్
32. జతపరచండి.

జాబితా - I	జాబితా - II
a) విటమిన్ - సి	i) స్కర్వీ
b) విటమిన్ - డి	ii) రికెట్స్
c) విటమిన్ - ఎ	iii) రేచీకటి
d) విటమిన్ - $బి_{12}$	iv) రక్తహీనత

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	iii	ii	i
3)	iii	iv	i	ii
4)	ii	i	iv	iii

33. ఏ విటమిన్ లోపం వల్ల పెదాల మూలల్లో ఉండే చర్మం పగిలి పుండ్లు ఏర్పడతాయి?
 1) రైబోఫ్లేవిన్ (B_2)
 2) థయమిన్ (B_1) 3) పిరిడాక్సిన్ (B_6)
 4) సయనోకోబాలమిన్ (B_{12})
34. కింది వాటిలో దేనికి యాంటీసెప్టిక్ ధర్మం ఉండదు?
 1) అయొడోఫామ్ 2) టింక్చర్ అయోడిన్
 3) బోరిక్ ఆమ్లం 4) క్లోరోఫామ్
35. ఎసిటైల్ శాలిసిలిక్ ఆమ్లం ఏ ఔషధంగా ప్రసిద్ధి చెందింది?
 1) ఓమిప్రజోల్ 2) ఆస్పిరిన్
 3) క్లోరోక్విన్ 4) డెట్టాల్
36. కింది వాటిలో ఆస్పిరిన్ ఉపయోగం కానిదేది?
 1) నొప్పులను తగ్గిస్తుంది
 2) రక్తం త్వరగా గడ్డకట్టకుండా పనిచేస్తుంది
 3) కీళ్ల వాతానికి సంబంధించిన నొప్పులను తగ్గిస్తుంది
 4) ఆమ్ల విరోధిగా పనిచేస్తుంది
37. కింది వాటిలో ఆమ్ల విరోధి కానిదేది?
 1) బేకింగ్ సోడా
 2) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
 3) అల్యూమినియం హైడ్రాక్సైడ్
 4) ఆస్పిరిన్
38. కింది వాటిలో కొల్లాయిడ్ ఏది?
 i. పాలు ii. రక్తం
 iii. జున్ను iv. పెయింట్
 1) i, ii మాత్రమే 2) ii, iv మాత్రమే
 3) i, ii, iii మాత్రమే 4) i, ii, iii, iv
39. జతపరచండి.

జాబితా - I	జాబితా - II
a) బాక్సైట్	i) థోరియం
b) హెమటైట్	ii) యురేనియం
c) పిచ్‌బ్లెండ్	iii) ఐరన్
d) మోనోజైట్ ఇసుక	iv) అల్యూమినియం

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	iii	i	ii
3)	iv	iii	ii	i
4)	iii	iv	i	ii

40. కింది వాటిలో ఫెర్మెంటేషన్ ప్రక్రియ ద్వారా దేన్ని తయారు చేస్తారు?
 i. ఆల్కహాల్ ii. వెనిగర్ iii. టీ
 1) iii మాత్రమే 2) ii మాత్రమే
 3) ii, iii మాత్రమే 4) i, ii మాత్రమే
41. గది ఉష్ణోగ్రత వద్ద ద్రవ రూపంలో ఉండే లోహం ఏది?
 1) ఐరన్ 2) మెర్క్యురీ
 3) జింక్ 4) అల్యూమినియం
42. జతపరచండి.

జాబితా - I	జాబితా - II
a) హిమోగ్లోబిన్	i) కోబాల్ట్
b) క్లోరోఫిల్	ii) సిలికాన్
c) సయనోకోబాలమిన్	iii) ఐరన్
d) ఇసుక, శిలలు	iv) మెగ్నీషియం

	a	b	c	d
1)	ii	iii	i	iv
2)	iii	i	ii	iv
3)	i	iv	iii	ii
4)	iii	iv	i	ii

43. కింది వాటిలో సరికాని జత ఏది?
 1) నూనె నుంచి డాల్డా తయారీ - హైడ్రోజన్
 2) వెల్డింగ్ - ఎసిటలీన్
 3) మంటలు ఆర్పడం - ఆక్సిజన్
 4) భోపాల్ గ్యాస్ దుర్ఘటన - మిథైల్ ఐసోసయనేట్
44. బెరిబెరి (ఆకలి మందగించడం) వ్యాధి ఏ విటమిన్ లోపం వల్ల వస్తుంది?
 1) B_{12} 2) B_1 3) B_6 4) B_2
45. కింది వాటిలో నీటిలో కరిగే విటమిన్లు ఏవి?
 i. ఎ ii. బి iii. సి iv. డి v. ఇ
 1) i, iv, v మాత్రమే 2) ii, iii మాత్రమే
 3) iii, iv మాత్రమే 4) i, ii, iii, iv, v
46. జతపరచండి.

 జాబితా - I
 a) డీఎన్ఏ అణు నిర్మాణం
 b) రేడియోధార్మికత
 c) పెన్సిలిన్
 d) సల్ఫాడ్రగ్స్

 జాబితా - II
 i) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
 ii) జేమ్స్ డేవీ వాట్సన్
 iii) డోమాక్
 iv) హెన్రీ బెక్వరల్

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	iii	i	ii
3)	ii	iv	i	iii
4)	iv	ii	iii	i

47. వాహనాల్లో ఉండే ఎయిర్ బ్యాగుల్లో ఏ రసాయనాన్ని ఉపయోగిస్తారు?
 1) సోడియం బై కార్బొనేట్
 2) సోడియం ఎజైడ్
 3) సోడియం పెరాక్సైడ్
 4) సోడియం క్లోరైడ్
48. కన్వేయర్ బెల్ట్, గాస్కెట్, హోజ్‌పైపుల తయారీలో వాడే రబ్బర్ ఏది?
 1) సహజ రబ్బర్ 2) బ్యునా - S
 3) బ్యునా - N 4) బ్యునా - E
49. కింది వాటిలో దేని తయారీలో PVC ని ఉపయోగించరు?
 1) నీటి పైపులు 2) రెయిన్ కోట్‌లు
 3) క్యారీ బ్యాగులు 4) స్విచ్ బోర్డులు
50. కింది వాటిలో ట్రాంక్విలైజర్ ఏది?
 1) స్ట్రెప్టోమైసిన్ 2) డయజీపామ్
 3) క్లోరాంఫెనికాల్ 4) క్లోరోమైసిటిన్
51. కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
 1) గాలిలో కార్బన్ మోనాక్సైడ్ గాఢత పెరిగితే తలనొప్పి, దృష్టి మందగించడం లాంటి దుష్పరిణామాలు కలుగుతాయి
 2) గాలిలో సల్ఫర్ డైఆక్సైడ్ అధికమైతే చారిత్రక కట్టడాలు దెబ్బతింటాయి
 3) కార్బన్ డైఆక్సైడ్ ఆమ్లవర్షానికి కారణం
 4) గాలిలో లెడ్ (Pb) గాఢత పెరిగితే మానసిక వ్యాధులు కలుగుతాయి
52. కింది వాటిలో 'భౌతిక మార్పు' ఏది?
 i. పాలు పెరుగుగా మారడం
 ii. మంచు కరిగి ద్రవ నీరుగా మారడం
 iii. ఇనుము తుప్పు పట్టడం
 iv. అయోడిన్ స్ఫటికాలు ఉత్పతనం చెందడం
 1) iii మాత్రమే 2) ii, iv మాత్రమే
 3) i, ii మాత్రమే 4) i, iii మాత్రమే

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 4	5) 4
6) 3	7) 1	8) 3	9) 1	10) 2
11) 3	12) 3	13) 1	14) 2	15) 4
16) 4	17) 4	18) 2	19) 1	20) 4
21) 3	22) 3	23) 4	24) 2	25) 1
26) 4	27) 2	28) 1	29) 2	30) 4
31) 3	32) 1	33) 1	34) 4	35) 2
36) 4	37) 4	38) 4	39) 3	40) 4
41) 2	42) 4	43) 3	44) 2	45) 2
46) 3	47) 2	48) 2	49) 4	50) 2
51) 3	52) 2			

How many rooms are there of the west..



BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q.No.1-5): Read the following information carefully to answer the given questions.

In a global environment summit, eight representatives, viz P, Q, R, S, T, V, W and Z are representing different countries, viz Australia, Canada, France, Iran, China, Korea, Nepal and Britain, but not necessarily in the same order. All of them are sitting around a circular table facing the center. V sits third to the left of T. R and Z and also their immediate neighbours do not represent France. Only one person sits between W and the representative of France. The representatives of Iran and Canada are immediate neighbours of each other. R represents neither China nor Iran. Only one person sits between P and the one who represents Korea. P does not represent either France or Canada. R sits third to the right of Z. Z represents Britain. T is not an immediate neighbour of either R or Z. The one who represents Australia is an immediate neighbour of T. Three people sit between Z and the representative of Nepal. Q is not representing either France or Australia. W is not representing Korea.

1. Who among the following represents Canada?
 1) Q 2) R 3) T 4) V
 5) Cannot be determined
2. Who among the following represent immediate neighbours of V?
 1) P, Q 2) P, S
 3) T, W 4) P, R
 5) P and the representative of China
3. Which of the following is true regarding W?
 1) W sits second to the right of P.
 2) W represents Iran.
 3) W sits between Q and the representative of Britain.
 4) Only one person sits between W and the representative of Canada.
 5) None is true
4. How many persons sit between S and the representative of Iran, when counted anti clockwise from S?
 1) None 2) One 3) Two 4) Three 5) Four
5. Which of the following is true?
 1) S represents France.
 2) Only one person is sitting between the representatives of Iran and China.
 3) The representative of Canada is an immediate neighbour of W.
 4) One person sits between Z and the representative of France.
 5) None is true

Directions (Q.No.6-10): Study the information carefully and answer the questions given below.

There are three floors in a given building such that floor 2 is above floor 1 and floor 3 is above floor 2. In the building there are two flats in each floor such that A is in the west of Flat B. In the building each Flat has an area of 1200 ft and each flat has certain number of rooms and no two flats have same number of rooms. The area of each room of one of the flats on the even number floor is 120ft. Total rooms on floor number three is seven. The flat which has rooms of area of 150 ft is on odd number floor. Area of rooms in the flat which is exactly below 10 rooms flat is 600 ft. There is only one floor between the flats whose each room area is 400 ft and the flat whose room's area is 150 ft. There is no flat on the west of the flat having 6 rooms.

6. What is the area of a room in Flat A on floor 2?
 1) 300 ft 2) 200 ft 3) 600 ft
 4) either (1) or (3)
 5) None of these
7. What is the total number of rooms on floor 2?
 1) 12 2) 14 3) 13
 4) 16 5) None of these
8. Which of the following statement is true?
 1) Total number of rooms on floor 2 is 16
 2) Area of each room is 150 ft of flat A on floor 1
 3) Total rooms in Flat A of all three floors is 17.
 4) All are correct
 5) None is correct
9. What is the area of room of flat B on floor 3?
 1) 200 ft 2) 600 ft 3) 300 ft
 4) 400 ft 5) None of these
10. How many rooms are there of the west of the flat whose each room area is 600 ft?
 1) 6 2) 4 3) 3
 4) 8 5) None of these

Directions (Q.No.11-15): The following questions are based on the following three-digit numbers given below:

571 863 427 654 912

11. If all the three digits of each of the numbers are multiplied together, the product of which of the following numbers will be the second highest?
 1) 571 2) 863 3) 427
 4) 654 5) 912
12. If all the digits of each of the numbers are arranged in ascending order within the number, how many numbers thus formed will be divisible by three?
 1) None 2) One 3) Two
 4) Three 5) More than three
13. If one is subtracted from each even digit of each of the numbers, in how many numbers thus formed will a digit appear twice within the number?
 1) One 2) Two 3) Three
 4) Four 5) Five
14. If the positions of the first and the second digits of each of the numbers are interchanged, what will be the product of the first and the third digits of the second highest number thus formed
 1) 14 2) 16 3) 12
 4) 18 5) None of these
15. What will be the product of the second digit of the second lowest number and the third digit of the second highest number?
 1) 21 2) 12 3) 24
 4) 16 5) None of these

(Q.No.16-17): Read each question carefully and choose the appropriate answer:


16. If the alphabet is written in the reverse order and every alternate letter starting with Y is dropped, which letter will be fourth to the right of the ninth letter from the left end?
 1) B 2) N 3) Z
 4) Z or A 5) None of these
17. In a certain code, 'COMPATIBLE' is written as MXUWGYMENF. How is BENEFICIAL written in that code?
 1) LNVLLNGLMC
 2) LVNLLNGLCM
 3) LNVLNLGLCM
 4) LNVLLNGLCM
 5) None of these

(Q.No.18 -20): In a row of children facing North, Tagore is fifth to the right of Amar who is twentieth from the right end of the row. Pavan is tenth to the left of Tagore and is twentysixth from the left end.

18. How many children are there in the row ?
 1) 49 2) 50 3) 51
 4) Cannot be determined
 5) None of these
19. What is Amar's rank from the left end of the row?
 1) 29th 2) 30th 3) 31st
 4) Cannot be determined
 5) None of these
20. How many children are there in the row between Amar and Pavan?
 1) 4 2) 5
 3) 3 4) 6
 5) None of these

SOLUTIONS

(1-5)



1) 4; **2)** 4 **3)** 5
4) 3; Only two persons, i.e W and Z
5) 2

(6-10):

Floor	A	B
3rd	Room area = 400ft Number of Rooms = 3	Room area = 300ft Number of Rooms = 4
2nd	Room area = 200ft Number of Rooms = 6	Room area = 120ft Number of Rooms = 10
1st	Room area = 150ft Number of Rooms = 8	Room area = 600ft Number of Rooms = 2

6) 2; **7)** 4; **8)** 4;
9) 3; **10)** 4;

(11-15):

11) 4;
$8 \times 6 \times 3 = 144$; $6 \times 5 \times 4 = 120$. Therefore, second highest number is 654.

12) 3;
654 when arranged in ascending order, becomes 456 which is divisible by 3.
912 when arranged in ascending order, becomes 129 is also divisible by 3.

13) 2;
In 654, if one is subtracted from each even digit, it becomes 553. The digit '5' appears twice.
In 912, when one is subtracted from the even digit, it becomes 911 where the digit '1' appears twice

14) 4;
In the given numbers,
571 863 427 654 912
after interchanging the first two digits, the numbers appear as follows:
751 683 247 564 192
Hence, the second highest number is 683. The product of the first and the third digits is 18.

15) 1;
second lowest number is 571, and the second digit is '7'
Second highest number is 863, and the third digit is '3'
The product of 7 and 3 is 21.

16) 1;
Step No: 1
ZYXWVUTSRQPONMLKJIHGFEDCBA
Step No: 2 ZXVTRPNLJHFDB (all the odd numbered position letters which amount to thirteen are dropped)
Step No: 3 4th letter to the right + 9th letter from left end = 13th from the left end which is 'B'

17) 4;
Each letter in the word 'COMPATIBLE' is coded in the alphabetical order in the forward direction , but in the descending order.
C+ 10 = M, O + 9 = X, and so on.

18) 2;
Tagore is 15th from the right end. Pavan is 25th from the right end. We know that Pavan is 26th from the left end.
Hence, number of children in the row
= 25 + 26 – 1 = 50

19) 3;
Left position of Amar + Right position of Amar –1 = number of children in a row
Left position
= 50 + 1 –20 = 31st

20) 1;
Pavan is 25th from the right end. Amar is 20th from the right end. Hence, there are four children between Amar and Pavan.